

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 326

గురువారం 8-8-2024


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




27 ఏళ్ల తర్వాత...
శ్రీలంక జట్టుతో వన్డే సిరీస్ కోల్పోయిన టీమిండియా - 13లో



ఉద్యోగులకు నం.1 మైక్రోసాఫ్ట్
తర్వాతి స్థానాల్లో టీసీఎస్, అమెజాన్.. ర్యాండ్‌స్టాడ్ బ్రాండ్ రీసెర్చ్ వెల్లడి -13లో



3న రాజ్యసభ ఉప ఎన్నికలు
వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 12 రాజ్యసభ స్థానాలకు సెప్టెంబర్ 3న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.
వివరాలు 6లో ▶



బంగ్లాలో.. తాత్కాలిక సర్కారు
బంగ్లాదేశ్‌లో నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ సారథ్యంలో నేడు తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరనుంది.
వివరాలు 6లో ▶



నేపాల్‌లో కూలిన హెలికాప్టర్
నేపాల్ రాజధాని ఖట్మాండు సమీపంలో హెలికాప్టర్ కుప్పకూలడంతో నలుగురు చైనా పర్యాటకులు, పైలట్ మరణించారు.
వివరాలు 6లో ▶



అమెరికా ఎన్నికల్లోనూ డీప్‌ఫేక్
డీప్ ఫేక్ వీడియోలను సృష్టించినా, ప్రసారం చేసినా సదరు కంపెనీలకు జరిమానా విధిస్తామని అమెరికా హెచ్చరించినా.. అవి ఆగలేదు.
వివరాలు 6లో ▶

గుండె బరువెక్కింది!

రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు తీరని వేదన
ఒలింపిక్స్ ఫైనల్‌కు ముందు అనర్హత వేటు

100 గ్రాముల అధిక బరువే కారణం

పతకం లేకుండానే నిష్క్రమణ
అద్భుత ప్రదర్శనకు అనూహ్య ముగింపు



100 గ్రాముల బరువు..
రోజువారీ జీవితంలో అయితే అది పెద్ద లెక్కలోకి తీసుకునేదే కాదు.. కానీ ఒలింపిక్స్‌లో 100 గ్రాముల బరువు విలువ చెప్పమంటే ఒక పతకమంత..

దాని విలువ ఒక దేశపు ఆశలు, ఆకాంక్షలంత.. దాని విలువ ఒక ప్లేయర్ జీవితకాలపు కష్టం, స్వప్నమంత.. కానీ ఇప్పుడు ఆ 100 గ్రాముల బరువు వల్లే ఒక కల చెదిరింది.. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి, సవాళ్లను అధిగమించి, పట్టు వీడకుండా పోరాడిన ఒక క్రీడాకారిణి ఆశలు కుప్పకూలాయి... పతకంతో సగర్వంగా శిఖరాన నిలిచి జాతీయ జెండాను ఎగురవేసేందుకు సిద్ధమైన తరుణంలో అధిక బరువు ఆ అద్భుతాన్ని అడ్డుకుంది. పదునైన ఆటతో రెజ్లింగ్‌లో ఫైనల్‌కు చేరిన వినేశ్ ఫొగాట్ అనూహ్య రీతిలో ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. ప్రత్యర్థులపై చెలరేగి తుది పోరు వరకు దూసుకొచ్చిన వినేశ్ ఒలింపిక్ ప్రస్థానం విషాదంగా ముగిసింది.

పారిస్: ఒలింపిక్స్‌లో భారత్‌కు నాలుగో పతకం ఖాయ మైన తర్వాత బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. 50 కేజీల కేటగిరీ ఫైనల్లో తలపడాల్సిన మన రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. పోరుకు కొన్ని గంటల ముందు నిర్వహించే 'వెయింగ్'లో ఆమె బరువు 50 కేజీల 100 గ్రాములుగా వచ్చింది. దాంతో నిబంధనల ప్రకారం ఆమెను డిస్క్వాలిఫై చేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఆమె గెలిచిన మూడు బౌట్‌లనూ పరిగణనలోకి తీసుకోకుండా ఆమెకు ఈ కేటగిరీలో చివరి స్థానమే ఇచ్చారు. పోటీల తొలి రోజు మంగళవారం 'వెయింగ్'లో వినేశ్ బరువు 50 కేజీలకంటే తక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం రెండో రోజు కూడా మళ్లీ ఆటగాళ్ల బరువు చూస్తారు. అయితే తొలి రోజు బౌట్‌ల మధ్య శక్తిని కూడదీసుకునేందుకు ఆహారం తీసుకోవడంతో వినేశ్ బరువు పెరిగింది. సెమీఫైనల్ తర్వాత ఇది 52.7 కేజీలుగా తేలింది. దీంతో రాత్రంతా ఆమె కనీసం నీళ్లు కూడా తాగకపోగా... నిద్ర పోకుండా వ్యాయామాలు, ఆవిరి స్నానం ద్వారా బరువు తగ్గించేందుకు శ్రమించినా అది సరిపోలేదు. నిర్ణీత సమయానికి ఆమె బరువు 50 కేజీల 100 గ్రాములుగా రికార్డు అయింది. దాంతో భారత రెజ్లర్ బాధతో నిష్క్రమించక తప్పలేదు.

12 లో

వినేశ్ విషాదం | **సీఏఎస్‌లో అప్పీల్** | **చాంపియన్లకే చాంపియన్: మోదీ**

చంద్రబాబుది అధర్మ యుద్ధం..
మనమే గెలవాలి

పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నియోజకవర్గాల వారీగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో వేర్వేరుగా సమావేశం

విలువలు, విశ్వసనీయతే వైఎస్సార్‌సీపీ నైజం

పార్టీ ప్రజా ప్రతినిధులందరిదీ అదే మాట, అదే బాట

3 లో



- ఏకాభిప్రాయంతోనే ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స ఎంపిక
- రూ.5 లక్షలు.. రూ.10 లక్షలు ఇస్తామంటూ చంద్రబాబు ప్రలోభ పెడుతున్నారు
- ఆ ప్రలోభాలకు లొంగకుండా మనస్ఫూర్తిగా సహకరించండి
- ఎన్నెన్నో హామీలిచ్చి అన్ని వర్గాల వారిని మోసం చేశారు
- మీ జగనే సీఎంగా ఉండి ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన వచ్చి ఉండేవి

“ తెలుగుదేశం పార్టీ చేస్తున్న కొనుగోలు, ప్రలోభాల కార్యక్రమాలకు ఎవ్వరూ లొంగొద్దు. నేను ఒక్కటే చెబుతున్నా. జగన్ పలావ్ పెట్టాడు. చంద్రబాబు బిర్యానీ పెడతామన్నాడు. చంద్రబాబుని నమ్మి ఓటేశారు. పలావ్ పోయింది.. బిర్యానీ పోయింది. చివరకు పస్తు పడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. చంద్రబాబును నమ్ముకున్న ప్రజలైనా, నాయకులకైనా అంతే. మనం ప్రవర్తించే తీరు మార్గదర్శకంగా ఉండేలా, గొప్పగా ప్రజల్లో నిలబడేలా నేను, మీరు అడుగులు ముందుకు వేద్దాం. చంద్రబాబు చేస్తున్న ఈ అధర్మ యుద్ధంలో మనమే గెలవాలి.

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

న్యూస్‌రీల్

రూ.10 నాణెం చెల్లుతుంది



రూ.10 నాణెం చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోరింది. ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఈ నాణేలను స్వీకరించాలని సూచించింది. దీనిపై పత్రికా ప్రకటన విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది.
వివరాలు 2లో ▸

డ్వాక్రా మహిళలపై అమరావతి ట్యాక్స్



అమరావతికి కేంద్రం నుంచి నిధులు రాబట్టలేకపోయిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు ఆ భారాన్ని డ్వాక్రా మహిళలపై వేస్తోంది. ప్రతి మహిళా అమరావతి కోసం రూ.100 ఇవ్వాల్సిందేనంటూ అధికారుల ద్వారా హుకుం జారీ చేయిస్తోంది.
వివరాలు 3లో ▸

ఎంబీబీఎస్.. పెరగనున్న కటాఫ్‌లు!



ఎంబీబీఎస్ కోర్సులో 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు కౌన్సెలింగ్ త్వరలో ప్రారంభం కానుంది. గతేడాదితో పోలిస్తే ఈసారి కటాఫ్‌లు బాగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.
వివరాలు 14లో ▸

విశాఖలో కూటమి 'మహా' కుట్ర



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల నిరసన

మహా విశాఖ నగర పాలక సంస్థలో జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో టీడీపీ కూటమి కుట్ర చేసింది. జీవీఎంసీ కమిషనర్ కూడా మద్దతు పలుకుతూ.. చెల్లని ఓట్లను పరిగణనలోకి తీసుకుని టీడీపీ గెలిచినట్లు ప్రకటించారు.
వివరాలు 2లో ▸

ఇదం జగత్



• మళ్లీ ఐదేళ్ల తర్వాత.. **క్యూలో రైతన్న**



పల్నాడు జిల్లా నరసరావుపేటలో విత్తనాల టోకెన్ కోసం బారులుదీరిన రైతులు

విత్తనం దొరక్క
రైతులు 'వర్రీ'

జేజీఎల్–384 రకం వరి విత్తనం దొరక్క రైతుల అవస్థలు

5 లో

పది రోజులుగా కాళ్లరిగేలా తిరుగుతూ ఎదురు చూపులు

ఒకే ఒక్క దుకాణంలో విక్రయం.. క్యూకట్టిన రైతులు

రైతులు కోరిన విత్తనాలు అందజేయలేని ప్రభుత్వం

నోరు మెదపని ఎమ్మెల్యేలు.. అన్నదాతల ఆగ్రహం

ఈవీఎంలపై ఫిర్యాదులు
వెనక్కి తీసుకోండి

మీరు చెల్లించిన ఫీజు వాపసు ఇస్తాం.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై ఎన్నికల సంఘం అధికారుల ఒత్తిడి

- విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలో 81 శాతం పోలింగ్
- 21 రోజులు గడిచినా ఈవీఎంలలో ఇంకా 99 శాతం ఛార్జింగ్
- దీనిపై విచారణ జరపాలని ఆర్వోకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బెల్లాన ఫిర్యాదు
- ఈసీ సూచన మేరకు రూ.94,400 ఫీజు కింద చెల్లింపు
- ఈవీఎంల ట్యాంపరింగ్, హ్యాకింగ్ అనుమానంతో ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని ఫిర్యాదు
- విచారణ కోసం రూ.5,66,400 ఫీజు చెల్లించిన బాలినేని
- ఇదే రీతిలో బొబ్బిలి అభ్యర్థి శంబంగి చినఅప్పలనాయుడు ఫిర్యాదు.. ఈనెల 25 నుంచి 28 వరకూ విచారణ చేస్తామన్న ఎన్నికల సంఘం

2 లో



- తేదీ దగ్గరపడుతున్న కొద్దీ అధికారుల్లో ఆందోళన
- ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున ఒత్తిళ్లు
- ఈవీఎంల పనితీరుపై ఏడీఆర్, వీఎఫ్‌డీ అనుమానాలు
- ఓట్లు, పోలింగ్ శాతాల్లో భారీ వ్యత్యాసాలపై ఫిర్యాదు
- ఏపీలో ఏకంగా 12.54 శాతం పోలింగ్ పెరగడంపై ఆశ్చర్యం
- హ్యాకింగ్ లేదా మార్చడం లేదా సక్రమంగా పనిచేయకపోవడమే పోలింగ్ శాతం పెరగడానికి కారణమని విశ్లేషణ
- వీఎఫ్‌డీ, ఏడీఆర్ ప్రశ్నలపై స్పందించని ఎన్నికల సంఘం
- తాజాగా ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై ఒత్తిడి

ఈవీఎంల పనితీరుపై అనుమానాలకు మరింత బలం చేకూర్చుతున్న ఈసీ తీరు



జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనానికి
లోపాలు నిజమే

ఆ వాహనం అద్దాలకు పగుళ్లు కూడా ఉన్నాయి

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

మాజీ సీఎంకు మంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వాల్సిన అవసరం ఉందన్న హైకోర్టు

భద్రత కుదింపుపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రతలో భాగంగా ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం లోపభూయిష్టమైనదన్న వాస్తవాన్ని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఎదుట పరోక్షంగా అంగీకరించింది. ఆ బుల్లెట్ ప్రూఫ్ వాహనానికి మరమ్మతులు చేయించి పాడైపోయిన భాగాలను మార్చి తిరిగి వైఎస్ జగన్‌కు కేటాయిస్తామని హైకోర్టుకు నివేదించింది. ఈలోపు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని


మిగతా 5వ పేజీలో ▶

కొత్త వైద్య కళాశాలల
ప్రైవేటీకరణ!

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్వహణకు అడుగులు

- గుజరాత్ పీపీపీ మోడల్ అధ్యయనానికి కసరత్తు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రి మండలిలో నిర్ణయం
- ఐదు కొత్త వైద్య కళాశాలల్లో అదనంగా 380 పోస్టుల భర్తీ
- ఇద్దరు పిల్లలకు మించి ఉంటే 'స్థానిక' ఎన్నికల్లో పోటీపై నిషేధం ఎత్తివేత
- ఎక్సైజ్ శాఖ పునర్ నిర్మాణానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- ప్రభుత్వ ముద్ర, క్యూఆర్ కోడ్‌తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు
- మత్స్యకారుల హక్కులకు భంగం కలిగించే 144, 217 జీవోలు రద్దు
- వెల్లడించిన మంత్రి పార్థసారథి

10 లో




చేనేతలకు ఎన్నో ఇవ్వాలనుకున్నా..
ఇవ్వలేకపోతున్నా

గత ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేసింది

చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని వెల్లడి

10 లో



విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ నుంచి కడలి వైపు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

కడలి వైపు కృష్ణమ్మ పరుగులు

2 లో

ప్రకాశం బ్యారేజ్‌లోకి లక్షా 51వేల క్యూసెక్కుల ప్రవాహం

నేడు కూడా ఇదే రీతిలో వరద కొనసాగే అవకాశం

70 గేట్లు ఎత్తి 1,37,450 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

పులిచింతలలో 37.10 టీఎంసీలకు చేరిన నిల్వ

గోదావరిలోనూ స్వల్పంగా వరద పెరుగుదల

రాష్ట్రంలో 3 రోజులు వర్షాలు 14 లో

కొత్త తరం.. పర్యాటకానికి ఊతం!



- యువ పర్యాటకులతో దేశీ జీడీపీ పెరుగుదల
- 6శాతం నుంచి 9 శాతానికి పెరుగుతుందని అంచనా
- ప్రపంచవ్యాప్తంగా ర్యాంకింగ్స్‌లో భారత్‌కు 39వ స్థానం
- రోడ్డు, రైలు ప్రయాణాలతో పోలిస్తే విమాన ప్రయాణాలు రెట్టింపు

పర్యాటక రంగంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. కోవిడ్ మహమ్మారి తర్వాత ప్రత్యేకించి దేశీయ సందర్శకుల్లో స్థిరమైన పర్యటనలను నమోదు చేస్తోంది. అయితే దేశంలో ట్రావెల్–అండ్ టూరిజం డెవలప్‌మెంట్ ఇండెక్స్ (టీటీడీఐ) స్కోరు 2019తో పోలిస్తే 2.1 శాతమే ఉన్నప్పటికీ.. ప్రపంచ దేశాలతో పోలిస్తే అద్భుత పురోగతిని కనబరుస్తోంది. ఐరోపా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో అధిక–ఆదాయ ఆర్థిక వ్యవస్థల జాబితాలో ముందంజలో నిలిచాయి. అమెరికా అగ్రగామిగా ఉండగా దక్షిణాసియాలో, దిగువ మధ్య ఆదాయ దేశాల్లో భారత్ అగ్రగామిగా ఎదిగింది. ఈ క్రమంలోనే భారత్ టీటీడీఐ ఇండెక్స్‌లో 119 దేశాలలో 2021లో 54వ స్థానంలో ఉండగా.. తాజాగా 39వ స్థానానికి ఎగబాకింది. – సాక్షి, అమరావతి

కొత్త తరం ప్రయాణికులు..

దేశంలో యువ ప్రయాణికులు జీడీపీకి బలంగా మారుతారని అమెరికాకు చెందిన అంతర్జాతీయ స్ట్రాటజీ కంపెనీ మెకిన్సే ప్రకటించింది. ఈ వార్షిక వృద్ధి 6 శాతం నుంచి 9శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. దేశీయ ప్రయాణ మార్కెట్ జపాన్, మెక్సికోలను అధిగమించి 2023 నాటికి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద దేశంగా భారత్ అవతరిస్తుందని ది స్టేట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ నివేదిక వెల్లడిస్తోంది. ఈ క్రమంలోనే దేశంలో రైలు రోడ్డు ప్రయాణాలతో పోలిస్తే.. విమాన ప్రయాణికుల రద్దీ 2030 నాటికి రెట్టింపు అవుతుందని పేర్కొంది. 2020లో 75 శాతం పడిపోయిన విమాన ప్రయాణం.. ఈ ఏడాది చివరి నాటికి మునుపటి స్థితికి చేరుకుంటుందని స్పష్టం చేసింది.



గతేడాది రూ.2వేల కోట్ల ఆదాయం

ఆన్‌లైన్ డేటా ప్లాట్‌ఫారమ్ స్టాటిస్టిక్స్ ప్రకారం 2023లో దేశంలో పర్యాటక పరిశ్రమ సుమారు రూ.2వేల కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఇందులో అత్యధిక వాటా హోటల్ రంగం నుంచే వచ్చింది. 2028 నాటికి ప్యాకేజీ హాలిడేస్ మార్కెట్ 6.50 కోట్ల మందికిపైగా చేరుకుంటుందని అంచనా. దేశంలో పర్యాటకాభివృద్ధికి (పర్యాటక వెంచర్లలో) 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. సందర్శకులకు నాణ్యమైన పర్యాటక మౌలిక వసతులు కల్పించడంతో పాటు వారసత్వ ప్రదేశాల సంరక్షణను చేపడుతోంది.



2023లో దేశంలో పర్యాటక పరిశ్రమ ఆదాయం (రూ.కోట్లలో) **2,000**

వార్షిక వృద్ధి అంచనా **6** శాతం నుంచి **9** శాతం

టీటీడీఐ స్కోర్ ప్రకారం ప్రపంచంలో భారత్ స్థానం **39**

క్లుప్తంగా...

రాజధాని నిర్మాణంతో భూముల విలువ పెంచుతాం

- మంత్రి నారాయణ



సాక్షి, అమరావతి/తాడికొండ: అమరావతి నిర్మాణంతో భూముల విలువ పెంచుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. బుధవారం రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. రాజధాని పునర్నిర్మాణంలో భాగంగా రూ.36.20 కోట్లతో 24వేల ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టామని తెలిపారు. ఇందుకోసం నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్సీసీ) టెండర్ దక్కించుకున్నట్లు వివరించారు. జంగిల్ క్లియర్స్ పనులు పూర్తయితే రైతులు తమకు వచ్చిన రిటర్నబుల్ ప్లాట్‌లు ఎక్కడున్నాయో చూసుకోవచ్చన్నారు. మరో ఐదేళ్ల పాటు కౌలు, భూమిలేని వారికి పెన్షన్‌ను పొడిగించినట్టు వివరించారు. రాజధానిలో ఇప్పటికే నిర్మించిన భవనాల సామర్థ్యంపై అధ్యయనం చేసేందుకు వచ్చిన హైదరాబాద్, మద్రాస్ ఐఐటీ నిపుణులు తమ ప్రాథమిక నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి అందజేస్తారని మంత్రి తెలిపారు.

ఎన్నికల ముందు పనిచేసిన మండలాలకే ఎంపీడీవోల బదిలీలు



సాక్షి, అమరావతి: కోడ్ నిబంధనల కారణంగా ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలను బదిలీ చేసిన మండలాల నుంచి తిరిగి వారు పనిచేసిన మండలాలకే బదిలీలకు వీలు కల్పిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సంఘం పేర్కొన్న నిబంధనల మేరకు ఆయా బదిలీల ప్రక్రియ చేపట్టాలంటూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌కు సూచించారు.

2025 నాటికి అంధత్వ వ్యాప్తిని తగ్గించాలి

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంధత్వ వ్యాప్తిని 2025 నాటికి 0.25 శాతానికి తగ్గించాలని జాతీయ అంధత్వ, దృష్టిలోప నియంత్రణా కార్యక్రమ అధికారులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ ఆదేశించారు. అంధత్వ నియంత్రణ కార్యక్రమం అమలు తీరుపై బుధవారం కమిషనర్ సమీక్ష నిర్వహించారు. విద్యార్థి దశలోనే కంటి పరీక్షలు నిర్వహించడం వల్ల దృష్టి లోపాల్ని ముందుగానే పసిగట్టి, నివారించవచ్చునన్నారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థుల కంటి పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈనెల 25 నుంచి సెప్టెంబర్ ఎనిమిదో తేదీ వరకూ నేత్ర దాన పక్షోత్సవాల్ని నిర్వహించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రైవేట్ యాజమాన్యాలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జేడీ డాక్టర్ సునీల్ నాయక్ పాల్గొన్నారు.

'దేవదాయ' పరిధిలో లేని అర్చకులకు కనీస వేతనం



సాక్షి, అమరావతి: దేవదాయ పరిధిలో లేకుండా కొందరు వ్యక్తులు, కమిటీల ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయాల్లో పనిచేసే అర్చకులకు కనీస వేతనాలు అందజేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అర్చకుల కనీస వేతనాలకు కూడా ఆదాయం లేని ఆలయాలకు దేవదాయ శాఖ పరంగా ఆర్థిక సహాయం అందజేసేందుకు జిల్లాల వారీగా ఆలయాల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. జిల్లాల దేవదాయశాఖ అధికారులు గురువారం ఉదయం కల్లా ఆ వివరాలు పంపాలంటూ ఆశాఖ కమిషనర్ కార్యాలయం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఈవీఎంలపై ఫిర్యాదులు వెనక్కి తీసుకోండి

ఈవీఎంల పనితీరుపై అనుమానాలకు మరింత బలం చేకూర్చుతున్న ఈసీ తీరు

సాక్షి, అమరావతి: దేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) పనితీరుపై ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్), వీఎఫ్‌డీ (ఓట్ ఫర్ డెమొక్రసీ) వ్యక్తం చేసిన అనుమానాలు నిజమేనా? ఎన్నికల సంఘం తొలుత వెల్లడించిన పోలింగ్ శాతానికి, తర్వాత ప్రకటించిన దానికి భారీ వ్యత్యాసం ఉండటం.. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 12.54 శాతం పోలింగ్ పెరగడంపై ఆ రెండు సంస్థలతోపాటు పలు రాజకీయ పార్టీల నేతలు, సామాజికవేత్తలు వ్యక్తం చేసిన సందేహాలు వాస్తవమేనా? పోలింగ్ శాతం ఇంత భారీ స్థాయిలో ఉండటానికి కారణం ఈవీఎంలను హ్యాకింగ్ చేసైనా ఉండాలి! లేదంటే ఈవీఎంలను మార్చైనా ఉండాలి! లేదంటే అవి సక్రమంగా పనిచేయకపోయి ఉండాలి! అంటూ వీఎఫ్‌డీ, ఏడీఆర్ వ్యక్తం చేసిన సందేహాలు వాస్తవమేనా? ఈవీఎంల పనితీరుపై చేసిన ఫిర్యాదులను వెనక్కి తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను తాజాగా అధికారులు కోరుతుండటం ఎన్నికల ప్రక్రియపై వ్యక్తమవుతున్న అనుమానాలకు మరింత బలం చేకూర్చుతోంది.

ఈవీఎంల పనితీరుపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఫిర్యాదు..

రాష్ట్రంలో మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలో 81 శాతం ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపును ఈసీ జూన్ 4న చేపట్టింది. అంటే పోలింగ్ పూర్తయిన 21 రోజుల తర్వాత ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ఓటింగ్ యంత్రాలను పరిశీలించగా అధిక శాతం ఈవీఎంలలో ఛార్జింగ్ 99 శాతం ఉన్నట్లు



గమనించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ అనుమానం వ్యక్తం చేస్తూ దీనిపై విచారణ జరపాలని రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. విచారణ కోసం జూన్ 10న ఆయన రూ.94,400 ఫీజు కూడా చెల్లించారు. ఈవీఎంలో మెమరీని తొలగించారా..? మైక్రో కంట్రోలర్ ట్యాంపరింగ్ జరిగిందా? కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్స్ ట్యాంపరింగ్‌గానీ ఏమైనా మార్పులుగానీ జరిగాయా? అని అనుమానం వ్యక్తం చేస్తూ వాటిపై విచారణ చేయాలని ఒంగోలు శాసనసభ స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. మొత్తం 12 ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బాలినేని ఫిర్యాదు సమర్పించారు. విచారణకు రూ.5,66,400 ఫీజుగా జూన్ 10న చెల్లించారు. బొబ్బిలి శాసనసభ స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శంబంగి చిన అప్పలనాయుడు కూడా ఇదే రీతిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులన్నింటిపైనా ఈనెల 25వతేదీ నుంచి 28 వరకు ఈవీఎంలు తయారు చేసిన కంపెనీ ప్రతినిధులు, ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారుల సమక్షంలో విచారణ జరగనుంది.

వెనక్కి తీసుకోవాలంటూ ఒత్తిళ్లు..

రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే దేశవ్యాప్తంగా సందేహాలు రేకెత్తుతుండగా తాజాగా ఎన్నికల సంఘం అధికారులు వ్యవహరిస్తున్న తీరు మరింత అనుమానాస్పదంగా ఉంది. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఫిర్యాదులను విచారించేందుకు స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం వెనకడుగు వేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. విచారణ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అధికారుల్లో ఆందోళన పెరుగుతోంది. ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై అధికారులు పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్నారు. ఫిర్యాదులు వెనక్కి తీసుకుంటే మీరు చెల్లించిన ఫీజు వెనక్కి ఇచ్చేస్తామని ప్రతిపాదిస్తున్నారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ఈవీఎంల పనితీరుపై ఏడీఆర్, వీఎఫ్‌డీలతోపాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, వివిధ రాజకీయపార్టీల నేతలు, సామాజికవేత్తలు వ్యక్తం చేసిన అనుమానాలు నిజమేననే అభిప్రాయం బలంగా కలుగుతోంది. ఇదే అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌ను 'సాక్షి' సంప్రదించగా.. సీఈవో కార్యాలయానికి ఈ విచారణకు సంబంధం ఉండదని, ఇది పూర్తిగా జిల్లా స్థాయిలో జరుగుతుందని స్పష్టం చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫిర్యాదులపై ఆయా రిటర్నింగ్ అధికారులదే బాధ్యత అని పేర్కొన్నారు. వారి సమక్షంలోనే ఈ విచారణ ప్రక్రియ జరుగుతుందని సీఈవో చెప్పారు.

విచారణ నిర్వహించాల్సిందే



ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలను పరిశీలించగా అధిక శాతం ఈవీఎంలలో ఛార్జింగ్ 99 శాతం ఉన్నట్లు తేలింది. నా లోక్‌సభ స్థానం పరిధిలో 81 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్‌కు, కౌంటింగ్ తేదీకి మధ్య 21 రోజులు గడువు ఉంది. అయినా సరే ఈవీఎంలలో 99 శాతం ఛార్జింగ్ ఉండటాన్ని బట్టి చూస్తే ట్యాంపరింగ్ జరిగిందనే అనుమానంతో ఫిర్యాదు చేశా. విచారణకు అయ్యే ఫీజు మొత్తాన్ని కూడా చెల్లించా. అయితే ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని అధికారులు నన్ను కోరారు. ఫిర్యాదు ఉపసంహరించుకుంటే ఫీజు వాపసు ఇస్తామని చెప్పారు. దాన్ని నేను సున్నితంగా తోసిపుచ్చా. విచారణ నిర్వహించాల్సిందేనని తేల్చి చెప్పా.

– బెల్లాన చంద్రశేఖర్,
విజయనగరం లోక్‌సభ స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

ఫీజు వెనక్కి ఇస్తామని పీఏకు ఫోన్



ఈవీఎంల ట్యాంపరింగ్, హ్యాకింగ్, ఓటింగ్ యంత్రాలను మార్చేశారని అనుమానాలు వ్యక్తం చేస్తూ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశా. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఫిర్యాదుపై విచారణ కోసం ఫీజు కూడా చెల్లించా. ఇప్పుడు ఆ ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని నా పీఏకు అధికారులు ఫోన్ చేశారు. ఫిర్యాదు వెనక్కి తీసుకుంటే ఫీజు వాపసు ఇస్తామని చెప్పారట. దీనిపై విచారణ జరగాల్సిందే.. వాస్తవాలు నిగ్గు తేల్చాల్సిందేనని తేల్చి చెప్పా.

– బాలినేని శ్రీనివాసరెడ్డి,
ఒంగోలు శాసనసభ స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

విశాఖలో కూటమి మహాకుట్ర

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వివాదాస్పదం.. చెల్లని ఓట్లతో గెలుపు






కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళుతున్న పోలీసులు.. కన్నీటి పర్యంతం అవుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ రోహిణి

- టీడీపీ కార్యకర్తలా వ్యవహరించిన కమిషనర్
- పోలైన ఓట్లలో చెల్లనివి ఉన్నా.. లెక్కించాలంటూ ఆదేశాలు
- న్యాయపోరాటం చేస్తామన్న మేయర్, డిప్యూటీ మేయర్

సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థలో జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో టీడీపీ కూటమి కుట్ర రాజకీయాలకు తెరతీసింది. కూటమి కార్పొరేటర్లకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మద్దతు పలుకుతూ.. చెల్లని ఓట్లను కూడా పరిగణనలోకి తీసుకుని.. 10కి 10 స్థానాల్లోనూ టీడీపీ విజయం సాధించినట్లు ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక తొలిసారిగా జీవీఎంసీలో జరుగుతున్న ఎన్నికలు కావడంతో.. టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కుట్రలు చేసైనా విజయం సాధించాలనే ఉద్దేశంతో.. కార్పొరేటర్లకు రూ.5 లక్షల వరకూ డబ్బులిచ్చి మరీ ఓట్లు బహిరంగంగానే కొనుగోలు చేశారు. తమకు మద్దతిస్తున్న కార్పొరేటర్లను భీమిలిలోని రిసార్టులో మంగళవారం రాత్రి మొత్తం అక్కడే బస చేయించి.. ఉ.11 గంటల సమయంలో ఓటింగ్‌కు బస్సులో తీసుకొచ్చారు. మరోవైపు.. టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు కొందరు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు నేరుగా ఫోన్లుచేసి డబ్బులు పంపిస్తున్నట్లు చెప్పి ఓట్లు కొనుగోలు చేశారు.

బ్యాలెట్ పేపర్లపై కలర్ పెన్సిళ్లతో గుర్తులు..

ఇక డబ్బులు తీసుకున్న వారు తమకు ఓట్లు వేశారా లేదా అనేది తెలుసుకునేందుకు కలర్ పెన్సిళ్లతో బ్యాలెట్ పేపర్‌పై అనధికారికంగా గీతలు గీశారు. వాస్తవానికి.. బ్యాలెట్ పేపర్‌పై పెన్ను, పెన్సిల్, స్కెచ్ గీతలుంటే కచ్చితంగా ఆ ఓట్లు చెల్లుబాటు కావన్న నిబంధనలున్నా కమిషనర్ మాత్రం పూర్తిగా పక్కా టీడీపీ కార్యకర్తలా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆ ఓట్లు చెల్లుబాటు కావని చెబుతున్నా బేఖాతరు చేస్తూ టీడీపీ కార్పొరేటర్లు 10 మంది విజయం సాధించినట్లు ప్రకటించారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కమిషనర్ తీరుపై మండిపడ్డారు. పోర్టికోలో బైఠాయించారు. ముందుగానే కుట్ర పన్ని గెలుపొందాలని స్కెచ్ వేసిన టీడీపీ పెద్దఎత్తున పోలీసు బలగాల్ని రంగంలోకి దించి.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను జీవీఎంసీ నుంచి బయటికి పంపించేశారు. అక్రమంగా విజయం సాధించిన టీడీపీ వ్యవహారం, కమిషనర్ వ్యవహరించిన తీరుపై న్యాయపోరాటం చేస్తామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీను, ఇతర కార్పొరేటర్లు తెలిపారు.

రూ.10 నాణెం చెల్లుతుంది

- ఏపీఎస్‌ఆర్టీసీ వంటి ప్రభుత్వరంగ సంస్థలు రూ.10 నాణేలను స్వీకరించాలి
- దీనిపై పత్రికా ప్రకటన జారీ చేసి ప్రోత్సహించాలి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



వ్యాపారులకు పదిరూపాయల నాణేలను అందిస్తున్న కుమార్ విశ్వజిత్

సాక్షి, అమరావతి: రూ.10 నాణెం చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి ముందుకు రావాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఏపీఎస్‌ఆర్టీసీ వంటి ప్రభుత్వరంగ సంస్థలు పది రూపాయల నాణేలను స్వీకరించడం ద్వారా ప్రజలకు భరోసా కల్పించేలా తక్షణం పత్రికా ప్రకటన విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. బుధవారం విజయవాడలో 32వ స్టేట్ లెవెల్ సెక్యూర్టీ మీటింగ్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ కమల్ పి పట్నాయక్ మాట్లాడుతూ ప్రజల్లో నెలకొన్న అపోహల వల్ల రాష్ట్రంలో తీవ్రమైన చిల్లర కొరత నెలకొని ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే కర్ణాటక ప్రభుత్వం ముందుకు వచ్చి ప్రకటన విడుదల చేసిన తర్వాత రూ.10 నాణేల చెలామణి ఏడు రెట్లు పెరిగిందని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశానికి చైర్మన్‌గా వ్యవహరించిన రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌ను కోరారు. ఇప్పటికే ఆర్‌బీఐ పలు ప్రకటనలు చేసినా వినియోగం ఆశించినంత పెరగలేదని, ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. రూ.10 నోట్లతో పోలిస్తే నాణేల జీవిత కాలం రెండు దశాబ్దాలుపైన ఉంటుందని తెలిపారు. రూ.10 నాణేలు చెల్లవనే ప్రచారం ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధికంగా ఉందని, హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ పరిధిలో రూ.22 కోట్ల విలువైన రూ.10 నాణేలు మింట్, కరెన్సీ చెస్ట్‌ల్లో మూలుగుతున్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో 14 డిజైన్లలో పది రూపాయల నాణేలు చెలామణిలో ఉన్నాయని, ఇవన్నీ కూడా చెల్లుతాయని ఆర్‌బీఐ అధికారులు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన విశ్వజిత్ ఆర్‌బీఐ లిఖిత పూర్వకంగా ఈ ప్రతిపాదనను పంపిస్తే తక్షణంచర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంతో చర్చిస్తామని హామీనిచ్చారు. రూ.10 నాణేల చెలామణి పెంచే విధంగా బ్యాంకులు కూడా ప్రోత్సహించాలని ఆర్‌బీఐ కోరింది. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు, డీమార్ట్, మోడరన్ సూపర్ బజార్, రైస్ మిల్లుల వ్యాపారులకు రూ.10 నాణేలను కమల్ పి పట్నాయక్, కుమార్ విశ్వజిత్ చేతుల మీదుగా అందజేశారు.

ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.7,266 కోట్లు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రతిపాదన మేరకే..
- 2024–25 వార్షిక ప్రణాళికకు కేంద్రం ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రూ.7,266 కోట్లతో జాతీయ రహదారులను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2024–25 వార్షిక ప్రణాళికను ఆమోదించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదన మేరకే కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ ఆమోదముద్ర వేసింది. ఆ మేరకు 2023 డిసెంబర్‌లోనే ప్రతిపాదనలు పంపింది. కీలకమైన విజయవాడ తూర్పు బైపాస్‌తోసహా పలు కీలక ప్రాజెక్టులను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

2024-25 వార్షిక ప్రణాళిక కింద ఆమోదించిన ప్రాజెక్టులు ఇవీ..

- కృష్ణా జిల్లా రామారావు పేట నుంచి గుంటూరు జిల్లా కాజా టోల్‌గేట్ వరకు నాలుగు లేన్ల విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణానికి రూ.2,716 కోట్లు.
- వినుకొండ – గుంటూరు నాలుగు లేన్ల రహదారికి రూ.2,360కోట్లు
- అనకాపల్లి జిల్లా సబ్బవరం నుంచి విశాఖ జిల్లా షీలానగర్ వరకు ఆరులేన్ల రహదారి నిర్మాణానికి రూ.906 కోట్లు
- విజయవాడలోని మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఆరు లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.669కోట్లు
- చెన్నై– కోల్‌కతా జాతీయ రహదారిపై రణస్థలం వద్ద విడిచిపెట్టిన ఆరు లేన్ల రహదారి నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు రూ.325కోట్లు
- గన్నవరం సమీపంలోని గుండుగొలను 'గామన్ జంక్షన్' వద్ద నాలుగు లేన్ల ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.150కోట్లు
- జాతీయ రహదారి 44పై 416 కి.మీ. వద్ద అసంపూర్తిగా ఉన్న నాలుగు లేన్ల ఫ్లై ఓవర్‌ను పూర్తి చేసేందుకు రూ.140 కోట్లు

కడలి వైపు కృష్ణమ్మ పరుగులు



నాగార్జునసాగర్ నుంచి విడుదలవుతున్న నీరు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: కడలి వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ప్రకాశం బ్యారేజ్‌లోకి బుధవారం సా.6 గంటలకు 1లక్షా 51వేల క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టా కాలువలకు 13,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్న అధికారులు.. మిగులుగా ఉన్న 1,37,450 క్యూసెక్కులను 50 గేట్లను మూడు అడుగులు, 20 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. బ్యారేజ్‌లోకి గురువారం కూడా ఇదే రీతిలో వరద కొనసాగనుంది. మరోవైపు.. నాగార్జునసాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టులోకి 3.74 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. ఇక్కడ 37.10 టీఎంసీలను నిల్వచేస్తూ దిగువకు 1.06 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అలాగే, శ్రీశైలం ప్రాజెక్టులోకి 3.32 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 882.8 అడుగుల్లో 203.42 టీఎంసీలు నిల్వచేస్తూ పది గేట్లు ఎత్తి, విద్యుదుత్పత్తి చేస్తూ 4.03 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 3.50 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 584.6 అడుగుల్లో 296.28 టీఎంసీలు నిల్వచేస్తూ గేట్లు ఎత్తి, ప్రధాన కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 2.70 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆ రెండింటి నుంచి దిగువకు రెండు లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 59 వేల క్యూసెక్కులు చేరుతుండగా.. 103.74 టీఎంసీలు నిల్వచేస్తూ 60 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. ఈ నేపథ్యంలో.. గురువారం కూడా శ్రీశైలంలోకి వరద ఉధృతి ఇదే రీతిలో కొనసాగనుంది. మరోవైపు.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పత్తి, పెసర, మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి పెరుగుతుండటంతో ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి..

ఇదిలా ఉంటే.. గోదావరి వరద స్వల్పంగా పెరుగుతోంది. నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాలతో ఉప నదుల నీరు, కొండవాగుల నీరు క్రమేపీ నదిలోకి చేరుతుండటంతో వరద ఉధృతి పెరుగుతోంది. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30.800 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 6.24 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది. ఎగువన భద్రాచలం వద్ద కూడా గోదావరి వరద పెరుగుతూ 35.3 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో వరద మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాగులు పొంగి ప్రవహిస్తున్నందున చింతూరు మండలంలో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వీఆర్‌పురం మండలంలో అన్నవరం వాగు పొంగి వరదనీరు రహదారి పైనుండి ఉధృతంగా ప్రవహించింది. వరినాట్లు నిమిత్తం అవతలి పక్కకు వెళ్లిన వ్యవసాయ కూలీలు తిరుగుమార్గంలో ప్రాణాలకు తెగించి వాగును దాటారు.

క్లుప్తంగా...

సినిమా వృక్షం పునరుజ్జీవానికి చర్యలు


కూలిన భారీ వృక్షాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొవ్వూరు: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో నేలకూలిన 150 ఏళ్ల చరిత్ర కలిగిన సినిమా (నిద్రగన్నేరు) వృక్షాన్ని తిరిగి అదే ప్రదేశంలో బతికించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటించారు. అటవీ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి బుధవారం కూలిన చెట్టును ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కెమికల్ ట్రీట్‌మెంటు ద్వారా ఈ చెట్టును మళ్లీ చిగురింప జేసేందుకు రోటరీ క్లబ్ రాజమహేంద్రవరం ముందుకొచ్చిందన్నారు. ఇప్పటికే వీరు పలు భారీ వృక్షాలకు జీవం పోశారని, ఈ వృక్షాన్ని బతికించి, పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ఏపీ వారూ తెలంగాణ సివిల్ జడ్జి పరీక్ష రాయొచ్చు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ బార్ అసోసియేషన్‌లో పేరు నమోదు చేసుకొని ఏపీకి చెందిన 11 మంది కూడా తెలంగాణ సివిల్ జడ్జీల ప్రధాన పరీక్ష రాయడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఏపీకి చెందిన 11 మంది తెలంగాణ సివిల్ జడ్జీల ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. కానీ, నిబంధనల ప్రకారం తెలంగాణ బార్ అసోసియేషన్ నుంచి ఎన్‌రోల్‌మెంట్ సర్టిఫికెట్లు లేకపోవడంతో.. ప్రధాన పరీక్షకు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందని.. తెలంగాణ రాష్ట్ర న్యాయ(సర్వీస్, కేడర్) నిబంధనలు-2023కు విరుద్ధమని పేర్కొంటూ ఆ 11 మందీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించింది. 2024 ఏప్రిల్ 10న జారీ చేసిన నోటిఫికేషన్‌తో ప్రారంభమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పాల్గొనడానికి పిటిషనర్లకు అనుమతి ఇచ్చింది.

గనుల శాఖ అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారు?


సిలికా తవ్వకాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, అమరావతి: లీజుకు తీసుకున్న విస్తీర్ణానికి, నిర్దేశించిన పరిమాణానికి మించి సిలికా ఇసుక తవ్వకాలు జరుపుతుంటే పట్టించుకోని గనుల శాఖ అధికారులపై ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. చర్యలు తీసుకోకుంటే కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ ఎందుకు ఉన్నట్లని ప్రశ్నించింది. ఏం చర్యలు తీసుకుంటున్నారో లిఖితపూర్వకంగా కోర్టుకు వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 4కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిలికా అక్రమ తవ్వకాలపై గూడూరుకు చెందిన నాను మునీంద్ర రెడ్డి, మరో ఇద్దరు గతేడాది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

టోల్‌చార్జీల ప్రతిపాదనను విరమించుకోవాలి

సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్‌ఛార్జీ వసూలు చేయాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పీపీపీ పేరిట రోడ్లపై టోల్‌టాక్స్ వసూలుకు సన్నాహాలు చేయాలని కలెక్టర్ల సమావేశంలో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించినట్టు వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసులు కేసు నమోదు చేసేలా ఆదేశాలివ్వండి

రుషికొండ నిర్మాణాల విషయంలో హైకోర్టులో పిటిషన్

సాక్షి, అమరావతి: రుషికొండపై నిర్మాణాల విషయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రులు, అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తదితరులు నేరపూరిత విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని, దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తానిచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసేలా మంగళగిరి పోలీసులను ఆదేశించాలని కోరుతూ సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ముందు విచారణకు వచ్చింది. అయితే పిటిషనర్ తరఫు న్యాయవాది ఎవరూ లేకపోవడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

చంద్రబాబుది అధర్మ యుద్ధం.. మనమే గెలవాలి

పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులతో వైఎస్ జగన్

> రాజకీయాల్లో ఏ రోజైనా నిలబడాలి అంటే, ప్రజల మన్ననలు ఉండాలంటే.. ఎప్పుడూ షార్ట్ కట్ దారి ఎంచుకోకూడదు. కష్టమైనా కూడా విలువలు, విశ్వసనీయతతో కూడిన దారినే ఎంచుకోవాలి. మీ అందరి దగ్గర నుంచి కూడా నేను ఇదే ఆశిస్తున్నాను. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ప్రజల్లోకి పోతే.. మాట చెప్పాం, నెరవేర్చాం.. అని కాలర్ ఎగరేసుకుని చెప్పాలి. మాలో అబద్ధాలు, మోసాలు, కల్మషం ఉండవని చెప్పాలి. ప్రతి ఒక్కరూ ఇది గుర్తు పెట్టుకోవాలని కోరుతున్నా.
>
> – వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్


తాడేపల్లిలో సమావేశానికి హాజరైన అరకు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు


హాజరైన పాడేరు నియోజకవర్గ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు

సాక్షి, అమరావతి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి సంపూర్ణమైన మెజార్టీ ఉందని, నైతికత ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని పోటీకి పెట్టకూడదని.. అయినా సీఎం చంద్రబాబు అభ్యర్థిని పోటీకి పెట్టారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. మన పార్టీ తరఫున గెలిచిన వాళ్ల వద్దకు మనుషులను పంపించి రూ.5 లక్షలు.. రూ.10 లక్షలు ఇస్తామంటూ ప్రలోభ పెడుతున్నారని ఎత్తి చూపారు. విలువలు, విశ్వసనీయతే వైఎస్సార్‌సీపీ నైజమని, ప్రలోభాలకు లొంగకుండా మన పార్టీ అభ్యర్థి బొత్స సత్యనారాయణకు మనస్ఫూర్తిగా సహకరించాలని పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు సాగిస్తున్న ఈ అధర్మ యుద్ధంలో మనమే గెలవాలని దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆ నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ వారితో ఏమన్నారంటే..

మనమైతే మెజార్టీ లేకుంటే పోటీ పెట్టం

ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో టీడీపీతోపాటు నైతిక విలువలు ఉన్న ఏ పార్టీ పోటీ పెట్టకూడదు. కారణం ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల్లో 600కు పైగా స్థానాల్లో మనం గెలిస్తే.. టీడీపీ వాళ్లు కేవలం 200కు పైగా స్థానాల్లోనే గెలిచారు. వారికి, మనకు దాదాపు 387 స్థానాల తేడా ఉంది. గెలిచిన వాళ్లు అంతా మన పార్టీ గుర్తు, జెండా మీద గెలిచారు. అలాంటి పరిస్థితుల్లో మెజారిటీ లేనప్పుడు ఎవరైనా పోటీ పెట్టకూడదు. మీ జగనే ఈ రోజు ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ఉంటే.. వాళ్లకు అక్కడ మెజారిటీ ఉండి ఉంటే, మనం పోటీ కూడా పెట్టి ఉండేవాళ్లం కాదు. మనం ముఖ్యమంత్రిగా ఉన్నాం.. మన దగ్గర డబ్బులు దండిగా ఉన్నాయని.. పోలీసులు, అధికారులు మన చేతిలో ఉన్నారని అధర్మంగానైనా గెలిచే కార్యక్రమం చేస్తే అది ఏ మాత్రం ధర్మం కాదు. చంద్రబాబునాయుడు మాత్రం తన నైజం చూపిస్తూనే ఉన్నాడు. ఈ రోజుకు కూడా అధర్మంగా యుద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా మన పార్టీ తరఫున గెలిచిన వాళ్లకు ఫోన్లు చేసి ప్రలోభ పెడుతున్నారు. మనుషులను పంపించిన మీకు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇస్తామని ఆఫర్ చేస్తున్నారు.

అప్పుడే ఎవరైనా ఎదుగుతారు

ఎమ్మెల్సీ ఎన్నికలో రాజకీయాల్లో విలువలను అట్టడుగు స్థానంలోకి తీసుకుపోయే కార్యక్రమం జరుగుతోంది. ఏ రోజైనా ఒక రాజకీయ నాయకుడు విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయం చేస్తేనే ఎదుగుతాడు. ఈ విలువలను, విశ్వసనీయతను వదిలి రాజకీయం చేయడం ఏ రోజైతే మనం మొదలు పెడతామో ఆ రోజు ప్రజలకు సమాధానం చెప్పడం మాట దేవుడెరుగు.. ఇంటిలో కూడా గౌరవం ఉండదన్న సంగతి ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. నేను నా జీవితంలో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయమే చేశాను. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చినప్పుడు వెనక్కి తిరిగి చూస్తే నేను, అమ్మ తప్ప ఎవరూ లేరు. ఇద్దరమే బయటకు వచ్చాం. నాతో పాటు కొంత మంది ఎమ్మెల్యేలు వస్తామని అడిగితే.. రాజీనామా చేసి రావాలని చెప్పాను. అక్కడ నుంచి మొదలుపెడితే దేవుని దయతో ప్రతి అడుగులో విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయమే చేశామని తలెత్తుకుని గర్వంగా చెప్పుకోగలం.

మొన్నటి ఎన్నికల్లో మోసపు ప్రచారం

మొన్న ఎన్నికల్లో 10 శాతం ప్రజలు చంద్రబాబునాయుడు మాటలు నమ్మారు. చంద్రబాబు నాయుడు, ఆయన ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు సంతోషమా? అని ప్రచారం చేశారు. అలాగే వాళ్ల అమ్మ కనిపిస్తే నీకు రూ.18 వేలు సంతోషమా? అని అడుగుతూ ప్రచారం చేశారు. ఇలా ఎన్నెన్నో చెప్పారు. ఈ మోసపు ప్రచారంతో ఓ 10 శాతం ప్రజలు మన దగ్గర నుంచి దూరమయ్యారు. కానీ ఏమైంది?. చంద్రబాబు పాలన వచ్చి రెండు నెలలైంది. స్కూళ్లు తెరిచారు, పిల్లలు బడులకు వెళ్తున్నారు. జగన్ ఉండి ఉంటే అమ్మఒడి కింద రూ.15 వేలు ఇచ్చుండే వాడు. ఇప్పుడు ఆ రూ.15 వేలు పోయే.. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు ఇస్తానని చెప్పిందీ పోయింది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జగన్ ఉండి ఉంటే రైతు భరోసా కింద రూ.13,500 చేతిలో పడేవి. చంద్రబాబు వచ్చాడు. రూ.20 వేలు ఇస్తానన్నాడు. జగన్ ఇస్తానన్న రూ.13,500 పోయాయి. చంద్రబాబు ఇస్తానన్న రూ.20 వేలు మొత్తమే రాకపోయే. ఈ రోజు మీ జగన్ ఉండి ఉంటే.. పెద్ద చదువులు చదువుతున్న పిల్లలందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రతి మూడు నెలలకొకసారి ఫీజులు జమ అయ్యేవి. ఇప్పుడు జనవరి, ఫిబ్రవరి, మార్చి త్రైమాసికానికి సంబంధించి ఫీజులు ఎగిరిపోయాయి. డిగ్రీ చదువుతున్న పిల్లలకు ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో వారు కాలేజీలకు వెళ్తున్నారు. ఫీజులు కట్టకపోతే టీసీలు తీసుకుని వెళ్లిపొమ్మని కాలేజీలు చెబుతున్నాయి. వసతి దీవెన పథకం కూడా పోయింది. పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు ఏప్రిల్‌లో పడాల్సిన సున్నా వడ్డీ డబ్బులు కూడా రాలేదు.

అదే మన సర్టిఫికెట్

నేను ఒక్కటే చెబుతున్నాను. మోసం, అబద్ధాలతో సాగించే పాలన ఎక్కువ రోజులు ఉండదు. మనం చేసిన పనులకు ఇవాళ తలెత్తుకుని గర్వంగా ప్రతి ఇంటికి పోగలుగుతున్నాం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చెప్పిన మాట ప్రకారం చేశామని తలెత్తుకుని వెళ్లగలుగుతున్నాం. అదీ మనకున్న సర్టిఫికెట్. కానీ.. చంద్రబాబునాయుడుకు సంబంధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ప్రజల్లోకి వెళ్తే.. మీరిచ్చిన సూపర్ సిక్స్, సూపర్ టెన్, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అడిగితే సమాధానం చెప్పుకోలేని స్థితిలో టీడీపీ కేడర్ ఉంది. అదే వాళ్లకూ మనకూ మధ్య ఉన్న తేడా. గతంలో మన పార్టీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను తీసుకున్నాడు. ఆ 23 మంది ఎమ్మెల్యేల్లో కేవలం ముగ్గురికి మాత్రమే టిక్కెట్టిచ్చాడు. వాళ్లకు ఒక్కొక్కరికి రూ.20 కోట్లు ఇస్తామని.. కేవలం అడ్వాన్స్ ఇచ్చాడు. దాంతో అటువైపు పోయిన వాళ్లందరూ మరలా వెనక్కి వచ్చేస్తామని నాకు ఫోన్ చేశారు. కానీ ఒక్కసారి జారిపోయిన తర్వాత వెనక్కి వస్తే విలువ, గౌరవం పోతుంది. వెనక్కి తీసుకోలేకపోయాం. వాళ్ల రాజకీయ జీవితం సున్నా అయిపోయింది.

చేయలేనిది, జరగనిది మీ జగన్ చెప్పడు

2014 ఎన్నికల్లో మనం ఓడిపోయాం. అప్పుడు కూడా మన వాళ్లు నా దగ్గరికి వచ్చి నా మంచి కోసం, మన మంచి కోసం చాలా చెప్పారు. చంద్రబాబునాయుడు ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ఆడుతున్నారు. రైతులు, మహిళలకు రుణమాఫీ అంటున్నారు. ఇంటింటికీ ఉద్యోగం అంటున్నారు. ఒకవేళ అది ఇవ్వలేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామంటున్నారు. ప్రతి పేద కుటుంబానికి 3 సెంట్ల స్థలం అంటున్నారు. కాబట్టి, మనం కూడా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పమన్నారు. ముందైతే చెప్పేయండి.. ఆ తర్వాత సంగతి చూద్దామన్నారు. కానీ చేయలేనిది, జరగనిది చెప్పడానికి మీ జగన్ ఇష్టపడడు. అబద్ధం చెప్పనందుకు ఆ ఎన్నికల్లో మనం ఓడిపోయి ప్రతిపక్షంలో కూర్చున్నాం. ఆ తర్వాత చంద్రబాబు పరిపాలన చేశాడు. ఆ ఎన్నికల్లో అడ్డగోలుగా అబద్ధాలు చెప్పిన చంద్రబాబు.. ప్రజలను మోసం చేశాడు అన్నది అందరికీ తెలిసేటట్టుగా 2019 ఎన్నికలు వచ్చే సరికి డిపాజిట్లు దక్కని స్థితిలోకి పోయాడు. అప్పుడు మనం అధికారంలోకి వచ్చాం. మన మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్లు చేశాం. మొట్టమొదటిసారిగా రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత అంటే అర్థం చెప్పేలా.. అడుగులు వేశాం. గతంలో మేనిఫెస్టో అంటే చెత్తబుట్టలో వేసే డాక్యుమెంటు. కానీ మొట్టమొదటిసారిగా మేనిఫెస్టో అంటే ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని నిర్వచనం చెబుతూ మాట తప్పకుండా అమలు చేశాం.

అందరూ చెప్పడం వల్లే ఈ నిర్ణయం

మన్యం ప్రాంతం ఎప్పుడూ నాకు తోడుగా ఉంది. పార్టీ స్థాపించినప్పటి నుంచి వెనక్కు తిరిగి చూస్తే ఎప్పుడూ నాకు తోడుగా నిలబడింది. ఏ ప్రాంతం, ఎవరెటుపోయినా ఇక్కడి నాయకులు మాత్రం ఎప్పుడూ వంద శాతం నాకు తోడుగా ఉన్నారు. మీ ప్రేమలు, ఆప్యాయతలు ఇదే మాదిరిగా కొనసాగించాలని కోరుతున్నాను. కష్టకాలంలో ఉన్నప్పుడే ఇంకా మీ సహాయం, సహకారం ఎక్కువ కావాలని కోరుతున్నా. కష్టాల్లో ఉన్నప్పుడే మీరు ఇంకా గట్టిగా నిలబడాలి. ఐదేళ్లు కళ్లు మూసుకుంటే అయిపోతాయి. ఈ ఐదేళ్ల మన పోరాటంలో మీ సహాయ, సహకారాలు మెండుగా ఉండాలని కోరుతున్నాను. బొత్స సత్యనారాయణను మన పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దింపుతున్నాం. మన ప్రాంత ప్రజా ప్రతినిధులను, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్యే అభ్యర్థులు అందరినీ పిలిచి ఎవరైతే బాగుంటుందని అడిగాను. అందరూ ఏకగ్రీవంగా చెప్పారు. శకుని పాచికలు మాదిరిగా జరుగుతున్న ఎన్నికలివి. ఇటువంటి ఎన్నికల్లో మనకు బొత్స సత్యనారాయణ లాంటి స్టేచర్, ప్రొఫైల్ ఉండి ఓర్చుకోగలిగిన, నిలబడగలిగిన నేత అయితే బాగుంటుందని అందరి నోటి నుంచి బొత్స సత్యనారాయణ పేరు వచ్చింది. జిల్లా మొత్తం అందరూ అదే చెప్పారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం. అదీగాక, ప్రత్యేకంగా చంద్రబాబు లాంటి అన్యాయస్తుడితో యుద్ధం చేస్తున్నాం కాబట్టి.. గట్టిగా నిలబడగలిగిన నాయకుడిని నిలబెడితేనే మనకు అడ్వాంటేజ్ ఉంటుంది. అలాగే బొత్స కూడా మన వాళ్లకు గట్టి తోడుగా నిలబడగలుగుతాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా విలువలతో కూడిన రాజకీయాలపై ఫోకస్ పెడుతున్నాం. మీ అందరూ బొత్సకు మనస్ఫూర్తిగా సహకరించాలని, పేరు పేరునా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

డ్వాక్రా మహిళలపై 'అమరావతి ట్యాక్స్'

- డ్వాక్రా మహిళల నుంచి రూ.100 చొప్పున వసూలు
- మధ్యస్థాయి అధికారుల ద్వారా డ్వాక్రా సంఘాలకు హుకుం
- సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ఆడియో టేప్




సాక్షి, అమరావతి: 'రాజధాని అమరావతి కడతాం.. సంపద సృష్టిస్తాం' అంటూ గొప్పలు చెప్పుకొంటున్న బాబు కూటమి ప్రభుత్వం.. కేంద్రం నుంచి నిధులు రాబట్టలేకపోయింది. గతంలో ఇటుకలమ్మి సేకరించిన విరాళాలు మరుగున పడ్డాయి. ఇప్పుడు రాజధాని భారాన్ని రాష్ట్ర ప్రజలపై వేస్తోంది. వివిధ వర్గాల ప్రజల నుంచి బలవంతపు వసూళ్లకు తెగబడుతోంది. చివరికి రూపాయి రూపాయి పొదుపు చేసుకొని, కుటుంబానికి అండగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) అక్కచెల్లెమ్మలనూ వదలడంలేదు. ప్రతి మహిళా వందేసి రూపాయలు అమరావతి కోసం ఇవ్వాల్సిందేనంటూ కొందరు అధికారుల ద్వారా హుకుం జారీ చేయిస్తోంది. ఇదే విధంగా ఓ మధ్యస్థాయి అధికారి డ్వాక్రా మహిళలను ఆదేశిస్తున్న వీడియో టేప్ ఒకటి బయటపడింది. ఈ టేపు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. 'అమరావతి రాజధాని కోసం ఒక్కొక్క సభ్యురాలు రూ. వంద చొప్పున కలెక్షన్ చేయాలి. ప్రతి ఒక్కరూ.. గ్రూపు లీడర్ కూడా సంఘ సభ్యురాలు దగ్గర... సంఘంలో ఎంత మంది ఉన్నారో, అంతమంది మనిషికి వంద రూపాయల చొప్పున కలెక్షన్ చేయండి. నేను చాలా వరకు గ్రూపు లీడర్లకు ఫోన్లు చేశాను. ప్రతి గ్రూపు లీడరు ఫాలోఅప్ చేయండి. రేపు సాయంత్రంకల్లా కలెక్షన్ చేసి మాకు ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్ని సంఘాలు ఇచ్చారన్నది మేం సీవో (మెప్మా విభాగంలో పట్టణ ప్రాంతాల్లో పనిచేసే కమ్యూనిటీ ఆర్గనైజర్)కు అప్పజెప్పాలి. ప్రతి సభ్యురాలు ఎందుకు.. ఏమిటి అని అడగొద్దు. ప్రతి సంఘ సభ్యురాలు వంద రూపాయలు ఇవ్వాలి' అంటూ ఓ పట్టణ ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాల కార్యకలాపాలను పర్యవేక్షించే ఓ మధ్య స్థాయి అధికారి ఆయన పరిధిలోని సంఘాల సభ్యులకు జారీ చేసిన ఆదేశాలు ఆ ఆడియో టేపులో ఉన్నాయి. ఈ ఆడియో టేపులో మాట్లాడిన మాటల ప్రకారం.. ఇప్పటికే తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పొదుపు సంఘాల సభ్యుల నుంచి రూ. వంద చొప్పున వసూళ్లు పూర్తయ్యాయి. సెర్ప్, మెప్మా ఉద్యోగుల చర్చల్లోనూ ఈ విషయం బయటపడింది.

బహిరంగంగానే చెప్పిన చిత్తూరు 'మెప్మా'

ఎన్నికల ఫలితాల అనంతరం సీఎం చంద్రబాబు తొలిసారిగా సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనకు వెళ్లినప్పుడు చిత్తూరు జిల్లాలో మెప్మా అధికారులు ఆ ప్రాంత పొదుపు సంఘాల తరఫున అమరావతి నిర్మాణానికి రూ.4.50 కోట్ల విరాళం ప్రకటించారు. ఆ డబ్బు సేకరణ కోసమే అధికారులు, సంఘాల లీడర్లు డ్వాక్రా మహిళలపై ఒత్తిడి తెచ్చి ఒక్కొక్కరి నుంచి రూ.100 చొప్పున ఇప్పటికే వసూళ్లు చేసినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఇది చిత్తూరు, తిరుపతి జిల్లాలకే పరిమితమవలేదని, మిగతా జిల్లాల్లోనూ వసూళ్లు జరుగుతున్నాయని సమాచారం.

ఆధారాలుంటే చూపండి.. నిరూపించండి

- మదనపల్లె ఘటనపై సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి సవాల్
- ఆ ఘటనతో నాకు సంబంధం లేదు.. ఇదంతా బాబు కుట్రే



సాక్షి, హైదరాబాద్: మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఘటనలో తన ప్రమేయం ఉన్నట్లు ఏ ఆధారాలు ఉన్నా చూపాలని, వాటిని నిరూపించాలంటూ సీఎం చంద్రబాబును మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సవాల్ చేశారు. ఆ ఘటనతో తనకే మాత్రం సంబంధం లేదని, సీబీఐ సహా ఎవరితో దర్యాప్తు జరిపినా ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఇదంతా చంద్రబాబు కుట్రే అని చెప్పారు. ఆయన బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి తమకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆయన్ని ఎదుర్కొంటున్నందునే తనను టార్గెట్ చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. తానెలాంటి తప్పు చేయకపోయినా, కుట్రలతో దోషిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, వ్యక్తిత్వ హననం చేస్తున్నారని మండిపడ్డారు. వారి అనుకూల పత్రికల్లో తనపై దుష్ప్రచారం చేసి, వాటిని నిజాలుగా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఎం నుంచి మంత్రుల వరకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఏ ఆధారాల్లేకపోయినా బురద చల్లుతున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఏమన్నా అంటే ఖజానా ఖాళీ అంటున్నారని, సూపర్ సిక్స్ గురించి కూడా బాబు మాట్లాడటంలేదంటూ దెప్పిపొడిచారు.

నాపేరు చెప్పించే కుట్ర

మదనపల్లెలో తగలబడ్డాయని చెబుతున్న రికార్డులు ఎమ్మార్వో, కలెక్టర్ ఆఫీస్‌తో పాటు సచివాలయంలో కూడా ఉంటాయని చెప్పారు. ఆ రికార్డులన్నింటి డేటా రిట్రీవ్ చేశామని చెబుతున్నారని, ఇక ఆ ఘటనలో కుట్ర కోణం ఏముందని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తూ, వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, వారితో తన పేరు చెప్పించే కుట్ర చేస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల తర్వాతా చాలా మందిని హత్య చేశారని, చాలా మంది ఆడపిల్లలపై అత్యాచారాలు జరిగాయని, ఆ కేసులన్నింటిలో కూడా ప్రభుత్వం ఇంత వేగంగా ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. మదనపల్లెలో అగ్ని ప్రమాదం జరగ్గానే ఏదో పెద్ద విపత్తు సంభవించినట్లు ఏకంగా డీజీపీని హెలికాప్టర్‌లో పంపారని గుర్తు చేశారు.

5 స్టార్ రేటింగ్ కంపెనీగా

'భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్'

- ఆరోసారి ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన కంపెనీగా ఘనత
- అవార్డు ప్రదానం చేసిన కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి


కిషన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న భారతి సిమెంట్స్ కంపెనీ ప్రతినిధి

సాక్షి, న్యూఢిల్లీ: కడపలోని 'భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్'కు ఆరోసారి అత్యంత ప్రతిష్టాత్మకమైన 5 స్టార్ రేటింగ్ లభించింది. పర్యావరణ పరిరక్షణ, విద్య, వైద్యం, పరిశుభ్రత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాల్లో స్థానికంగా చేసిన కృషికి భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది. గనుల రంగంలో సుస్థిరాభివృద్ధి విధానాలు అమలుచేస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న 68 మైనింగ్ సంస్థలకు కేంద్రం 2022–23 సంవత్సరానికి ఈ అవార్డులు అందజేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 5, తెలంగాణ నుంచి 5 సంస్థలు ఈ అవార్డులు అందుకున్నాయి. బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది 7 ఉత్తమ సంస్థలకు 7 స్టార్ రేటింగ్స్ కూడా ఇస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్‌చంద్ర దూబే, గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, అదనపు కార్యదర్శి లోహియా, ఐబీఎం సెక్రటరీ జనరల్ పీఎన్ శర్మ, అవార్డులు సాధించిన సంస్థల ప్రతినిధులు, మైనింగ్ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ఏపీ నుంచి అవార్డు అందుకున్న సంస్థలు

భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్ – కడప, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్ లైమ్ స్టోన్ – నంద్యాల, దాల్మియా సిమెంట్స్ నవాబ్‌పేట – తలమంచిపట్నం, అల్ట్రాటెక్ – తుమ్మలపెంట, శ్రీ జయజ్యోతి (మైహోం) సిమెంట్స్ – కర్నూలు

తెలంగాణ నుంచి అవార్డు అందుకున్న కంపెనీలు

మైహోం – చౌటుపల్లి-1, టీఎస్ఎండీసీ-దేవాపూర్ (మంచిర్యాల), మైహోం – మెల్లచెరువు, రైన్ సిమెంట్స్ – నల్గొండ, సాగర్ సిమెంట్స్ – నల్గొండ

'ఉపాధి' కూలీల ఆకలి కేకలు

- రూ.2,100 కోట్లకు పైగా బకాయి పెట్టిన ప్రభుత్వం
- తమ కూలి డబ్బుల కోసం ఎదురుచూస్తున్న 40 లక్షల కుటుంబాలు
- ఆగస్టు 15కల్లా చెల్లించకపోతే ఆందోళన చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం హెచ్చరిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసుకున్న కూలీలంతా ఆకలితో అలమటిస్తున్నారు. రెండు నెలలుగా ప్రభుత్వం తమ కూలి డబ్బులు చెల్లించకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే బకాయిలు చెల్లించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. లేకపోతే ఆందోళనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. వివరాలు.. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు పొందేందుకు దాదాపు 56.17 లక్షల కుటుంబాలు జాబ్‌కార్డులు పొందాయి. ఏటా కూలీలు దాదాపు రూ.6 వేల కోట్ల చొప్పున ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. గత ఐదేళ్లలో కూలీలకు సుమారు రూ.27 వేల కోట్ల మేర డబ్బులందాయి. కాగా, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నాలుగు నెలల్లో ఉపాధి కూలీలు దాదాపు రూ.4,190 కోట్ల విలువైన పనులు చేయగా.. అందులో సగానికి పైగా ప్రభుత్వం బకాయి పెట్టింది. నిబంధనల ప్రకారం.. ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన వారికి గరిష్టంగా 15 రోజుల్లోనే ప్రభుత్వం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ మే నెల 20 నుంచి కూలీలెవ్వరికీ డబ్బులు ఇవ్వలేదని తెలిసింది. దాదాపు 40 లక్షల కుటుంబాలకు రూ.2,100 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

ఇంత పెద్ద బకాయి.. ఇదే మొదటిసారి

రాష్ట్రంలోని ఉపాధి కూలీలకు ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో బకాయి పెట్టడం ఇదే మొదటిసారి అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తెలిపింది. బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కోట కల్యాణి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం రూ.2,800 కోట్ల మేర నిధులు విడుదలయ్యాయని, వారం రోజుల్లో బకాయిలు చెల్లిస్తామంటూ అధికారులు హామీ ఇచ్చారని నాయకులు చెప్పారు. ఆగస్టు 15లోగా బకాయిలు చెల్లించకపోతే 16న కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

41ఏ నోటీసు ఇచ్చిన తరువాత ఎలా అరెస్టు చేస్తారు?: హైకోర్టు

సాక్షి, అమరావతి: ఓ వ్యక్తికి ఒకసారి సీఆర్‌పీసీ 41ఏ నోటీసు ఇచ్చిన తరువాత మళ్లీ అతన్ని ఎలా అరెస్టు చేస్తారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. ఈ నోటీసు ఇచ్చిన తరువాత దాన్నుంచి వెనక్కి మళ్లి అరెస్టు చేస్తామంటే పౌరులు ఎక్కడకు వెళ్లాలని కూడా ప్రశ్నించింది. 41ఏ ఇచ్చిన తరువాత కార్యనిర్వాహకపరంగా ఏం చేయాల్సి ఉంటుందని, అరెస్ట్ చేయడమేనా? ఇంకేదైనా ఉందా చెప్పాలని నిలదీసింది. చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన ఇంటి వద్ద జరిగిన గొడవ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ పోలీసు శాఖను బుధవారం గట్టిగా నిలదీశారు. జోగి రమేష్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్లిన పిటిషనర్‌పై రాజకీయ దురుద్దేశాలతో కేసు నమోదు చేశారని చెప్పారు. ఆ తర్వాత హత్యాయత్నం కేసును కూడా జత చేశారన్నారు. హత్యాయత్నం కేసు జత చేసేందుకు ప్రాథమిక ఆధారాలేవీ లేవన్నారు. హత్యాయత్నం కేసు నమోదుకు ముందే పోలీసులు పిటిషనర్‌కు 41ఏ నోటీసు ఇచ్చారని తెలిపారు. ఓసారి 41ఏ నోటీసు ఇచ్చిన తరువాత మరో సెక్షన్ కింద కేసు పెట్టి అరెస్ట్ చేయాలనుకుంటే అందుకు కోర్టు అనుమతి తప్పనిసరని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పోలీసులకు పలు ప్రశ్నలు సంధించారు. పోలీసుల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఇందులో ఉన్న కుట్ర కోణాన్ని వెలికి తీయాల్సి ఉన్నందున పిటిషనర్‌ను అరెస్ట్ చేసి విచారణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. న్యాయమూర్తి తదుపరి విచారణను 13కి వాయిదా వేశారు.

పొన్నవోలుపై దూసుకొచ్చిన టీడీపీ లాయర్లు

పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన జూనియర్‌లతో మాట్లాడుతూ బయటకు వస్తున్న సందర్భంగా పక్కనే ఉన్న ఓ న్యాయవాది మా న్యాయవాది (సిద్దార్థ లూథ్రా) గురించి ఎందుకు మాట్లాడుతావంటూ ఆయనతో గొడవకు దిగారు. కోర్టులో హాలులో ఉన్న మిగతా న్యాయవాదులు అదే సమయంలో సుధాకర్‌రెడ్డిపైకి దూసుకొచ్చారు.

గాసిప్‌లే చంద్రబాబు జీవనాడి

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



తగరపువలస (విశాఖ జిల్లా)/ అనకాపల్లి: చంద్రబాబు జీవితమంతా గాసిప్‌లపైనే నడిచిందని మాజీ మంత్రి, ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. బుధవారం ఉదయం అనకాపల్లి రింగ్‌రోడ్డులోని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోనూ, సాయంత్రం విశాఖ జిల్లా, ఆనందపురం మండలం బోయపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో జరిగిన ఎమ్మెల్సీ ఓటర్లు, వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీకి చెందిన 50 మంది ఏజెన్సీ ఓటర్లు టీడీపీ క్యాంప్‌లో ఉన్నట్లు పచ్చ మీడియా, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం గాసిప్ మాత్రమేనన్నారు.



అవసరమైన దాని కంటే ఎక్కువ బాధపడకు.
అనవసరంగా ముందే బాధపడకు.
– సెనెకా

సాక్షి

గురువారం, 8 ఆగస్టు 2024

చెదిరిన స్వప్నం

భారత్ బంగారు కల నెరవేరడానికి మరికొన్ని గంటల దూరంలో మాత్రమే ఉన్నామని మన క్రీడాభిమానులు ఉత్కంఠతో వేచిచూస్తున్న వేళ హఠాత్తుగా అంతా తలకిందులైంది. రెజ్లింగ్‌లో ఒకేరోజు దిగ్గజ క్రీడాకారిణులనదగ్గ ముగ్గురిని అవలీలగా జయించి, చరిత్ర సృష్టించి బుధవారం పతాక శీర్షికలకెక్కిన మన రెజ్లింగ్ స్టార్ వినేశ్ ఫోగాట్‌పై చివరాఖరిలో అనర్హత వేటు పడింది. అంతర్జాతీయ క్రీడలు బహు చిత్రమైనవి. ఎవరి అంచనాలకూ అందనివి. ప్రపంచ శిఖరాగ్రంపై ఎవరినైనా ప్రతిష్ఠించగలవు... అధఃపాతాళానికి తొక్కి నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయేలా కూడా చేయగలవు. కేవలం 24 గంటల వ్యవధిలో పరస్పర విరుద్ధమైన ఈ రెండు అనుభవాలనూ వినేశ్ చవిచూడాల్సివచ్చింది. క్రీడారంగంలో దేశాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచటానికీ.., స్ఫూర్తి రగల్చడానికీ ఉద్దేశించిన ఇలాంటి సందర్భాల్లో ముందంజలో నిలిచి మాతృదేశానికి మరిచిపోలేని విజయాన్నందించాలని క్రీడాకారులంతా తపిస్తారు. తమ తమ నైపుణ్యాలకు పదునుపెట్టుకుంటారు. నిజానికి ఇలాంటి వారందరికీ వినేశ్ తలమానికమైనది. ప్రధాని చెప్పినట్టు సవాళ్లకు ఎదురొడ్డి పోరాడే స్వభావం ఆమెది. ఒక్క రెజ్లింగ్‌లో మాత్రమే కాదు... దశాబ్దాలుగా దేశ క్రీడా రంగాన్ని పట్టిపీడిస్తున్న లింగ వివక్షపైనా, లైంగిక వేధింపులపైనా సివంగిలా తిరగబడిన చరిత్ర ఆమెది. తోటి క్రీడాకారిణులకు ఎదురవుతున్న లైంగిక హింసపై నిరుడు దాదాపు నెలన్నరపాటు ఢిల్లీ వీధుల్లో పోరాడి... అరెస్టులూ, అవమానాలూ, లాఠీ దెబ్బలూ, చంపేస్తామన్న బెదిరింపులూ సహిస్తూ భరిస్తూ మొక్కవోని ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించింది. ఆటల బరిలోనే కాదు... తేడా వస్తే అధికార మదంపైనా పోరాడతానన్న సందేశం పంపింది. ఒక దశలో ఇతర క్రీడాకారులతోపాటు తనకొచ్చిన అవార్డులన్నీ వెనక్కివ్వాలని, పతకాలను గంగానదిలో పడేయాలని నిర్ణయించుకుంది.

ఏ రంగంలోనైనా మహిళలు రాణించడమంటే అంత సులువేం కాదు. గడప లోపలే కాదు, వెలుపల సైతం అడుగడుగునా అవరోధాలూ, అడ్డంకులూ ఉంటాయి. క్రీడారంగంలో ఇవి మరిన్ని రెట్లు అధికం. సమస్యలను ఎదుర్కొనటంతో పాటు అవి కలిగించే భావోద్వేగాలను అధిగమించి, గాయపడిన మనసును ఓదార్చుకుంటూ తాను ఎంచుకున్న క్రీడాంశంలో ఏకాగ్రత సాధించి నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఎంత కష్టం! కానీ వినేశ్ దృఢంగా నిలబడింది. తనేమిటో నిరూపించుకుంది. కనుకనే ప్రస్తుత ఒలింపిక్ చాంపియన్, ఏకంగా మూడుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన జపాన్ క్రీడాకారిణి సుసాకి యుయుపై 3–2 తేడాతో గెలిచి ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచింది. బరిలో ఇంతవరకూ ఓటమే చవిచూడని నంబర్ వన్ యుయు నిజానికి ఈ పోరులో అందరి ఫేవరెట్. అటుపై ప్రతిభావంతులుగా పేరొందిన ఉక్రెయిన్, క్యూబా క్రీడా దిగ్గజాలను కూడా వినేశ్ సునాయాసంగా అధిగమించింది. బుధవారం అమెరికా క్రీడాకారిణి సారా హిల్డెర్‌బ్రాంట్‌తో తలపడబోతున్న తరుణంలో ఉండాల్సిన 50 కిలోల బరువు కంటే కేవలం వందగ్రాములు అధికంగా ఉందన్న కారణంతో వినేశ్‌ను అనర్హురాలిగా ప్రకటించటం దురదృష్టకరం. గతంలోనూ ఆమెకు బరిలో సమస్యలు తప్పలేదు. వరసగా 2016, 2020 ఒలింపిక్స్ పోటీల్లో బరి నుంచి నిష్క్రమించాల్సి వచ్చిన వినేశ్‌పై ఎవరికీ పెద్దగా అంచనాల్లేవు. అసలు 2016లో మోకాలి గాయం అయ్యాక ఇక ఆమె క్రీడలకు స్వస్తి చెప్పక తప్పదని అనుకున్నారు. దానికి తోడు నిరుడు గాయానికి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. నిరసనోద్యమం సరేసరి. వీటన్నిటినీ అధిగమించి ఆమె మ్యాట్‌పైకొచ్చింది. అచిరకాలంలోనే అద్భుతంగా రాణించింది. మంగళవారం నాటి ఆటను చూసినవారంతా ఫైనల్లో ఆమె స్వర్ణం చేజిక్కించుకోవటం ఖాయమని అనుకుంటుండగా ఊహించని విపరిణామమిది. ఒలింపిక్స్ చరిత్రలో భారతీయ క్రీడాకారులకు ఎన్నడూ ఎదురు కాని అనుభవమిది.

వినేశ్ అనర్హత వెనక కుట్ర కోణం ఉండొచ్చని, ఆమెను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బృందం అలసత్వాన్ని ప్రదర్శించిందని సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కుట్రకోణం వెలికితీయాలంటూ లోక్‌సభలో విపక్షం వాకౌట్ కూడా చేసింది. అయితే మన ఒలింపిక్ అసోసియేషన్ ఆమె బరువు తగ్గడానికి ముందురోజు రాత్రంతా ఏమేం చేయాల్సి వచ్చిందో ఏకరువు పెడుతోంది. ఆ మాటెలావున్నా ఒలింపిక్స్‌లో అనుసరించే నిబంధనలు అత్యంత కఠినమైనవవి. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ నిబంధనల్లోని 11వ అధికరణ ప్రకారం నిర్దిష్టమైన బరువు దాటితే క్రీడాకారులను అనుమతించే ప్రసక్తే లేదంటున్నారు. మంగళవారం ఇటలీ క్రీడాకారిణి లియుజీకి కూడా ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. ఈ నిబంధనలపై ఇప్పటికి రెండుసార్లు ఒలింపిక్స్ అనుభవం గల వినేశ్‌కు గానీ, నిరంతరం అదే పనిలో ఉండే మన బృందానికి గానీ అవగాహన లేకపోవటం ఆశ్చర్యకరమే. ఈ విషయంలో వినేశ్‌ను ఎవరైనా పక్కదోవ పట్టించి వుంటారా అనేది ఆమె చెబితే గానీ తెలిసే అవకాశం లేదు. ఆటపైనే సర్వశక్తులూ ఒడ్డాల్సిన క్రీడాకారులకు ఇతరేతర సమస్యలు ఎదురుకావటం విచారించదగ్గ విషయం. వినేశ్‌కు నిరుడు చేదు అనుభవాలు ఎదురుకాకపోతే కుట్ర ఆరోపణలు వచ్చి ఉండేవే కాదు. మొత్తానికి మన దేశానికి తలమానికమనదగ్గ క్రీడాకారులను ఎలా గౌరవించుకోవాలో, ఎంత అపురూపంగా చూసుకోవాలో తాజా ఉదంతం తెలియజెబుతోంది. దీన్నుంచి గుణపాఠం నేర్వగలిగితేనే అంతర్జాతీయ క్రీడా యవనికపై మనం తళుకులీనగలమని గ్రహించాలి. రాజకీయ సంకెళ్ల నుంచి క్రీడా వ్యవస్థలను విముక్తం చేయాలి.

కేరళ విలయానికి క్వారీలే కారణం

విశ్లేషణ



మాధవ్ గాడ్గిల్

మూడేళ్ల క్రితం కొంకణ్ ప్రాంతంలోనే ప్రస్తుతం వయనాడ్‌లో చోటు చేసుకున్నట్లు కొండచరియలు విరిగిపడి పలువురు ప్రాణాలు కోల్పోయారు. రాయగఢ్ జిల్లా తాలియే ప్రాంతంలో ఏకంగా 124 మంది ప్రాణాలు పోయాయి. ఈ ప్రాంతంలోనూ రాతి తవ్వకాల కోసం పెద్ద ఎత్తున పేలుళ్లు కొనసాగుతున్న విషయాన్ని గమనించాలి. కాగా భారీ వర్షాల కారణంగానే తాజాగా వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయనీ, ఊళ్లకు ఊళ్లు తుడిచిపెట్టుకుపోయి 350కి పైగా ప్రాణాలు పోయాయనీ ప్రభుత్వం నమ్మబలకవచ్చు; కానీ టూరిస్టు రిసార్టుల కోసం నేలను చదును చేయడం, లాటరైట్ రాయి తవ్వకాలు పెద్ద ఎత్తున చేపట్టడం ఈ విధ్వంసానికి దారి తీసిన అసలు కారణాలు అనడంలో సందేహం లేదు.

పశ్చిమ కనుమల్లో రాతి తవ్వకాలు ఏళ్లగా కొనసాగుతున్నాయి. ఈ క్వారీయింగ్‌కూ, కొండచరియలు విరిగిపడేందుకూ మధ్య దగ్గరి సంబంధాలున్నాయని తెలిసినా... పట్టించుకోకపోవడమే జూలై 30న కేరళలోని వయనాడ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున విధ్వంసానికి కారణమైంది. భారీ వర్షాల కారణంగానే వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయనీ, ఊళ్లకు ఊళ్లు తుడిచిపెట్టుకుపోయి 350కి పైగా ప్రాణాలు పోయాయనీ ప్రభుత్వం నమ్మబలకవచ్చు; కానీ టూరిస్టు రిసార్టుల కోసం నేలను చదును చేయడం, సరస్సులను నేలమట్టం చేస్తూ లాటరైట్ రాయి తవ్వకాలు పెద్ద ఎత్తున చేపట్టడం ఈ విధ్వంసానికి దారితీసిన అసలు కారణాలు అనడంలో సందేహం అవసరం లేదు.

ఆరు గంటల వాన అరగంటలోనే!

అయితే ఒక్క విషయం. భారీ వర్షాలకు కూడా లాటరైట్ రాయి తవ్వకాలే కారణమయ్యాయా? అవుననే చెప్పాలి. ఎందుకంటే భారత్‌లో భవన నిర్మాణం, గనులు, రాతి తవ్వకాలు, రోబో శాండ్ కోసం రాయిని పొడిలా మార్చడం వంటి అన్నింటి కారణంగా ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఏరోసాల్స్ (దుమ్ము, ధూళిల కారణంగా గాల్లోకి చేరే అతి సూక్ష్మ కణాలు) గాల్లోకి చేరుతున్నాయి. వాహన కాలుష్యం, థర్మల్ పవర్ స్టేషన్లలో బొగ్గు వాడకం కూడా ఈ ఏరోసాల్ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. గాల్లోని నీటి ఆవిరికి ఈ ఏరోసాల్స్ తోడైనప్పుడు ఆవిరి ఘనీభవించడం మొదలవుతుంది. అది కాస్తా ముందు చిన్న చిన్న నీటి బిందువులుగా మారుతుంది. ఒకదానితో ఒకటి చేరడం ద్వారా నీటి బిందువుల పరిమాణం గణనీయంగా పెరుగుతుంది. ఫలితంగా అతితక్కువ సమయంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదవుతాయి. అందుకే ఆరు గంటల సమయం జల్లుగా కురవాల్సిన వాన కాస్తా అరగంటలో కుమ్మరించిపోతోంది.

పశ్చిమ కనుమలకు సంబంధించినంతవరకూ కొంకణ్ ప్రాంతం చాలా కీలకమైంది. మహారాష్ట్రలోని ఈ ప్రాంతంతోపాటు పక్కనే ఉండే దక్కన్ పీఠభూమి ప్రాంతంలోనూ 2021 జూన్ 22న అతి తక్కువ కాలంలోనే అతిభారీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మహారాష్ట్రలోని ఎత్తయిన ప్రాంతాల్లో నివసించే వారు కూడా అంత తక్కువ కాలంలో అంత ఎక్కువ వాన కురవడం గతంలో ఎప్పుడూ లేదని చెబుతారు. అదే ఏడాది అక్టోబరులో కేరళ ప్రాంతంలో విలయం లాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి.

కేరళలో 2018 ఆగస్టులో కురిసిన అతిభారీ వర్షాలు, తద్వారా ఏర్పడ్డ వరద పరిస్థితి వందేళ్ల రికార్డుగా నమోదైన విషయం తెలిసిందే. ఈ వరదల్లో దాదాపు 483 మంది ప్రాణాలు కోల్పోగా, 140 మంది కనిపించకుండా పోయారు. కేరళలోని చాలక్కుడిలోని ప్రఖ్యాత రివర్ రీసెర్చ్ సెంటర్ 2018 నాటి వరదలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. చాలక్కుడి నదీ బేసిన్ లో చాలా రిజర్వాయర్లు ఉండగా... 2018లో మే నెలలోనే క్యాచ్‌మెంట్ ఏరియాలో మంచి వర్షాలు కురిశాయి. జూన్, జూలైలలో ఒకట్రెండు భారీ వర్షాలూ నమోదయ్యాయి. రుతుపవనాలు ఇంకా చురుకుగా ఉండగానే డ్యామ్‌లన్నీ వేగంగా నిండిపోవడం మొదలైంది. ఈ తరుణంలో మరిన్ని వర్షాలు కురిస్తే వరదలు తప్పవన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2018లో జూలై 17 నుంచే రివర్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు, చాలక్కుడి రివర్ ప్రొటెక్షన్ ఫోరమ్ వాళ్లు వరదల నుంచి ప్రజలకు రక్షణ కల్పించటం కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించేందుకు విఫలయత్నం చేశారు. డ్యామ్‌లలోని నీరు దశలవారీగా నిదానంగా వదలాలనీ, తద్వారా వరద ముప్పును కొంత వరకూ తగ్గించవచ్చుననీ వీరు సూచించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఒకవేళ ఈ సూచనలు పాటించి ఉంటే డ్యామ్ గరిష్ఠ మట్టాన్ని చేరకుండా రెండు మీటర్ల మేర తక్కువ స్థాయిలోనే నీటిని నిలుపుకునే వారు. తద్వారా ప్రమాద తీవ్రత తగ్గేది.



వయనాడ్ జిల్లాలోని ముండక్కాయ్ గ్రామంలో సహాయక చర్యలు

భారీ వర్షాల్లోనూ క్వారీ తవ్వకాలు!

మూడేళ్ల క్రితం కొంకణ్ ప్రాంతంలోనే ప్రస్తుతం వయనాడ్‌లో చోటు చేసుకున్నట్లు కొండచరియలు విరిగిపడి పలువురు ప్రాణాలు కోల్పోయారు. రాయగఢ్ జిల్లా తాలియే ప్రాంతంలో ఏకంగా 124 మంది ప్రాణాలు పోయాయి. ఈ ప్రాంతంలోనూ రాతి తవ్వకాల కోసం పెద్ద ఎత్తున పేలుళ్లు, రహదారి నిర్మాణం కోసం అడవుల నరికి వేత విచ్చలవిడిగా కొనసాగుతున్న విషయం ప్రస్తావనార్హం. 2021 జూన్ – జూలైలో మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదు కాగా అక్టోబరు 16న కేరళలోని కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లో అదే తరహా విపత్తు సంభవించింది.

మహారాష్ట్ర మాదిరిగానే కేరళలోనూ రాతి క్వారీల తవ్వకం వంటివే విపత్తులకు కారణమయ్యాయి. కేరళలోని ప్లాప్పల్లీ, కొట్టాయంలోని కూటిక్కల్‌లు బాగా దెబ్బతిన్నాయి. ఇక్కడ దాదాపు పదేళ్లుగా రాతి క్వారీలు జోరుగా సాగుతున్నాయి. వీటి నిలిపివేతకు పెద్ద ఎత్తున ఉద్యమమూ నడుస్తోంది. అయినా క్వారీ నిర్వాహకులు పట్టించుకోలేదు. అక్టోబరు 16న కూటిక్కల్‌లో కొండచెరియలు విరిగిపడే సమయంలోనూ రాతి క్వారీలు పని చేస్తూనే ఉన్నాయి. విపత్తు సంభవించినప్పుడు క్వారీలు ఉన్న ప్రాంతంలో పెద్ద ఎత్తున పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారిక సమాచారంలో కేవలం మూడు రాతి క్వారీల పేర్లు ఉన్నప్పటికీ ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా కనీసం 17 క్వారీలను గుర్తించారు. కేరళ మొత్తమ్మీద ప్రస్తుతం దాదాపు ఆరు వేల వరకూ క్వారీలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. 2018 వరదల తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 223 రాతి క్వారీలకు అనుమతివ్వడం గమనార్హం.

నిలిపివేత నిర్ణయంపై రాజకీయాలు

కూటిక్కల్ నుంచి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలోని కడనాడ్‌లో రాతి క్వారీల సమస్యను అధిగమించేందుకు ఒక ప్రయత్నం జరిగింది. 2008లో కడనాడ్ పంచాయతీ అధ్యక్షుడు మజు పుతెనికందం బయో డైవర్సిటీ కమిటీ ఒకదాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీలోని పదమూడు వార్డులకు చెందిన నిపుణులు, కార్యకర్తలు ఈ కమిటీ కార్యకలాపాలను నిర్వహించేవారు. రైతులు, సభ్యులందరి నుంచి సమాచారం సేకరించిన మజు పుతెనికందం బృందం పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్ ఒకదాన్ని సిద్ధం చేసింది. జీవ వైవిధ్యభరితమైన పెరుమ్ కన్ను ప్రాంతంలో రాతి క్వారీయింగ్ సరికాదని గుర్తించిన ఈ కమిటీ క్వారీయింగ్ నిలిపివేతకు నిర్ణయం తీసుకుంది. కేరళ స్టేట్ బయో డైవర్సిటీ బోర్డు కూడా ఈ తీర్మానానికి మద్దతు తెలిపింది. 2012లో కేరళ హైకోర్టు ఈ అంశాన్ని పరిశీలించి క్వారీ నిలిపివేత నిర్ణయాన్ని సమర్థించింది.

అయితే ఈ విషయంలో కొన్ని దుష్టశక్తుల ప్రవేశం వెంటనే జరిగిపోయింది. కడనాడ్ ప్రాంతాన్ని గ్రామ పంచాయతీ పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంగా ప్రకటించిందని... దాంతో రైతులు, ప్రజలు అటవీ అధికారుల పెత్తనంలో బతకాల్సి వస్తుందని తప్పుడు ఆరోపణలు వ్యాప్తిలోకి తెచ్చింది. దురదృష్టకరమైన అంశం ఏమిటంటే, అటవీ శాఖ కూడా ఈ దుష్ట శక్తులతో కుమ్మక్కైపోవడం. పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పి వీరు ప్రజలను వేధించడం కూడా వాస్తవమే. ఈ ఒత్తిళ్ల నేపథ్యంలో కడనాడ్ పంచాయతీ రాతి క్వారీల తవ్వకాలను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నం కాస్తా నిర్వీర్యమైపోయింది. పంచాయతీ తన తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది. అయితే సరైన దిశలో వేసిన ఈ తొలి అడుగు మరిన్ని ముందడుగులకు ప్రారంభం కావాలని ఆశిద్దాం!

వ్యాసకర్త పర్యావరణవేత్త, 'సెంటర్ ఫర్ ఎకలాజికల్ స్టడీస్' వ్యవస్థాపకులు ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వారసత్వ కళ



ఒడిశాకు అద్భుతమైన చేనేత, నేత సంప్రదాయాల శక్తిమంతమైన వారసత్వం ఉంది. ఇది తరతరాలుగా హస్తకళలను మెరుగుపరుస్తూ వస్తోంది. ఈ జాతీయ చేనేత దినోత్సవం (7 ఆగస్టు) సందర్భంగా ఒడిశా చేనేతలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపును సృష్టించిన హస్త కళల సంప్రదాయాన్ని వేడుకగా జరుపుకొందాం.

– నవీన్ పట్నాయక్, ఒడిశా మాజీ సీఎం

సంస్కృతిపై దాడి



ఎంత దారుణం! ఢాకాలోని ధన్మోండిలో ప్రముఖ బంగ్లాదేశ్ గాయకుడు రాహుల్ ఆనంద్ నివాసం ఉంటున్న 140 ఏళ్ల నాటి ఇంటిపై మూకలు దాడి చేశాయి. ఇంట్లో ఉన్న మూడు వేలకు పైగా సంగీత వాద్యాలు బూడిదయ్యాయి. ఇల్లు దగ్ధమైంది. రాహుల్ కుటుంబం ఎలానో బయటపడింది.

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

బాధ - సంతోషం



షేక్ హసీనా వెళ్లటం బాధాకరం. మధ్యంతర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న నోబెల్ శాంతి బహుమతి విజేత మహమ్మద్ యూనస్‌కు విద్యార్థులు మద్దతుగా ఉన్నారని వినడం బాగుంది. ఆయన ప్రస్తుతం బంగ్లాదేశ్‌కు అవసరమైన వ్యక్తి.

– ప్రీతిష్ నంది, కవి – జర్నలిస్ట్

వంద గ్రాములు!



హృదయ విదారకం! పూర్తిగా హృదయ విదారకం. బంగారు పతకం ఆమెకు మాత్రమే చెందుతుంది. జాత్యహంకార ఒలింపిక్స్ నిర్వాహకులు వీళ్లు! (100 గ్రాములు ఎక్కువ బరువు ఉన్న కారణంగా ఫైనల్స్‌కు రెజ్లర్ వినేశ్ ఫోగట్‌ను అనర్హురాలిగా ప్రకటించటంపై).

– మింటీ శర్మ, వ్యాఖ్యాత

రెండు నాలుకలు



'ఎక్స్/ట్విట్టర్ చనిపోతోంది' అని పదే పదే అబద్ధాలు చెప్పిన అదే మీడియా బుద్ధిహీనులు ఇప్పుడు ఎక్స్ గురించి, "అతిపెద్ద, అత్యంత ప్రభావవంతమైన వేదిక" అని అంటున్నారు. (ప్రజాస్వామ్యానికి ట్విట్టర్ 'అతి పెద్ద', 'ప్రభావవంతమైన' బెడద అంటూ ఫైనాన్సియల్ టైమ్స్' పత్రిక వ్యాసంపై స్పందిస్తూ).


– ఎలాన్ మస్క్, 'ఎక్స్' అధినేత

ఇన్ బాక్స్

మందుల మహా మాంత్రికుడు

ప్రపంచ వైద్యశాస్త్ర రంగంలో మందుల మహా మాంత్రికుడని సుస్థిర స్థానాన్ని పొందిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు తెలుగుజాతి గర్వించదగిన ముద్దుబిడ్డ. ఎన్నో రకాల జాడ్యాలకు దివ్యౌషధాలను కనుగొని మనవాళికి మహోపకారం చేసిన మహోన్నత వైద్య శాస్త్రవేత్త.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వెంకమ్మ, జగన్నాథం పుణ్య దంపతులకు 1895 జనవరి 12న ఆయన జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. తల్లి పెంపకంలో పెరిగారు. పుస్తెలమ్మి సుబ్బారావును చదివించింది తల్లి. రాజమండ్రిలో పాఠశాల విద్య పూర్తిచేసిన సుబ్బారావు పై చదువుల కోసం మద్రాసుకు వెళ్ళారు. అక్కడ ఉన్నప్పుడే ఆయన సోదరులు కొంత కాల వ్యవధిలో ఒకరి తరువాత ఒకరు 'స్ప్రూ' వ్యాధితో మరణించారు. మనోవేదనకు గురైన సుబ్బారావు దానికి మందు కొనుక్కోవాలని నిర్ణయించుకున్నారు. మద్రాస్ వైద్య కళాశాలలో చేరి వైద్య విద్యను పూర్తి చేశాక, పరిశోధన కోసం లండన్ వెళ్లి డాక్టర్ రిచర్డ్ స్ట్రాంగ్ శిష్యరికంలో ఉష్ణ మండల వ్యాధుల చికిత్సలో డిప్లొమా పొందారు. డాక్టర్ స్ట్రాంగ్ సూచన మేరకు అమెరికా వెళ్లి జీవ రసాయన శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.



డా॥ ఎల్లాప్రగడ సుబ్బారావు


సుబ్బారావు తన పరిశోధనల వల్ల ఫోలిక్ ఆమ్లపు నిజ స్వరూపాన్ని గుర్తించారు. ఇది స్ప్రూ వ్యాధికీ, మైక్రోసైటిక్ ఎనీమియా వ్యాధికీ తిరుగులేని ఔషధంగా నిలిచింది. అలాగే బోధకాలు నివారణ కోసం మందు కనుక్కున్నారు. కీమోథెరపీ కోసం వాడే మెథోట్రెక్సేట్‌ను కనుక్కున్నారు. ఎల్లప్పుడూ పరిశోధనలలో నిమగ్నం కావడం వల్ల సుబ్బారావు ఆరోగ్యం నశించింది. 1948 ఆగస్టు 8న అమెరికాలో కన్నుమూశారు. ఆయన సేవలు అందించిన అమెరికాకు చెందిన లీడర్లీ సంస్థ సుబ్బారావు మీద గౌరవంతో సుబ్బారోమెసెస్ ఔషధాన్ని ప్రవేశపెట్టింది. కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. ప్రపంచ మానవాళికి తన జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు తెలుగువాడు కావడం మన తెలుగు వారందరి అదృష్టం.

– జాధవ్ పుండలిక్ రావు పాటిల్ | 94413 33315

(నేడు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు వర్ధంతి)

బంగ్లాదేశ్ అంటేనే భయపడాల్సిందేనా?

విశ్లేషణ



జయంత రాయ్ చౌధురీ

ముజిబుర్ రెహ్మాన్ కుటుంబానికి ఆగస్టు ఎప్పుడూ క్రూరమైన నెలగానే ఉంటోంది. బంగ్లాదేశ్ వ్యవస్థాపక నిర్మాత షేక్ ముజిబుర్ రెహ్మాన్ తన మొత్తం కుటుంబంతో సహా 1975 ఆగస్టు 15 తెల్లవారుజామున సైనిక తిరుగుబాటులో మరణించారు. ఆయన ఇద్దరు కుమార్తెలు షేక్ హసీనా, షేక్ రెహానా భారతదేశానికి వలస రావలసి వచ్చింది.

తన తండ్రి వారసురాలిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన షేక్ హసీనా, 2004 ఆగస్టు 21న తాను ప్రసంగిస్తున్న ర్యాలీపై గ్రెనేడ్ దాడిలో గాయపడి దాదాపు మరణం అంచులను తాకి వచ్చారు.బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లో హర్కత్–ఉల్–జిహాద్ అనే ఉగ్రవాద సంస్థ చేసిన ఆ దాడిలో అవామీ లీగ్ కార్యకర్తలు చాలామంది మరణించారు. ఇప్పుడు 20 సంవత్సరాల తరువాత ఆగస్టు మధ్యాహ్నం, హసీనాను ప్రధాని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఆమె నివాసంపై దాడి చేస్తామని బెదిరించిన నిరసనకారులను కాల్చి చంపడానికి ఇష్టపడని బంగ్లాదేశ్ సైన్యం, ఆమెను పదవి వీడి ఢాకా నుండి పారిపోవాలని కోరింది.

బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న కుటుంబాల పిల్లలకు ఉద్యోగాల్లో 30 శాతం మేరకు కోటా కల్పిస్తున్నట్లు హసీనా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కోటాకు వ్యతిరేకంగా నెల రోజుల పాటు సాగిన విద్యార్థి ప్రదర్శనల పట్ల షేక్ హసీనా ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించలేదు. ఆ ఘటన... బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాత్–ఎ–ఇస్లామీ పార్టీల్లోని ఆమె ప్రత్యర్థుల మద్దతుతో పాలన మార్పు కోసం డిమాండ్‌గా మారిందని ఇక్కడ తిరిగి చెప్పాల్సిన పనిలేదు.

బంగ్లాదేశ్ బాగుండాలని కోరుకునే వారికి ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, విద్యార్థుల ప్రతిఘటనా ఉద్యమం పాలనా మార్పు కోసం డిమాండ్‌గా మాత్రమే కాకుండా, భావజాల మార్పు కోసం ప్రతీకార యుద్ధంగా మారింది. హసీనా దేశం విడిచి పారి పోవడంతో, బంగ్లాదేశ్ జాతిపిత ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని ఇస్లాం విరుద్ధమని పేర్కొంటూ ఆందోళనాకారులు పగలగొట్టారు. అవామీ లీగ్ నాయకుల కార్యాలయాలను, ఇళ్లను కూడా తగలబెట్టారు. అంతకు ముందు రోజు రాత్రి రంగ్‌పూర్‌లో, ఇతర ప్రాంతాల్లో మైనా రిటీల ఇళ్లపై, గ్రామాలపై దాడులు జరిగాయి. ఇది బంగ్లాదేశ్‌కు, మరీ ముఖ్యంగా పొరుగు దేశాలకు ఏ సంకేతాలను ఇస్తోంది?

గత రెండు ఎన్నికలలో రిగ్గింగ్ చేసిన ఆరోపణలతో సహా, ఎన్ని తప్పులు చేసినప్పటికీ, అవామీ లీగ్ దేశంలో లౌకిక పాలనను అందించింది. బంగ్లాదేశ్‌లో నివసించే మైనారిటీల భూములు కబ్జాకు గురై, అప్పుడప్పుడు దాడులు జరిగినప్పటికీ, ఏ సైనిక నియంతృత్వం లేదా దేశాన్ని పాలించిన మునుపటి పాలనా వ్యవస్థల కంటే చాలా ఎక్కువ స్థాయిలో వాళ్లు సమాన అవకాశాలను పొందారన్నది వాస్తవం.



చిట్టగాంగ్ కొండ ప్రాంతాలలో బౌద్ధ గిరిజనులపై దాడులు, బరిషల్, ఫరీద్‌పూర్‌లలో హిందూ గ్రామాలను తగులబెట్టడం తర చుగా జరుగుతూ వచ్చిన బంగ్లా నేషనలిస్టు పార్టీ పాలించిన రోజుల్లోకి ప్రస్తుతం బంగ్లాదేశ్ దిగజారిపోవడం భారత్‌కు నిజంగానే ఆందోళన కలిగించే విషయం. ఈ పరిణామం ఇప్పటికే జనాభాపరంగా విస్తరించి ఉన్న పశ్చిమ బెంగాల్, అస్సాం, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాల్లోకి వేలాదిమంది శరణార్థులను నెట్టివేస్తుంది.

బంగ్లా నేషనలిస్టు పార్టీ పాలనలో, జిహాదీలను అఫ్గానిస్తాన్‌కు ఎగుమతి చేసి బంగ్లాదేశ్ అపఖ్యాతి పాలైంది. 2001లో తాలిబన్లను తరిమికొట్టిన తర్వాత, వారు బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చి, ఢాకాలోనే కాకుండా భారత గడ్డపై దాడులకు పాల్పడి బీభత్సం సృష్టించారు. ఇప్పుడూ అలా జరిగే అవకాశం గురించి భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల 'తిరుగుబాటు'లో కొందరు పాకిస్తానీ యులను జోడించారని ఇప్పటికే అనుమానాలు ఉన్నాయి. భారతదేశ ఈశాన్య ప్రాంతాల నుండి ఉగ్రవాదులకు సురక్షితమైన స్వర్గధామాలను సృష్టించడానికి, బంగ్లాదేశ్‌లోని అనుకూల వాతావరణాన్ని పాకిస్తాన్ మళ్లీ ఉపయోగించుకునే అవకాశం ఉంది.

భారతదేశం వంటి పొరుగు దేశాలతో వాణిజ్యం, ప్రయాణ కనెక్టివిటీకి ప్రాధాన్యత నిస్తూనే స్వతంత్ర అలీన విదేశాంగ విధానాన్ని కోరుకునే వారికీ... చైనాతో సన్నిహిత సంబంధాలను నెరపడానికి అవసరమైతే భారతదేశ భద్రతా ప్రయోజనాలతో రాజీ పడటానికైనా సిద్ధపడేవారికీ మధ్య అవామీ లీగ్ పాలన విభజితమై ఉండింది. ఏదేమైనప్పటికీ, షేక్ హసీనా ఎల్లప్పుడూ ఇతరులకు ప్రాధాన్యతనిస్తూనే భారతదేశంతో మెరుగైన సంబంధాలను నిర్మించుకునే వైఖరిని తీసుకుంటూ వచ్చారు. తీస్తా నదిని దిగువకు అభివృద్ధి చేసే విషయంలో, చైనా ప్రతిపాదనను పక్కనబెట్టి బంగ్లాదేశ్‌తో భాగస్వామి కావాలనే భారత ప్రతిపాదనకు సూటిగా అంగీకరించారు. ఆ మేరకు బీజింగ్ ఆమె పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు కొట్టివేసిన కోటాలకు (బంగ్లా స్వాతంత్ర్యోద్యమం కోసం పోరాడిన కుటుంబాల పిల్లలకు ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు) వ్యతిరేకంగా జరిగిన ఒక ప్రదర్శన నుండి, పాలనా వ్యవస్థ మార్పు అనే సింగిల్ పాయింట్ పిలుపుగా విద్యార్థుల నిరసనలు రంగు మారుతున్న క్రమంలో ఇలా జరగటం అనేది మరొక విషయం. కానీ, చరిత్రకారులు, అంతర్జాతీయ సంబంధాల పరిశీలకులు ఏదో ఒక రోజు దీనిపై పరిశోధన చేయాల్సి ఉంటుంది.

ఏమైనప్పటికీ, బంగ్లాదేశ్‌లో పెరుగుతున్న చైనా కోరల గురించి భారతదేశమూ, గతంలో షేక్ హసీనా ప్రభుత్వాన్ని అనేక అంశాలలో వ్యతిరేకించిన పాశ్చాత్య దేశాలూ జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవ సరం ఉంది. చైనాకు బంగ్లాదేశ్ దాదాపు 7 బిలియన్ డాలర్ల రుణా లను చెల్లించాల్సి ఉంది. దాని రుణ చెల్లింపులు ఇప్పటికే దాని విదేశీ మారక నిల్వలకు సంబంధించి సంక్షోభం సృష్టించాయి. ఇవి 2021 ఆగస్టు, 2024 జూన్ మధ్య కాలంలో 60 శాతం మేరకు పడిపోయాయి. శ్రీలంకను అనుసరించి బంగ్లాదేశ్ కూడా చైనా రుణ ఉచ్చులో మునిగిపోవచ్చు. రుణమాఫీకి బదులుగా రుణదాతకు వ్యూహాత్మక ఓడరేవులు, ఆర్థిక మండలాలను ఇవ్వవలసి వస్తుంది కూడా. చైనా ఓడలు నెలల పర్యంతం హిందూ మహాసముద్ర ప్రాంతాలను సర్వే చేస్తున్నాయి. బంగాళాఖాతం, అరేబియా సముద్ర ప్రాంత దేశాలలో విస్తరించిన చైనా నావికాదళ ఉనికితో ఇవి సంబంధం కలిగి ఉంటాయి. ఢాకాలో కొత్తగా రానున్న ప్రభుత్వంతో వ్యవహరించేటప్పుడు ఈ అంశాలన్నింటినీ భారతీయ ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ పరిస్థితులలో, భారతదేశం, ప్రజాస్వామ్య ప్రపంచం కాయవలసిన ఉత్తమమైన పందెం ఏమిటంటే బంగ్లాదేశ్ మిలిటరీకి మద్దతు ఇవ్వడం, ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం చైనా అనుకూల మంత్రులు లేదా కరడు గట్టిన ఛాందసవాదులతో నింపబడకుండా చూసుకోవడం. అవామీ లీగ్ పని ముగియలేదు. అది ఇప్పటికీ దేశంలో లోతైన మూలాలను కలిగి ఉంది. పెద్ద సంఖ్యలో మద్దతుదారులను కలిగి ఉంది. సైన్యం ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసిన తాత్కాలిక ప్రభుత్వంలో అవామీ లీగ్ తన స్థానాన్ని కోల్పోకూడదు.

చివరగా, ప్రపంచం శరవేగంతో మారుతుంది. కమ్యూనిజం రాత్రికి రాత్రే మరణించినట్లే, షేక్ హసీనా ప్రభుత్వం కూడా కుప్పకూలి పోయింది. ఏదేమైనప్పటికీ, భావజాలాలు పాలనా వ్యవస్థల కంటే ఎక్కువ కాలం కొనసాగుతాయి. ఇవి సరైన 'వాతావరణ పరిస్థితుల'లో పునరాగమనం చేయగలవు. బంగ్లాదేశ్‌లో పెట్టుబడులు పెట్టిన భారతదేశం, ఇతర దేశాలన్నీ ఆ పాఠాన్ని గుర్తుంచుకోవడం మంచిది.

వ్యాసకర్త పీటీఐ తూర్పు రీజియన్ మాజీ హెడ్ ('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: శు.చవితి రా.9.47 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: ఉత్తర రా.10.07 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.9.59 నుండి 10.50 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు, అమృత ఘడియలు: ప.2.13 నుండి 3.56 వరకు, నాగ చతుర్థి : రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.28.

నేటి నుంచి సత్యదేవుని ధ్వజస్తంభానికి స్వర్ణరేకు తాపడం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని సత్యదేవుని నూతన ధ్వజస్తంభానికి స్వర్ణ రేకు తాపడం పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. శ్రావణ శుద్ధ పంచమి, శుక్రవారం ఉదయం ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేసిన అనంతరం స్వర్ణ కలశాలు, సుదర్శన చక్రం అమర్చి ప్రత్యేక పూజలతో ఈ కార్యక్రమం పూర్తవుతుంది. రాగి రేకులపై బంగారు పూత పూసిన ధ్వజస్తంభం కవచాలు ఇప్పటికే దేవస్థానానికి చేరాయి.నెల్లూరుకు చెందిన దాతల సహకారంతో ఏప్రిల్ 22వ తేదీన సత్యదేవుని ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించిన విషయం విదితమే. రూ.మూడు కోట్ల వ్యయంతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ, స్వర్ణ రేకు తాపడం పనులు దాతలు నిర్వహిస్తున్నారు.

భీమేశ్వరుని దర్శనాలు పునఃప్రారంభం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో 105 రోజుల జీర్ణోద్ధరణ పనుల అనంతరం మూల విరాట్ దర్శనాలను బుధవారం పునఃప్రారంభించారు. అర్చ



కులు స్వామివారికి సంప్రోక్షణ చేశారు. కాగా, వివిధ ద్రవ్యాలతో అనేక సంవత్సరాలుగా నిర్వహించిన అభిషేకాల కారణంగా శివలింగం దెబ్బతినడంతో దానిని పునరుద్ధరించే పనిని ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన ఆర్కియాలజీ డిపార్టుమెంట్ ప్రారంభించింది. అప్పటి నుంచి స్వామివారి దర్శనాలు నిలిపివేశారు. ఇకపై జలంతో మాత్రమే అభిషేకాలు నిర్వహించాలని ఆర్కియాలజీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను సాధారణ దర్శనాలకు అనుమతించారు. మాణిక్యాంబ అమ్మవారి పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని ఈవో పితాని తారకేశ్వరరావు తెలిపారు.

పడవపై నుంచి జారిపడి ఆంధ్ర జాలరి మృతి

అన్నానగర్: శ్రీకాకుళం జిల్లాకు చెందిన ధర్మరాజ్ (43) పడవపై నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి సముద్రంలో పడి మృత్యువాత పడ్డాడు. ధర్మరాజ్ కొంతకాలంగా చెన్నైలోని కాశిమేడులోని ఫిషింగ్ హార్బర్‌లో పనిచేస్తున్నారు. ఈనెల 4వ తేదీన బోటు డ్రైవర్ దోంపూర్ (49) సహా 8 మంది మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి.. రాత్రికి పడవపై నిద్రించారు. ఈ క్రమంలో మరుసటి రోజైన 5వ తేదీన నిద్రలేచి చూసేసరికి ధర్మరాజు అదృశ్యమైనట్లు గుర్తించారు. ధర్మరాజ్ కాలు జారి సముద్రంలో పడి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో మృతదేహం బుధవారం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. ఫిషింగ్ పోర్టు పోలీసులు ధర్మరాజ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మత్స్యకారుడిని రక్షించిన కోస్ట్‌గార్డు సిబ్బంది

కాకినాడ క్రైం: బంగాళాఖాతం జలాల్లో జరిగిన ఓ బోటు ప్రమాదంలో గాయాలపాలైన మత్స్యకారుడిని కాకినాడ కోస్ట్‌గార్డు బృందం రక్షించింది. కమాండెంట్ రాజేంద్రకుమార్ తెలిపిన వివరాల మేరకు.. చెన్నైకు చెందిన 21 ఏళ్ల చిరంజీవి మరో 13 మందితో కలిసి ఈ నెల 5వ తేదీన చెన్నై తీరంలోని షిప్పింగ్ హార్బర్ నుంచి ఓ బోటులో చేపల వేటకు బయల్దేరాడు. రెండు రోజుల అనంతరం బుధవారం ఉదయం వారు ప్రయాణిస్తున్న బోటు కాకినాడ తీరానికి 95 నాటికల్ మైళ్ల దూరంలో ఉంది. ఆ సమయంలో బోటులో టీ కాస్తుండగా స్టవ్ పేలి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో చిరంజీవి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి మత్స్యకారులు మంటలను అదుపుచేసి అగ్ని ప్రమాదాన్ని అరికట్టారు. సమీపంలో కోస్ట్‌గార్డు షిప్ వద్దకు వెళ్లి మత్స్యకారులు సహాయాన్ని కోరారు. తక్షణమే స్పందించిన కోస్టుగార్డు సిబ్బంది కాకినాడ తీరానికి సమాచారం అందించారు. కాకినాడ నుంచి ఛార్లీ 430 షిప్‌లో బయల్దేరి వెళ్లిన అసిస్టెంట్ కమాండెంట్ సూర్యతేజ క్షతగాత్రుడిని కాకినాడ తీరానికి తరలించారు. మెడికల్ సర్జన్ లెఫ్టినెంట్ భరత్ కుమార్ చిరంజీవికి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

జగన్ బుల్లెట్ ప్రూఫ్ వాహనానికి లోపాలు నిజమే

▶ మొదటి పేజీ తరువాయి

ఆయనకు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి అయినందున ఆయనకు మంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సమకూర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. తనకు గతంలో ఉన్న భద్రతను భారీగా కుదించడంపై వైఎస్ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి వివరాలతో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని, కేంద్ర హోంశాఖను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం వారంలోపు ఆ కౌంటర్‌కు సమాధానం దాఖలు చేయాలని వైఎస్ జగన్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 28వతేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మాజీ ప్రధానుల్లా ఎందుకు భద్రత కల్పించకూడదు...?

వైఎస్ జగన్ తరఫున సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ మాజీ సీఎంకు జెడ్ ప్లస్ కేటగిరీ అలాగే ఉన్నా భద్రతను మాత్రం భారీగా కుదించి వేశారని నివేదించారు. గతంలో 10 మంది పీఎస్ఓలు ఉంటే ఇప్పుడు ఇద్దరినే కేటాయించారన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా భద్రతను కుదించిందన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ మాజీ ముఖ్యమంత్రికి భద్రత విషయంలో ఓ నిర్దిష్ట విధానపరమైన నిర్ణయం ఎందుకు తీసుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మాజీ ప్రధానులకు కల్పిస్తున్న రీతిలోనే మాజీ ముఖ్యమంత్రులకు కూడా భద్రత కల్పించడం సబబుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. గత మాజీ ముఖ్యమంత్రికి ఎలాంటి భద్రత కల్పించారని ప్రశ్నించారు. దీనికి దమ్మాలపాటి బదులిస్తూ తీవ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉండటంతో ఆయనకు ఎస్‌పీజీ భద్రత కల్పించారని చెప్పారు. మరి మిగిలిన మాజీ ముఖ్యమంత్రుల సంగతి ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించడంతో వారికి 'వై' కేటగిరీ భద్రతను ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎలాంటి భద్రత కల్పించాలన్నది వారికి ఉన్న ప్రాణహానిని బట్టి ఉంటుందని దమ్మాలపాటి చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, ఆ తరువాత పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోర్టును కోరారు.

మంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వకుంటే ఎలా..?

ఈ సమయంలో శ్రీరామ్ స్పందిస్తూ అందుకు అభ్యంతరం లేదని, అప్పటి వరకు 3.6.24 నాటికి జగన్‌కున్న భద్రతను కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే దీనిని దమ్మాలపాటి వ్యతిరేకించారు. చట్ట ప్రకారం ముఖ్యమంత్రికే ఆ స్థాయి భద్రత ఉంటుందన్నారు. ఈ సమయంలో శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ జగన్‌కు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం పూర్తి లోపభూయిష్టంగా ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. కారు అద్దాలపై పగుళ్లు ఉన్నాయని, వెనుక డోరు తెరుచుకోవడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో కారు నుంచి బయటకు వచ్చే అవకాశం ఏమాత్రం లేదని నివేదించారు. జామర్ సదుపాయం కూడా తొలగించారన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ మాజీ ముఖ్యమంత్రికి మంచి బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఇవ్వకుంటే ఎలా? ఎందుకు ఇవ్వడం లేదు? అని ప్రశ్నించారు. దీనిపై ఏం చేయబోతున్నారో తెలుసుకుని చెప్పాలని దమ్మాలపాటిని ఆదేశిస్తూ విచారణను మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేశారు.

ప్రాణహాని లేదనేందుకు ప్రభుత్వం వద్ద ఆధారాలు లేవు...

తిరిగి మధ్యాహ్నం విచారణ మొదలు కాగానే దమ్మాలపాటి స్పందిస్తూ వైఎస్ జగన్‌కు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం అద్దాలకు పగుళ్లు ఉన్నాయని అంగీకరించారు. ఆ అద్దాన్ని మారుస్తామని, ఆ వాహనం మొత్తానికి మరమ్మతులు చేయిస్తామన్నారు. అప్పటి వరకు వైఎస్ జగన్‌కు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయిస్తామని చెప్పారు. మరి జామర్ సంగతి ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించగా.. జగన్ ఏదైనా ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ రిమోట్ కంట్రోల్డ్ ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఆర్‌సీఐఈడీ) ఉపయోగించే అవకాశాలు ఉంటే ఆ విషయాన్ని ఆయన భద్రతా సిబ్బందికి తెలియచేసి అప్పుడు మాత్రమే జామర్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. మిగిలిన అన్ని సమయాల్లో జామర్ ఇవ్వడం సాధ్యం కాదన్నారు. దీనిపై శ్రీరామ్ స్పందిస్తూ వైఎస్ జగన్‌కున్న ప్రాణహానిని ప్రభుత్వం సరిగా మదింపు చేయలేదని చెప్పారు. ప్రాణహాని లేదని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలను కోర్టు ముందుంచలేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పిన వివరాలను న్యాయమూర్తి నమోదు చేశారు.

జగన్ భద్రతపై దుష్ప్రచారం

- వాహనం లోపభూయిష్టంగా ఉన్నట్లు ప్రభుత్వ న్యాయవాదే ఒప్పుకున్నారు: అంబటి
- సెక్యూరిటీలో ల్యాండ్ క్రూజర్లు ఎక్కడున్నాయ్?



సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా మంత్రులు నారా లోకేష్, అనిత, అచ్చెన్నాయుడు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ఆయనకు జరగరానిది ఏదైనా జరిగితే కూటమి ప్రభుత్వానిదే బాధ్యతని హెచ్చరించారు. గతంలో జగన్‌కి 986 మందితో భద్రత ఉన్నట్లు ఎల్లో మీడియాలో కథనాలు రావడం, సీఎం చంద్రబాబు నుంచి మంత్రుల దాకా అవే అబద్ధాలను పదే పదే ప్రచారం చేయడంపై మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో అంబటి బుధవారం మీడియాతో మాట్లాడారు.

అత్యంత ప్రజాదరణ ఉన్న నేత జగన్..
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆయనకు సెక్యూరిటీగా ఉన్నది కేవలం 139 మంది మాత్రమే. వైఎస్ జగన్ అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడు. నెల్లూరు, పులివెందుల, వినుకొండ, విజయవాడ.. ఇలా ఆయన ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఎస్ఆర్‌సీ నివేదిక రాకుండానే జగన్ సెక్యూరిటీని తొలగించారు. ఆయన ఇంటి వద్ద సెక్యూరిటీని తొలగించడంతోపాటు ఆ రూట్‌లో చెక్‌పోస్టులు, పోలీస్ ఔట్‌పోస్టులను ఎత్తివేశారు. కొందరు కూటమి పార్టీల కార్యకర్తలను జగన్ ఇంటి వద్దకు పంపించి గొడవలు చేయించారు. వాటిని అనుకూల మీడియాలో ప్రచారం చేశారు. ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్నవారు సైతం ఎన్నికల ఫలితాలు వెలువడగానే జగన్‌ను ఉద్దేశించి దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఇవన్నీ చూసిన తర్వాతే వైఎస్ జగన్ భద్రత కోసం హైకోర్టును ఆశ్రయించాం. వైఎస్ జగన్‌కు ఇచ్చిన వాహనం లోపభూయిష్టంగా ఉన్నట్లు ప్రభుత్వ న్యాయవాదే న్యాయస్థానంలో ఒప్పుకున్నారు. హైదరాబాద్‌లో చంద్రబాబు నివాసం ఉన్న వీధిలోకి ఇప్పటికీ ఎవరినీ అనుమతించడం లేదు. చివరకు చంద్రబాబు మనవడు దేవాన్ష్‌కు కూడా ఆరుగురు గన్‌మెన్లు ఉండొచ్చు కానీ జగన్‌కి మాత్రం డొక్కు బుల్లెట్‌ప్రూఫ్ కారు ఇస్తారా? జగన్ కాన్వాయ్‌లో రెండు ల్యాండ్ క్రూజర్లు ఉన్నాయని వ్యాఖ్యలు చేస్తున్న నారా లోకేష్ తాను బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్నాననే విషయాన్ని గుర్తుంచుకుని మాట్లాడాలి. హోం మినిస్టర్ అనితమ్మా? లేక నారా లోకేశా? హోంమంత్రి చేయాల్సిన పనులు నారా లోకేశ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

రఘురామపై 'సుప్రీం' అసహనం

- కోర్టులను ఎంతమాత్రం శాసించొద్దు
- క్షేత్రస్థాయి కోర్టులను మేం నియంత్రించజాలం
- అన్ని విషయాలను ట్రయల్ కోర్టు చూసుకుంటుంది
- ఏం చేయాలో ఇప్పటికే స్పష్టంగా చెప్పేశాం
- తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- తదుపరి విచారణ నవంబర్‌కు వాయిదా

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టులను శాసించొద్దని, అలా అనుకోవడం ఎంత మాత్రం సరికాదని హితవు పలికింది. క్షేత్రస్థాయి కోర్టుల్లో ఏం జరుగుతున్నాయో తమకు తెలియదని, అందువల్ల నిర్దిష్టంగా ఇలాగే విచారణ జరపాలంటూ నియంత్రించజాలమని తేల్చి చెప్పింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించిన కేసుల్లో అన్ని విషయాలను సంబంధిత ట్రయల్ కోర్టే చూసుకుంటుందని తెలిపింది. రాజకీయ నేతల కేసుల్లో ఎలా వ్యవహరించాలో ఆదేశాల రూపంలో దేశవ్యాప్తంగా దిగువ కోర్టులకు ఇప్పటికే చాలా స్పష్టంగా చెప్పామని గుర్తు చేసింది. సీబీఐకి కూడా చెప్పాల్సింది చెప్పామని పేర్కొంది.

మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ పిటిషన్..
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులను తెలంగాణ నుంచి వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. జగన్ బెయిలు రద్దు చేసి విచారణను వేగవంతం చేసేలా కింది కోర్టును ఆదేశించాలని కూడా రఘురామ కోరారు. ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. విచారణ ముందుకు వెళ్లకుండా నిందితులు డిశ్చార్జి పిటిషన్లు దాఖలు చేస్తున్నారని సీబీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. పదేళ్లుగా డిశ్చార్జి పిటిషన్ల వల్ల సమయం వృథా అవుతోందని రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ నివేదించారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ సీబీఐ తరఫు న్యాయవాది ఎస్‌వీ రాజు ఎక్కడ ఉన్నారని ఆరా తీసింది. ఆయన మరో కోర్టులో ఉండటంతో విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది.

రఘురామపై కూడా సీబీఐ కేసులున్నాయి..
మధ్యాహ్నం తిరిగి విచారణ ప్రారంభం కాగానే రఘురామ తరఫు న్యాయవాది మరోసారి డిశ్చార్జి పిటిషన్ల గురించి ప్రస్తావించడంతో 'డోన్ట్ డిక్టేట్ అజ్' అంటూ ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో ట్రయల్ కోర్టులో ఏం జరుగుతుందో తమకు తెలియదని, అన్ని విషయాలను ఆ కోర్టే తేలుస్తుందని తేల్చి చెప్పింది. 100 నుంచి 200 వరకూ రాజకీయ నేతలపై కేసులు ఉన్నాయని, వాటన్నింటినీ తాము నియంత్రించగలమా? అని ప్రశ్నించింది. ఈ సమయంలో వైఎస్ జగన్ తరఫు సీనియర్ న్యాయవాది జోక్యం చేసుకుంటూ పిటిషనర్ రఘురామకృష్ణరాజుపై కూడా సీబీఐ కేసులు ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆయనపై రూ.800 కోట్ల వరకూ బ్యాంకులను మోసం చేసిన కేసులు ఉన్నాయని తెలిపారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం సీబీఐ తరఫు న్యాయవాది రాజు అందుబాటులో లేకపోవడంతో తదుపరి విచారణను నవంబర్ 11 నుంచి ప్రారంభమయ్యే వారంలో చేపడతామంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రైవేటు బస్సు బోల్తా.. 25 మందికి గాయాలు



కృత్తివెన్ను (పెడన) : ప్రైవేటు బస్సు, కారు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో బస్సు బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న 21 మంది, కారులో ఉన్న నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. కృత్తివెన్ను ఎస్ఐ కె. నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు నుంచి ఓ ప్రైవేటు బస్సు బుధవారం హైదరాబాద్‌కు బయల్దేరింది. రాత్రి 8.30 గంటల సమయంలో కృత్తివెన్ను మండలం యండపల్లి-మునిపెడ గ్రామాల మధ్య విజయవాడ నుంచి రావులపాలెం వెళ్తున్న కారు, ఈ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బస్సు రోడ్డు మార్జిన్‌లో పల్టీ కొట్టింది. కారు ముందు భాగం దెబ్బతింది.



ప్రమాదంలో బయటపడిన నెలలు వయస్సున్న చిన్నారితో తల్లి

ప్రమాద సమయంలో బస్సులో 19 మంది ప్రయాణికులు, బస్సు డ్రైవరు, క్లీనరు ఉండగా వారిలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇక కారులో ఉన్న నలుగురూ గాయపడ్డారు. వీరిని మచిలీపట్నం సర్వజనాసుపత్రికి తరలించారు. బస్సు ప్రయాణికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు.

అవయవదానంతో ముగ్గురికి జీవం పోసిన టీచరమ్మ

అవయవదానంతో ముగ్గురి జీవితాలు నిలబెట్టిన రిటైర్డ్ ఉపాధ్యాయిని శ్రీలక్ష్మి



శ్రీలక్ష్మి (ఫైల్)

కాకినాడ రూరల్: ఉపాధ్యాయినిగా ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఓ టీచర్ అవయవదానంతో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బళ్లముడి శ్రీలక్ష్మి (68) అనారోగ్యంతో కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద ఉన్న ట్రస్ట్ ఆస్పత్రిలో చేరారు. మెదడులో రక్తస్రావం కారణంగా కోమాలోకి వెళ్లిపోవడంతో వైద్యులు బుధవారం బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. భర్త యలమంచిలి ఆంజనేయులు, కుటుంబసభ్యులు అవయవదానం చేయడానికి ముందుకు రావడంతో ట్రస్ట్ ఆస్పత్రి వైద్యులు ఆమె నుంచి అవయవాలు సేకరించారు. కిడ్నీ, లివర్‌ను అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు పేషెంట్లకు అమర్చారు. మరో కిడ్నీ విశాఖలోని ఒమ్నీ ఆర్‌కే ఆస్పత్రిలో పేషెంట్‌కు అమర్చేందుకు తరలించారు. కృష్ణా జిల్లా మాడిచెర్ల గ్రామంలో జన్మించిన శ్రీలక్ష్మి ఉపాధ్యాయవృత్తిలో చేరి టీచర్‌గా మంచి పేరు సంపాదించుకుని రిటైరయ్యారు. కిర్లంపూడి మండలం వేళంగిలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా 1996లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. అవయవదానానికి ముందుకు వచ్చిన శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులను ట్రస్ట్ ఆస్పత్రి ఎండీ కళ్యాణ్, వైద్యులు అభినందించారు.

పేకాటలో పట్టుబడ్డ వీఆర్‌వో



నాగేశ్వర్‌రెడ్డి

పుంగనూరు (చిత్తూరు జిల్లా): ఓ లాడ్జిలో పేకాట ఆడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని వనమలదిన్నె వీఆర్‌వో నాగేశ్వర్‌రెడ్డి అడ్డంగా పట్టుబడిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని ఓ లాడ్జిలో వీఆర్‌వోతో పాటు మరో ఆరుగురు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.10500 స్వాధీనం చేసుకుని, హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు కేసు నమోదు చేశారు. 41 సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేసి, పేకాట రాయుళ్లను విడుదల చేశారు. కాగా పుంగనూరు, పరిసర గ్రామాల్లో పేకాట తీవ్రం కావడంతో జిల్లా ఎస్పీ మణికంఠ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు.

విత్తనం దొరక్క రైతులు 'వర్రీ'

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలో వరి విత్తన కొరత తీవ్రంగా ఉంది. కోరిన విత్తనం దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే మడులు సిద్ధం చేసుకున్న రైతులు.. అదను దాటి పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నిండి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేయడంతో కుడి కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులు పూర్తి స్థాయిలో మాగాణి భూముల్లో వరి సాగుకు సిద్ధమయ్యారు. దీంతో పది రోజులుగా నాణ్యమైన వరి విత్తనాల కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. నరసరావుపేట డివిజన్‌తో పాటు వినుకొండ, సత్తెనపల్లి డివిజన్లలోనూ విత్తన కొరత ఉండటంతో ఆయా ప్రాంత రైతులు నరసరావుపేట పట్టణానికి విత్తనాల కోసం తరలి వస్తున్నారు. తెలంగాణలోని జగిత్యాల ప్రాంతం నుంచి సరఫరా అవుతున్న స్వల్ప కాలిక రకం జేజీఎల్-384 విత్తనాలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. 135 రోజుల్లో పంట చేతికి రావడంతో పాటు తెగుళ్లను తట్టుకునే వంగడం కావడంతో ఈ రకం విత్తనాల కోసం రైతుల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని చిన్నయ్య అండ్ సన్స్ దుకాణంలో సబ్సిడీపై ఏపీ సీడ్స్ సరఫరా చేసే విత్తనాలతో పాటు ప్రైవేటు రకం విత్తనాలను కూడా విక్రయిస్తుంటారు. ఇందులో భాగంగా జేజీఎల్-384 రకం విత్తనాలు కూడా అందుబాటులో ఉంచారు. 25 కిలోల విత్తనాల బస్తా రూ.1,350.. 30 కిలోల విత్తనాల బస్తా రూ.1,500కు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు ఈ విత్తనం కోసం దుకాణం ఎదుట బారులు తీరుతున్నారు.



జోరు వానలో విత్తన దుకాణం వద్ద క్యూలైన్‌లో

పోలీసు బందోబస్తుతో విత్తనాల విక్రయం

వారం నుంచి విత్తనాల కోసం వందల మంది రైతులు దుకాణం వద్ద పడికాపులు కాస్తున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రైతులు గ్రామాల నుంచి జేజీఎల్-384 రకం విత్తనాల కోసం తరలి వస్తున్నారు. రైతులు పెద్ద ఎత్తున రావడంతో పోలీసు బందోబస్తుతో విత్తనాల విక్రయం సాగుతోంది. అయినప్పటికీ బుధవారం ఉదయం రైతుల మధ్య తోపులాట జరగడంతో టౌన్ హాల్‌లో టోకెన్లు జారీ చేసేందుకు కౌంటర్ ఏర్పాటు చేశారు. కొంత మందికి టోకెన్లు అందజేసి కౌంటర్‌ను మూసివేశారు. దీనిపై రైతులు నిలదీయడంతో స్టాక్ ఉన్న వరకే టోకెన్లు అందజేశామని నిర్వాహకులు తెలిపారు. దీంతో గత్యంతరం లేక రైతులు వెనుదిరగాల్సి వచ్చింది. టోకెన్లు తీసుకున్న రైతులు జోరు వానలోనూ క్యూలైన్‌లో వేచి ఉండటం కనిపించింది. రైతులు అన్ని ఇబ్బందులు పడి టోకెన్ తీసుకున్నా, కేవలం ఒక బస్తానే ఇస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జేజీఎల్-384 రకం వరి విత్తనాల కోసం రైతులు కష్టాలు పడుతుంటే ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఇతర రకాలు సాగు చేసుకోవాలని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రత్యామ్నాయ విత్తనాలు సిద్ధం

జేజీఎల్-384 రకం వరి విత్తనాలు ఎక్కడా అందుబాటులో లేవని, అదే రీతిలో దిగుబడి ఇచ్చే స్వల్ప కాలిక రకాలు ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. పల్నాడు ప్రాంతానికి అనుకూలమైన వంగడాలతో పాటు రైతులు ఎక్కువగా ఇష్టపడే అంకుర్ సోనా, అంకుర్-పద్మ, ఏపి-567, అన్నపూర్ణ తదితర రకాల విత్తనాలను సరిపడా అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

నాలుగు రోజులుగా తిరుగుతున్నా..



జేజీఎల్-384 రకం వరి విత్తనాల కోసం నాలుగు రోజులుగా పట్టణానికి వచ్చి దుకాణాల చుట్టూ తిరుగుతున్నాం. ఈ రోజు టోకెన్ దొరికితే ఒక బస్తా (25 కిలోలు) ఇచ్చారు. ఐదు ఎకరాల్లో ఈ రకం వేయాలని సిద్ధమయ్యాం. ఒక బస్తాతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.
– వసంత శ్రీనివాసరావు, రైతు, పమిడిమర్రు

ఇంత ఇబ్బంది ఎప్పుడూ పడలేదు



వరి విత్తనాల కోసం ఇంత ఇబ్బంది ఎప్పుడూ పడలేదు. విత్తన దుకాణాల్లోనే అన్ని రకాల విత్తనాలు దొరికేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైతులకు కావాల్సిన విత్తనం దుకాణాల్లో దొరకడం లేదు. ఇక్కడ ఒక్క చోటే విత్తనాలు అమ్ముతున్నారు. దీంతో రైతులందరూ ఇక్కడికే రావడంతో తోపులాట జరుగుతోంది. – రావి సుబ్బారావు, రైతు, చీమలమర్రి

రైతులు కోరిన విత్తనాలు అందించాలి



లాభసాటిగా ఉండే విత్తనాలను రైతులకు ప్రభుత్వం అందించాలి. రైతులు అడిగిన విత్తనం కాకుండా, ఇతర రకాలు సబ్సిడీపై ఇస్తే ప్రయోజనం ఏమిటి? జేజీఎల్ రకం విత్తనాలు మార్కెట్లో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– జి.వెంకటేశ్వర్లు, రైతు, తుంగపాడు

■ పేదల ఇంటి పునాదులు పెరికేసి భూమి కబ్జా

చిత్తూరు జిల్లా సోమలమండలం ఆవులపల్లి గ్రామంలో సర్వే నెంబరు 501/9లో పేదలకు పంచిన ఇళ్ల స్థలాలపై టీడీపీ నేతల కన్నుపడింది. ఇక అంతే బుధవారం జేసీబీలతో అక్కడకు చేరుకున్నారు. బి.దామోదర్, హేమావతి దంపతులు కష్టపడి కట్టుకున్న ఇంటి పునాదులను పెరికేశారు. ఆ భూమినంతా చదును చేశారు. దీనిపై బాధితులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నారు.

–సాక్షి టాస్క్‌ఫోర్స్



■ శిలాఫలకాలు ధ్వంసం





ప్రకాశం జిల్లా కొండపి మండలం నేతివారిపాలెం గ్రామంలో ఐదేళ్ల కిందట ఐటీసీ వారి సహకారంతో మాజీ ఎమ్మెల్యే దివి శంకరయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ శిలాఫలకాన్ని టీడీపీ నేత పున్నయ్య వర్గానికి చెందిన రాయని బుజ్జి గుంటూరు నుంచి వచ్చి బుధవారం ధ్వంసం చేశారు. తాము వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమని టీడీపీ వారు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని దివి శంకరయ్య కుమారుడు దివి శ్రీనివాసరావు ఆరోపించారు. అలాగే పీసీపల్లి మండలం మురుగమ్మి గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని టీడీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. దీనిపై మాజీ ఎంపీపీ బత్తుల అంజయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు వల్లెం మాల్యాద్రి, నల్లగంగుల శ్రీనివాసుల యాదవ్, వల్లెం రమణారెడ్డి, కొండారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

–సాక్షి టాస్క్‌ఫోర్స్/పీసీపల్లి

బంగ్లాలో నేడే తాత్కాలిక సర్కారు

సారథిగా యూనస్ ప్రమాణం

- సలహాదారులుగా 15 మంది
- దేశాన్ని పునర్నిర్మించుకుందాం
- హింసను ఆపండి: యూనస్
- కొనసాగుతున్న దమనకాండ
- హిందువులపై మరిన్ని దాడులు
- చేతులెత్తేసిన పోలీసు వ్యవస్థ
- రంగంలోకి యువకులు

ఢాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో నోబెల్ గ్రహీత మహ్మద్ యూనుస్ సారథ్యంలో గురువారం తాత్కాలిక ప్రభుత్వం కొలువు దీరనుంది. ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్ బుధవారం ఈ మేరకు ప్రకటించారు. రాత్రి 8 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. యూనుస్ సర్కారుకు సైన్యం సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. 15 మంది సభ్యులతో ఆయన సలహా మండలి ఏర్పాటవుతుందని తెలుస్తోంది. ప్రస్తుతం పారిస్‌లో ఉన్న 84 ఏళ్ల యూనుస్ హుటాహుటిన స్వదేశం చేరుకోనున్నారు. శాంతియుతంగా వ్యవహరించాలని బంగ్లా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ''మన దేశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకునేందుకు ఇదో గొప్ప అవకాశం. మతిలేని హింసతో దాన్ని చేజార్చుకోవద్దు. హింసకు పూర్తిగా స్వస్తి చెబుదాం. పార్టీలతో పాటు అందరికీ ఇది నా విజ్ఞప్తి'' అన్నారు. సాహస విద్యార్థుల వల్లే దేశంలో ఇంతటి విప్లవం సాధ్యమైందని ప్రశంసించారు. తాత్కాలిక ప్రభుత్వ సారథిగా యూనుస్ పేరును విద్యార్థి సంఘాల నేతలే ప్రతిపాదించడం తెలిసిందే.

రెచ్చిపోయిన మూకలు

బంగ్లాదేశ్‌వ్యాప్తంగా హింసాకాండ బుధవారం కూడా నిర్నిరోధంగా కొనసాగింది. హసీనాకు చెందిన అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలపై దాడులు తీవ్రతరమయ్యాయి. ఒక్క మంగళవారమే దేశవ్యాప్తంగా 29 మంది పార్టీ మద్దతుదారులను హతమార్చారు. దాంతో గత నెల రోజుల్లో దేశవ్యాప్త హింసకు బలైన వారి సంఖ్య 470 దాటింది. హిందువుల ఇళ్లు, వ్యాపార సముదాయాలనే ప్రధానంగా లక్ష్యం చేసుకుంటూ అల్లరి మూకలు రెచ్చిపోయాయి. ప్రఖ్యాత జానపద కళాకారుడు రాహుల్ ఆనంద ఇంటిని లూటీ చేశారు. అనంతరం దాన్ని నేల మట్టం చేశారు. ఆయన ఏళ్ల తరబడి శ్రమించి రూపొందించుకున్న 3,000 పై చిలుకు సంగీత పరికరాలలకు నిప్పు పెట్టారు. దాంతో కుటుంబంతో సహా రాహుల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పలుచోట్ల ముస్లిం యువకులు, మత పెద్దలు ఆలయాలకు, హిందువుల నివాసాలకు రక్షణ కల్పిస్తూ కన్పించారు. మరోవైపు పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారు. పరిస్థితి మరింత విషమిస్తుందన్న వదంతులకు జడిసి వారు మూకుమ్మడిగా అజ్ఞాతంలోకి వెళ్లినట్టు వార్తలొస్తున్నాయి. దీనికి తోడు పోలీస్‌స్టేషన్ల మీదే దాడులు జరగడం, మూకల చేతుల్లో పోలీసులు పెద్ద సంఖ్యలో చనిపోవడం పరిస్థితిని మరింత జటిలం చేసింది. పోలీసులంతా విధుల్లోకి తిరిగి రావాల్సిందిగా దేశ పోలీస్ తాత్కాలిక చీఫ్ షహీదుర్ రెహ్మాన్ బహిరంగంగా విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయింది! శాంతిభద్రతల పరిరక్షణకు విద్యార్థులు, యువకులే రంగంలోకి దిగారు. దేశవ్యాప్తంగా ట్రాఫిక్‌ను నియంత్రణ తదితర బాధ్యతలు నిర్వర్తిస్తూ కన్పించారు. శాంతిభద్రతలను కాపాడటం కేవలం సైన్యం వల్ల అయ్యే పని కాదని ఆర్మీ చీఫ్ అన్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్టు చెప్పుకొచ్చారు.



ప్రొఫెసర్ నెత్తిన ముళ్ల కిరీటం

నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ 'పేదల బ్యాంకర్'గా, బంగ్లాదేశ్‌లో మైక్రోఫైనాన్స్ పితామహునిగా పేరొందారు. 1940లో చిట్టగాంగ్‌లో జన్మించిన ఆయన ఢాకా వర్సిటీలో చదువుకున్నారు. పీహెచ్‌డీ తర్వాత పలు విదేశీ వర్సిటీల్లో ప్రొఫెసర్‌గా చేశారు. బంగ్లాకు తిరిగొచ్చి బంగ్లాదేశ్ గ్రామీణ్ బ్యాంక్‌ను స్థాపించారు. పేదలకు చిన్న రుణాలిచ్చే ఈ మైక్రోఫైనాన్స్ సంస్థ దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడింది. లక్షలాది మందిని పేదరికం నుంచి గట్టెక్కించేందుకు చేసిన కృషికి 2006లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. పాశ్చాత్య దేశాలతో, ముఖ్యంగా అమెరికాతో యూనుస్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. షేక్ హసీనా 2008లో రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆమెతో మనస్పర్థలొచ్చాయి. అవినీతి సహా ఆయనపై పలు ఆరోపణలు తెర మీదికి వచ్చాయి. కార్మిక చట్టాలను ఉల్లంఘించిన కేసులో దోషిగా తేలి ఆర్నెల్ల జైలు శిక్ష పడటంతో యూనుస్ దేశం వీడారు.

400 మంది భారతీయులు వెనక్కు

కల్లోలం నేపథ్యంలో అక్కడున్న భారతీయులు ముందుజాగ్రత్తగా వెనక్కు వస్తున్నారు. వారి కోసం ఎయిరిండియా, ఇండిగో బుధవారం ఢాకా నుంచి ఢిల్లీ, కోల్‌కతాకు ప్రత్యేక విమానాలు నడిపాయి. వాటిలో 400 మందికి పైగా తిరిగొచ్చారు. ఢాకాలోని భారత హైకమిషన్ నుంచి అత్యవసరం కాని 190 మంది సిబ్బంది, కుటుంబీకులు భారత్ తిరిగొచ్చారు. బంగ్లాదేశ్‌లో ఇంకా 10,000 మంది దాకా భారతీయులు ఉన్నట్టు సమాచారం. పరిస్థితి వారందరినీ తరలించాల్సినంత ఆందోళనకరంగా లేదని విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు.

కొంతకాలం భారత్‌లోనే హసీనా: వాజెద్

ప్రధాని పదవికి రాజీనామా చేసి బంగ్లాదేశ్‌ను వీడిన 76 ఏళ్ల షేక్ హసీనా మరికొంతకాలం భారత్‌లోనే గడుపుతారని ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జాయ్ బుధవారం వెల్లడించారు. పలు దేశాల్లో రాజకీయ ఆశ్రయం కోసం హసీనా ప్రయత్నిస్తున్నారన్న వార్తలను కొట్టిపారేశారు. ''మా అమ్మ ప్రస్తుతం ఢిల్లీలో నా సోదరితో పాటు ఉన్నారు. కొంత కాలం అక్కడే ఉంటారు'' అని చెప్పారు. లండన్ వెళ్లాలని హసీనా భావించగా ఆశ్రయం కల్పించేందుకు బ్రిటన్ నిరాకరించడం తెలిసిందే.



ఖలీదా ర్యాలీ

విపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ బుధవారం ఢాకాలో భారీ ర్యాలీ నిర్వహించింది. గృహనిర్బంధం నుంచి విడుదలైన పార్టీ చీఫ్ బేగం ఖలీదా జియా (79) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ర్యాలీనుద్దేశించి ప్రసంగించారు. ప్రజలు మూకుమ్మడిగా కదిలి షేక్ హసీనా సర్కారును సాగనంపడం ద్వారా అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని కొనియాడారు. ''ఇది హింసా ప్రతీకారాలకు సమయం కాదు. ఇప్పుడు కావాల్సింది ప్రేమ, శాంతి, సామరస్యాలు. అవే దేశ పునర్నిర్మాణానికి చోదక శక్తులు కావాలి'' అన్నారు. ''యువతే మన భవిత. వారి కలలను సాకారం చేసేలా ప్రజాస్వామిక బంగ్లాదేశ్‌ను తీర్చిదిద్దుకుందాం. రక్తపాతం, విధ్వంసం, ఆగ్రహావేశాలు, ప్రతీకారాలకు తావియ్యొద్దు'' అని పిలుపునిచ్చారు.

వక్ఫ్ బోర్డులోకి మహిళలు, ముస్లిమేతరులు!

వక్ఫ్ చట్టానికి కీలక సవరణలు చేయనున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: ముస్లిం మతపరమైన, ధార్మిక ప్రయోజనాల కోసం దానంగా వచ్చిన ఆస్తులను పర్యవేక్షించే వక్ఫ్ బోర్డుల్లో మరింత పారదర్శకత సాధించే లక్ష్యంతో సంబంధిత చట్టంలో కీలక మార్పులకు కేంద్రం నడుం బిగించింది. ఇందులోభాగంగా వక్ఫ్ బోర్డుల పాలనా వ్యవహారాల్లో మహిళలు, ముస్లిమేతరులకు చోటు కల్పించాలని భావిస్తోంది. ఈ మేరకు వక్ఫ్ చట్టంలో సవరణలు తేవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వక్ఫ్ చట్టం,1995 పేరును యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్,1995గా మార్చుతూ వక్ఫ్ (సవరణ)బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. సంబంధిత బిల్లు వివరాలు మంగళవారం లోక్‌సభ సభ్యులకు అందాయి. ఆ బిల్లులోని అభ్యంతరాలు, అందుకు కారణాల జాబితా ప్రకారం ప్రస్తుత వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40ని తొలగించనున్నారు. ఏదైనా ఆస్తి వక్ఫ్‌కు చెందినదిగా నిర్ణయించే అధికారం ప్రస్తుతం వక్ఫ్ బోర్డుకే ఉంది. ఇంతటి అపరిమిత అధికారాలను తగ్గించాలని బిల్లులో ప్రతిపాదించారు. కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్రాల వక్ఫ్ బోర్డుల్లో భిన్న వర్గాలకు, ముస్లిం పురుషులతోపాటు మహిళలు, ముస్లిమేతరులకూ ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ముస్లింలలో బోరా, అగాఖనీల కోసం ప్రత్యేకంగా బోర్డ్ ఆఫ్ ఔఖాఫ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కనీసం ఐదేళ్లుగా ఇస్లామ్ మతాన్ని ఆచరిస్తూ సొంత ఆస్తిని దానంగా ఇస్తేనే దానిని 'వక్ఫ్'గా పేర్కొనాలని 'వక్ఫ్' పదానికి బిల్లు కొత్త నిర్వచనం ఇచ్చింది.

సెప్టెంబర్ 3న రాజ్యసభ ఉప ఎన్నికలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 12 రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ 12 స్థానాలకు సెప్టెంబర్ 3న ఎన్నికలు జరుగనున్నట్లు బుధవారం ప్రకటించింది. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, సర్బానంద సోనోవాల్, జ్యోతిరాదిత్య సింధియా సహా కాంగ్రెస్ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, దీపేందర్ హుడా వంటి సిట్టింగ్ సభ్యులు లోక్‌సభకు ఎన్నికవడంతో ఆ స్థానాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణ నుంచి బీఆర్ఎస్ ఎంపీగా ఉన్న కె.కేశవరావు కాంగ్రెస్‌లోకి మారడంతో పాటు తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఒక సీటు, ఒడిశాలో మమతా మొహంతా రాజీనామాతో మరో సీటు ఖాళీ అయింది. ఈ 12 స్థానాలకు ఆగస్టు 12న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, నామినేషన్ పత్రాల దాఖలుకు ఆగస్టు 21 చివరి తేదీగా ఈసీ ప్రకటించింది. 22న నామినేషన్ పత్రాల పరిశీలన, 26న అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, త్రిపుర, 27న బిహార్, రాజస్తాన్, తెలంగాణ, ఒడిశాల్లో నామినేషన్‌ల ఉపసంహరణకు గడువిచ్చింది. సెప్టెంబర్ 3వ తేదీన ఓటింగ్ నిర్వహిస్తారని, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేస్తారని తెలిపింది.

అనవసర మాటలొద్దు

సర్వోన్నత న్యాయస్థానం పట్ల గౌరవం ఉండాలి

- తమ తీర్పును తప్పుబట్టిన హైకోర్టు న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు అసహనం

న్యూఢిల్లీ: గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉద్దేశిస్తూ పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎగువ కోర్టు పట్ల ఎనలేని గౌరవం చూపాలని, న్యాయ క్రమశిక్షణ పాటించాలని హితవు పలికింది. హరియాణాలోని గుర్గావ్‌లో ఒక భూవివాదానికి సంబంధించిన కేసులో మే మూడో తేదీన సుప్రీంకోర్టు ఒక ఉత్తర్వులు జారీచేసింది. అయితే జూలై 17వ తేదీన ఒక కేసును విచారిస్తున్న సందర్భంగా పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజ్‌బీర్ సహరావత్ సుప్రీంకోర్టును విమర్శించారు. '' హైకోర్టుల అధికారాలకు సుప్రీంకోర్టు యథాలాపంగా అడ్డు తగులుతోంది. ఇక తామే 'సుప్రీం' అన్నట్లుగా సుప్రీంకోర్టులో విపరీత ధోరణి కనిపిస్తోంది'' అని జడ్జి సహరావత్ అన్నారు. అయితే ఆరోజు హైకోర్టులో కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారం కావడంతో సంబంధిత వీడియో వైరల్‌గా మారింది. విషయం తెల్సుకున్న సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా స్వీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషికేశ్ రాయ్‌ల ప్రత్యేక ధర్మాసనం ఈ అంశాన్ని బుధవారం విచారించింది. '' కింద కోర్టులు సుప్రీంకోర్టు తీర్పులను శిరసావహించాల్సిందే. ఇందులో వేరే ఆప్షన్ ఎంచుకునే అవకాశమే లేదు. ఎందుకంటే ఇది రాజ్యాంగబద్ధ విధి నిర్వహణ. కోర్టుల్లో తీర్పులపై పిటిషనర్లు, కక్షిదారులు అసంతృప్తి వ్యక్తంచేయొచ్చుగానీ జడ్జీలు తమ సొంత వ్యాఖ్యానాలు చేయకూడదు. దేశంలో ఇక ఏ న్యాయస్థానంలోనూ ఇలాంటివి పునరావృతం కాబోవని భావిస్తున్నాం. కేసు విచారణల ప్రత్యక్ష ప్రసారాల కాలంలో జడ్జీలు ఏవైనా వ్యాఖ్యానాలు చేసేటపుడు సంయమనం పాటించాలి. అనవసర మాటలొద్దు'' అని హైకోర్టు జడ్జికి ధర్మాసనం మౌఖిక ఆదేశాలిచ్చింది. జిల్లా కోర్టులు మొదలు హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా రాజ్యాంగంలోని ప్రతి అంగంలోనూ క్రమశిక్షణ అనేది కొనసాగాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు ఖచ్చితంగా కోర్టు ధిక్కారమేనని పేర్కొన్న సుప్రీంకోర్టు.. ఆ జడ్జిపై చర్యలు తీసుకునేందుకు మాత్రం నిరాకరించింది.



పెన్సిల్వేనియాలో సభలో కమలతో వాల్జ్

అమెరికాకు అర్హుడైన ఉపాధ్యక్షుడు

వాల్జ్‌ను పరిచయం చేసిన కమల

ఫిలడెల్ఫియా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీకి దిగిన కమలా హారిస్ ప్రచారం ముమ్మరం చేశారు. మంగళవారం పెన్సిల్వేనియాలో భారీ ప్రచార సభలో మాట్లాడారు. తన ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్‌ను దేశ ప్రజలకు పరిచయం చేశారు. ఆయన ఉన్నత స్థాయికి ఎదిగిన తీరును వివరించారు. ఆయన కేవలం గవర్నర్ మాత్రమే కాదు, అంతకుమించి ఎంతో గొప్ప వ్యక్తి అని చెప్పారు. అమెరికా ప్రగతి కోసం, ప్రజల సౌభాగ్యం కోసం తాము కలిసి పని చేయబోతున్నామని వెల్లడించారు. అమెరికాకు అన్నివిధాలా అర్హుడైన ఉపాధ్యక్షుడు టిమ్ వాల్జ్ అని ప్రశంసించారు. కమలా హారిస్ మాట్లాడిన అనంతరం టిమ్ వాల్జ్ ప్రసంగం ప్రారంభించారు. జనం చప్పట్లు, కేకలతో హర్షామోదాలు వ్యక్తం చేశారు. మనకు మరో 91 రోజులపాటు సమయం మాత్రమే ఉందని, ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. అవిశ్రాంతంగా కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు. మరణించిన తర్వాతే మనకు నిద్ర అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఏబీసీ న్యూస్ సర్వేలో ఆసక్తికరమైన అంశం బయటపడింది. వాల్జ్ ఎవరో తమకు ఇప్పటిదాకా పెద్దగా తెలియదని ప్రతి 10 మందిలో 9 మంది చెప్పారు. ఉపాధ్యక్ష అభ్యర్థిగా పేరు ఖరారైన తర్వాతే ఆయనెవరో తెలిసిందని అన్నారు.

ట్రంప్ హత్యకు కుట్ర!

పాకిస్తాన్ పౌరుడు అసిఫ్ మర్చెంట్‌ను అరెస్టు చేసిన ఎఫ్‌బీఐ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి జరిగిన కుట్రను ఎఫ్‌బీఐ అధికారులు అడ్డుకున్నారు. ట్రంప్‌తోపాటు మరికొందరు రాజకీయ నాయకులను, ప్రభుత్వ ఉన్నతాధికారులను అంతం చేయడానికి స్కెచ్ వేసిన పాకిస్తాన్ పౌరుడు అసిఫ్ మర్చెంట్(46)ను జూలై 12న అరెస్ట్ చేశారు. అతడిపై హత్య కేసు నమోదుచేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అసిఫ్ మర్చెంట్‌కు ఇరాన్ ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నట్లు భావిస్తున్నారు. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఫెడరల్ కోర్టులో అధికారులు సమర్పించిన పత్రాలతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జూలై 13న పెన్సిల్వేనియాలోని బట్లర్ నగరంలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ట్రంప్‌పై తుపాకీతో కాల్పులు జరిపిన 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్‌తో అసిఫ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఎఫ్‌బీఐ అధికారులు స్పష్టంచేశారు. ట్రంప్‌తోపాటు ఇతర పెద్దలను హత్య చేయడానికి అసిఫ్ నియమించుకున్న కిరాయి హంతకుడే అధికారులకు ఉప్పందించి, అతడిని చట్టానికి పట్టివ్వడం గమనార్హం.

గోవిందరాజన్‌కు తొలి విజ్ఞాన్ రత్న అవార్డు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా నెలకొల్పిన శాస్త్రసంబంధ 'విజ్ఞాన్ రత్న' అవార్డుకు ప్రముఖ జీవరసాయన శాస్త్రవేత్త గోవిందరాజన్ పద్మనాభన్ ఎంపికయ్యారు. దీంతోకలిపి కేంద్రం మొత్తంగా 33 రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్ అవార్డులను ప్రకటించింది. యువ శాస్త్రవేత్తలకు ఇచ్చే 18 విజ్ఞాన్ యువ పురస్కార్‌లతోపాటు 13 విజ్ఞాన్ శ్రీ పురస్కార్, ఒక విజ్ఞాన్ టీమ్ అవార్డులు ఈ 33 అవార్డుల్లో ఉన్నాయి. విజ్ఞాన్ టీమ్ అవార్డును టీమ్ చంద్రయాన్–3కి ప్రకటించారు. శాస్త్రసాంకేతి, నూతన ఆవిష్కరణ రంగాల్లో పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు సాధించిన ఘనతలకుగాను ప్రభుత్వం ఈ అవార్డును అందజేస్తోంది.

అసమానతలు అరికట్టే ఆయుధం రాజ్యాంగం

సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్



న్యూఢిల్లీ: భారత రాజ్యాంగం దేశంలో అసమానతలు అరికట్టే శక్తివంతమైన ఆయుధమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. కంటికి కనిపించే, కనిపించని అసమానతలకు వ్యతిరేకంగా పనిచేసే వ్యవస్థలకు, ప్రభుత్వ యంత్రాంగాలకు రాజ్యాంగం తగిన రక్షణ కల్పిస్తుందని అన్నారు. వ్యవస్థలు వాటి పరిధిలో అవి సక్రమంగా పనిచేసేలా రాజ్యాంగం తగిన కట్టుదిట్టాలు చేసిందని తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఓ.పి.జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవంలో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడారు. న్యాయ వ్యవస్థపై పరిజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. చుట్టూ జరిగే అన్యాయాన్ని ప్రశ్నించాలన్నారు.

నియంతృత్వం ఇక సాగదు: ముఫ్తీ



శ్రీనగర్: యువతను నిరాశానిస్పృహలకు గురిచేయకూడదని, బంగ్లాదేశ్ సంక్షోభం భారత్‌కు ఒక గుణపాఠమని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. నియంతృత్వం ఎక్కువ కాలం సాగదన్నారు. ద్రవోల్బణాన్ని, నిరుద్యోగాన్ని కట్టడి చేయడంలో విఫలమైతే, చదువుకున్నా నిస్సహాయులుగా మిగిలిపోయామనే భావనను యువతలో కలిగిస్తే బంగ్లాదేశ్ లాంటి పరిస్థితి ఇక్కడా రావొచ్చన్నారు. 'తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వ విధానాలు, చట్టాలతో విసుగెత్తితే.. ప్రజలు సహనాన్ని కోల్పోతారు. అప్పుడు షేక్ హసీనాలా పారిపోవాల్సి ఉంటుంది' అని ముఫ్తీ అన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

వయనాడ్ దుర్ఘటనపై రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని విపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో బుధవారం జీరో అవర్‌లో మాట్లాడారు. బాధితులకు పరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. 'కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను సందర్శించా. కళ్లారా చూశాను. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. పెద్ద సంఖ్యలో గల్లంతయ్యారు. మృతులు400 దాటే అవకాశం ఉంది' అని రాహుల్ పేర్కొన్నారు. ఈ విపత్తులో సహాయపడిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆతిషి జెండా ఎగురవేస్తారు: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమంలో తనకు బదులుగా మంత్రి ఆతిషి పాల్గొంటారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ఈ మేరకు లేఖ రాశారు. ఆగస్టు 15న ఆమే జాతీయ జెండాను ఎగురవేస్తారని తెలిపారు. ఢిల్లీ అవినీతి కుంభకోణం కేసులో కేజ్రీవాల్ తిహార్ జైల్లో ఉండటం తెలిసిందే. దాంతో జైలు నుంచే ఎల్జీకి లేఖ రాశారని ఆప్ వెల్లడించింది.

నేపాల్‌లో కుప్పకూలిన హెలికాప్టర్..



కఠ్మాండు: నేపాల్‌లో ఘోర ప్రమాదం జరిగింది. రాజధాని కఠ్మాండు సమీపంలో ఓ హెలికాప్టర్ పర్వతాల మధ్యలో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు చైనా పర్యాటకులు, పైలట్ దుర్మరణం పాలయ్యారు. ఎయిర్ డినాస్టీ హెలికాప్టర్ 9ఎన్-ఏజేడీ బుధవారం మధ్యాహ్నం 1.54 గంటల సమయంలో కఠ్మాండులోని త్రిభువన్ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. రసువా పట్టణానికి చేరుకోవాల్సి ఉంది. బయలుదేరిన కొద్దిసేపటికే గ్రౌండ్ స్టేషన్‌తో సంబంధాలు తెగిపోయాయి. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరో హెలికాప్టర్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. నువాకోట్ పరిధిలోని శివపురి రూరల్ మున్సిపాలిటీలో కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను గుర్తించారు.

కానిస్టేబుల్ పరీక్షకు పోటెత్తిన అభ్యర్థులు

ముంబై: మహారాష్ట్ర పోలీసు శాఖలో 4,230 మహిళా కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ కార్యక్రమానికి బుధవారం 5.8 లక్షల మంది అభ్యర్థులు పోటెత్తారు. దక్షిణ ముంబైలోని మెరైన్ లైన్స్, ఘట్కోపార్‌లోని జీఆర్‌పీ మైదానంలో రన్నింగ్, ఇతర పరీక్షలు నిర్వహిస్తున్నారు. మహిళా అభ్యర్థులకు తోడుగా భర్త, తల్లిదండ్రులు, తోబుట్టువులు, చివరకు పసిపిల్లలు వెంట రావడంతో ఆయా ప్రాంతాలు జనసంద్రంతో నిండిపోయాయి. బస చేయడానికి హోటళ్లలో గదులు ఖాళీలేక కుటుంబసభ్యులు వర్షాకాలంలో రైల్వే స్టేషన్లలో, బ్రిడ్జిల కింద తలదాచుకుంటూ, ఆరుబయట ఫుట్‌పాత్‌లపై అవస్థలు పడుతున్నారు. '' నా భార్యకు గురువారం గ్రౌండ్ టెస్ట్ ఉంది. ఎక్కడా గదులు దొరకలేదు. బయట వర్షం. చివరకు రైల్వేస్టేషన్ దిక్కయింది' అని భర్త చెప్పారు.

అమెరికా ఎన్నికల్లోనూ డీప్‌ఫేక్

ఓటర్లను గందరగోళ పరుస్తున్న ఫేక్ వీడియోలు ● ఎన్నికల ప్రక్రియపై పెను ప్రభావం!



అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను ఉపాధ్యక్షురాలు, సొంత పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ విమర్శిస్తున్న వీడియో..

విమర్శకులను ఏకిపారేస్తూ, ఎల్జీబీటీక్యూలను తిట్టి పోస్తూ బైడెన్ ఫోన్ కాల్స్ రికార్డులు..

మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అరెస్ట్ ఫొటో..

... అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డీప్ ఫేక్ హల్‌చల్‌కు ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే. కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చాక అమెరికాలో జరుగుతున్న తొలి అధ్యక్ష ఎన్నికలివి. దానికి తోడు ఏకపక్షంగా సాగేలా కన్పించిన పోటీ కాస్తా బైడెన్ స్థానంలో హారిస్ రంగప్రవేశంతో హోరాహోరీగా మారింది. ఈ నేపథ్యంలో ఓటర్లను గందరగోళపరచడానికి, ఉద్రిక్తతలను రేకెత్తించడానికి ఏఐ మరింతగా దుర్వినియోగం కావచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

2024 జనవరిలో డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీ సందర్భంగా అధ్యక్షుడు జో బైడెన్ గొంతును అనుకరిస్తూ న్యూహ్యాంప్‌షైర్ ప్రజలకు ఫేక్ ఫోన్ కాల్స్ వెళ్లాయి. ప్రైమరీల్లో పాల్గొంటే సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అర్హత కోల్పోతారంటూ ఓటర్లను ఆయన హెచ్చరిస్తున్నట్టుగా ఉన్న ఆ ఫేక్ కాల్స్ సంచలనమే సృష్టించాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ- ఆధారిత వాయిస్ రోబోకాల్స్‌పై నిషేధం విధించింది. అలాంటి వీడియోలను సృష్టించినా, ప్రసారం చేసినా సదరు కంపెనీలకు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అయినా డీప్ ఫేక్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది.

బైడెన్‌ను మూర్ఖుడన్న కమల

కుబేరుడు మస్క్ ఎక్స్‌లో షేర్ చేసిన కమల డీప్‌ఫేక్ వీడియో వైరల్ అయింది. బైడెన్ మూర్ఖుడని, దేశాన్ని నడపడం ఆయనకు తెలీదని కమల అన్నట్టు ఆ వీడియోలో ఉంది. ఒక్క స్మైలీ ఎమోజీని మినహాయిస్తే అది పేరడీ అనడానికి ఆ వీడియోలో ఎటువంటి సంకేతాలూ లేవు. ఇలాంటివాటి ప్రభావం తటస్థ ఓటర్లపై చాలా ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది.

విమర్శకులను తిట్టినట్టుగా...

బైడెన్ అధ్యక్ష బరి నుంచి తప్పుకుని తనకు బదులుగా హారిస్‌ను అభ్యర్థిత్వాన్ని సమర్థించే క్రమంలో తన విమర్శకులను విపరీతంగా తిట్టిపోయడమే గాక ఎల్జీబీటీక్యూలకు వ్యతిరేకంగా మాట్లాడినట్టు, ఓ మానిప్యులేటెడ్ వీడియో పీబీఎస్ మీడియా సంస్థ లోగోతో సహా తెరపైకి వచ్చింది. దాంతో పీబీఎస్ టెలివిజన్ సంస్థ రివర్స్ ఇమేజ్ సెర్చ్ చేసింది. అసలు వీడియోను తమ చానల్లో లైవ్ ప్రసారం చేసింది. అది నిజానికి జూలై 13న ట్రంప్‌పై హత్యాయత్నం తర్వాత రాజకీయ హింసను ఖండిస్తూ బైడెన్ మాట్లాడిన వీడియో. వీక్షకులను మోసగించేందుకు తమ లోగోను వాడుతూ డీప్ ఫేక్ వీడియో చేసినట్టు పీబీఎస్ తేల్చింది.

ట్రంప్ అరెస్టు!

పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు డబ్బు చెల్లింపుల రికార్డులను తారుమారు చేసిన కేసులో ట్రంప్‌ను కోర్టు దోషిగా తేల్చాక పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్టు చేసినట్లు కొన్ని వారాల క్రితం ఒక ఫొటో వైరలైంది. అది కూడా డీప్ ఫేక్ బాపతేనని డిజిటల్ ఫోరెన్సిక్స్ నిపుణులు తేల్చారు.

ఆటో టెక్నాలజీ లేదు

ఏఐ ద్వారా సృష్టించే ఫేక్ వీడియో కంటెంట్, ఒరిజినల్ కంటెంట్ మధ్య తేడాను ఆటోమేటిక్‌గా గుర్తించే టెక్నాలజీ ఏదీ ప్రస్తుతానికి అందుబాటులో లేదు. దాంతో ఏదైనా కంటెంట్‌పై ఫ్యాక్ట్ చెక్ చేసే లోపే అది వైరల్ అవుతోంది. అది ఫేక్ అని చివరికి తేలినా, అప్పటికే జరగాల్సిన నష్టమంతా జరిగిపోతోంది.

తప్పుడు ట్వీట్లతో..

వీటికి తోడు తప్పుడు ట్వీట్లను సృష్టించి ఓటింగ్‌నే తారుమారు చేసే ఏఐ చాట్‌బాట్ సామర్థ్యాన్ని సిప్ ఏఐ సంస్థ సహ వ్యవస్థాపకుడు లుకాస్ హాన్సెన్ ప్రదర్శించారు. అందులో అలెన్, టెక్సాస్ 'పోలింగ్ కేంద్రాలు పార్కింగ్ కోసం ఛార్జ్ చేస్తున్నాయి' అంటూ ఏఐ టూల్‌కు సందేశమిచ్చారు. అంతే...! అలెన్ అధికారులు చాలా పోలింగ్ కేంద్రాల్లో గప్‌చుప్‌గా 25 డాలర్ల పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారంటూ సెకన్ల వ్యవధిలోనే లక్షల మందికి ట్వీట్లు చేరిపోయాయి.

సమస్యేనంటున్న అమెరికన్లు

ఇలాంటి మోసపూరిత చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఆగ్రహం రగిల్చే ప్రమాదముందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను ఏఐ ఆధారిత అసత్యాలు ప్రభావితం చేస్తాయని 50 శాతానికి పైగా అమెరికన్లు భావిస్తున్నట్టు మీడియా గ్రూప్ ఆక్సియోస్, బిజినెస్ ఇంటెలిజెన్స్ సంస్థ మార్నింగ్ కన్సల్ట్ గతేడాది చేసిన పోల్‌లో వెల్లడైంది. దీనిపై 200కి పైగా న్యాయవాద బృందాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఏఐ అసత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు తక్షణం రంగంలోకి దిగాలంటూ టెక్ సీఈఓలకు ఏప్రిల్లో లేఖ రాశాయి. రాజకీయ ప్రకటనల్లో డీప్‌ఫేక్స్ వాడకాన్ని నిషేధించాలని, వాస్తవిక ఎన్నికల కంటెంట్‌ను ప్రోత్సహించేలా అల్గారిథంను ఉపయోగించాలని కోరాయి. ఈ నేపథ్యంలో, ఏఐ కంటెంట్‌ను పక్కాగా లేబులింగ్ చేసే దిశగా కృషి చేస్తున్నట్టు టెక్ దిగ్గజాలు చెబుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం | 8 | ఆగస్టు | 2024



జై గణేశా

త్వరలో వినాయక చవితి రానున్నది. ఇందుకోసం బెళగావిలో సిద్ధమవుతున్న గణేశ విగ్రహాలు

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. ఆండాళ్ ఉత్సవం



ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మండ్య: ఆండాళ్ అవతారంలోని తిరువాడి ప్పూరం రోజైన బుధవారం మేలుకోటె చెలువ నారాయణస్వామి ఆలయంలో మహాలక్ష్మి యదుగిరి నాయకి అమ్మ ఊరేగింపు వైభవంగా నెరవేరింది. రోజంతా భక్తి కార్యక్రమాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం పొందారు. మహాలక్ష్మి ఆండాళ్ రూపంలో భూమిపై అవతరించిన రోజుకు ప్రతీకగా తిరువాడిప్పూరంని అన్ని వైష్ణవ ఆలయాల్లో ఆచరిస్తారు. అలాగే మేలుకోటెలో కూడా అమ్మవారి వేడుకని వైభవంగా నిర్వహిస్తున్నారు. కళ్యాణ నాయకి అమ్మవారికి ఉదయం 8 గంటలకు వెండి పెద్ద ఆదిశేష వాహనోత్సవం, దివ్య ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యాలతో నెరవేర్చారు. ఏడు రోజులుగా జరుగుతున్న తిరువాడిప్పూరం కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి మంగళవారం రాత్రి బంగారు చిన్న శేషాలంకారంతో ఉత్సవం నిర్వహించారు. ఈవో మహేష్, వేద పండితులు పాల్గొన్నారు.

నేత కార్మికులకు సన్మానం



బనశంకరి: నగరంలో యలహంక కామాక్షమ్మ లేఔట్‌లో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా, ప్రవాసాంధ్రుడు మురళి ఆధ్వర్యంలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. మోర్చా నాయకురాలు బృంద మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం ముడిసరుకు సబ్సిడీ, నేసిన చీరలను కొనుగోలుచేసి చేయూతనివ్వాలన్నారు. ఎం.సతీశ్‌గౌడ, వై.రామిరెడ్డి, జమున తదితరులు పాల్గొన్నారు.

బాలికపై హత్యాచారం

దొడ్డబళ్లాపురం: బాలిక హత్యకు గురైన సంఘటన మంగళూరులోని జోకట్టె గ్రామంలో చోటుచేసుకుంది. బెళగావి జిల్లా రామదుర్గ తాలూకాకు చెందిన బాలిక చికిత్స నిమిత్తం జోకట్టె గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. ఇంట్లో ఉన్న వారంతా కూలి పనికి వెళ్లగా బాలిక ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమెపై అత్యాచారం చేసి, ఆపై గుడ్డతో గొంతు బిగించి హత్య చేశాడు. మంగళవారం సాయంత్రం ఘటన వెలుగు చూసింది. పోలీసులు హంతకుని కోసం గాలింపు చేపట్టారు.

దారుణ ప్రమాదం

- గర్భిణి, కడుపులోని శిశువు దుర్మరణం



సించన (ఫైల్)

దొడ్డబళ్లాపురం: లారీ ఓ స్కూటర్‌ను ఢీకొన్న ప్రమాదంలో గర్భిణి మహిళ దుర్మరణం పాలైంది. ఆమె కడుపు బద్ధలై గర్భస్థ శిశువు బయటకు వచ్చి మృత్యువాత పడింది. ఈ ఘోరం నెలమగల తాలూకా ఎడేహళ్లి గేట్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. గర్భిణి సించన (20) భర్తతో కలిసి స్కూటర్‌పై ఎడేహళ్లి వద్ద సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారి ఢీకొంది. సించన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా, పొట్ట చీలిపోవడంతో గర్భస్థ పిండం బయటకు వచ్చింది. భర్త మంజునాథ్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ దారుణాన్ని చూసి ఆగ్రహోదగ్రులైన స్థానికులు లారీ డ్రైవర్‌ను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. దాబస్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గ్రీన్ బదులు బ్లూ యూనిఫాం

బనశంకరి: యూనిఫాం మార్పు గురించి పౌర కార్మికుల డిమాండ్‌కు బీబీఎంపీ తలొగ్గింది. పాలికె పౌరకార్మికులు ప్రస్తుతం ఉన్న గ్రీన్ రంగు యూనిఫాం మార్పు చేయాలని పలుమార్లు కమిషనర్ కు మనవిచేశారు. దీంతో నీలి రంగు యూనిఫాం అందజేయాలని పాలికె నిర్ణయించింది. సుమారు 17 వేలమంది పౌరకార్మికులకు నూతన యూనిఫాం ఇస్తారు. మహిళా పౌర కార్మికులకు రెండు జతల చీరలు, టోపీ, స్వెట్టర్ కోటు అందిస్తారు. ఒకరికి రూ. 4,811 వ్యయమవుతుంది. పురుషులకు ఒక ట్రాక్ ప్యాంట్, టీషర్ట్, టోపీ అందిస్తారు, ఇందుకు తలా రూ.3,578 ఖర్చవుతుంది. వస్త్రాల సరఫరా కోసం టెండర్లు పిలిచాం, ఈ నెల15 నుంచి నూతన యూనిఫాం అందిస్తామని కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు.

కాటేస్తోన్న డెంగీ జ్వరం


- రాష్ట్రంలో 20 వేలకు చేరువగా కేసులు
- ఐటీ నగరంలో అత్యధికం
- 10 మంది మృత్యువాత



పొగ వదిలినా ఫలితం సున్నా



బెంగళూరులో ఓ ఆస్పత్రిలో వేచి ఉన్న జ్వర పీడితులు



బనశంకరి: విపరీతమైన జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, రక్తంలో ప్లేటిలెట్లు క్షీణించడం ఇవన్నీ డెంగీ జ్వరం లక్షణాలు. సరైన చికిత్స అందకపోతే ప్రాణాలే పోవచ్చు. రాష్ట్రంలో డెంగీ కేసులు రోజురోజుకు హెచ్చుమీరుతున్నాయి. డెంగీ రోగుల సంఖ్య 19 వేలను దాటడం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది డెంగీ విజృంభణ పెరిగింది. ఈ ఏడాదిలో గత ఆదివారం వరకు రాష్ట్రంలో 19,313 డెంగీకేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. సిలికాన్ సిటీలో ఈ విష జ్వరం వల్ల రోజురోజుకు ఆసుపత్రుల్లో చేరే వారిసంఖ్య పెరుగుతోంది. డెంగీ బాధితుల కోసం హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఆరోగ్యశాఖ , బీబీఎంపీ అధికారులు ప్రారంభించారు. టోల్‌ఫ్రీ నంబరు 1800–425–8330 కి ప్రజలు డెంగీ సమస్యపై ఫిర్యాదు చేయవచ్చు, లేదా సమాచారం తీసుకోవచ్చునని తెలిపారు. డెంగీ సమర్థ నియంత్రణ నిర్వహణకు ఆరోగ్యశాఖ బెంగళూరులో 6 ప్రభుత్వ ఆసుపత్రుల్లో నోడల్ అధికారులను నియమించింది.

గతేడాది కంటే 5 రెట్లు అధికం

- రాష్ట్రంలో బాధితులు 19 వేలు దాగా, వీరిలో 10 మంది మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. 2023 ఇదే అవధిలో రాష్ట్రంలో 4,864 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయి. తాజాగా బెంగళూరులో ముగ్గురిని పొట్టనపెట్టుకుంది. శివమొగ్గ, హాసన్‌లో తలా ఒకరు, హావేరి, మైసూరు, ధారవాడలో తలా ఒకరు డెంగీకి బలయ్యారు.
- రాష్ట్రంలో మొత్తం డెంగీ కేసుల్లో 50 శాతం కేసులు గత రెండు వారాల్లో నమోదు కావడం విశేషం. అందులో బెంగళూరులోనే 46 శాతం కేసులు రావడం తీవ్రతకు అద్దం పట్టింది.

ఏమిటీ కారణాలు

ప్రతి ఏటా డెంగీ సమస్య పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. వేసవిలో ఎండల వల్ల దోమల సంఖ్య తగ్గుతుంది. మళ్లీ వర్షాకాలం రాగానే దోమల సంతతి పెరుగుతుంది. తడి వాతావరణంలో, డ్రైనేజీలు, నీటి కుంటలు, చెత్త దిబ్బల్లో దోమలు విచ్చలవిడిగా పెరుగుతాయి. వీటిలో డెంగీకి కారణమయ్యే ఈడిస్ ఈజిప్టై దోమలు అధికంగా ఉంటాయి.

8 జిల్లాల్లో అధికం

బెంగళూరు, ధారవాడ, హావేరితో పాటుగా ఎనిమిదికి పైగా జిల్లాల్లో రెండెంకెల్లో కేసులు వస్తున్నాయి. తాలూకా, జిల్లా ఆసుపత్రుల్లో బెడ్లను రిజర్వు చేసినట్లు అధికారులు చెప్పారు. ప్రతి శుక్రవారం కాలువలు, చెత్త కుప్పల్లో క్రిమి సంహారకాలను పిచికారి చేస్తున్నట్లు, ఇంటింటి సర్వే చేసి జాగృతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, తీవ్ర జ్వర లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రిలో చికిత్స పొందాలని తెలిపారు.

- బెంగళూరులో జూలై 1 నుంచి 1,563 కేసులు నమోదయ్యాయి. ఆగస్టు నాటికి డెంగీ కేసుల సంఖ్య 8,800 కు చేరుకుంది.
- వచ్చే ఆదివారానికి డెంగీ జ్వర బాధితులు 20 వేలకు చేరుకున్నా ఆశ్చర్యం లేదు. ప్రతి రోజు 300 మంది వరకు డెంగీ బారిన పడుతున్నారు. మంగళవారం 259 డెంగీ కేసులు నమోదయ్యాయి.

రాత్రివేళ ల్యాండింగ్

- శివమొగ్గ విమానాశ్రయంలో త్వరలో పనులు పూర్తి
- పర్యాటక రంగానికి ఊతం



శివమొగ్గ: శివమొగ్గ విమానాశ్రయంలో రాత్రి వేళలో విమానాల ల్యాండింగ్‌కు ఎదురైన అడ్డంకులకు సత్వరమే విముక్తి లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలోనే పనులను చేపట్టినా కొన్ని కారణాల వల్ల ఈ ఏడాది జనవరిలో నిలిపివేశారు. కాగా రాత్రి వేళ ల్యాండింగ్ పనుల పున:ప్రారంభానికి తాజాగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆమోదించింది. దీంతో ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) పనులను తిరిగి చేపట్టనుంది. డిజైన్, కార్యాచరణకు డీజీసీఏ ఆమోదించినట్లు స్థానిక ఎంపీ బీవై రాఘవేంద్ర తెలిపారు. గత జనవరి నాటికి 65 శాతం మేర రాత్రివేళ ల్యాండింగ్‌కు ఏర్పాట్ల పనులు పూర్తి కాగా మిగతా పనులను మరో రెండు నెలల్లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. రాత్రి పూట ల్యాండింగ్ ప్రారంభించేముందు డీజీసీఏ అధికారులు పనులను పరిశీలించి అన్నీ బాగుంటే అనుమతిస్తారు. లేదంటే కొన్ని మార్పులు సూచిస్తారు. మరో 3–4 నెలల్లో ఇది పూర్తి కావచ్చని భావిస్తున్నారు.

ఉపయోగాలు?

రాబోయే చలికాలం ప్రారంభమయ్యే నాటికి నిరంతర ల్యాండింగ్, టేకాఫ్‌లకు ఎయిర్‌పోర్టు సిద్ధమవుతుందని ఆశాభావం ఉంది. రాత్రి పూట విమాన రాకపోకలకు అనుమతి వస్తే ప్రయోజనం కలుగుతుంది. దూరప్రాంత ప్రయాణికులు ఎక్కువగా రాత్రివేళల్లో ప్రయాణిస్తారు. దాని వల్ల ఎయిర్‌పోర్టుకు ఎక్కువ విమానాలు రాకపోకలు సాగించడంతో పాటు స్థానికంగా ఉద్యోగ ఉపాధులు, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది.

బీజేపీ సర్కారు ఉన్నప్పుడే స్థలాలు ఇచ్చారు

- గవర్నర్ నోటీసుకు జవాబిచ్చా
- సీఎం సిద్దరామయ్య వెల్లడి



మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

మైసూరు: ముడా నుంచి ప్రత్యామ్నాయ స్థలాలు పొందిన కేసులో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోట్ ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇచ్చానని, దానిని గవర్నర్ అంగీకరిస్తారనే నమ్మకం ఉందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. బుధవారం మైసూరు నగరంలోని టీకే లేఔట్‌లో తమ ఇంటి ముందు విలేకరులతో ఆయన మాట్లాడారు. ముడా నుంచి నా భార్య స్థలాలు పొందిన కేసులో గవర్నర్ నుంచి నాకు వచ్చింది ఒకే నోటీసు, దానికి బదులిచ్చాను. చట్టపరంగా నాది ఎలాంటి తప్పు లేదు. ముడా నా భార్యకు కెసరెలో స్వాధీనపరచుకున్న భూమికి బదులుగా విజయనగరలో మొత్తం 14 స్థలాలను కేటాయించడంలో నేను ఎలాంటి పలుకుబడిని చూపలేదు. 2014లో నేను సీఎంగా ఉన్న సమయంలో నా భార్య అర్జీ సమర్పించగా, ఆ విషయాన్ని ముడా అధికారులు తన దృష్టికి తేగా ఒక్క సెంటు స్థలాన్ని కూడా ఇవ్వవద్దని చెప్పాను. ఆ తర్వాత మళ్లీ 2021లో అర్జీ సమర్పించగా అప్పటి బీజేపీ ప్రభుత్వ హయాంలో చట్టప్రకారమే తన భార్యకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించారని చెప్పారు. తాను స్థలాలను పొందాలనుకుంటే సీఎంగా ఉండగా తానే ఇప్పించేవాడిని కదా అన్నారు.

యడియూరప్పపై ఆగ్రహం

బీజేపీ మాజీ సీఎం యడియూరప్ప ఈ వయస్సులో పోక్సో కేసులో చిక్కుకుని కోర్టు దయతో జైలు కాకుండా తప్పించుకున్నారని సిద్దరామయ్య ఎద్దేవా చేశారు. సీఎంగా యడియూరప్ప లంచాలు తీసుకున్నారు, అక్రమ డీ నోటిఫై చేశారని ఆరోపించారు. ఈ నెల 9న మైసూరు మహారాజ కాలేజీ మైదానంలో కాంగ్రెస్ జనాందోళన సభ జరగనుంది, ఆ ఏర్పాట్లను పరిశీలించారు.

మైసూరులో సైబర్ నేరాల దడ

- ఇద్దరికి రూ. 40 లక్షల మస్కా

మైసూరు: సైబర్ నేరాల బాధితులకు అడ్డాగా మారిన మైసూరులో మరో రెండు వేర్వేరు ఆన్‌లైన్ వంచన కేసుల్లో ఓ వైద్యునితో సహా మరో మహిళ రూ.40 లక్షలను పోగొట్టుకున్నారు. వివరాలు... విజయనగర నివాసి అయిన వైద్యుడు ఫేస్‌బుక్ ద్వారా షేర్‌మార్కెట్ గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయనను వంచకులు తమ వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. తాము చెప్పినట్లు ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు గడించవచ్చని దుండగులు నమ్మించడంతో దశలవారీగా రూ.29 లక్షలను వారి ఖాతాలకు బదలాయించి మోసపోయాడు.

జయలక్ష్మీపురానికి చెందిన ఓ మహిళకు దుండగులు ఫోన్ చేసి తాము సీబీఐ అధికారులమని, మీరు అక్రమ లావాదేవీలు జరిపామని బెదిరించారు. మీరు విచారణకు హైదరాబాద్‌కు రావాలని, విచారణ ముగిసిన తర్వాత మీ నగదు వాపసు ఇస్తామని ఒత్తిడి చేసి రూ. 11 లక్షలు గుంజారు. ఈ ఘటనలపై సైబర్ క్రైం పోలీసులు కేసులు నమోదు చేశారు.

కాళీ నదిపై కూలిన వారధి



కుప్పకూలిన వంతెన దృశ్యాలు



రెండవ వంతెన బంద్



నదిపై వంతెన ఇలా కనిపించేది (ఫైల్)

- కార్వార వద్ద మరో దుర్ఘటన
- గోవాతో రాకపోకలకు ఆటంకం




యశవంతపుర: ఉత్తర కన్నడ (కార్వార) జిల్లాలో వరుస విపత్తులు సంభవిస్తున్నాయి. గత నెలలో శిరూరు వద్ద హైవే–66లో భారీ కొండలు విరిగి పడి 8 మంది చనిపోగా, ఇప్పటికీ ముగ్గురి జాడ దొరకలేదు. ఇంతలోనే కార్వార నగరం నుంచి గోవాకు అనుసంధానంగా కాళీ నదిపై ఉన్న పాత వంతెన మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెళపెళమని కూలిపోయింది. ఈ సమయంలో బ్రిడ్జి మీద వెళుతున్న లారీ నదిలోకి పడిపోయింది. లారీ డ్రైవర్ లారీ ఎక్కి ఆర్తనాదాలు చేస్తుండగా స్థానిక జాలర్లు, పోలీసులు అతనిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. నదిపై పాత, కొత్త వంతెనలు రెండు ఉన్నాయి.

జిల్లా ఎస్పీ నారాయణ్, కలెక్టర్ లక్ష్మీ ప్రియ, ఎమ్మెల్యే సతీశ్ సైల్ వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. రెండవ వంతెన నాణ్యత ప్రమాణాలు వివరాలు వచ్చే వరకు కొత్త వారధిపై వాహనాల రాకపోకలను నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో కార్వార నుంచి గోవాకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు 50 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్తున్నాయి. రెండేళ్ల క్రితం పాత వంతెనను మరమ్మతు చేశారు. సంఘటనపై నివేదిక ఇవ్వాలని సీఎం సిద్ధరామయ్య కలెక్టర్‌ను ఆదేశించారు. వంతెన కూలినప్పుడు బస్సులు, కార్లు వంటివి వెళ్లకపోవడంతో పెద్ద ప్రాణనష్టం తప్పింది. నదిలో రెండు వంతెనలు పర్యాటక ఆకర్షణగా పేరుపొందాయి.

శిరాడి ఘాట్‌లో ఓకే


మరోవైపు శిరాడి ఘాట్ మార్గంలో మట్టి చరియలను తొలగించడంతో బుధవారం నుంచి అన్ని వాహనాలను అనుమతించారు. కుండపోత వర్షాల వల్ల హైవే– 75లో హాసన్ జిల్లా సకలేశపుర వద్ద శిరాడి ఘాట్‌లో మట్టి చరియలు విరిగి పడ్డాయి. అనేక వాహనాలు మట్టిలో చిక్కుకున్నాయి. అతి కష్టం మీద అధికారులు సిబ్బందిని కాపాడారు. ఇక సకలేశపుర– మారనేహళ్లిల మధ్య మట్టి చరియలు విరిగిపడి 30 గ్రామాలకు రవాణా వసతి స్తంభించింది.



పాత, కొత్త బ్రిడ్జిలు, ఇప్పుడు పాత బ్రిడ్జి కూలింది

చైతన్య స్ఫూర్తి పుష్ప రూపం

- నేటి నుంచి లాల్‌బాగ్‌లో ఫ్లవర్ షో



పూలతో రూపొందిన పాత పార్లమెంటు భవనం



రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, ఇతర కళాత్మక రూపాలు

శివాజీనగర: త్వరలో స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో బెంగళూరులోని లాల్‌బాగ్ ఉద్యానవనంలో వార్షిక ఫల పుష్ప ప్రదర్శనకు సర్వం సిద్ధమైంది. ఈసారి పార్లమెంటు భవనం, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ థీమ్‌తో ఫ్లవర్ షో అలరించబోతోంది. ఆగస్టు 8 నుంచి 19వ తేదీ వరకు కొనసాగుతుంది. గురువారం ఉదయం సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీ.కే.శివకుమార్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈసారి ఫల పుష్ప ప్రదర్శనలో 200 విభిన్నమైన సుమారు 32 లక్షల పుష్పాలతో వివిధ రూపాలను తీర్చిదిద్దారు. అపురూపమైన మొక్కలను, చెట్లను ప్రదర్శనలో ఉంచారు. అంబేడ్కర్ జీవితంలో ప్రధాన ఘట్టాలు, భారతదేశ భూపటం, రాజ్యాంగ పీఠికతో పాటుగా మరెన్నో కళాకృతులు స్ఫూర్తిని కలిగించనున్నాయి.

ఐటీ సిటీ.. నైట్‌లైఫ్ ఈజీ



- అర్ధరాత్రి 1 గంట వరకు హోటళ్లు, బార్లకు అనుమతి



రాత్రి వేళ సంచరించే యువతకు ఉపయోగం

బనశంకరి: కాస్మోపాలిటన్ సిటీగా ఖ్యాతిఘడించిన బెంగళూరులో నైట్ లైఫ్ మరింత సులభతరం కానుంది. అర్ధరాత్రి దాటాక 1 గంట వరకు హోటళ్లు, బార్లు రెస్టారెంట్లు, కొన్ని రకాల షాపులు తెరిచి ఉంచడానికి సర్కారు అనుమతించింది. ఆ మేరకు గత బడ్జెట్లో హామీ ఇవ్వగా, ఇప్పుడు నగరాభివృద్ధి శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అసలు బెంగళూరులో రోజులో 24 గంటలు వ్యాపార కార్యకలాపాలకు అవకాశం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్లు ఉన్నాయి.

బెంగళూరుకు దేశ విదేశాల నుంచి గంట గంటకూ వేలాది మంది వస్తుంటారు. రాత్రి 11కల్లా హోటళ్లు, బార్లు అన్నీ మూసివేయాలి. దీంతో వారికి ఆహార పానీయాలు లభించడం కష్టమవుతోంది. దీంతో అర్ధరాత్రి వరకు హోటల్స్ తెరవడానికి ఒప్పుకోవాలని నగర ఎమ్మెల్యేలు శాసనసభలో డిమాండ్ చేశారు. ఇందుకు 2021లోనే ప్రభుత్వం కొన్ని షరతులతో ఆమోదించింది. కానీ సిబ్బంది కొరత ఉందని, భద్రత కష్టమవుతుందని అప్పటి నగర పోలీస్ కమిషనర్ ప్రభుత్వానికి సూచించారు. ఇప్పుడు సమస్య కొలిక్కి వచ్చింది. ప్రభుత్వ నిర్ణయం సంతోషకరమని, ఈ రోజునుంచి ప్రజలకు, పర్యాటకులకు ప్రయోజనం చేకూరుతుందని బెంగళూరు హోటల్స్ సంఘం గౌరవాధ్యక్షుడు పీసీ.రావ్ తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా తపస్సిద్ధి ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న డీ.రాంబాబు, పార్వతమ్మ దంపతులు

బనశంకరి: జేపీ.నగర మూడో ఫేజ్ శ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో బుధవారం 63వ వార్షిక తపస్సిద్ధి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం అర్చకుల బృందం శ్రీ శివబాలయోగి మహరాజ్ విగ్రహం, మరకత శివలింగం, త్రిమూర్తి ఆలయంలో అర్చనలు, అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు శివబాలయోగిమహరాజ్ సమాధికి ఆశ్రమం కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు, పార్వతమ్మ దంపతులు పూజలు చేపట్టారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, మరకత శివలింగానికి అభిషేకం, ధ్యానం, విద్వాన్ శ్రీ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో భజన, త్రిమూర్తి ఆలయంలో గిరిజా కలాణోత్సవం, ప్రసాదం వితరణచేశారు. పెద్ద ఎత్తున ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

నా కల నెరవేరింది : రిషబ్ శెట్టి



చియాన్ విక్రమ్‌తో రిషబ్

దొడ్డబళ్లాపురం: తమిళ సూపర్‌స్టార్ చియాన్ విక్రమ్ తన సినిమా తంగాలన్ ప్రచారం కోసం బెంగళూరు విచ్చేశారు. చియాన్ అభిమాని అయిన కాంతార సినిమా హీరో రిషబ్ శెట్టి, ప్రముఖ కవి డింగ్రి నాగరాజ్ కుమారుడు రాజవర్ధన్‌లు విక్రమ్‌తో కలిసి దిగిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేసిన రిషబ్… తన 24ఏళ్ల కల నెరవేరిందని, విక్రమ్‌ను కలిశాక ప్రపంచంలో తనకంటె అదృష్టవంతుడు ఎవరూ లేరనిపిస్తోందన్నారు.

నిధుల మళ్లింపును నిరసిస్తూ 9న ధర్నా

మాలూరు : ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన రూ.39 వేల కోట్లను ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం గ్యారంటీ పథకాలకు మళ్లించిందని, దీనిని నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన ఎమ్మెల్యే నివాసం ముందు బృహత్ ప్రతిఘటన నిర్వహించనున్నట్లు దళిత సంఘర్ష సమితి జిల్లా సంచాలకుడు ఆర్. వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నిర్వహించే ఆందోళనలో పెద్ద సంఖ్యలో దళిత సముదాయ ప్రజలు పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు.

వైద్య శిబిరానికి స్పందన అంతంతే



కేజీఎఫ్ : తాలూకాలోని ఎన్‌జీ హుల్కూరు గ్రామ పంచాయతీ, వైదేహి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం వెద్య శిబిరం ఏర్పాటు చేశారు. అయితే కొద్దిమంది మాత్రమే వచ్చి వైద్య సేవలు పొందారు. ఆరోగ్య శిబిరానికి ప్రజలు రాకపోవడంపై జీవిక గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు రామచంద్రప్ప పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిబిరం నిర్వహణపై ప్రజలకు సరైన సమాచారం ఇవ్వలేదని, దీంతో రోగులు రాలేకపోయారన్నారు. కరపత్రాలను పంచి ప్రచారం చేసి ఉంటే పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి ఆరోగ్య పరీక్షలను చేయించుకునే వారన్నారు.

వీధి వ్యాపారుల ధర్నా



ఆందోళన చేస్తున్న వ్యాపారులు

యశవంతపుర: రేవు నగరం మంగళూరులో వీధి వ్యాపారుల అంగళ్లను పాలికె తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ దక్షిణకన్నడ జిల్లా వీధి వ్యాపారుల శ్రేయోభివృద్ధి సంఘం నేతృత్వంలో బుధవారం పాలికె కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేశారు. మొదట పీవీఎస్ సర్కిల్ నుంచి లాల్‌బాగ్ వరకు ఊరేగింపుగా వీధి వ్యాపారులు పాలికెకి చేరుకున్నారు. ఆపరేషన్ టైగర్ పేరుతో వీధి వ్యాపారుల పొట్ట కొడుతోందని దుయ్యబట్టారు. దుకాణాలను తొలగించరాదని కమిషనర్ సీఎల్‌ఆనందకు వినతి అందజేశారు. శాశ్వత పునరావాసం కల్పిస్తామని, వీధి వ్యాపారులకు గుర్తింపుకార్డులను అందిస్తామని కమిషనర్ తెలిపారు.

ఘనచరితకు సాక్ష్యం రాయ కాలువ

- రాయల కాలంలో అద్భుతంగా కాలువ నిర్మాణం
- వందలాది ఏళ్లుగా రైతుల జీవనాడిగా నిలిచిన వైనం



పాములా మెలికలు తిరిగిన ఆకారంలో అద్భుతంగా నిర్మితమైన రాయ కాలువ సుందర దృశ్యం

సాక్షి బళ్లారి: దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైన విజయనగర రాజుల కాలం నాటి ఎన్నో కట్టడాలు, వారి పాలన నేటికీ ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ పాలకులకు విజయనగర రాజుల కాలం నాటి పాలన నేటికీ గుర్తుకు వచ్చేలా సాక్ష్యాధారాలతో మనముందున్నాయి. హంపీని రాజధానిగా చేసుకొని దక్షిణ భారత దేశాన్ని పాలించిన తీరుపై యావత్ భారత దేశాన్ని విజయనగర రాజుల పాలనను పొగడ్తలతో ముంచెత్తుతుంటారు. అలాంటి వాటిలో ముందు చూపుతో రైతులకు జీవనాడిగా, ప్రజలకు ఆహారం అందించేందుకు రైతులకు ఉపయోగపడే విధంగా తుంగభద్ర నది నుంచి అప్పట్లో నిర్మించిన కాలువలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. విజయనగర రాజుల కాలంలో తుంగభద్ర నది నుంచి నీరు తీసుకొని రావడానికి నిర్మించిన కాలువలపైకి 'రాయ కాలువ' వైభవమే వేరుగా ఉంటుంది.

నయన మనోహర దృశ్యం

రాయ కాలువ పొడవు, పోయే మార్గం, వివిధ రకాలుగా సుడిగుండాల్లాగా ఉండే దృశ్యాలు ఎంతో అద్భుతంగా కనిపిస్తున్నాయి. 600 సంవత్సరాల క్రితమే నీటి పారుదల కాలువల నిర్మాణం నేటి ఇంజనీర్లను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. హంపిలో వైవిధ్యమైన నీటిపారుదల సౌకర్యాలు, ఆనకట్టలు, కాలువలు అడుగడుగునా కనిపిస్తుంటాయి. హంపిలోని మహానవమిదిబ్బ సమీపంలో మెట్లల కళ్యాణి, విరుపాక్షి దేవాలయం పక్కన మన్మథ నీటి గుంత, కృష్ణదేవాలయం ముందు బాలకృష్ణ నీటి గుంత, విజయవిఠల దేవాలయానికి వెళ్లే దారిలో పలు కళ్యాణి గుంతలు లాంటి దృశ్యాలు, రాణి స్నాన గృహాలు, ఈత కొలనులు తదితర దృశ్యాలు నేటికీ పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. వీటితో పాటు అలనాటి రాయ కాలువ, నీటి పారుదల వ్యవస్థకు సాక్ష్యంగా నిలుస్తోంది.

25 వేల ఎకరాలకు నీటిపారుదల

తుంగభద్ర నదికి హొసపేటె నుంచి రాయచూరు వరకు చిన్న చిన్న ఆనకట్టలు నిర్మించి కాలువల ద్వారా నీటిని అందిస్తున్నారు. విజయనగర కాలంలో నిర్మించిన కాలువల ద్వారా దాదాపు 25 వేల ఎకరాలకు నీటిపారుదల అందించే నైపుణ్యతను తీర్చిదిద్దారు. రాయల కాలంలో నిర్మించిన 18 కాలువల్లో ఎన్నో అద్భుతమైన వివిధ రీతుల్లో నిర్మించిన కట్టడాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇందులో అత్యంత ప్రముఖమైనది రాయ కాలువే అని చెప్పవచ్చు. ఈ కాలువ ద్వారా ఎన్నో కాలువలకు నీటి పారుదల సౌకర్యం కలుగుతోంది. విజయనగర రాజుల కాలంలో హొసపేటె సమీపంలో తుంగభద్ర నదికి వేసినా కురువగడ్డ ఆనకట్ట నుంచి ఈ కాలువ ప్రారంభమవుతోంది. తుంగభద్ర జలాశయం నిర్మించినప్పుడు ఈ గ్రామాలు, ఆనకట్టలు కొంత మునిగిపోయినా ప్రస్తుతం తుంగభద్ర డ్యాం నుంచి ఈ కాలువకు నీరు పారుదల సౌకర్యం కల్పించారు.

20 పల్లెలకు సాగునీరు

హొసపేటె తాలూకాల్లో దాదాపు 20 పల్లెలకు దీని ఉపయోగం లభిస్తుంది. 18 కాలువల పైకి రాయ కాలువే ఎక్కువగా రైతులకు నీరందిస్తుంది. రాయ కాలువ పొడవునా అపురూపమైన స్మారకాలు, ఎన్నో దృశ్యాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. నాగేనహళ్లి సమీపంలో కాలువ పక్కనే పాడుబడిన రాతి మండపాలు, ప్రాచీన శివాలయం కూడా ఉంది. ఇది చాలా వరకు శిథిలమైంది. విజయనగర రాజుల కాలంలో 600 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కాలువ ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతోంది. ఈ కాలువ ద్వారా హొసపేటె నగరం నుంచి చిత్తవాడిగి, రాణిపేట పక్కనే ప్రవహిస్తుంది. రాయ కాలువగా పిలవబడుతున్న ఈ కాలువ నిర్మాణం శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారా, అంతకు ముందే నిర్మించారా అన్నది ఖచ్చితమైన సాక్ష్యాలు లేకపోయినా అప్పట్లో నిర్మించిన రాయ కాలువ నాటి అద్భుతమైన ప్రతిభకు సాక్ష్యంగా నిలుస్తోంది.

అగ్నిప్రమాదంలో కార్మికుడు సజీవదహనం

- బెళగావి నగరంలో ఘోరం

హుబ్లీ: ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ కార్మికుడు సజీవదహనం కాగా ఇతర కార్మికులు ప్రాణాలతో బయట పడ్డారు. వివరాలు.. బెళగావిలోని ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో బెళగావి మార్కండేయనగర నివాసి యల్లప్ప గూడ్యగోళ (20) మృతి చెందినట్లుగా తెలిసింది. స్నేహ టిస్కో టిప్ కంపెనీ ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి జరిగిన ఈ అగ్నిప్రమాదం వేళ కొందరు కార్మికులు లోపలే ఉన్నారు. మంటలు చెలరేగగానే కార్మికులు తలో దిక్కుకు పారిపోయారు. కానీ యల్లప్ప తప్పించుకొనే ప్రయత్నంలో లిఫ్ట్‌లో చిక్కుకొని మృత్యువాత పడ్డారు. ఘటన స్థలాన్ని, కార్మికుడి మృతదేహాన్ని జిల్లా డీహెచ్‌ఓ డాక్టర్ మహేష్ నేతృత్వంలో ఫోరెన్సిక్ అధికారులు పరిశీలించారు. 5 ఎకరాల్లో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో ఈ ఫ్యాక్టరీ మూడు అంతస్తుల్లో నిర్మించారు. యల్లప్ప లిఫ్ట్‌లో కిందకు దిగి వస్తుండగా విద్యుదాఘాతం వాటిల్లి నిప్పు రాజుకోవడంతో ఆయన బయటకు రావడానికి సాధ్యం కాలేదని తోటి కార్మికులు తెలిపారు. ఈ ఘోర అగ్నిప్రమాదంలో మంటలు ఆర్పడానికి సంబంధిత సిబ్బంది రాత్రంతా ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. బుధవారం రాత్రి 10 గంటల సుమారు ఆ కట్టడం గోడ కిటికీలను జేసీబీతో పగలగొట్టి లోనికి నీరు చిమ్మి అగ్నిని ఆర్పడానికి ప్రయత్నించారు. ఫ్యాక్టరీ చుట్టుపక్కల 10 కి.మీ. ప్రాంతంలో దట్టమైన మంటల పొగ, ప్లాస్టిక్ కాలిన వాసనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు మాస్కులు ధరించి ఎంతో కష్టపడి మంటలను ఆర్పేందుకు శ్రమించారు. మూడు అంతస్తుల ఈ కట్టడంలో చిన్న చిన్న కిటికీలు మాత్రమే ఉన్నాయి. సరైన వాకిళ్లు లేవు. నాలుగు వైపులా ఎత్తైన గోడలు ఉన్నందు వల్ల మంటలు ఆర్పడానికి ఎంతో ఆటంకం కలిగింది. కాగా ఘటనలో తీవ్రంగా గాయపడిన బెళగావి తాలూకా కవళవాడి మారుతీ నారాయణ కర్వేకర్(32), జూనే బెళగావి యల్లప్ప ప్రకాష్ సలగుడే(35), రాజవాడి సందీప్ దశరథ(39)లను బెళగావి కేఎల్‌ఈ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

మొసలి కలకలం



మావినకెరె చెరువులో కనిపించిన మొసలి

రాయచూరు రూరల్: నగరంలో మొసలి ప్రత్యక్షం కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బుధవారం మావినకెరె చెరువులో మొసలి కనబడింది. దీంతో ఇందిరా నగర్, ఆజాద్ నగర్, ఐడీఎస్‌ఎంటీ కాలనీ, జహీరాబాద్, ఆకాశవాణి ఏరియా, యరగేర కాలనీ చుట్టు పక్కల నివాసాలున్న ప్రజలు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు వచ్చి గాలించి మొసలిని పట్టుకుని తరలించారు.

నకిలీ కాంట్రాక్టర్ అరెస్ట్

హుబ్లీ: నకిలీ ఎస్సీ కులధ్రువీకరణ పత్రం సమర్పించి టెండర్లు పొందిన ఓ కాంట్రాక్టర్‌ను బెళగావి జిల్లా చిక్కోడి పోలీసులు అరెస్ట్ చేశారు. ధార్వాడ మరాఠ కాలనీ నివాసి బాలకృష్ణ బసవరాజ చోళచగుడ్డ అరెస్ట్ అయిన నిందితుడు. చిక్కోడి గ్రామీణ తాగునీటి నైర్మల్య విభాగం ఏఈఈ ఈ కేసును దాఖలు చేశారు. గ్రామీణ తాగు నీరు, పారిశుధ్య విభాగం చిక్కోడి పరిధిలోని రాయబాగ తాలూకా అళకనూరు, అళకవాడి గ్రామాల్లో జలజీవన మిషన్ పథకం ద్వారా ఇళ్లకు నీటి కొళాయిలను అమర్చడానికి రూ.29.55 లక్షలు, అలాగే రూ.17.90 లక్షల మొత్తం టెండర్లను ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో పిలిచారు. దరఖాస్తు చేసిన బాలకృష్ణ ఆ మేరకు గత మార్చి 2న పనులు చేపట్టాలని ఆదేశం వచ్చింది. నకిలీ కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి టెండర్ పొందడంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారుల బృందం దర్యాప్తు చేసి సదరు కుల ధ్రువీకరణ పత్రం ఇతరులకు చెందిందని నివేదికలో పేర్కొంది. ఆ నివేదిక ఆధారంగా బాధ్యుడిపై చర్యలు తీసుకున్నట్లు ఆ జిల్లా జెడ్పీ సీఈఓ రాహుల్ షిండే తెలిపారు.

మేకెదాటుపై తమిళనాడుతో మాట్లాడండి

- సర్కారుకు కేంద్రమంత్రి కుమార సూచన



జన సందోహం మధ్య మాట్లాడుతున్న కుమారస్వామి

మండ్య: అధికారంలోకి వస్తే ఐదు నిమిషాల్లోనే మేకెదాటు పథకానికి అనుమతులు ఇప్పిస్తానని చెప్పిన మాట వాస్తవమేనని, అయితే మీ ఇండియా మిత్రకూటమిలోని తమిళనాడు ప్రభుత్వాన్ని ఒప్పించే బాధ్యత మీదే అన్న మాటను కూడా చెప్పానని, దీనిని ప్రస్తావించకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. ఆయన బుధవారం మండ్య నగరంలోని జేసీ సర్కిల్‌లో మైసూరు చలో పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. అన్నీ కేంద్రమే చేయలేదు, తమిళనాడు ముఖ్యమంత్రితో చర్చలు జరిపి ఒప్పిస్తే తాను ప్రధానితో మాట్లాడి ఒప్పిస్తానని చెప్పడం నిజమన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై ఆయన విమర్శల వర్షం కురిపించారు. 2017లో మా ఇంటి గడప తొక్కి మీరే ముఖ్యమంత్రి కావాలని ప్రాధేయపడింది ఎవరు? మీ వేధింపుల మధ్య కూడా తాను రైతుల రుణాలను మాఫీ చేశానని అన్నారు. గతంలో 20 నెలల పాటు తాను, యడియూరప్ప కలిసి రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వంలో మెరుగైన పాలన అందించినందునే తాను తిరిగి అధికారంలోకి వచ్చానన్నారు.

పితృ వియోగం.. కూతురు ఆత్మహత్య

బనశంకరి: మానసిక ఒత్తిడితో కేరళకు చెందిన యువతి పీజీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగరంలో కుమారస్వామిలేఔట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పీజీ హాస్టల్‌లో కేరళ యువతి అంజన (26) ఉంటోంది. ఇటీవల తండ్రి చనిపోవడంతో తీవ్ర వేదనకు లోనైంది. అప్పటి నుంచి తండ్రిని తలచుకుంటూ బాధపడేది. ఆమె ఈ నెల 3వ తేదీన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా, చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

నీటి తొట్టిలో మహిళ మృతదేహం

బన్నేరుఘట్ట సమీపంలో శిలీంద్రదొడ్డి బాలాజీ లేఔట్‌లో మహిళ మృతదేహం లభ్యమైంది. పాడుబడిన నీటి తొట్టిలో సుమారు 30 ఏళ్ల వయస్సుగల మహిళ శవం ఉంది. నాలుగైదు రోజుల కిందట హత్య చేసి తొట్టిలో పడేశారనే అనుమానాలున్నాయి. బన్నేరుఘట్ట పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు.

10 నుంచి ఫొటో ప్రదర్శన



వైపీఎస్ సభ్యులు తీసిన అందమైన ఫొటోలు



బనశంకరి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యూత్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో చిత్రకళా పరిషత్‌లో ఛాయాచిత్ర ప్రదర్శన కనువిందు చేయనుంది. ప్రతి ఏడాది ఆగస్టు 19వ తేదీన ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి చిత్రకళా పరిషత్‌లో రెండురోజుల పాటు ఫొటో ప్రదర్శన, వివిధ కార్యక్రమాలు జరుపుతారు. 10, 11 తేదీల్లో తేదీ ఉదయం 11 గంటలకు స్పైర్ ఇట్ అప్ పేరుతో వైపీఎస్ సభ్యులు తమ కెమెరాలతో బంధించిన ఫోటోలను ప్రదర్శిస్తారు. షూట్ షేర్ అండ్ విన్ కార్యక్రమంలో వివిధ వంటకాలను రమణీయంగా ఫొటోలు తీసి బహుమతులు గెలుచుకోవచ్చు. ఈ కార్యక్రమంలో అందరూ ఎలాంటి రుసుం లేకుండా పాల్గొనవచ్చని వైపీఎస్ అధ్యక్షుడు వీ.మంజు వికాస్‌శాస్త్రి, కార్యదర్శి ప్రేమ కాకడే తెలిపారు.





కోలారు వార్తలు...

కోలారులో కుండపోత వాన



అరహళ్లి అండర్‌పాస్‌లో చిక్కుకున్న కేఎస్ ఆర్టీసీ బస్సు



కీలుకోట అండర్‌పాస్‌లో చిక్కుకున్న కారు

- అండర్ పాస్‌లో చిక్కుకున్న బస్సు, కారు
- బయటకు తీసిన అగ్నిమాపక సిబ్బంది

కోలారు : నగరంలో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన వాన దాదాపుగా రెండు గంటల పాటు ఏకదాటిగా కురిసింది. భారీ వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అరహళ్లి రైల్వే అండర్‌పాస్‌లోకి నీరు చేరింది. ఆ సమయంలో కేఎస్ ఆర్టీసీ బస్సు నీటిలో చిక్కుకోగా అగ్నిమాపక సిబ్బంది వెళ్లి నీటిని తోడి బస్సును బయటకు తీశారు. ప్రయాణికులను సరక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. కీలుకోట వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్‌లో కారు చిక్కుకు పోగా స్థానికులు బయటకు తీశారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారి అండర్‌పాస్‌లలో భారీగా నీరు చేరి వాహన సంచారానికి తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కాగా వర్షాభావంతో విత్తనం వేయలేక రైతులు దిగాలు ఉన్న సమయంలో వర్షం కురవంతో వారిలో ఆశలు చిగురించాయి. విత్తనం వేయడానికి సిద్ధమవుతున్నారు.

భార్యను కడతేర్చి ఆత్మహత్య



తబ్రేజ్(ఫైల్)

కోలారు: భార్యను హత్యచేసి ఆత్మహత్యకు యత్నించిన భర్త చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కోలారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... సిద్దాపుర నివాసి తబ్రేజ్‌కు ఏడేళ్ల క్రితం బెంగుళూరు చామరాజ పేటకు చెందిన సయ్యద్ ఫాజల్ ఫాతిమాతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఫాతిమా (34) రెండు సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 2వ తేదీన తబ్రేజ్ తన మామ ఇంటికి వెళ్లి భార్యతో గొడవపడి కత్తితో పొడిచి హత్య చేసి ఉడాయించాడు. అనంతరం ఫేస్‌బుక్ లైవ్‌లో తన అత్త భార్యను నిందించాడు. ఇతని కోసం చామరాజపేట పోలీసులు గాలిస్తుండగా కోలారుకు వచ్చి బంధువుల ఇంటిలో తలదాచుకున్నాడు. పోలీసులు గాలిస్తున్నట్లు తెలుసుకొని మంగళవారం 12 అడగుల భవనం పై నుంచి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు మృతి చెందాడు. కోలారు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా శ్రావణమాస పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : నగరంలోని బసవేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం నాగలాపురం గ్రామ శ్రీమద్ వీరధర్మ సంస్థాన మఠం స్వామీజీ ఆధ్వర్యంలో 12వ సంవత్సరం శ్రావణ మాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఇష్ట లింగానికి పూజలు నిర్వహించారు.

బసవేశ్వర భక్త మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

హర్మన్ మోగ్లింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



పాత్రికేయులను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు : జర్మనీ నుంచి 1811 సంవత్సరంలో క్రైస్త ధర్మం ప్రచారం కోసం కన్నడ నాడుకు వచ్చిన హర్మన్ మోగ్లింగ్ మంగళూరు సమాచార పత్రిక ద్వారా మొదటి కన్నడ పత్రికను స్థాపించడంతో పాటు కర్ణాటక ఏకీకరణలో తనదైన పాత్రను పోషించారని బెంగుళూరు ఉత్తర విశ్వ విద్యాలయం కులపతి డాక్టర్ నిరంజన వానళ్లి తెలిపారు. తాలూకాలోని మంగసంద్ర బెంగుళూరు ఉత్తర విశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రంలో సమాచార శాఖ, జిల్లా పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పత్రికా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోగ్లింగ్ బాసిల్ పత్రికా రంగానికి అందించిన సేవలను కొనియాడారు. నేటి పాత్రికేయులకు ఆయన ఆదర్శప్రాయుడన్నారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు ఎంజీ ప్రభాకర్, హెచ్‌కే రాఘవేంద్రలను సన్మానించారు. పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, సమాచార శాఖ అధికారి చేతన్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో ప్రపంచ స్థాయికి చేరుకోవచ్చు



విజేతకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్

పావగడ: ప్రపంచ స్థాయికి చేరుకునే శక్తి కేవలం క్రీడా రంగం లోనే ఉందని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. తన తండ్రి మాజీ మంత్రి వెంకటరమణప్ప హయాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. ఆడిటోరియం, తరగతి గదుల నిర్మాణాలను త్వరలోనే చేపడతానన్నారు. ఈ సందర్భంగా అంతర్ విశ్వవిద్యాలయాల ఎగుడు దిగుడు ప్రాంతాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో విజయం సాధించిన పావగడకు చెందిన భరత్ తదితర క్రీడాకారులకు ట్రోఫి అందించారు. రూ. 5 వేలు ప్రోత్సాహక ధనం అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరువులో ఇద్దరు కార్మికుల అనుమానాస్పద మృతి

బళ్లారి రూరల్ : జిల్లాలోని తోరణగల్లులోని జిందాల్ విద్యానగర్ చెరువులో అనుమానాస్పద రీతిలో ఇద్దరు కార్మికుల మృతదేహాలు లభ్యమైన ఘటన బుధవారం వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. ఉత్తరాఖండ్‌కు చెందిన దీపక్‌సింగ్(27), నేపాల్‌కు చెందిన రాణాబహదూర్ (35) అనే వ్యక్తులు జిందాల్ విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో కార్మికులుగా పని చేస్తున్నారు. వీరిరువురి మృతదేహాలు విద్యానగర్ చెరువులో లభ్యమయ్యాయి. ఈ ఘటనపై మృతుల సంబంధీకుల సమాచారం మేరకు తోరణగల్లు పోలీసులు అనుమానాస్పద మృతులుగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

బాలుడి ఆత్మహత్య

కోలారు: బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి ముళబాగిలు నగరంలోని పూల్ చంద్ లేఔట్‌లో చోటు చేసుకుంది. తాలూకాలోని చిక్కనహళ్లి గ్రామ నివాసి మురళి తన కుటుంబంతో కలిసి నగరంలోని ముత్యాల పేటలో నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు గిరిధర్ (14) నగర సమీపంలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకున్నాడు. తర్వాత ఇంటిలోకి వెళ్లి వేల్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడు ఆత్మహత్య చేసుకోవడానికి కారణం తెలియరాలేదు. నగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అవార్డుకు ఎంపిక



విశ్వనాథ సింగ్

శ్రీనివాసపురం: పట్టణంలోని సీనియర్ ఛాయాగ్రాహకుడు, తాలూకా కార్యనిరత ఛాయాచిత్ర గ్రాహకుల క్షేమాభివృద్ధి సంఘం ట్రస్టు అధ్యక్షుడు విశ్వనాథ్ కర్ణాటక ఛాయాచిత్ర గ్రాహకుల సంఘం అందజేసే రాష్ట్ర స్థాయి ఛాయా భూషణ అవార్డుకు ఎంపికయ్యారు. బెంగుళూరులోని కన్నడ సాహిత్య పరిషత్ సభాంగణంలో విశ్వ ఛాయాగ్రాహణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 19వ తేదీన అవార్డు ప్రదానం చేయనున్నారు.

ప్రామాణికంగా విధులు నిర్వహించాలి



జడ్జి బీకే మనును సన్మానిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: ఉద్యోగులు ప్రామాణికంగా విధులు నిర్వహించాలని జేఎఫ్‌సీఎం ప్రధాన జడ్జి బీకే మను అభిప్రాయపడ్డారు.బదిలీపై వెళ్తున్న జడ్జిని పట్టణంలోని కోర్టు ఆవరణలో తాలూకా న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. జడ్జి మాట్లాడుతూ కేసులను త్వరగా పరిష్కరించాలని కొన్నిసార్లు న్యాయవాదులపై ఒత్తిడి తెస్తుంటామని, కక్షిదారులకు సత్వర న్యాయం లభించాలనేదే ఇందులో ప్రధాన ఉద్దేశమన్నారు. తన విధి నిర్వహణ ఎంతో సంతృప్తిని నిచ్చిందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జయరామేగౌడ, డిప్యూటీ న్యాయమూర్తి హెచ్‌ఎన్ సచిన్, న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు టి వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

25 మినీ పట్టు పార్కుల ఏర్పాటు

- మంత్రి శివానంద పాటిల్

శివాజీనగర: చేనేతలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో 25 మినీ పట్టు పార్కులు స్థాపించాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర పట్టు, వ్యవసాయ మార్కెట్ శాఖ మంత్రి శివానంద ఎస్.పాటిల్ తెలిపారు. చేనేత, పట్టు శాఖ, చేనేత అభివృద్ధి మండలి, కావేరి హ్యాండ్లూమ్స్, చేనేతకారుల సేవా కేంద్రం ద్వారా విధానసౌధ బ్యాంక్వెట్ హాల్‌లో బుధవారం నిర్వహించిన 10వ జాతీయ చేనేత దినాచరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సిబ్బందికి ఇచ్చే యూనిఫాం తయారీకి చేనేత వస్త్రాలు వినియోగించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పట్టుశాఖకు రూ.181 కోట్లు ఇచ్చామని తెలిపారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న అలజడి కారణంగా పట్టు ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉందన్నారు. దీంతో భారత్ నుంచి ఎగుమతులు పెరుగుతాయన్నారు. అనంతరం విధానపరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి మాట్లాడారు. తర్వాత చేనేతకారులకు నగదు బహుమతి ఇచ్చి సన్మానించారు.

నమ్మ మెట్రో రికార్డు

- ఒకేరోజు 8.26 లక్షల మంది ప్రయాణం



శివాజీనగర: నమ్మ మెట్రోలో రోజు రోజుకు ప్రయాణీకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మంగళవారం ఆగస్టు 6న పచ్చ, నేరేడు మార్గంలో 8, 26, 883 మందికి పైగా ప్రయాణించడంతో కొత్త రికార్డు నమోదైందని నమ్మ మెట్రో వెల్లడించింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నమ్మ మెట్రో ప్రయాణానికి అనుకూలంగా చేసుకున్నందుకు, వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్ ప్రమాణం తగ్గించే దిశలో నమ్మమెట్రోలో ప్రయాణించినందుకు ప్రయాణికులకు మండలి ధన్యవాదాలు తెలియజేసింది.

విచారణకు ఈడీ పిలుపు

బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణంలో రెండోదశ విచారణకు రావాలని కూనం రెడ్డి వెంకటరెడ్డి అనే వ్యక్తికి ఈడీ అధికారులు మరోసారి నోటీస్ జారీచేశారు. రాయచూరు జిల్లా సింధనూరు తాలూకా బూదిహాళ క్యాంప్‌లో ఉన్న కూనంరెడ్డి వెంకటరెడ్డి కుటుంబానికి ఈ స్కాంలో మండలి నిధుల నుంచి నగదు బదిలీ జరిగినట్లు తెలిసింది. ఇప్పటికే అతనిని ఒకసారి ఈడీ విచారించింది. మళ్లీ రావాలని ఈడీ నుంచి పిలుపు పంపింది.

ధనం కన్నా జ్ఞానం ముఖ్యం



విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

కృష్ణరాజపురం: విద్యార్థి దశలో ఐదేళ్ల పాటు కఠోర సాధన చేస్తే తమ 50 ఏళ్ల జీవితం బంగారు బాట పడుతుందని రిటైర్డ్ లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే పేర్కొన్నారు. ఆయన హొసకోటెలోని అంబేడ్కర్ భవన్‌లో ముజామిల్ అధ్యక్షతన డివైన్ సర్వీస్ ఫర్ ఎవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 400 మంది టెన్త్, పీయూసీ ప్రతిభాన్విత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. మనిషికి డబ్బు, ఆస్తి, ఐశ్వర్యాలతో ప్రశాంతత లభించదని, చదువు, జ్ఞానమే ఎక్కువ తృప్తిని కలిగిస్తాయని అన్నారు. డీఎస్ఎఫ్ అధ్యక్షుడు ముజామిల్, జీఎస్టీ కమిషనర్ రఫిక్ పాషా, ఇంతియాజ్ పాషా, హరీంద్ర, ఖదీర్ అహమద్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై శిబిరం

గౌరిబిదనూరు: మహిళలు స్వయం ఉపాధి పొందేలా ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ తాలూకాలోని అలీపురంలో శిబిరం ఏర్పాటు చేసింది. ఆ సంస్థ ప్రాజెక్ట్ అధికారి నాగరాజనాయక్, జిల్లా స్థాయి అధికారి రమేశ్ మాట్లాడుతూ ఇలాంటి శిబిరాల్లో శిక్షణ పొందిన అనేక మంది మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తున్నారన్నారు. అవసరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి లభించే మార్గాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి మనోజ్‌రావ్, జీపీ అధ్యక్షురాలు నాగరత్నమ్మ, జ్ఞాన వికాస కార్యక్రమాల సమన్వయ అధికారి అశ్విని,నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కారులో రొమాన్సు

యశవంతపుర: ఉడుపి నగరంలో పట్టపగలే కారులో అనైతిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న జంట ప్రజలకు చిక్కిన ఘటన బుధవారం జరిగింది. కవి ముద్దణ్ణ మార్గంలో చిత్తరంజన్ సర్కిల్ రోడ్డులో చిన్నపిల్లల ఆస్పత్రి ఎదురుగా కారును నిలిపి జంట శృంగారంలో మునిగి ఉండగా ప్రజలు చూసి కసురుకోవడంతో యువతీ యువకుడు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. కొందరు వీరి నిర్వాకాన్ని మొబైళ్లలో బంధించారు. కారు అద్దాలకు నల్ల బట్టను కట్టుకొని ఈ పని చేస్తున్నారు. కారు వారం రోజుల నుంచి అక్కడే అనుమానాస్పదంగా నిలిపి ఉంచినట్లు స్థానికులు తెలిపారు.

దక్షిణ కాశీ.. సౌకర్యాలు నాస్తి

- నంజనగూడు శ్రీకంఠేశ్వరుని సన్నిధిలో సదుపాయాల కొరత
- అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై భక్తుల అసంతృప్తి
- మౌలిక సదుపాయాలు కల్పించాలి
- కానుకలతోపాటు లేఖలు రాసి హుండీలో వేసిన భక్తులు



భక్తుడు రాసిన లేఖ, హుండీ లెక్కిస్తున్న దృశ్యం



శ్రీకంఠేశ్వర రథోత్సవం(ఫైల్)



భక్తుడు రాసిన మరో లేఖ

మైసూరు: దక్షిణ కాశీగా పేరొందిన నంజనగూడులోని శ్రీకంఠేశ్వరుని సన్నిధిలో మౌలిక సౌకర్యాలు కొరవడినట్లు భక్తులు ఆక్రోశం వ్యక్తం చేశారు. కొందరు భక్తులు రూ.100 కానుకల డబ్బుతో పాటు లేఖలను రాసి హుండీలో వేసి అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యంపై అసంతృప్తి వెళ్లగక్కారు. హుండీ లెక్కింపు సందర్భంగా ఈ విషయం వెలుగు చూసింది. శ్రీకంఠేశ్వర స్వామీ...మీ దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని లేఖల ద్వారా వేడుకుంటున్నట్లు భక్తులు అందులో పేర్కొన్నారు. ప్రతి నెలా నిర్వహించే హుండీ లెక్కింపు సందర్భంగా ఇలాంటి అనేక లేఖలు భక్తుల నుంచి అందుతున్నాయి. ఈసారి 150కి పైగా లేఖలు లెక్కింపులో లభించాయి. బెంగళూరు, మండ్య, కేఎం దొడ్డిలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి చిరునామాలతో లేఖలు రాసిన భక్తులు ఆ లేఖలకు రూ.500, రూ.100, రూ.50 నోట్లను చుట్టి తమ ఆవేదనను వినిపించారు. ప్రతి నెలా కోట్లాది రూపాయల కానుకలను హుండీలో వేస్తుంటే పేద భక్తులకు ఎందుకు సౌకర్యాలు కల్పించడం లేదని ఓ భక్తుడు ప్రశ్నించాడు. పేద భక్తుల వాస్తవ్యానికి తగిన వ్యవస్థ లేదని, కపిలా నది ఒడ్డున భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వ్యవస్థ లేదని పేర్కొన్నారు. భక్తులు అందించే కానుకలతో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. భక్తుల విజ్ఞప్తులపై ఇకనైనా సంబంధిత ఆలయ పాలక మండలి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

హుండీల్లో రూ.1.13 కోట్ల కానుకలు

కాగా మంగళవారం శ్రీకంఠేశ్వరుని ఆలయంలోని 35 హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. రూ.1,12,92,000 నగదు, 51 గ్రాముల బంగారు, 1.800 కేజీల వెండి, 46 విదేశీ కరెన్సీ లభించాయని ఆలయ వర్గాలు తెలిపాయి.

స్వాతంత్ర్యదిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ తుషార్‌గిరినాథ్

బనశంకరి: బెంగళూరులోని మాణిక్‌షా పరేడ్ మైదానంలో నిర్వహించనున్న స్వాతంత్ర్యదినానికి ఏర్పాట్లు ఘనంగా చేయాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ అధికారులకు సూచించారు. పాలికె కేంద్రకార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఆసనాలు వ్యవస్థ, ప్రవేశ ద్వారాలు, వాహనాల పార్కింగ్ వంటి వాటి విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. తోపులాటకు ఆస్కారం లేకుండా బారికేడ్లు ఏర్పాటుచేయాలని, మైదానంలో స్వచ్ఛతను కాపాడాలని సూచించారు. అవయవ దానం చేసే 80 మందిని సన్మానించి సర్టిఫికెట్లు అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రత్యేక కమిషనర్ అవినాశ్‌మెనన్ రాజేంద్రన్, ప్రీతిగెహ్లాట్, వలయ కమిషనర్లు స్నేహల్, వినోత్‌ప్రియా, రమ్య, జిల్లా కలెక్టర్ దయానంద్, డిప్యూటీ కమిషనర్ మంజునాథస్వామి, పోలీస్‌శాఖ, జలమండలి, కన్నడ సంస్కృతి, ప్రజాపనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సిద్దు.. స్థలాలు వెనక్కి ఇచ్చెయ్

- ఆయనో అవినీతి సీఎం
- పాదయాత్రలో బీజేపీ నేతల ధ్వజం

మండ్య: సిద్దరామయ్య అవినీతి సీఎం అని, రూ.5 లక్షలు పెట్టి భూమి కొనుగోలు చేసి ఇప్పుడు రూ.62 కోట్లను అడగడం లూటీ కాదా? అని అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర దుయ్యబట్టారు. బుధవారం మండ్య జేసీ సర్కిల్‌లో మైసూరు చలో పాదయాత్రలో మాట్లాడారు. పేదలకు ఇవ్వాల్సిన స్థలంలో పసుపు కుంకుమ కింద 14 సైట్లను పొందిన ముఖ్యమంత్రికి దరిద్రం పట్టిందా? అని నిలదీశారు. బీజేపీ, జేడీఎస్ వాళ్లు తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారంటున్న సీఎం సిద్దరామయ్య ఆయనకు వెన్నుపోటు పొడిచేవారిని పక్కనే కూర్చోబెట్టుకున్నారన్నారు.

బీజేపీ ప్రభుత్వ హయాంలోనే కేటాయింపులు జరిగాయంటున్న అధికార పార్టీ వారు నాడు ప్రతిపక్షంలో ఉండగా నిద్రపోయారా? అప్పుడే ఎందుకు మాట్లాడలేదు? అని ప్రశ్నించారు. తమ పోరాటం సిద్దరామయ్య లూటీపైనే అని, ఆ సైట్లను వాపసు చేయాలన్నారు. మాజీ మంత్రులు కే.గోపాలయ్య, డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, సీఎస్ పుట్టరాజు, కేసీ నారాయణగౌడ, ఎమ్మెల్యే అరవింద బెల్లద, ఛలవాది నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు సురేష్‌గౌడ, శ్రీకంఠేగౌడ, పి.రాజీవ్, డాక్టర్ కె.అన్నదాని తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, జేడీఎస్ కార్యకర్తల గొడవ

పాదయాత్రలో బీజేపీ నేత ప్రీతంగౌడకు మద్దతుగా కొందరు నినాదాలు చేయడంతో జేడీఎస్ కార్యకర్తలు గొడవ చేశారు. జేడీఎస్ నేత నిఖిల్ కుమారస్వామి మాట్లాడబోతుండగా కొందరుప్రీతంగౌడకు మద్దతుగా నినాదాలు చేశారు. రెచ్చిపోయిన జేడీఎస్ కార్యకర్తలు వెంటనే ఆ నినాదాలు ఆపాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు గందరగోళం నెలకొంది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు

- 1200 నర్సుల పోస్టులు కూడా
- వైద్య విద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్

శివాజీనగర: వైద్య శాఖ పరిధిలో 650 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 1200 నర్సుల పోస్టులను కర్ణాటక పరీక్షా ప్రాధికార ద్వారా భర్తీ చేయాలని వైద్యవిద్యా మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ అధికారులకు సూచించారు. వికాససౌధలో బుధవారం ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 వైద్య కాలేజీలు, 11 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు వైద్యవిద్య కిందకు వస్తాయన్నారు. నియామక ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి కేఈఏకు అవసరమైన సహకారం ఇవ్వాలని ఆదేశించారు. కేఈఏ ద్వారా నర్సుల నియామకానికి రెండు సంవత్సరాల క్రితమే ప్రతిపాదనలు అందాయని, సీ అండ్ ఆర్ నియమాలు, రోస్టర్ సిస్టమ్ లేకపోవటంతో పరీక్ష జరపటం కష్టమని కేఈఏ సమాధానమిచ్చిందనే సమాచారాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నర్సుల నియామకాల్లో సీ, ఆర్ నిబంధనలు అనుసరించాలని వైద్యవిద్యా శాఖ డైరెక్టర్ సుజాతా రాథోడ్, జాయింట్ కార్యదర్శికి మంత్రి సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యాయమూర్తుల తనిఖీలు



కేంద్రం నిర్వహణపై ఆరా తీస్తున్న జడ్జీలు

మైసూరు: నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన జిల్లా సెషన్స్ జడ్జి రవీంద్ర హెగ్డే, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సభ్య కార్యదర్శి దినేష్‌తో కలిసి తనిఖీ చేశారు. మౌలిక సౌకర్యాల కొరతపై ఆరా తీశారు. చాలా కేంద్రాలు శిథిల భవనాల్లో కొనసాగుతుండగా గాలి, వెలుతురు, నీటి వ్యవస్థ లేమితో కొట్టుమిట్టాడుతుండటాన్ని గమనించి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. పిల్లలకు అందించే ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, సూపర్‌వైజర్లకు కేంద్రాలను ఎలా నిర్వహించాలో వివరించారు. కేంద్రాల్లో పీహెచ్‌సీ వైద్యులు, నర్సులు, పోలీసు, మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, జిల్లా న్యాయ సేవా ప్రాధికారం ఫోన్ నంబర్లను ప్రకటించాలని సూచించారు.

దర్శన్ బట్టలపై రక్తపు మరకలు

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో ఇప్పటికే జైల్లో ఉన్న ప్రముఖ హీరో దర్శన్‌కు ఉచ్చు బిగుస్తున్నట్లు ఉంది. ప్రతి సాక్ష్యం దర్శన్‌ను శిక్షకు దగ్గర చేస్తోంది. తాజాగా రేణుకాస్వామి రక్తపు మరకలు దర్శన్ దుస్తులపై గుర్తించబడ్డాయి. దర్శన్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న నీలం రంగు జీన్స్ ప్యాంట్, బ్లాక్ టీ షర్ట్‌పై రేణుకాస్వామి రక్తం చిందినట్లు పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్ పరీక్షల్లో గుర్తించారు.

పోలీసులు సతమతం

రేణుకాస్వామి హత్య కేసు దర్యాప్తు పోలీసులకు కత్తిమీద సాములా మారింది. ఒత్తిళ్లు, దర్శన్ అభిమానులతో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో స్పెషల్ కోర్టు లేదా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ త్వరగా చేపట్టాలని కోర్టు అధికారులను కోరాలనే యోచనలో పోలీసు అధికారులు ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు దర్శన్ అండ్ గ్యాంగ్ మొత్తం 17మందిని అరెస్ట్ చేశారు. అన్ని రకాల సాక్ష్యాధారాలు సేకరించారు. కోర్టుకు చార్జ్ షీట్ సమర్పించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

రాజకీయాలను సేవగా భావించాలి



మాట్లాడుతున్న సా.రా.మహేష్

మైసూరు: చాలా మంది రాజకీయాలనే ఉపాధిగా చేసుకుని సమాజ కంటకులుగా మారారని జేడీఎస్ కార్యాధ్యక్షుడు, మాజీ మంత్రి సా.రా.మహేష్ అన్నారు. కన్నడ నేగిలయోగి సమాజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మైసూరు నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజకీయాలను సేవగా భావించి ప్రజల సంక్షేమానికి పాటుపడాలన్నారు. రాజకీయాలను సంపాదనమార్గంగా చేసుకోవడం వల్ల సామాన్య ప్రజల్లో రాజకీయ నాయకులపై అసహ్యం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో మైసూరు ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.విశ్వనాథ్, ముడా మాజీ అధ్యక్షులు యశస్విని సోమశేఖర్, కేఎస్ఎస్ఎఫ్‌ఐ జాయింట్ డైరెక్టర్ సతీష్, రాష్ట్ర ఒక్కలిగుల సంఘం డైరెక్టర్ మంజేగౌడ, నేగిలయోగి మహిళా క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షురాలు శోభా రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్... చోరీ సొత్తు స్వాధీనం



నిందితుడు తిమ్మప్ప



నిందితుడు హుచ్చ తిమ్మ

తుమకూరు: ఇంటికి కన్నాలు వేసి చోరీలకు పాల్పడుతున్న హొసదుర్గ తాలూకా గంజిగెరె గ్రామానికి చెందిన తిమ్మప్ప అలియాస్ యాడ్ తిమ్మ(56), తిమ్మ ఎం.అలియాస్ హుచ్చ తిమ్మ(45) అనే ఇద్దరిని చిక్కనాయకనహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.4.725 లక్షల విలువ చేసే 70 గ్రాముల బంగారు, రూ.17,500 విలువ చేసే 250 గ్రాముల వెండి సామగ్రిని స్వాధీనపరచుకున్నారు. జూలై 8న రాత్రి చిక్కనాయకనహళ్లి తాలూకా కందికెరె ఫిర్కా సాదరనహళ్లి గ్రామానికి చెందిన మహాలక్ష్మి అనే మహిళ ఇంటితో పాటు ఐదు ఇళ్లలో నిందితులు దోపిడీకి పాల్పడ్డారు. జిల్లా ఎస్పీ కేవీ అశోక్, ఏఎస్పీలు మరియప్ప, ఖాదర్ మార్గదర్శనంలో తిపటూరు డీఎస్పీ, సీఐ, ఇన్‌స్పెక్టర్లు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

వయనాడ్ బాధితులకు చేయూత



లారీని ప్రారంభిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

యశవంతపుర: వయనాడ్ జరిగిన జలవిలయంలో సర్వం కోల్పోయిన ప్రజలకు, కొడగు జిల్లాలో వరద బాధితులకు మైసూరు ఎలక్ట్రికల్ పరిశ్రమ అండగా నిలిచింది. బాధితులను ఆదుకునేందుకు ఆ సంస్థ సేకరించిన నిత్యావసరాలను బుధవారం బెంగళూరు నుంచి కేరళకు, కొడగుకు తరలించారు. లారీలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు ప్రజలు సహకారం అందించాలన్నారు. బీజేపీ అవాస్తవాలను ప్రచారం చేసేందుకు పాదయాత్ర చేపట్టిందని ఆయన విమర్శించారు. సీఎంకు గవర్నర్ నోటీసులివ్వటం వెనుక కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి ఉందని ఆరోపించారు. మైసూరు ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు ఎస్ మనోహర్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో బ్లాక్‌మెయిల్

- డోర్ డెలివరీ బాయ్ అరెస్ట్

బనశంకరి: విద్యార్థినిని బ్లాక్‌మెయిల్ చేసి 75 గ్రాములు బంగారు ఆభరణాలు కాజేసిన డోర్ డెలివరీ బాయ్‌ను సుబ్రహ్మణ్యపుర పోలీసులు అరెస్ట్‌చేశారు. సుబ్రమణ్యపుర నాయుడు లేఔట్ నివాసి తేజస్ ఓ సంస్థలో డోర్ డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడు. చిక్కలసంద్రకు చెందిన ఓ విద్యార్థినితో పరిచయమైంది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. యువతితో ఫొటోలు తీసుకున్నాడు. ఇంట్లోని బంగారు నగలు తెచ్చి ఇవ్వాలని, లేదంటే ప్రేమ విషయం ఇంటిలో చెబుతానని ఆమెను బెదిరించాడు. భయపడిన యువతి 75 గ్రాములు బంగారు నగలు, రూ.1.25 లక్షలు సమర్పించింది. కాగా ఇంటిలో ఉన్న నగలు కనిపించకపోవడంతో యువతి తల్లి ఆరా తీసింది. జరిగిన ఘటన గురించి తెలుసుకొని సుబ్రహ్మణ్యపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడు తేజస్‌ను బుధవారం అరెస్ట్ చేశారు. 50 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

హంతక దత్తపుత్రుడు

- జీవితఖైదు శిక్ష

మైసూరు: తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని పెంపుడు తల్లిని చంపిన తనయునికి మైసూరు 6వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జీవితఖైదు శిక్ష విధించింది. వివరాలు.. జిల్లాలోని పిరియాపట్టణ తాలూకా బైలుకుప్పె వద్ద గుట్టేనహళ్లి గ్రామంలో సూసై మేరి అనే మహిళ ఓ శిశువును దత్తత తీసుకుని అతనికి మార్టిన్ దేవస్ అనే పేరు పెట్టి పెంచి పెద్ద చేసింది. అతడు పెయింటింగ్ పని చేస్తూ దురలవాట్ల బారిన పడి తరచు డబ్బు కోసం తల్లిని వేధిస్తుండేవాడు. డబ్బులివ్వకపోతే తిట్టడం, కొట్టడం చేసేవాడు. 2022 జూన్ 28న సాయంత్రం 4 గంటల సమయంలో తన తల్లికి వచ్చిన వృద్ధాప్య వేతనం సొమ్మును తాగుడుకు ఇవ్వాలని అడిగాడు. ఆమె నిరాకరించింది. తనకు తాగుడుకు డబ్బులివ్వడం లేదని తన తల్లిపై ద్వేషం పెంచుకున్న మార్టిన్ కోపోద్రేకంతో మచ్చుకత్తితో దాడి చేసి చంపేశాడు. కేసు దర్యాప్తులో నిందితునిపై నేరారోపణ రుజువు కావడంతో బైలుకుప్పె పోలీసు స్టేషన్ ఎస్ఐ ప్రకాష్ కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. కేసు విచారణ చేపట్టిన మైసూరు 6వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పీజీ సోమశేఖర్ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

హోసూరు వార్తలు..

ఎప్పుడైనా కూలిపోయేలా పాఠశాల

- చదువుకోలేమంటూ విద్యార్థుల ధర్నా



ప్రమాదకర స్థితిలో ఉన్న తరగతి గది

కెలమంగలం: శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే స్థితిలో ఉన్న పాఠశాల కట్టడాన్ని తొలగించి పక్కా భవనం నిర్మించాలని విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వివరాలు.. డెంకణీకోట తాలూకా ఇరుదుకోట పంచాయతీ గిరియనపల్లి గ్రామంలో ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలను నిర్వహిస్తున్నారు. వంద మందికి పైగా బాల బాలికలు చదువుతున్నారు. ఈ పాఠశాలను గత కామరాజర్ కాలంలో నిర్మించారు. 2004లో మరో భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం పాఠశాల శిథిలావస్థకు చేరుకొంది. పైకప్పు రేకులు విచ్ఛిన్నమయ్యాయి. ఎండా, వానల మధ్య చదువుకోవాల్సి వస్తోందని బాలలు ఆవేదన చెందారు. గదుల్లో కూర్చోలేకపోతున్నారని, ఎప్పుడు కూలుతుందో తెలియలేదని, ప్రాణహాని జరిగే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. విద్యాశాఖ అధికార్లకు తెలిపినా పట్టించుకోవడం లేదని, గత రెండు రోజుల క్రితం పాఠశాల మరుగుదొడ్డి కూలిపోయిందని, సెలవు రోజు కావడంతో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పిందని అన్నారు. వెంటనే పాఠశాలకు పక్కాభవనం నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డెంకణీకోట- అంచెట్టి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. డెంకణీకోట పోలీసులు, సంబంధిత శాఖాధికార్లు వచ్చి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో బాలలు ఆందోళన విరమించుకొన్నారు.

ఒంటి ఏనుగు రచ్చ



అంచెట్టి అటవీ ప్రాంతంలో రోడ్డుపై సంచరిస్తున్న ఒంటి ఏనుగు

కెలమంగలం: అంచెట్టి సమీపంలో రోడ్డుపై ఒంటి ఏనుగు సంచరిస్తూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత కొద్దిరోజులుగా స్వైర విహారం చేస్తూ రైతులకు, వాహనదారులకు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలను భయానికి గురిచేస్తోంది. అటవీ శాఖాధికార్లు చర్యలు చేపట్టి ఒంటి ఏనుగును దట్టమైన అటవీ ప్రాంతానికి మళ్లించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం డెంకణీకోట- అంచెట్టి రోడ్డులో సూది కొండలు ప్రాంతంలోని మలుపులో ఒంటి ఏనుగు ధీమాగా తిరుగుతూ వాహనదారులను అడ్డుకుంది. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాలకెళ్లి సాయంత్రం గ్రామాలకెళ్లేందుకు భయపడుతున్నామని ప్రజలు వాపోయారు.

కరెంటు షాక్‌తో యువకుడు మృతి



రుద్రమూర్తి (ఫైల్)

క్రిష్ణగిరి: విద్యుత్ మోటర్‌కు అమర్చిన పైపును తాకడంతో షాక్ కొట్టి యువకుడు మరణించాడు, ఈ దుర్ఘటన వేపనపల్లి వద్ద జరిగింది. వివరాల మేరకు వేపనపల్లి సమీపంలోని తిమ్మనపల్లి గ్రామానికి చెందిన రుద్రమూర్తి (18) సూళగిరి సమీపంలోని పిఎంసి కళాశాలలో బిఎస్సీ ఫస్టియర్ చదువుతున్నాడు. బుధవారం గ్రామపంచాయతీకి తాగునీటిని సరఫరా చేసే విద్యుత్ మోటర్‌వద్దకెళ్లి పైపును తాకాడు. దానికి కరెంటు ఉండడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వేపనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యుత్, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నిండుప్రాణం పోయిందని స్థానికులు ఆరోపించారు. పైప్‌కి కరెంటు సరఫరా వస్తున్నా మరమ్మతులు చేయలేదని చెప్పారు.

గౌరిబిదనూరులో చెలరేగిన దొంగలు



రాఘవేంద్ర స్టోర్స్ ముందు గుమికూడిన ప్రజలు

గౌరిబిదనూరు: పట్టణంలో దొంగలు చెలరేగారు. మంగళవారం రాత్రి వరుస చోరీలకు పాల్పడ్డారు. ప్రైవేటు బస్టాండు సమీపంలో రాఘవేంద్ర, చేతన్‌లు నిర్వహిస్తున్న రాఘవేంద్ర స్టోర్స్ దుకాణంలోకి ముగ్గురు ముసుగు దొంగలు చొరబడి సీసీ కెమెరాలను పక్కకు తిప్పి గల్లా పెట్టెలో నగదు చోరీ చేశారు.

అనంతరం సమీపంలోని గణపతి ఆలయ తాళాలను పగులకొట్టి లోపలకు వెళ్లి హుండీని తీసుకెళ్లారు. అనంతరం మరో దుకాణంలో చోరీకి యత్నించి విఫలమై వెనుదిరిగారు. కాగా చోరీకి గురైన ఆలయ హుండీలో రూ. 10 వేలు ఉంటుందని అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉదయం టౌన్ పోలీసులు వచ్చి చోరీ జరిగిన ప్రదేశాలను పరిశీలించారు.

ఆటోడ్రైవర్ రౌడీయిజం



అనుచితంగా ప్రవర్తిస్తున్న ఆటో డ్రైవర్

కృష్ణరాజపురం: బెంగళూరులో ఓ ఆటో డ్రైవర్ కారు డ్రైవర్ ముఖంపై ఉమ్మి అనుచితంగా ప్రవర్తించి రౌడీయిజానికి పాల్పడ్డాడు.ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మారతహళ్లి యమలూరు సిగ్నల్ వద్ద సోమవారం చిన్న కారణానికి కారు, ఆటో డ్రైవర్ల మధ్య వాగ్వాదం చెలరేగింది. కోపోద్రిక్తుడైన ఆటో డ్రైవర్ కారు అద్దం పగులగొట్టాడు. వీడియో రికార్డింగ్ చేస్తుండటాన్ని గమనించి కారు డ్రైవర్ ముఖంపై ఉమ్మివేశాడు. విద్యార్థులు ఆటోలో ఉండగానే ఆటో డ్రైవర్ ఇలా అనుచితంగా ప్రవర్తించాడు. కారు డ్రైవర్ అలెక్స్ బోబివెంపల ఫిర్యాదు మేరకు హెచ్ఎఎల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.


రామకోటి జపయజ్ఞం



జపయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని ఇచ్చంగూరు గ్రామంలో శ్రీ రామకోటి జపయజ్ఞం బుధవారం నుంచి ప్రారంభమైంది. 15 రోజుల పాటు ఈ కార్యక్రమం ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు కోరారు. పెద్దఎత్తున భక్తులు పాలకుండలతో ఊరేగింపుగా వెళ్లి జపం చేశారు.

ఘనంగా కరుణానిధి వర్ధంతి



హోసూరులో జరిగిన వర్ధంతి కార్యక్రమం

హోసూరు: డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ సీఎం దివంగత కరుణానిధి వర్ధంతిని క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా డీఎంకే నాయకులు ఘనంగా ఆచరించారు. హోసూరులో తాలూకాఫీసు వద్ద అన్నా విగ్రహం వద్ద మేయర్ ఎస్ఏ సత్య నేతృత్వంలో కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి సమర్పించారు. యువరాజ్, ఎన్.ఎస్.మాదేశ్వరన్, ధనలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కృష్ణమ్మను చూస్తుంటే సంతోషంగా ఉంది

సీఎం చంద్రబాబు నాయుడు



సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్/వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అన్నారు. కృష్ణమ్మ పరవళ్లను ఆసక్తిగా తిలకించారు. వరద ప్రవాహాన్ని చూసేందుకు వచ్చిన సందర్శకులతో కొద్దిసేపు ముచ్చటించి సెల్ఫీలు దిగారు. సీఎం మాట్లాడుతూ జలకళతో తొణికిసలాడుతున్న కృష్ణమ్మను చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలపై తాజా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

డొక్కా సీతమ్మ కాదు.. అన్న క్యాంటీన్లే

- జనసేన అధినేత పవన్ అంగీకారం

సాక్షి, అమరావతి: పేదల భోజన వసతికి ప్రభుత్వం ప్రారంభిస్తున్న క్యాంటీన్లకు డొక్కా సీతమ్మ పేరును పెట్టాలని గతంలో సూచించిన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చివరకు వాటికి ఎన్టీఆర్‌కు గుర్తుగా 'అన్న కాంటీన్ల' పేరును కొనసాగించేందుకు అంగీకరించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని డొక్కా సీతమ్మ పేరుతో అందించడానికి నిర్ణయించారు. ఈ మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ప్రారంభించే క్యాంటీన్లను గతంలోలానే అన్న క్యాంటీన్లుగా కొనసాగించాలా, డొక్కా సీతమ్మ పేరు కూడా జోడించాలా అనే చర్చ వచ్చిందని, 2019 వరకూ ఉన్న విధంగా అన్న క్యాంటీన్లు అని కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ సూచించారని ఆ ప్రకటన తెలిపింది. డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగిస్తే ప్రతి విద్యార్థికీ ఆమె గొప్పదనం తెలుస్తుందని పవన్ అభిప్రాయపడినట్టు పేర్కొంది.

ఏఐ వర్సిటీని ఏర్పాటు చేస్తాం

- మంత్రి నారా లోకేశ్



సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌గా తీర్చిదిద్దుతామని మానవ వనరులు, అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మక గ్లోబల్ ఏఐ వర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఉన్నత విద్యాశాఖ పనితీరు, ఇంటిగ్రేటెడ్ వర్సిటీ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఏఐ టెక్నాలజీ ద్వారా కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు స్టూడెంట్ పాస్‌పోర్టు ఇచ్చేలా ఫ్రేమ్ వర్క్ రూపొందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి వర్సిటీలు, డిగ్రీ కళాశాలల్లో అకడమిక్ క్యాలెండర్ పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సమగ్ర నివేదిక ఇవ్వా లని అధికారులను ఆదేశించారు. ఆర్జేయూకేటీలను మెరుగ్గా తీర్చిదిద్దుతామన్నారు.

ఉద్యోగం నుంచి తొలగిస్తే.. పురుగుల మందే దిక్కు

ఆత్మహత్యాయత్నం చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



పులివెందుల: తమను ఉద్యోగం నుంచి తొలగిస్తే పురుగుల మందు తాగి చనిపోతామంటూ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఇద్దరు చిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేసిన ఘటన వైఎస్సార్ జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమితులై పులివెందుల మార్కెట్‌యార్డులో పనిచేస్తున్న నలుగురిని, సింహాద్రిపురం మార్కెట్‌యార్డులో ముగ్గురిని తొలగించేందుకు టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తారన్న ఆందోళనతో పులివెందుల మార్కెట్‌యార్డులో అటెండర్‌గా పనిచేస్తున్న అజార్, సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న మహేశ్వరరెడ్డి బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో పురుగుమందు డబ్బాలు, పెట్రోలు తీసుకెళ్లి ఆత్మహత్యాయత్నం చేశారు. ఘటనాస్థలానికి వచ్చిన మీడియాతో అజార్, మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతల ఆదేశాలతో.. సరైన కారణాలు చూపకుండా ఇప్పటికే అధికారులు తమకు రెండు షోకాజ్ నోటీసులు అందజేశారన్నారు. ఆఫీసులో రిజిష్టర్‌ను దాచిపెట్టి తాము సంతకాలు పెట్టేందుకు వీలులేకుండా చేస్తున్నారని చెప్పారు. తమకు జీవనాధారం అయిన ఈ ఉద్యోగాలను తీసేస్తే.. ఆత్మహత్యలే శరణ్యమని విలపించారు. దీంతో మార్కెట్‌యార్డు సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి అక్కడికి చేరుకుని 'మీరు కోర్టును ఆశ్రయించారు కాబట్టి.. కోర్టు ద్వారా వచ్చే నిర్ణయాన్ని బట్టి తాము చర్యలు తీసుకుంటాం' అని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. దీనిపై సెక్రటరీని వివరణ కోరగా తాము ఎవర్నీ విధుల నుంచి తొలగించలేదని తెలిపారు.

సంస్కరణలకు, తప్పులకు తేడా తెలీదా?

గత ఐదేళ్లలో ప్రజలకు మేలు జరిగేలా అనేక భూ సంస్కరణలు

- తన హయాంలో ఎప్పుడూ ఒక్క భూ సంస్కరణ చేయని చంద్రబాబు
- చుక్కల భూములను చిక్కుల్లో పెట్టిన అపర మేధావి
- షరతులు గల భూములను వివాదాస్పదం చేసిన ఘనుడు
- వాటన్నింటినీ పరిష్కరించింది వైఎస్ జగన్ ప్రభుత్వమే
- రాష్ట్ర చరిత్రలో తొలిసారి అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు
- రీ సర్వే పూర్తయిన 7 వేల గ్రామాల్లో 50 వేలకుపైగా భూ సమస్యలు పరిష్కారం
- కేవలం రాజకీయం రంగు పులమడమే లక్ష్యంగా ఈ సర్కారు కుయుక్తులు
- అందుకు వంత పాడుతున్న రెవెన్యూ కార్యదర్శి సిసోడియా

సాక్షి, అమరావతి: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వైఎస్ జగన్ హయాంలో జరిగిన భూ సంస్కరణలపై చంద్రబాబు ప్రభుత్వం అడ్డగోలుగా నిందలు మోపుతోంది. భూములకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ఇందుకు గత ప్రభుత్వమే కారణమనే దిక్కుమాలిన వాదనను సీఎం మొదలు టీడీపీ కింది స్థాయి నేతలంతా వినిపిస్తున్నారు. రెవెన్యూ శాఖ కార్యదర్శి సిసోడియా కూడా ఇదే పాట పాడడం అధికార వర్గాలను విస్మయానికి గురిచేసింది. భూ సంబంధిత అంశాలపై ఎప్పటి మాదిరిగానే విజ్ఞాపనలు వస్తున్నా, టీడీపీ ప్రభుత్వం కావాలని వాటిని భూతద్దంలో చూపిస్తోంది. వచ్చిన వినతుల్ని పరిష్కరించకుండా తప్పించుకునేందుకు భూ సమస్యలు కావడం వల్ల ఏమీ చేయలేకపోతున్నామనే పలాయనవాదాన్ని వినిపిస్తోంది. చంద్రబాబు, మంత్రులు చెప్పినట్లు వచ్చిన వినతుల్లో 80 శాతం భూములకు సంబంధించినవే అయితే అందుకు గల కారణాలను వెలికి తీయవచ్చు. కానీ అలా చేయకుండా కేవలం గత ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుంది. నిజానికి వైఎస్ జగన్ హయాంలో భూములకు సంబంధించి అనేక సంస్కరణలు జరిగాయి. దశాబ్దాలుగా పేరుకుపోయిన భూముల వ్యవహారాలపై నిర్ణయాలు వెలువడడంతో సహజంగానే కొన్ని అంశాలు ముందుకు వచ్చాయి. వాటితోపాటు ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం స్పందన కార్యక్రమాన్ని భారీగా నిర్వహించింది. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి భారీగా వినతులు వచ్చినా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంది. అప్పట్లోనూ సివిల్ వ్యవహారాలపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చేవి. అందుకనుగుణంగా వాటి పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. అందుకు విరుద్ధంగా ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా వాటిపై రాజకీయాలు చేస్తోంది.

భూ సంస్కరణలు తెచ్చింది జగనే

భూ సమస్యలను పరిష్కరించడానికి సాహసోపేతంగా అడుగులు వేసి అనేక సంస్కరణలు తీసుకువచ్చింది గత వైఎస్ జగన్ ప్రభుత్వం కాగా, అసలు భూ సమస్యల గురించి పట్టించుకోకపోవడమే కాకుండా అనేక భూ వివాదాలకు కారణమైంది గత చంద్రబాబు ప్రభుత్వం. 2017లో చుక్కల భూముల చట్టం తెచ్చి ఆ భూముల సమస్యను పరిష్కరించకపోగా వివాదాస్పదంగా మార్చింది. స్వాతంత్ర్యానికి ముందు నుంచి హక్కులు ఉన్న షరతుల గల పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చి, వేలాది మంది రైతుల కడుపు కొట్టింది. అనాదీనం భూముల సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేసింది. వీటన్నింటినీ పరిష్కరించేలా ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించింది వైఎస్ జగన్ ప్రభుత్వం. 2 లక్షల ఎకరాల చుక్కల భూములను 22ఎ జాబితా నుంచి బయట పడేయడంతో వాటిని సాగు చేస్తున్న రైతుల జీవితాల్లో వెలుగులు వచ్చాయి. షరతులు గల భూములపైనా ఆంక్షలు లేకుండా చేయడంతో 50 వేల మంది రైతులకు మేలు జరిగింది.

పేదలకు 46 వేల ఎకరాలు పంచడం కనిపించలేదా?

చంద్రబాబు తన పాలనలో ఎప్పుడూ ఒక్క పేదవాడికి భూమి ఇచ్చిన పాపాన పోలేదు. వైఎస్ జగన్ తన హయాంలో 46 వేల ఎకరాలను 40 వేల మందికిపైగా రైతులకు పంపిణీ చేశారు. దానిపై టీడీపీ శ్రేణులు, సానుభూతి పరులతో ఫిర్యాదులు చేయిస్తూ పంపిణీపై నిందలు మోపుతున్నారు. భూమిని పొందిన వారిలో వైఎస్సార్‌సీపీ వారున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు. పేద వర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కొందరు అర్హత ప్రకారం భూములు పొందడాన్ని వక్రీకరిస్తున్నారు.

అసైన్డ్ భూములకు హక్కులిస్తే విషం కక్కుతారా?

చరిత్రాత్మక రీతిలో రాష్ట్రంలో అసైన్డ్ భూముల సమస్య పరిష్కారానికి మార్గం చూపడాన్ని చంద్రబాబు ప్రభుత్వం తప్పుగా చిత్రీకరిస్తూ వికృతానందం పొందుతోంది. దశాబ్దాల క్రితం భూములు పొందిన వారికి ఆ భూములపై హక్కులు కల్పించడాన్ని నేరంగా చిత్రీకరిస్తోంది. అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు లేక, అసైన్డ్ రైతులు ఎన్నో బాధలు పడినా చంద్రబాబు పట్టించుకోలేదు. తమ భూములపై తమకు హక్కులు ఇవ్వాలన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతుల కోరికను తీర్చడం కోసం.. ప్రభుత్వం నుంచి పొందిన 20 ఏళ్ల తర్వాత ఆ భూములపై వారికి సంపూర్ణ అధికారాలు ఇచ్చేలా చట్ట సవరణ చేశారు. దీనివల్ల 27 లక్షల ఎకరాలపై ఆంక్షలు తొలగే పరిస్థితి ఏర్పడింది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉండగానే అందులో 9 లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఆ భూములను సాగు చేసుకుంటున్న లక్షల మంది రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు లభించాయి. తమ భూములపై ఆంక్షలు లేకపోవడం, మంచి ధర రావడంతో అందులో కొంత మంది రైతులు వాటిని విక్రయించారు. హక్కులు వచ్చాక 25 వేల ఎకరాలను అమ్ముకున్నారని అసైన్డ్ భూములపై అమలైన సంస్కరణను తప్పుదోవ పట్టిస్తోంది. వీటితోపాటే 1.79 లక్షల ఎకరాల సర్వీస్ ఈనాం భూములను 22ఏ నుంచి తొలగించారు. ఆంక్షల చెరలో ఉండి ఎటూ కాకుండా ఉన్న లక్షల మంది రైతుల భూములపై వారికి హక్కులివ్వడాన్ని ఏమనాలి? రాజధాని పేరుతో వేలాది ఎకరాల అసైన్డ్ భూములను కొల్లగొట్టి వారికి అన్యాయం చేసిన చంద్రబాబు రాష్ట్రంలో అసైన్డ్ రైతులందరికీ మేలు జరిగేలా అమలైన సంస్కరణను తప్పుగా వక్రీకరించి రాజకీయం చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

భూముల రీ సర్వేతో కలిగిన ప్రయోజనాలు తెలియవా?

దేశంలోనే మొట్టమొదటిసారిగా వందేళ్ల తర్వాత వైఎస్ జగన్ హయాంలో ఏపీలో జరిగిన భూముల రీ సర్వే అద్భుతమని కేంద్రం కితాబిచ్చింది. భూ వివాదాల పరిష్కారానికి ఏకైక మార్గం రీ సర్వే కావడంతో అనేక సమస్యలు, కష్టాలు ఎదుర్కొని 7 వేల గ్రామాల్లో గత ప్రభుత్వం సర్వే పూర్తి చేసింది. దాన్ని కొనసాగించాల్సింది పోయి రాజకీయ కారణాలతో అభాండాలు వేయడాన్ని రెవెన్యూ యంత్రాంగం తప్పు పడుతోంది. రీ సర్వేపై విషం చిమ్మే క్రమంలో రాష్ట్రంలో ల్యాండ్ రికార్డ్స్ వెల్ సెటిల్డ్ అంశమని, బ్రిటీష్ హయాంలో చాలా సిస్టమాటిక్‌గా ల్యాండ్ రికార్డులు నిర్వహించారని కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు చెప్పడం చూసి ఐఏఎస్ అధికారులు విస్తుపోయారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం భూ రికార్డుల డిజిటలైజేషన్ జరగాలని, అందుకు రీ సర్వే తప్పనిసరి అని చెబుతుంటే ఎన్డీయేలోనే ఉన్న చంద్రబాబు అందుకు విరుద్ధంగా సొంత వాదనలు వినిపించడం విడ్డూరం. చంద్రబాబు చెప్పిన దాని ప్రకారం బ్రిటీష్ హయాంలో రికార్డులు కచ్చితంగా ఉంటే భూ వివాదాలు కుప్పలు తెప్పలుగా ఎందుకు వస్తున్నాయి? తన రాజకీయాల కోసం ఎలాంటి అబద్ధాలైనా ఆడడంలో చంద్రబాబును మించిన వారు లేరని రీ సర్వేపై ఆయన చేస్తున్న అడ్డగోలు వాదనలే నిదర్శనం. వివాదాలు లేని భూముల వ్యవస్థను తీసుకురావడానికి ఐదేళ్లపాటు రెవెన్యూ యంత్రాంగం కష్టపడి చేసిన సాహసోపేతమైన కార్యక్రమంపై బురదజల్లడం విజనరీ చంద్రబాబుకే సాధ్యం. రీ సర్వే ద్వారా ప్రతి గ్రామానికి ఆధునిక డిజిటల్ రెవెన్యూ రికార్డులు అందుబాటులోకి రావడం, ప్రతి రైతుకు భూ హక్కు పత్రం, భూములకు జియో హద్దులు వంటి అనేక ప్రయోజనాలున్నాయి. ఇప్పటి వరకు సర్వే పూర్తయిన గ్రామాల్లో 10 లక్షల పట్టా సబ్ డివిజన్లు, 8 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. ఇదంతా మంచి కాదా? గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమం మొదలైంది. వీటన్నింటినీ కాదని మళ్లీ వివాదాస్పద పాత భూముల వ్యవస్థనే తీసుకువస్తానని చంద్రబాబు చెప్పడాన్ని ఏమనాలి?

సీఎం మెప్పు కోసం సిసోడియా అత్యుత్సాహం

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు మెప్పు కోసం పడిన పాట్లు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఆశ్చర్య చకితుల్ని చేశాయి. తాను ఎప్పుడూ చూడని స్థాయిలో భూములపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఇందుకు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులే కారణమని ఆయన సెలవిచ్చారు. భూ సమస్యలు రావడానికి ఆయన రెవెన్యూ శాఖలో పని చేసింది ఎప్పుడు? ఎప్పుడో కలెక్టర్‌గా చేసిన కొద్ది కాలం తప్ప ఆ తర్వాత ఆయన రెవెన్యూ శాఖలో పని చేయనేలేదు. గత పదేళ్లుగా ఆయన కీలక శాఖల్లో పని చేసేందే లేదు. ఎడ్డెమంటే తెడ్డెం అనే వైఖరి.. తానే గొప్పవాడిననే అహంభావి కావడంతో ఆయనకు మంచి పోస్టింగ్ దక్కలేదని సీనియర్ ఐఏఎస్ అధికారులు చెబుతున్నారు. కాలం కలిసి వచ్చి ఇప్పుడు అనుకోకుండా రెవెన్యూ కార్యదర్శి పోస్టు వచ్చింది. దీంతో సీఎం చంద్రబాబు ఏం చెప్పినా చేసి, ఆయన్ను ఎంతైనా పొగిడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అయిపోదామనే ఆశ తప్ప ఆయన మాట్లాడేదాంట్లో అర్థం లేదని సీనియర్ అధికారులు చర్చించుకుంటున్నారు. అందుకే మదనపల్లి ఫైల్స్ దహనం కేసును అధికార పార్టీ రాజకీయం చేస్తే, అందులో సిసోడియా కూడా దూరిపోయి డప్పు వాయించేస్తున్నారు. కాలిపోయిన రెవెన్యూ రికార్డులన్నీ రీట్రీవ్ అయ్యాయని చెబుతూనే ఫోర్జరీ చేశారు కాబట్టే కాల్చేశారనే వితండ వాదాన్ని వినిపిస్తున్నారు. తాను ఐఏఎస్ అధికారిననే విషయాన్ని మరిచిపోయి పోస్టుల కోసం ఇంత దిగజారడం తగదని సాటి అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు.

కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణ!

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైద్య విద్యను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి.. పేద విద్యార్థులకు మరింత దూరం చేసేలా ప్రణాళికలు వేస్తోంది. ఈ మేరకు అధ్యయనం చేసేందుకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేబినెట్ భేటీ వివరాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని కొత్త వైద్య కళాశాలలను ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)లో నిర్వహించేందుకు 'గుజరాత్ పీపీపీ మోడల్'ను అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని మంత్రి వివరించారు. ఫేజ్–1 కింద నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో (150 సీట్లు) నిర్మించిన కొత్త వైద్య కళాశాలలకు గతంలో మంజూరైన పోస్టులకు అదనంగా మరో 380 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదించిందన్నారు. ఫేజ్–2 కింద పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెల్లో నిర్మించిన కొత్త వైద్య కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 100 సీట్లతో తొలి ఏడాది ఎంబీబీఎస్ కోర్సును ప్రారంభించేందుకు మంత్రి మండలి అంగీకరించిందని చెప్పారు. మంత్రి పార్థసారథి వెల్లడించిన మేరకు మంత్రి మండలి నిర్ణయాలు ఇలా ఉన్నాయి.



ఎంత మంది పిల్లలున్నా పోటీ చేయొచ్చు

- ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న వారు అర్బన్ లోకల్ బాడీస్‌తో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడంపై ఉన్న నిషేధాన్ని తొలగించేందుకు మంత్రివర్గం అంగీకరించింది. ఇందుకు సంబంధించిన చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. సంతానోత్పత్తి రేటు, పని చేయగల సామర్థ్యం ఉన్న జనాభా గణనీయంగా తగ్గుతున్న నేపథ్యంలో పిల్లల సంఖ్యపై నిషేధం తగదని భావిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చట్ట సవరణ ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదించింది.
- 2014–19తో పోలిస్తే ప్రస్తుత మద్యం పాలసీ లోపభూయిష్టంగా, పారదర్శకత లోపించింది. భవిష్యత్తులో మెరుగైన పర్యవేక్షణ, నియంత్రణకై ఏకీకృత పరిపాలన విధానంలోకి తెచ్చేందుకు ఎక్సైజ్ శాఖ పునర్‌నిర్మాణ ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదించింది. ఇందుకోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తాం. సెప్టెంబర్ 5 నాటికి ఆమోదం ప్రక్రియను పూర్తి చేసి, అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త మద్యం విధానాన్ని అమలు చేస్తాం. ఇకపై మద్యం దుకాణాల్లో పూర్తి స్థాయిలో డిజిటల్ లావాదేవీలు ప్రవేశ పెడతాం.
- గత ప్రభుత్వంలో రూ.22.95 కోట్ల వ్యయంతో జారీ చేసిన 21.86 లక్షల భూ హక్కు సర్వే పత్రాల స్థానంలో ప్రభుత్వ ముద్ర, క్యూ ఆర్ కోడ్‌తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేందుకు మంత్రి మండలి నిర్ణయించింది. దీంతో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించి 22ఏ నిషేధిత జాబితా భూములపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో రాబోయే మూడు నెలల్లో గ్రామ సభలు నిర్వహిస్తాం. అప్పటి వరకు 22ఏ నుంచి మినహాయిస్తూ భూములకు ఎటువంటి రిజిస్ట్రేషన్లు నిర్వహించం.
- మత్స్యకారుల హక్కులకు భంగం కలిగించేలా గత ప్రభుత్వం జారీ చేసిన 144, 217 జీవోలను రద్దు చేస్తున్నాం. చేప పిల్లల పెంపకం నుంచి మార్కెటింగ్ వరకు దళారీ వ్యవస్థ లేకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తాం.
- నంద్యాల జిల్లా సున్నిపెంట (శ్రీశైలం ప్రాజెక్టు) గ్రామ పంచాయతీకి 208.74 ఎకరాల భూమిని కేటాయిస్తూ గత ప్రభుత్వం 2023 మే 11న జారీ చేసిన జీవో 40ని రద్దు చేసి, ఆ భూమిని నీటి పారుదల శాఖకు బదలాయించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ భూమిని పర్యాటకాభివృద్ధి కోసం బదలాయించి టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు.
- వామపక్ష భావజాలాన్ని ప్రచారం చేస్తూ, ప్రభుత్వ కార్యకలాపాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు), రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్డీఎఫ్) సంస్థలపై మరో ఏడాది నిషేధాన్ని పొడిగించాం.

పేదలకు ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్యమే లక్ష్యం

గత ప్రభుత్వంలో ఆ దిశగా వైఎస్ జగన్ చర్యలు

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజలకు చేరువలో ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించడంతో పాటు, మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలను పెంచడమే లక్ష్యంగా 17 కొత్త వైద్య కళాశాలలకు వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019 నాటికి రాష్ట్రంలో ఉన్నవి 11 ప్రభుత్వ వైద్య కళాశాలలే. వీటిలో 2,185 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండేవి. రోజు రోజుకు వైద్య విద్యకు డిమాండ్ పెరుగుతున్న క్రమంలో చాలా మంది పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా ఉండింది. ప్రైవేటు కళాశాలల్లో లక్షల రూపాయల ఫీజులు కట్టలేక, తమ పిల్లల్ని వేరే కోర్సుల్లో చేర్పించే వారు. మధ్య తరగతి కుటుంబాల వారైతే అప్పులు చేసి రష్యా, ఫిలిప్పైన్స్ వంటి దేశాలకు పిల్లలను పంపేవారు. ఈ పరిస్థితులకు చెక్ పెట్టేలా కొత్తగా 2,550 సీట్లను సమకూర్చే లక్ష్యంతో రూ.8 వేల కోట్లకుపైగా నిధులతో 17 కొత్త కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వేగంగా నిర్మాణాలు కూడా చేపట్టారు. దీంతో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా 2023–24 విద్యా సంవత్సరంలో ఒకేసారి 5 కళాశాలలను ప్రారంభించారు. విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని, పాడేరు కళాశాలలను ప్రారంభించాల్సి ఉంది. ఇందుకోసం గత ఏడాది నుంచే వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అన్ని చోట్లా ఏపీవీవీపీ (ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్) ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేసింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా పోస్టుల భర్తీ చేపట్టింది. మొదటి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థుల అకడమిక్ కార్యకలాపాల కోసం లెక్చర్ హాల్, ల్యాబ్, వసతి కోసం హాస్టల్స్, క్యాంటీన్ ఇలా వివిధ నిర్మాణాలు చేపట్టింది. ఎన్నికల ఫలితాలు వెలువడే నాటికి 80 శాతం మేర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ ప్రభుత్వం రెండో దశ కళాశాలలకు అనుమతులు రాబట్టకుండా కావాలనే నిర్లక్ష్యం చేసింది. దీనికితోడు ప్రస్తుత ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసే దిశగా నిర్ణయం తీసుకుంది. కొత్త వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నడిపి, విద్యార్థులకు జాతీయ ప్రమాణాలతో వైద్య విద్యను అందించడంతో పాటు, పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించడం జగన్ విధానం. ఇందుకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో కళాశాలలను, బోధనాస్పత్రులను పెడితే పేదలకు ఉచిత వైద్య సేవలు కరువయ్యే అవకాశం ఉంది.

అవసరమైన మేరకు ఉద్యోగుల బదిలీలు

సాక్షి, అమరావతి: వీలైనంత లో ప్రొఫైల్‌లో ఉండాలని, అప్పుడే ప్రజలు దగ్గరకు వస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులతో వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం ఆయన వారితో కొద్దిసేపు రాజకీయ అంశాలపై మాట్లాడారు. తమ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ చెబుతోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది. వాళ్లు చేసినట్లు చేయకూడదని పదేపదే చెబుతున్నా, కొందరు వినడం లేదని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలాగే చేస్తే ఇబ్బందులు వస్తాయని అన్నట్లు తెలిసింది. 'ఉద్యోగుల బదిలీలను అవసరమైన మేరకు చేసుకోవాలి. నియోజకవర్గాలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రజలతో చర్చించి వారి అభిప్రాయాలు కూడా తీసుకోవాలి. ఏపీ ఎన్నికల్లో వచ్చింది నిశ్శబ్ద విప్లవమైతే.. బంగ్లాదేశ్‌లో వైలెంట్ విప్లవం చూశాం. నదుల అనుసంధానానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ విషయం ప్రజల్లోకి వెళ్లేలా జల హారతుల కార్యక్రమాలు నిర్వహిస్తాం. రీ సర్వే వివాదాలు మూడు నెలల్లో పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిద్దాం. రీ సర్వేకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న వాటిని కూడా అధ్యయనం చేయాలి. సర్వే రాళ్లపై పేర్లు, బొమ్మలు తుడిచేసి ప్రభుత్వ అవసరాలకు వినియోగిద్దాం' అని సీఎం చంద్రబాబు చెప్పినట్లు సమాచారం.

ఏపీ ఇన్ పార్లమెంట్ | రాజ్యసభ

ఆదాయ పన్ను కట్టేవారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి

- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఆదాయ పన్ను కట్టే వారిపై పన్ను భారం వేయడమే కాదని, ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మధ్యతరగతి వారికి ఆదాయ పన్ను పెద్ద సమస్యగా మారిందన్నారు. సంపాదిస్తే పన్ను, ఖర్చు చేస్తే జీఎస్టీ, పెట్టుబడి పెడితే లాంగ్‌టెర్మ్ లేదా షార్ట్‌టెర్మ్ పన్ను వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు కడుతున్నా ప్రయోజనాలేమీ ఒనగూరడంలేదన్నది వారి బాధ అని తెలిపారు. ఆర్థిక బిల్లుపై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. నెలకు రూ.లక్ష లోపు పింఛను తీసుకొనే వారిని ఆదాయ పన్ను నుంచి మినహాయింపునిస్తే వారి ఆరోగ్య ఖర్చులకు ఉపకరిస్తుందని తెలిపారు. సీనియర్ సిటిజన్ల ఆదాయ పన్ను ఫైలింగ్‌కు ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలన్నారు.

ఏపీలో 19 వన్‌స్టాప్ సెంటర్లు



మహిళల భద్రత, సాధికారతకు ఏపీలోని 26 జిల్లాలకు 26 వన్‌స్టాప్ సెంటర్లకు అనుమతి ఇవ్వగా, వాటిలో 19 అమలులో ఉన్నాయని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ మంత్రి అన్నపూర్ణదేవి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

జాతీయ సంపదను సమానంగా పంచండి
ఓబీసీల జాతీయ సదస్సులో ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ సంపదను ప్రతి ఒక్కరికీ సమానంగా పంపిణీ చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందని పలువురు ఎంపీలు పేర్కొన్నారు. ఓబీసీల డిమాండ్ల సాధనకు ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సును ఆల్ ఇండియా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, తదితరులు హాజరయ్యారు.

చేనేతలకు ఎన్నో ఇవ్వాలనుకున్నా.. కానీ..

- ఇవ్వలేకపోతున్నా..
- గత ప్రభుత్వం ఖజానా దివాలా తీయించింది
- రూ.10 లక్షల కోట్లు అప్పు పెట్టింది
- చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో సీఎం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు ఎన్నో ఇవ్వాలని అనుకున్నానని, అడిగిన దానికంటే ఎక్కువ ఇవ్వడం తన స్వభావమని, కానీ ఇవ్వలేకపోతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. గత రెండు నెలలుగా ప్రభుత్వాన్ని చూస్తుంటే బాధేస్తోందని చెప్పారు. రాష్ట్ర ఖజానాను గత ప్రభుత్వం దివాలా తీయించిందని, రూ.10 లక్షల కోట్లు అప్పు పెట్టిందని, దానికి వడ్డీ, అసలు చెల్లించడానికే ఏటా రూ.80 వేల కోట్లు కావాలని అన్నారు. ఎక్కడ చూసినా విధ్వంసమేనని, వ్యవస్థలను సర్వనాశనం చేశారని చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ స్టెల్లా కాలేజీలో ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలలో ఒక రోజు అందరం చేనేత వస్త్రాలు ధరించాలని సూచించారు. చేనేత రంగానికి, కార్మికులకు రూ.266 కోట్లు అప్పు పెట్టి వెళ్లిపోయిందని అన్నారు. గత ప్రభుత్వం పెట్టిన ఆప్కో బకాయిలు కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. రాష్ట్రంలో బీసీల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. బీసీ సబ్ ప్లాన్ ద్వారా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తామని అన్నారు. అంతకు ముందు చంద్రబాబు చేనేత వస్త్రాల స్టాల్స్‌ను సందర్శించి, కార్మికులతో మాట్లాడారు. తన సతీమణి కోసం ఉప్పాడ, వెంకటగిరి చీరలు కొన్నారు. తన సతీమణి కోసం ఎన్నడూ చీరలు కొనలేదని, ఎందుకో ఇక్కడికి రాగానే భువనేశ్వరి గుర్తుకు వచ్చారని, అందుకోసం ఆమెకు రెండు చీరలు కొన్నానని సరదాగా అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత శాఖ మంత్రి సవిత, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


వింజమూరి అనసూయ

మా అమ్మ పాట జానపదాల పూదోట

డాక్యుమెంటరీ

'అసమాన అనసూయ'... ఇదీ తెలుగు జానపద సంగీత సామ్రాజ్ఞి వింజమూరి అనసూయాదేవి పై ఆమె కుమార్తె సీతా రత్నాకర్ రూపొందించిన డాక్యుమెంటరీ పేరు. గంటన్నర నిడివి గల ఈ డాక్యుమెంటరీ వింజమూరి అనసూయాదేవి గాత్రాన్ని, ఘనతను, అనుభవాలను ప్రోది చేసింది. దేశ విదేశాల ఫెస్టివల్స్‌లో ప్రశంసలు పొందుతోంది. ఆగస్టు 11న కాకినాడలో, ఆగస్టు 17న హైదరాబాద్‌లో ప్రదర్శితం కానున్న ఈ డాక్యుమెంటరీ గురించి సీతా రత్నాకర్ తెలిపిన వివరాలు.

'దూరదర్శన్‌లో పని చేస్తున్న సమయంలో నేను కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. అయితే జానపద సంగీత విభాగంలో గొప్ప కృషి చేసిన మా అమ్మ మీద డాక్యుమెంటరీ తీసే ఉద్దేశం నాకు అప్పట్లో ఉండేది కాదు. మా అమ్మ 1990 తర్వాత అమెరికాలో స్థిర నివాసం ఏర్పరుచుకుంది. ఒకసారి నేను అక్కడికి వెళ్ళినప్పుడు అందరి మీద డాక్యుమెంటరీలు తీస్తున్నావ్ మరి నా మీద ఎప్పుడు తీస్తావు అని అడిగింది. అవును కదా అనుకున్నాను. అయినా సరే ఆ పనికి శ్రీకారం చుట్టడానికి చాలా సంవత్సరాలు పట్టింది' అని గుర్తు చేసుకున్నారు సీతా రత్నాకర్.

ఆమె తన తల్లి వింజమూరి అనసూయ పై తీసిన డాక్యుమెంటరీ 'అసమాన అనసూయ' ఇప్పుడు వివిధ దేశాలలో జరుగుతున్న ఫెస్టివల్స్‌లో పాల్గొంటోంది. కోల్‌కతా చలన చిత్ర ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్‌లో 2024 సంవత్సరానికి ప్రథమ బహుమతి పొందింది. తాజాగా ఈ డాక్యుమెంటరీని ఆగస్టు 11న కాకినాడ సూర్య కళామందిరంలో, ఆగస్టు 17న హైదరాబాద్ బంజారాహిల్స్ లోని సప్తపర్ణిలో ప్రదర్శించనున్నారు.


సీతా రత్నాకర్

డాక్యుమెంటరీ విలువ తెలిసింది

'మా అమ్మ అమెరికాలో ఉన్నప్పుడు మా అక్క భర్త ఆమె అనుభవాలను నమోదు చేసిన టేప్ ఫుటేజ్ ఉంది. నేను డాక్యుమెంటరీ కోసం ప్రత్యేకంగా అమ్మతో మాట్లాడాలనుకునేలోపు ఆమె 2019లో స్వర్గస్తురాలయింది. ఆమెపై డాక్యుమెంటరీ అవసరం ఆమె పోయాక గానీ పూర్తిగా నాకు తెలియరాలేదు. వెంటనే రంగంలో దిగాను. కరోనా మొదటి రెండేళ్ల సమయంలో ఫుటేజ్ మొత్తం గేదర్ చేసుకుని పని ప్రారంభించాను. పాత టేప్ ఫుటేజ్ అంతా డిజిటలైజ్ చేయించాను. ఆ తర్వాత దాన్ని అంతటినీ గుదిగుచ్చి 94 నిమిషాల డాక్యుమెంటరీ తయారు చేశాను. మా అమ్మ జీవితాన్ని తెలుసుకోడం అంటే స్వాతంత్ర్యానికి 20 ఏళ్ల పూర్వం నుంచి ఆ తర్వాత సినిమా, రేడియో, ఇతర మాధ్యమాల తెలుగు సంగీత చరిత్రను తెలుసుకోవడమే' అని తెలిపారు సీతా రత్నాకర్.


ఇందిరా గాంధీతో వింజమూరి సిస్టర్స్

జానపదం అమ్మపాట... బాట

'మా అమ్మ వింజమూరి అనసూయాదేవి 1920 మే 12 తేదీన కాకినాడలో జన్మించింది. మా అమ్మకు బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగింది. ఎనిమిదేళ్ల వయసులోనే గ్రాంఫోన్ రికార్డు పాడిన ఘనత ఆమెది. అప్పటినుంచి ఆమె తన మేనమామ, ప్రఖ్యాత భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రితో పాటల ప్రయాణం చేస్తూ ఎన్నో పాటలకు ప్రాణం పోసింది. అయితే 'జానపదం' అంటేనే ఆమెకు మక్కువ. 'బండీర పాగ బండీర', 'గోలకొండోయి గొరుగాకు పుల్ల', 'రామనా సంద నాలో', 'గోదారోరి సిన్నది', 'కొండం జోరి సెరువుల కింద', 'హోలీ హోలీయ రంగ హోలీ', 'గోదావరి ప్రాంత పెళ్లి పాటలు'– మొదలైన వందలాది తెలుగు జానపదాలను రేడియో ద్వారా ప్రజలకు చేరువ చేయడంలోనూ, కచేరీల స్థాయికి తీసుకువెళ్లడంలో ఆమెది పెద్ద పాత్ర' అంటారు సీతా రత్నాకర్.

మొక్కజొన్న తోటలో...

'మా అమ్మ తన చెల్లి సీతతో కలిసి వింజమూరి సిస్టర్స్‌గా ఎన్నో కచేరీలు చేసింది. దేవులపల్లి రాసిన 'జయజయజయ ప్రియభారత జనయిత్రీ'కి బాణీ ఏర్పరచి కాకినాడ పి.ఆర్. కళాశాల స్వర్ణోత్సవ సభలో(1935) పిల్లలతో పాడించింది. కొనకళ్ళ 'మొక్కజొన్న తోటలో' పాటకి ప్రాణం పోసింది. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గాంధీజీ పాల్గొన్న కాకినాడ టౌన్ హాల్ సభలో ఆయన పక్కన కూర్చుని దేశభక్తి గీతాలు పాడటం ఆమె ఎప్పుడూ మర్చిపోలేదు' అని గుర్తు చేసుకున్నారామె.

నేను రెండో కుమార్తెను

'నేను అమ్మకు రెండో కుమార్తెను. చెన్నైలో స్థిరపడ్డాను. మా అక్క రత్నపాపతో కలిసి అమ్మ కచేరీలలో కోరస్ పాడేదాన్ని. ఆ తర్వాత దూరదర్శన్ లో ప్రోగ్రాం ప్రొడ్యుసర్‌గా నాలుగు దశాబ్దాలు పని చేసి 2012లో పదవీ విరమణ చేశాను. 2014లో నుంచి ఇండిపెండెంట్ ఫిల్మ్ మేకింగ్ మొదలుపెట్టాను. నేను తీసిన 'కాస్మిక్ కనెక్షన్' డాక్యుమెంటరీకి దేశ విదేశ పురస్కారాలు వచ్చాయి. 'అసమాన అనసూయ' డాక్యుమెంటరీకి దేశ విదేశాలలో గుర్తింపు వస్తోంది. అయితే తెలుగువారే దానిని ఎక్కువ చూడాలని కోరుకుంటున్నాను' అన్నారామె.

– సాక్షి ఫ్యామిలీ డెస్క్
ఇన్‌పుట్స్: డా.కె.రామచంద్రారెడ్డి

కాలు బెణికితే రైస్!

కాలు బెణికినప్పుడు పైకి ఎలాంటి గాయం కనిపించకపోయినా లోపల సలుపుతుంటుంది. ఇలాంటప్పుడు చేయాల్సిన ప్రథమచికిత్స కోసం ఇంగ్లిష్‌లో 'రైస్' అనే మాటను గుర్తుపెట్టుకోవాలి.

R అంటే **రెస్ట్.** అంటే కాలికి విశ్రాంతి ఇవ్వాలి. (24 నుంచి 48 గంటలపాటు).

I అంటే **ఐస్‌ప్యాక్** పెట్టడం. ఐస్‌క్యూబ్స్‌ను నేరుగా గాయమైన చోట అద్దకూడదు. ఐస్ నీళ్లలో గుడ్డ ముంచి బెణికిన చోట అద్దాలి.

C అంటే **కంప్రెషన్.** అంటే బెణికిన ప్రాంతాన్ని క్రాప్ బ్యాండేజ్‌తో కాస్తంత బిగుతుగా ఒత్తుకుపోయేలా (కంప్రెస్ అయ్యేలా) కట్టు కట్టవచ్చు. అది అందుబాటులో లేకపోతే మామూలు గుడ్డతోనైనా కట్టు కట్టవచ్చు.

E అంటే **ఎలివేషన్.** అంటే బెణికిన కాలు... గుండె కంటే కాస్త పైకి ఉండేలా పడుకోవడం. అంటే కాలికింద దిండు పెట్టుకోవడం మేలు.



అఫ్గాన్ ఫస్ట్ ఫిమేల్ ఒలింపిక్ బ్రేక్ డ్యాన్సర్

రూల్ బ్రేకర్

సినిమాకు ఎంతమాత్రం తీసిపోని కథ మనిజా తలాష్‌ది. మహిళలు సంగీతం వినడం తప్పు... అనుకునే పరిస్థితులు ఉన్న దేశంలో బ్రేక్‌డ్యాన్స్‌పై ఇష్టాన్ని పెంచుకుంది. ఆ ఇష్టం ఆమెకు ఎన్నో కష్టాలు తెచ్చింది. అయినా మడమ తిప్పలేదు. తలాష్ కష్టం వృథా పోలేదు. అఫ్గాన్ ఫస్ట్ ఫిమేల్ ఒలింపిక్ బ్రేక్ డ్యాన్సర్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది...



'సంకల్ప బలం ఉంటే బందీఖానాలో ఉన్నప్పటికీ కల నిజం చేసుకోవచ్చు' అంటుంది ఆఫ్గనిస్తాన్ ఫస్ట్ ఫిమేల్ ఒలింపిక్ బ్రేక్‌డ్యాన్సర్ మనీజా తలాష్. కొన్ని సంవత్సరాల క్రితం యూట్యూబ్‌లో అఫ్గాన్ బ్రేక్ డ్యాన్సర్‌ల వీడియో చూసి 'ఇది కలా నిజమా! ఇలా చేయడం సాధ్యమా' అనుకుంది తలాష్.

మూడు నెలల తరువాత...'సుప్రియర్స్ క్రూ'గా సుపరిచితులైన బ్రేక్ డ్యాన్సర్‌లను ట్రైనింగ్ క్లబ్‌లో కలుసుకుంది. 'నాకు డ్యాన్స్ నేర్పించగలరా?' అని అడిగింది. వారు ఓకే అన్నారు. శిక్షణ తీసుకుంటున్న 55 మందిలో తానొక్కతే అమ్మాయి. మొదట ఇబ్బందిగా ఫీల య్యేది.



'ఇక్కడ అమ్మాయి అయినా అబ్బాయి అయినా ఒకటే. ఇబ్బందిగా ఫీల్ కావద్దు' అని ధైర్యం చెప్పేవారు సుప్రియర్ క్రూ సభ్యులు. అయితే తలాష్ బ్రేక్ డ్యాన్స్ నేర్చుకోవడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎవరికీ నచ్చేది కాదు. ఈ ఒత్తిడి ప్రభావంతోనో ఏమో... 'నేర్చుకోవడం నాకు కష్టంగా ఉంది' అన్నది.

'కష్టం కావచ్చు. అసాధ్యం మాత్రం కాదు' అన్నారు 'సుప్రియర్ క్రూ' సభ్యులు.

ఇక అప్పటినుంచి వెనకడుగు వేయలేదు తలాష్. నాలుగు సంవత్సరాల తరువాత... అఫ్గానిస్తాన్ ఫస్ట్ 'బీ–గర్ల్' (బ్రేక్ డ్యాన్సర్ గర్ల్)గా పేరు తెచ్చుకుంది. మరోవైపు తలాష్‌కు బెదిరింపు కాల్స్ రావడం మొదలైంది. తన కల సాకారం అయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో పన్నెండేళ్ల సోదరుడిని తీసుకొని పాకిస్థాన్‌కు పారిపోయింది. అక్కడి నుంచి స్పెయిన్‌కు వెళ్లి హ్యాస్కా అనే చిన్న పట్టణంలోని హెయిర్ సెలూన్‌లో పనిచేస్తూ బ్రేక్ డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేది. తలాష్ కథ ఐవోసీ (ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ) ఎగ్జిక్యూటివ్ బోర్డ్ దృష్టికి రావడంతో రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్‌లో స్థానం కల్పించారు. ఒలింపిక్స్‌లో తలాష్ మెడల్ తేస్తే పెద్ద చరిత్రే.

కష్టమే అదృష్టమై...

పారిస్ ఒలింపిక్స్‌తో మొదటిసారిగా బ్రేకింగ్ స్పోర్ట్ (బి–బోయింగ్, బి–గర్లింగ్ లేదా బ్రేక్ డ్యాన్సింగ్)ను ప్రవేశ పెట్టారు. ప్రపంచ క్రీడా వేదిక చెంతకు చేరడానికి ఇది మనిజా తలాష్‌కు అదృష్టంగా మారింది. అయితే కష్టాన్ని తప్ప అదృష్ట, దురదృష్టాలను ఎప్పుడూ పెద్దగా నమ్మలేదు తలాష్. ఆమె ఒలింపిక్స్ వరకు రావడమే పెద్ద విజయం. పతకం గెలుచుకుంటే చారిత్రక విజయం అవుతుంది. 'ఈ పోటీ నా కోసం మాత్రమే కాదు. నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న స్నేహితులు, ఆత్మీయుల కోసం' అంటుంది మనిజా తలాష్.

గులాబీలు గుప్పే పిల్లడే...


సినిమా


విశ్వక్ సేన్, మీనాక్షీ చౌదరి

''గుల్లేడు గుల్లేడు గులాబీలు గుప్పే పిల్లడే ఇంక నాతో ఉంటడే...' అంటూ మొదలవుతుంది 'మెకానిక్ రాకీ' సినిమాలోని 'గుల్లేడు గుల్లేడు...' పాట. విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం ఇది. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 31న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో 'గుల్లేడు గుల్లేడు..' అంటూ సాగే ఫోక్ సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. జేక్స్ బిజోయ్ సంగీత సారథ్యంలో సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు.

'జాతి రత్నాలు' దర్శకుడితో... మంగళవారం విశ్వక్ 13వ సినిమా ప్రకటన రాగా, బుధవారం ఆయన 14వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని 'జాతి రత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్నారు. ఈ సినిమాకు సహ–నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

పని ఇంపార్టెంట్... పేరు కాదు


రవితేజ

'సరిహద్దు కాపాడేవాడే సైనికుడు కాదు... సంపద కాపాడేవాడు కూడా సైనికుడే...' అనే డైలాగ్‌తో 'మిస్టర్ బచ్చన్' సినిమా ట్రైలర్ ప్రారంభం అవుతుంది. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం 'మిస్టర్ బచ్చన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. 'నో ప్రాబ్లమ్ సార్.. నాకు పని ఇంపార్టెంట్.. పేరు కాదు, ఉయ్ ఆర్ ఫ్రమ్ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ ఆర్మీ ఎంత పవర్‌ఫుల్లో ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ కూడా అంతే పవర్‌ఫుల్ అని నిరూపిస్తా, ఆగస్టు 15న ఏం జరిగిందో తెలుసా మీకు.. ఆ రోజు 70ఎంఎం స్టీరియో ఫోనిక్ 'షోలే' రిలీజ్ అయింది' అంటూ రవితేజ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

వయనాడ్ బాధితులకు భారీ విరాళం


ప్రభాస్

కేరళలోని వయనాడ్ వరద బాధితులకు రెండు కోట్ల రూపాయలు భారీ విరాళం ప్రకటించారు హీరో ప్రభాస్. ఇటీవల కేరళలోని వయనాడ్ జిల్లాలో వరదల వల్ల భారీ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించిన సంగతి తెలిసిందే. సర్వస్వం కోల్పోయిన వారికి చేయూతనిచ్చేందుకు పలువురు నటీనటులు ముందుకొచ్చి ఆపన్న హస్తం అందిస్తున్నారు. తాజాగా ప్రభాస్ రెండు కోట్ల రూపాయల విరాళాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇస్తున్నట్లు ప్రకటించారు. ''ఇలాంటి కష్ట సమయంలో కేరళ ప్రజలు ధైర్యంగా ఉండాలి. వారికి మనమంతా అండగా ఉండాలి'' అని ప్రభాస్ కోరారు.



'తాతమ్మ కల' (1974) సినిమాతో నటుడిగా నందమూరి బాలకృష్ణ కెరీర్ మొదలైంది. ఈ ఏడాదితో ఆయన నటుడిగా యాభైఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా స్వర్ణోత్సవాన్ని సెప్టెంబరు 1న నిర్వహించేందుకు తెలుగు చలన చిత్ర పరిశ్రమ సన్నాహాలు చేస్తోంది. ఈ వేడుకకు చెందిన కర్టన్ రైజర్ కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. పలువురు చిత్రరంగ ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, నందమూరి మోహనకృష్ణలు కలిసి స్వర్ణోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ధనుష్‌కి జోడీగా..?


కృతీ సనన్

'రాంఝణా, అత్రంగి రే' చిత్రాల తర్వాత హీరో ధనుష్, దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ కాంబినేషన్‌లో రూపొందనున్న తాజా చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఈ సినిమా చిత్రీకరణను అక్టోబరులో ప్రారంభించడానికి యూనిట్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలో నటీనటుల ఎంపికపై ఆనంద్ దృష్టి పెట్టారట. హీరోయిన్ పాత్ర కోసం కృతీ సనన్‌ను సంప్రదించారని టాక్. త్వరలోనే ఆమె పేరుని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని బాలీవుడ్ భోగట్టా. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్ర కోసం ఇప్పటికే కియారా అద్వానీ, త్రిప్తి దిమ్రీ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా కృతీ సనన్ పేరు వినిపిస్తోంది. మరి... కృతీ సనన్ ఖరారు అవుతారా? లేక సీన్లోకి వేరే హీరోయిన్ వస్తారా? అనేది చూడాలి.

కొందరు ఆలోచించినా సక్సెస్ అయినట్లే!


రాజేందర్ రెడ్డి

''సందేశాత్మక చిత్రాలు నిర్మించాలన్నది నా ఆశయం. సినిమాల్లోని సందేశాలతో ప్రజలు మారతారని చెప్పను. కానీ కొందరు ఆలోచించినా నా ప్రయత్నం సక్సెస్ అయినట్లే. 'సింబా' సినిమా సందేశాత్మకంగా ఉంటుంది. కమర్షియల్, థ్రిల్లర్ అంశాలూ ఉన్నాయి'' అని అన్నారు దాసరి రాజేందర్ రెడ్డి. జగపతిబాబు, అనసూయ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'సింబా'. సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ – ''నేను ప్రకృతి ప్రేమికుడిని. ప్రకృతిపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ ఎంత ముఖ్యమో చెప్పాలని 'సింబా' తీశాం. ఇప్పటివరకు ఎవరూ చెప్పని పాయింట్‌ను ఈ సినిమాలో టచ్ చేశాం. సంపత్ నంది దగ్గర మురళీ ఎప్పట్నుంచో పని చేస్తున్నారు. మురళీ ఈ సినిమాను బాగా తీశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం. మా సినిమా ఆ రోజు విడుదలయితే బాగుంటుందనుకుని ఆ రిలీజ్ డేట్ ఫిక్స్ చేశాం'' అని చెప్పుకొచ్చారు.

ప్రతి కుర్రాడి బయోపిక్ ఇది


యదు వంశీ

''కమిటీ కుర్రోళ్ళు' కథ రాసుకుని ఐదారు ప్రొడక్షన్ హౌసెస్‌లో ప్రీ ప్రొడక్షన్ పనులు చేశాను. కానీ నేను అనుకున్నట్లుగా తీయలేనేమోనన్న భయంతో బయటికొచ్చేశాను. ఆ తర్వాత నిహారికగారికి కథ చెప్పాను. సెట్స్‌లో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారామె'' అన్నారు దర్శకుడు యదు వంశీ. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ పతాకాలపై నిహారిక కొణిదెల సమర్పణలో నూతన నటీనటులు నటించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదు వంశీ దర్శకత్వంలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో యదు వంశీ మాట్లాడుతూ– ''నా జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను 'కమిటీ కుర్రోళ్ళు'లో చూపించాం. ఓ గ్రామంలో మరుసటి రోజు పంచాయితీ ఎన్నికలనగా, అక్కడ ముందు రోజు పొలిటికల్‌గా ఏం జరిగింది? ఆ ఊర్లో జరిగిన జాతరకు, రాజకీయాలకు ఉన్న లింక్ ఏంటి? అన్న అంశాలనే కాస్త వ్యంగ్యంగా చూపించా. మదర్ సెంటిమెంట్ ఓ హైలైట్ పాయింట్. చెప్పాలంటే ఇది ప్రతి కుర్రాడి బయోపిక్'' అని చెప్పుకొచ్చారు.

డీల్ ఏంటి?


హను కోట్ల

నటుడు హను కోట్ల లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'డీల్'. హెచ్. పద్మ రమాకాంత్ రావ్, రామకృష్ణ కొలివి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ఈ నెల 9న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ – ''ఈశ్వర్' సినిమాలో ప్రభాస్‌గారి స్నేహితుల్లో నేనూ ఒక పాత్రలో నటించాను. ఆ తర్వాత పలు చిత్రాల్లో చాన్స్ వచ్చినా సరైన ప్రాధాన్యం లేకపోవడంతో నటనని వదిలేసి దర్శకత్వం వైపు వెళ్లాను. యాడ్ ఫిల్మ్ మేకర్‌గా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, ఆర్టిస్ట్‌గా చేశాను. పలు టీవీ కార్యక్రమాలకు దర్శకత్వం వహించాను. అయితే నటుడిగా నన్ను నేను నిరూపించుకోవాలని 'డీల్' వంటి మంచి కథతో సినిమా తెరకెక్కించాను. ఓ డీల్‌కి సంబంధించిన సస్పెన్స్, థ్రిల్ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు.

ప్రేమ... వినోదం


సంతోష్, వైష్ణవి

సంతోష్ కృష్ణ, వైష్ణవీ కృష్ణ, సిజు మీనన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'మన్మయి'. పులుగు రామకృష్ణా రెడ్డి దర్శకత్వంలో రామకృష్ణా రెడ్డి, శ్రీహరి రెడ్డి, కిరణ్ రెడ్డి నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ని నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ చూస్తే మంచి కంటెంట్‌తో సినిమా చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని అన్నారు. పులుగు రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ– ''ఎమోషనల్ లవ్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది. ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచే సినిమా అవుతుంది'' అని తెలిపారు. ''మంచి ప్రేమకథ, భావోద్వేగాలతో ప్రేక్షకుల్ని మా చిత్రం ఆకట్టుకుంటుంది'' అన్నారు శ్రీహరి రెడ్డి, కిరణ్ రెడ్డి. ''మనసుకు హత్తుకునే మంచి ప్రేమకథతో ఆడియన్స్ ముందుకు త్వరలో రానున్నాం'' అని సంతోష్ కృష్ణ, వైష్ణవీ కృష్ణ చెప్పారు.

వినోదాల స్వీటీ నాటీ


శ్రీజిత, త్రిగుణ్, ఇనయ, రాధ

త్రిగుణ్, శ్రీజిత ఘోష్ జోడీగా 'స్వీటీ నాటీ క్రేజీ' చిత్రం బుధవారం ప్రారంభమైంది. రాజశేఖర్ .జి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇనయ, రాధ, అలీ, రఘుబాబు, రవి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని ఆర్. అరుణ్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నటుడు అలీ క్లాప్ కొట్టగా, నిర్మాత దామోదర ప్రసాద్ స్క్రిప్టుని యూనిట్‌కి అందించారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం త్రిగుణ్ మాట్లాడుతూ– ''నేనిప్పటివరకూ చేసిన కామెడీ చిత్రాలు వర్కౌట్ అయ్యాయి. 'స్వీటీ నాటీ క్రేజీ'లోనూ మంచి వినోదం ఉంటుంది'' అన్నారు. ''ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది'' అని చెప్పారు రాజశేఖర్ .జి. ''మా సినిమా అందర్నీ నవ్వించేలా ఉంటుంది'' అని ఆర్. అరుణ్ తెలిపారు. ''తెలుగులో నేను చేస్తున్న పాత్రని తమిళంలో రవి మరియ చేస్తున్నారు'' అని రఘుబాబు పేర్కొన్నారు.

వినేశ్‌...నువ్వు చాంపియన్లకే చాంపియన్‌వు. భారత దేశానికి గర్వకారణం. ప్రతీ భారతీయుడికి స్ఫూర్తివి. ఈ రోజు జరిగిన ఘటన చాలా బాధ పెడుతోంది. నేను అనుభవిస్తున్న వేదనను మాటల్లో చెప్పలేను. అదే సమయంలో నీ పట్టుదలను అభినందిస్తున్నా. సవాళ్లను ఎదుర్కోవడానికి నువ్వు ఎప్పుడూ సిద్ధమే. నువ్వు మళ్లీ కోలుకొని బలంగా తిరిగిరావాలి.
– నరేంద్ర మోదీ, ప్రధాని

వినేశ్‌ ఫొగాట్‌ అనర్హత మనందరిని నిరాశపరిచింది. అయితే ఆమె 140 కోట్ల భారతీయుల హృదయాల్లో ఎప్పటికీ విజేత. పారిస్‌ ఒలింపిక్స్‌లో ఆమె కనబరిచిన ప్రదర్శన, చూపించిన తెగువ ప్రతీ భారతీయుడి మదిలో నిలిచిపోతుంది. యావత్‌ దేశం ఆమె పోరాటాన్ని చూసి గర్విస్తోంది. – రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మేమందరం నిర్ఘాంతపోయాం. ఇంట్లో మనిషి చనిపోయిన భావన ఇక్కడ కనిపించింది.– భారత రెజ్లింగ్‌ కోచ్‌ వీరేందర్‌

సీఏఎస్‌లో వినేశ్‌ ఫొగాట్‌ అప్పీల్‌

స్వర్ణ–రజత పతక బరిలో 100 గ్రాముల అధిక బరువు తేడాతో అనూహ్యంగా అనర్హతకు గురైన భారత స్టార్‌ రెజ్లర్‌ వినేశ్‌ ఫొగాట్‌ అప్పీలుకు వెళ్లింది. కోర్ట్‌ ఆఫ్‌ ఆర్బిట్రేషన్‌ ఫర్‌ స్పోర్ట్స్‌ (సీఏఎస్‌)లో తన అనర్హతను సవాలు చేస్తూ రజత పతకం కోసం అప్పీలు చేసింది. సీఏఎస్‌ ఈ అప్పీలును స్వీకరించింది. దీనిపై తుదినిర్ణయాన్ని గురువారం వెల్లడిస్తామని తెలిపింది. ఒకవేళ సీఏఎస్‌లో వినేశ్‌కు అనుకూలంగా తీర్పు వస్తే అంతర్జాతీయ ఒలింపిక్‌ కమిటీ (ఐఓసీ) వినేశ్‌కు సంయుక్తంగా రజత పతకం బహూకరించే అవకాశముంది.

వినేశ్‌ విషాదం

భారత మహిళా స్టార్‌ రెజ్లర్‌పై అనర్హత వేటు

- 100 గ్రాముల బరువు ఎక్కువ ఉండటమే కారణం
- ఖరారైన ఒలింపిక్‌ పతకాన్ని కోల్పోయిన వినేశ్‌ ఫొగాట్‌



50.10 కిలో గ్రాములు... వెయింగ్‌ స్కేల్‌పై వినేశ్‌ ఫొగాట్‌ బరువు కనిపించింది! అంతే... అక్కడే ఆశలు నేలకూలాయి. మరో మాటకు తావు లేకుండా అనర్హత... బంగారు పతకం కోసం కన్న కలలు అక్కడే కల్లలయ్యాయి... ఆ 100 గ్రాములను తగ్గించేందుకు మరికొంత సమయం కావాలంటూ భారత బృందం చేసిన అభ్యర్థనను నిర్వాహకులు లెక్క చేయనేలేదు. అసాధారణ ఆటతో ఫైనల్‌ వరకు చేరి తన ఒలింపిక్‌ పతక లక్ష్యాన్ని నిజం చేసుకున్న ఫొగాట్‌కు తుది సమరానికి కొన్ని గంటల ముందు ఆ పతకం కూడా దక్కదని తేలిపోయింది. రెజ్లింగ్‌లో భారత మహిళ తొలిసారి ఫైనల్‌కు చేరడంతో పసిడి పతకాన్ని ఆశించిన మన అభిమానులకు కూడా అది దక్కదని అర్థమైపోవడంతో అన్నింటా నిరాశ అలముకుంది. ఆమె మూడు మ్యాచ్‌ల కష్టాన్ని కూడా నిర్వాహకులు లాగేసుకోవడం ఎవరూ ఊహించని విషాదం.

పారిస్‌: ఒలింపిక్స్‌ మహిళల రెజ్లింగ్‌ 50 కేజీల కేటగిరీలో ఫైనల్‌ చేరిన భారత స్టార్‌ రెజ్లర్‌ వినేశ్‌ ఫొగాట్‌ బరిలోకి దిగకుండానే తప్పుకోవాల్సి వచ్చింది. ఫైనల్‌కు కొన్ని గంటల ముందు జరిగే 'వెయింగ్‌'లో వినేశ్‌ బరువు 50 కిలోల 100 గ్రాములుగా తేలింది. నిబంధనల ప్రకారం అనుమతించిన బరువుకంటే ఏమాత్రం ఎక్కువ బరువు ఉన్నా ఆటోమెటిక్‌గా అనర్హత వేటు పడుతుంది. ఫైనల్‌ కోసమే కాకుండా ఓవరాల్‌గా ఆమె గెలిచిన మూడు బౌట్‌లను కూడా గుర్తించకుండా వినేశ్‌ను నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. సెమీస్‌లో వినేశ్‌ చేతిలో ఓడిన యుస్నెలిస్‌ గుజ్‌మాన్‌ లోపెజ్‌ (క్యూబా) ఫైనల్‌ చేరింది. దాంతో ఎలాంటి పతకం లేకుండా చివరి స్థానంతో ఫొగాట్‌ నిష్క్రమించింది. **వినేశ్‌ అనర్హత నేపథ్యంలో అసలు ఏం జరిగింది, ఎలాంటి పరిణామాలు సంభవించాయో చూస్తే...**

కేటగిరీని మార్చుకొని...

కెరీర్‌ ఆరంభం నుంచి కొన్నాళ్ల క్రితం వరకు కూడా వినేశ్‌ 53 కేజీల విభాగంలో పోటీ పడింది. అయితే ఢిల్లీలో వివాద సమయంలో కొంత కాలం ఆటకు దూరమయ్యాక అందులో మరో ప్లేయర్‌ రావడంతో కేటగిరీ మార్చుకుంటూ 50 కేజీలకు తగ్గింది. ఇందులోనే పారిస్‌ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది.

తొలి రోజు ఏం జరిగింది...

పోటీలకు ముందు బరువు తూచే సాధారణ ప్రక్రియ 'వెయింగ్‌'లో వినేశ్‌ బరువు 49.90 కిలోలుగా వచ్చింది. అక్కడే కాస్త ప్రమాదం కనిపించినా, 50కి లోపు ఉండటంతో సమస్య రాలేదు. మూడు బౌట్‌లు ఆడి వరుస విజయాలతో ఫొగాట్‌ ఫైనల్‌ చేరింది.

ఆ తర్వాత ఏమైంది...

పోటీ పడే క్రమంలో విరామాల మధ్య ఆహారం, నీళ్లు తీసుకోవడంతో ఆమె సహజంగానే బరువు పెరిగింది. సెమీస్‌ తర్వాత ఇది 52.70 కేజీలుగా ఉంది. బుధవారం 'వెయింగ్‌'లోగా 2.70 కేజీలు తగ్గించాల్సిన అవసరం వచ్చింది.

ఏం చేశారు...



వినేశ్‌తో పాటు ఆమె న్యూట్రిషనిస్ట్, భారత చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ దిన్షా పర్దివాలా తదితరులు కలిసి రాత్రికి రాత్రే బరువు తగ్గించే ప్రయత్నం చేశారు. ఎలాంటి ఆహారం, నీరు ఇవ్వకపోవడంతోపాటు 12 గంటల వ్యవధిలో వివిధ రకాల ఎక్సర్‌సైజ్‌లు, ఆవిరి స్నానాలువంటి వాటితో వైద్యపరమైన జాగ్రత్తలు తీసుకుంటూనే బరువు తగ్గించాలని చూశారు. చెమట రావడం తగ్గిపోవడంతో జుట్టు కూడా కత్తిరించారు. ఒక దశలో రక్తం తగ్గించాలని కూడా భావించారు. అయితే వీటన్నింటి కారణంగా వినేశ్‌ దాదాపుగా కుప్పకూలిపోయే పరిస్థితి వచ్చినా అన్నింటికీ సిద్ధమైంది.

అన్నింటికీ సిద్ధపడ్డా...

సందేహంగానే వినేశ్‌ 'వెయింగ్‌'కు సిద్ధం కాగా... కానీ చివరకు 50 కేజీలకంటే మరో 100 గ్రాములు ఎక్కువగానే వచ్చింది. కొంత సమయం ఉంటే అదీ తగ్గించే వాళ్లమని మెడికల్‌ ఆఫీసర్‌ పర్దివాలా వెల్లడించారు. ఒక్కసారి అనర్హురాలని తేలడంతో ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి ఫ్లూయిడ్స్‌తో ఆమెకు చికిత్సను అందించారు.

తప్పెవరిది?

ప్లేయర్‌ సాధారణంగా తన ఆటపైనే దృష్టి పెడతారు. ఆమెతో పని చేసే వైద్యబృందం



ఇలాంటి విషయాలను చూసుకోవాలి. పోటీలు జరిగే సమయంలో జాగ్రత్తగా ఆహారం అందించాలి. ముఖ్యంగా బౌట్‌ల మధ్య ఆమెకు ఇచ్చిన ఆహారం విషయంలో బరువు పెరిగే అంశాలను చూసుకోవాల్సింది. ఒలింపిక్స్‌లాంటి ఈవెంట్‌లో ఇవి ఎంతో ముఖ్యం. అయితే ఎంత పెరిగినా సెమీ ఫైనల్‌ బౌట్‌ తర్వాత చూసుకోవచ్చు... ఎలాగైనా తగ్గించవచ్చనే అతి విశ్వాసమే దెబ్బ కొట్టిందని అర్థమవుతుంది. ఈ విషయంలో వైద్య బృందాన్ని తప్పు పట్టవచ్చు.

రజతం కూడా ఇవ్వరా!

2016 రియో ఒలింపిక్స్‌ తర్వాత రెజ్లింగ్‌ పోటీలను రెండు రోజులు నిర్వహిస్తున్నారు. అప్పటి వరకు ఒకసారి తొలి మ్యాచ్‌కు ముందు బరువు చూశాక కొందరు బలమైన ఆహారాన్ని తీసుకుంటూ తర్వాతి రౌండ్‌లలో చెలరేగారు. రెజ్లింగ్, బాక్సింగ్, జూడో తదితర యుద్ధ క్రీడల్లో సమ ఉజ్జీల మధ్యే పోరాటం జరగాలని, ఎక్కువ బరువు ఉన్నవారికి ఎలాంటి అదనపు ప్రయోజనం దక్కరాదనే కారణంతో రూల్‌ మార్చారు. నిబంధనల ప్రకారం రెండు రోజులూ బరువు చూస్తారు. రెండో రోజు 15 నిమిషాల సమయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. అందుకే ప్లేయర్లు 48 గంటల పాటు కడుపు మాడ్చుకొని అయినా సరే బరువు పెరగకుండా జాగ్రత్త పడతారు. సెమీస్‌ వరకు గెలిచింది కాబట్టి రజతం ఇవ్వవచ్చనే వాదన కొందరు లేవనెత్తారు. కానీ నిబంధనల ప్రకారం ఏ దశలో బరువు లెక్క తప్పినా అన్ని బౌట్‌ల ఫలితాలను రద్దు చేస్తారు. బరువు తగ్గే అవకాశం లేదని అర్థం కాగానే గాయం సాకుతో ఫైనల్‌కు ముందు ఓటమిని ఒప్పుకొని తప్పుకోవాల్సిందని కూడా అభిమానులు అనుకున్నారు. కానీ అదీ నిబంధనలకు విరుద్ధం. అంతకు ముందు మ్యాచ్‌లలో పోటీ పడుతూ మధ్యలో గాయమైతే తప్ప ప్లేయర్‌ రెండో వెయింగ్‌లో తప్పనిసరిగా బరువు చూపించాల్సిందే. అలా చేయకపోయినా అనర్హత వేటు పడుతుంది కాబట్టి వినేశ్‌కు ఆ అవకాశమూ లేకపోయింది.

వినేశ్‌ ఊహించలేదా!

సాధారణంగా ఆటగాళ్లు తమ శరీర బరువుకు దగ్గరలో ఉండే వెయిట్‌ కేటగిరీల్లో పోటీ పడతారు. అలా అయితే సన్నద్ధత సులువవుతుంది. పోటీలు లేని సమయంలో వినేశ్‌ 56–57 కేజీల బరువుంటుంది. ఏదైనా టోర్నీ రాగానే ఆ సమయంలో ఎలాగైనా కష్టపడి తన బరువును తగ్గించుకుంటూ వచ్చి ఆటకు సిద్ధమైపోయేది. ఈసారి కూడా అలాగే ఆశించి ఉండవచ్చు. కానీ బుధవారం ఉదయం అది సాధ్యం కాలేదు. అంచనాలు తప్పడంతో 100 గ్రాముల తేడా వచ్చేసింది. ఇతర అంతర్జాతీయ టోర్నీల్లో 2 కిలోల వరకు సడలింపు ఉంది. ఆ



టోర్నీల్లో అయితే 52 కేజీలు వచ్చినా సమస్య రాక పోయేది. కానీ ఒలింపిక్స్‌ నిబంధనలు చాలా కఠినంగా ఉండి అలాంటి సడలింపు లేదు.

భారత్‌లో నిరసన...

వినేశ్‌ ఉదంతంపై భారత పార్లమెంట్‌లో కూడా తీవ్ర చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం దీనిపై నిరసనను తెలియజేయాలని, ఆమెకు న్యాయం చేయాలని సభ్యులు కోరారు. మరోవైపు వినేశ్‌తో పాటు వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భారత రెజ్లింగ్‌ సమాఖ్య అధ్యక్షుడు సంజయ్‌ సింగ్‌ డిమాండ్‌ చేశారు. పారిస్‌లో పీటీ ఉష నేతృత్వంలో ఐఓఏ అధికారికంగా ఫిర్యాదు చేసినా... అంతర్జాతీయ రెజ్లింగ్‌ సమాఖ్య మాత్రం 'అన్నీ నిబంధనల ప్రకారమే' అంటూ అన్నింటినీ కొట్టిపారేసింది. మాజీ బాక్సర్, 2008 బీజింగ్‌ ఒలింపిక్స్‌ కాంస్య పతక విజేత విజేందర్‌ సింగ్‌... ఇందులో ఏదో కుట్ర జరిగిందని ఆరోపించాడు. అసాధారణంగా సాగిన వినేశ్‌ ఎదుగుదలను చూసి ఎవరైనా ఏదైనా చేసి ఉంటారని, 100 గ్రాములు అనే విషయం నమ్మశక్యంగా లేదని వ్యాఖ్యానించాడు.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్‌

హాకీ
పురుషుల కాంస్య పతక పోరు: భారత్‌ x స్పెయిన్‌ (సాయంత్రం గం. 5:30 నుంచి)

అథ్లెటిక్స్‌
మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌ రెపిచాజ్‌ రౌండ్‌: జ్యోతి యర్రాజీ (మధ్యాహ్నం గం. 2:05 నుంచి). పురుషుల జావెలిన్‌ త్రో ఫైనల్‌: నీరజ్‌ చోప్రా (రాత్రి గం. 11:55 నుంచి)

రెజ్లింగ్‌
పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్‌: అమన్‌ సెహ్రావత్‌ (మధ్యాహ్నం గం. 2:30 నుంచి). మహిళల ఫ్రీస్టయిల్‌ 57 కేజీలు: అన్షు మలిక్‌ (మధ్యాహ్నం గం. 2:30 నుంచి)

పతకాల పట్టిక



ర్యాంక్‌	దేశం	స్వ	ర	కాం	మొ
1	అమెరికా	25	33	32	90
2	చైనా	24	22	16	62
3	ఆస్ట్రేలియా	17	12	10	39
4	ఫ్రాన్స్‌	13	16	20	49
64	భారత్‌	0	0	3	3

నోట్‌: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్‌ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

నీరజ్‌పైనే పసిడి ఆశలు

నేడు పురుషుల జావెలిన్‌ త్రో ఫైనల్‌
- ఫేవరెట్‌గా భారత స్టార్‌ నీరజ్‌
- రాత్రి గం. 11:55 నుంచి స్పోర్ట్స్‌ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



పారిస్‌: యావత్‌ భారతావని ఆశలు మోస్తూ... పారిస్‌ ఒలింపిక్స్‌ క్వాలిఫయింగ్‌ రౌండ్‌లో అదరగొట్టిన జావెలిన్‌ త్రోయర్‌ నీరజ్‌ చోప్రా గురువారం ఫైనల్‌ బరిలో దిగనున్నాడు. వరుసగా రెండోసారి పసిడి పతకమే లక్ష్యంగా పారిస్‌లో అడుగు పెట్టిన నీరజ్‌చోప్రా.. అర్హత పోటీల్లో ఒకే ఒక్క త్రోతో అందరి దృష్టిని ఆకర్షించాడు. డిఫెండింగ్‌ చాంపియన్‌ హోదాకు న్యాయం చేస్తూ మంగళవారం క్వాలిఫయింగ్‌ ఈవెంట్‌ తొలి ప్రయత్నంలోనే జావెలిన్‌ను 89.34 మీటర్ల దూరం విసిరి దర్జాగా ఫైనల్‌ చేరాడు. పతకాల కోసం జరిగే ఫైనల్స్‌లో నీరజ్‌ అదే ప్రదర్శన కొనసాగించాలని చూస్తున్నాడు. అండర్సన్‌ పీటర్స్‌ (గ్రెనెడా), జూలియన్‌ వెబర్‌ (జర్మనీ), అర్షద్‌ నదీమ్‌ (పాకిస్తాన్‌), జాకుబ్‌ వెద్లెచ్‌ (చెక్‌ రిపబ్లిక్‌) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురవనుంది. ఈరోజు జరిగే ఫైనల్లో మొత్తం 12 మంది పతకాల కోసం పోటీ పడనున్నారు. ముందుగా జావెలిన్‌ త్రోయర్లకు మూడు అవకాశాలు ఇస్తారు. మూడు అవకాశాల తర్వాత చివరి నాలుగు స్థానాల్లో ఉన్న వారు నిష్క్రమిస్తారు. ఇక మిగిలిన ఎనిమిది మందికి మరో మూడు అవకాశాలు ఇస్తారు. మొత్తం ఆరు త్రోల తర్వాత టాప్‌-3లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.

భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు షట్లర్‌ పీవీ సింధు (2016 రియో; రజతం... 2020 టోక్యో; కాంస్యం), రెజ్లర్‌ సుశీల్‌ కుమార్‌ (2008 బీజింగ్‌ కాంస్యం; 2012 లండన్‌ రజతం), షూటర్‌ మనూ భాకర్‌ (2024 పారిస్‌; రెండు కాంస్యాలు) మాత్రమే విశ్వక్రీడల్లో రెండేసి పతకాలు సాధించారు. గురువారం నీరజ్‌ పోడియంపై నిలిస్తే ఈ జాబితాలో చేరనున్నాడు. ఇక అగ్రస్థానం దక్కించుకుంటే.. దేశం తరఫున వ్యక్తిగత విభాగంలో రెండు పసిడి పతకాలు గెలిచిన తొలి ప్లేయర్‌గా రికార్డుల్లో కెక్కనున్నాడు. నీరజ్‌ టైటిల్‌ నిలబెట్టుకుంటే.. ఒలింపిక్స్‌లో ఆ ఘనత సాధించిన ఐదో జావెలిన్‌ త్రోయర్‌ కానున్నాడు. విశ్వక్రీడల చరిత్రలో ఎరిక్‌ లామింగ్‌ (స్వీడన్‌; 1908, 1912), జానీ మైరా (ఫిన్‌లాండ్‌; 1920, 1924), జాన్‌ జెలెజ్నీ (చెక్‌ రిపబ్లిక్‌; 1992, 1996, 2000), ఆండ్రీస్‌ థోర్‌కిల్డ్‌సెన్‌ (నార్వే; 2004, 2008) స్వర్ణాన్ని నిలబెట్టుకున్నారు.

కాంస్యం కోసం ఆఖరి పోరు

- నేడు స్పెయిన్‌తో భారత్‌ 'ఢీ'
- సాయంత్రం గం. 5:30 నుంచి స్పోర్ట్స్‌ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



పారిస్‌: భారీ అంచనాలతో పారిస్‌ ఒలింపిక్స్‌ బరిలోకి దిగి ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయిన భారత పురుషుల హాకీ జట్టు.. గురువారం కాంస్య పతకం కోసం స్పెయిన్‌తో తలపడనుంది. టోర్నీ ఆరంభం నుంచి చక్కటి ఆటతీరు కనబర్చిన హర్మన్‌ప్రీత్‌ సింగ్‌ సారథ్యంలోని టీమిండియా.. మంగళవారం సెమీఫైనల్లో జర్మనీ చేతిలో ఓడి కాంస్య పతక పోరుకు చేరింది. మూడేళ్ల క్రితం జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లోనూ భారత్‌ కాంస్య పతకమే సాధించగా... వరుసగా రెండోసారి పోడియంపై నిలిచే అవకాశం టీమిండియా ముందుంది. జర్మనీతో సెమీఫైనల్లో భారత్‌ హోరాహోరీగా పోరాడి ఓడగా... మరో సెమీస్‌లో నెదర్లాండ్స్‌ చేతిలో స్పెయిన్‌ పరాజయం పాలైంది. బ్రిటన్‌తో క్వార్టర్‌ ఫైనల్‌ సందర్భంగా 'రెడ్‌ కార్డు'కు గురై సెమీస్‌కు అందుబాటులో లేకుండా పోయిన డిఫెండర్‌ అమిత్‌ రోహిదాస్‌... ఈ మ్యాచ్‌లో ఆడనుండటం భారత్‌కు సానుకూలాంశం. జర్మనీతో పోరులో పెనాల్టీ కార్నర్‌ అవకాశాలను సద్వినియోగపర్చుకోలేకపోయిన భారత్‌.. ఆ విషయంలో మరింత మెరుగవ్వాల్సిన అవసరం ఉంది. ఇక ఈ టోర్నీతో కెరీర్‌కు వీడ్కోలు పలుకనున్న గోల్‌కీపర్‌ పీఆర్‌ శ్రీజేశ్‌ మరోసారి కీలకం కానున్నాడు. 'సెమీస్‌ పరాజయం చాలా బాధించింది. పసిడి నెగ్గే సువర్ణ అవకాశం చేజారింది. అయితే ఆ ఓటమిని మరిచి కాంస్య పతక పోరుపై దృష్టి పెట్టాం. దేశానికి పతకం అందించేందుకు ఇదే చివరి అవకాశం. అందుకే ప్రతి ఆటగాడు దీన్ని వినియోగించుకోవాలని అనుకుంటున్నాడు' అని శ్రీజేశ్‌ అన్నాడు. ఒలింపిక్స్‌ వేదికగా స్పెయిన్‌తో భారత్‌ పది సార్లు తలపడగా.. అందులో ఏడింట గెలిచింది. ఒక మ్యాచ్‌ స్పెయిన్‌ నెగ్గగా.. మరో రెండు 'డ్రా'గా ముగిశాయి. ప్రస్తుత ప్రపంచ ర్యాంకింగ్స్‌లో స్పెయిన్‌ 8వ స్థానంలో ఉండగా.. టీమిండియా ఐదో ప్లేస్‌లో ఉంది.

అంతిమ్‌ తొలి రౌండ్‌లోనే...

1 నిమిషం 41 సెకన్లలో టర్కీ రెజ్లర్‌ చేతిలో ఓటమి



పారిస్‌: ఒలింపిక్స్‌ మహిళల రెజ్లింగ్‌లో భారత్‌కు మరో నిరాశాజనక ఫలితం వచ్చింది. కచ్చితంగా పతకంతో తిరిగి వస్తుందనుకున్న 19 ఏళ్ల భారత టీనేజ్‌ రెజ్లర్‌ అంతిమ్‌ పంఘాల్‌ తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. టర్కీ రెజ్లర్‌ యెట్‌గిల్‌ జెనెప్‌తో జరిగిన బౌట్‌లో అంతిమ్‌ 'టెక్నికల్‌ సుపీరియారిటీ' పద్ధతిలో ఓటమి చవిచూసింది. యెట్‌గిల్‌ ధాటికి అంతిమ్‌ 1 నిమిషం 41 సెకన్లలో ప్రత్యర్థికి 10 పాయింట్లు సమర్పించుకుంది. ఇద్దరి రెజ్లర్ల మధ్య 10 పాయింట్ల తేడా వచ్చిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపి వేసి పది పాయింట్ల ఆధిక్యం సాధించిన రెజ్లర్‌ను 'టెక్నికల్‌ సుపీరియారిటీ' పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. యెట్‌గిల్‌ క్వార్టర్‌ ఫైనల్లో ఓడిపోవడంతో అంతిమ్‌కు రెపిచాజ్‌ పద్ధతిలో కనీసం కాంస్య పతకం గెలిచే అవకాశం కూడా లేకుండా పోయింది. హరియాణాకు చెందిన అంతిమ్‌ గత ఏడాది ప్రపంచ సీనియర్‌ చాంపియన్‌షిప్‌లో 53 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించి పారిస్‌ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆసియా క్రీడల్లోనూ అంతిమ్‌ కాంస్య పతకం గెలిచింది. రెండుసార్లు 53 కేజీల్లో అంతిమ్‌ అండర్‌–23 వరల్డ్‌ చాంపియన్‌గా నిలిచింది. వాస్తవానికి 53 కేజీల విభాగం వినేశ్‌ ఫొగాట్‌ రెగ్యులర్‌ వెయిట్‌ కేటగిరీ. అంతిమ్‌ ఒలింపిక్‌ బెర్త్‌ దక్కించుకోవడం ... జాతీయ రెజ్లింగ్‌ సమాఖ్య ఈ వెయిట్‌ కేటగిరీ కోసం ఎలాంటి ట్రయల్స్‌ నిర్వహించబోమని చెప్పడంతో వినేశ్‌ 50 కేజీల విభాగానికి మారాల్సి వచ్చింది.


'వినేశ్‌ ఫొగాట్‌కు న్యాయం చేయాలి'

న్యూఢిల్లీ: రెజ్లర్‌ వినేశ్‌ ఫొగాట్‌పై ఒలింపిక్స్‌లో అనర్హత వేటు కుట్రలా కనిపిస్తోందని, ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ ఇండియా కూటమి ఎంపీలు బుధవారం పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన చేపట్టారు. వినేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ కాంగ్రెస్, టీఎంసీ, ఎన్సీపీ (ఎస్పీ), జేఎంఎం, ఆర్జేడీ, సమాజ్‌వాది పార్టీల ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభ నుంచి వాకౌట్‌ చేశారు. 'ప్రతిపక్షం మొత్తం వాకౌట్‌ చేసింది. మోదీ ఓదార్పు ట్వీట్‌ చేశారు. దాంతో ఏమీ జరగదు మోదీజీ. ఆమెకు న్యాయం జరగాలి' అని కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి రణదీప్‌ సూర్జేవాలా అన్నారు.

'మొదట ఆ ఆడకూతురుని ఢిల్లీ వీధుల్లో ఈడ్చుకెళ్లారు. ఇప్పుడు ఆమెపై అనర్హత వేటు పడితే.. కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉంది. ఇది కుట్ర కోణాన్ని సూచిస్తోంది. భారత క్రీడా చరిత్రలో ఇదో బ్లాక్‌డే. 140 కోట్ల మంది భారతీయులు ప్రభుత్వాన్ని క్షమించరు' అని ఆయన అన్నారు. పార్లమెంటు మకర ద్వారం మెట్లపై విపక్ష ఎంపీలు నిరసనకు దిగారు. వినేశ్‌ ఫొగాట్‌పై కుట్రను ఆపాలి, ఆమెకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఫొగాట్‌ అంశంపై రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడతానని కోరగా చైర్మన్‌ జగ్‌దీప్‌ ధన్‌ఖడ్‌ అనుమతి ఇవ్వలేదు. దాంతో ఇండియా కూటమి ఎంపీలు వాకౌట్‌ చేశారు.

ఒకే ఒక్కడు... లోపెజ్‌

ఒకే ఈవెంట్‌లో ఐదు స్వర్ణాలు నెగ్గిన తొలి క్రీడాకారుడిగా క్యూబా రెజ్లర్‌ ఘనత



పారిస్‌: 128 ఏళ్ల ఒలింపిక్స్‌ క్రీడల చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని ఘనతను క్యూబా దిగ్గజ రెజ్లర్‌ మిజైన్‌ లోపెజ్‌ నునెజ్‌ సాధించాడు. విశ్వ క్రీడల్లో ఒకే ఈవెంట్‌లో ఐదు స్వర్ణ పతకాలు సాధించిన తొలి క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించాడు. 41 ఏళ్ల లోపెజ్‌ గడిచిన 20 ఏళ్లుగా గ్రీకో రోమన్‌ 130 కేజీ కేటగిరీలోనే పోటీపడుతున్నాడు. 2004 ఏథెన్స్‌ ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేసిన లోపెజ్‌ ఐదో స్థానంతో తృప్తి పడ్డాడు. మరో నాలుగేళ్లు తిరిగేసరికి బీజింగ్‌ ఒలింపిక్స్‌లో చాంపియన్‌గా అవతరించి ఘన చరిత్రకు శ్రీకారం చుట్టాడు. అనంతరం లండన్‌ (2012), రియో (2016), టోక్యో (2020), తాజాగా పారిస్‌ ఒలింపిక్స్‌లోనూ గ్రీకో రోమన్‌ 130 కేజీల విభాగంలోనే పసిడి పతకాన్ని నిలబెట్టుకున్నాడు. తద్వారా ఒలింపిక్స్‌లో ఒకే ఈవెంట్‌లో ఐదు స్వర్ణాలు సాధించిన తొలి అథ్లెట్‌గా చరిత్ర పుటలకెక్కాడు. మంగళవారం రాత్రి జరిగిన పురుషుల గ్రీకో 130 కేజీల కేటగిరీ ఫైనల్లో లోపెజ్‌ 6–0తో చిలీకి చెందిన యస్మాని అకొస్తాను చిత్తు చేశాడు. ఒలింపిక్స్‌లో ఐదో స్వర్ణం సాధించిన తర్వాత లోపెజ్‌ రెజ్లింగ్‌ నుంచి వీడ్కోలు తీసుకున్నట్లు ప్రకటించాడు. మూడేళ్ల క్రితం టోక్యోలో పసిడి పతకాన్ని నిలబెట్టుకున్న లోపెజ్‌ 'పారిస్‌'లో అడుగు పెట్టేదాకా మరే టోర్నీలోనూ బరిలోకి దిగకపోవడం విశేషం. ఒకే ఈవెంట్‌లో నాలుగు స్వర్ణ పతకాలు నెగ్గిన క్రీడాకారుల జాబితాలో మహిళా రెజ్లర్‌ కవోరి ఇచో (జపాన్‌), పాల్‌ ఎల్వ్‌స్ట్రామ్‌ (డెన్మార్క్‌; సెయిలింగ్‌), అథ్లెట్లు అల్‌ఓర్టర్‌ (అమెరికా), కార్ల్‌ లూయిస్‌ (అమెరికా), స్విమ్మర్లు మైకేల్‌ ఫెల్ప్స్‌ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా), షూటర్‌ విన్సెంట్‌ హాన్‌కాక్‌ (అమెరికా) ఉన్నారు. తాజా స్వర్ణంతో లోపెజ్‌ ఈ ఏడుగురిని అధిగమించాడు.

సాక్షి బిజినెస్

గురువారం
8-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	875	79,468
నిఫ్టీ ▲	305	24,298

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,403	▲	38
డోజోన్స్	39,086	▲	88
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,167	▲	140
డాక్స్	17,615	▲	261
షాంఘై	2,870	▲	3
నికాయ్	35,090	▲	414

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత) 68,941	▼	241
బంగారం (99.5 స్వచ్ఛత) 68,665	▼	240
వెండి (కేజీ) 79,159	▲	11

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.46	84.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.06	108.63
€	యూరో	ఎస్‌బీఐ	90.79	93.17
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.94	58.24
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.76	55.68
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.01	65.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.49	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.97	23.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.86	12.68



- ఒకసారి చార్జింగ్‌తో 585 కి.మీ.
- ప్రారంభ ధర 17.49 లక్షలు

టాటా కర్వ్ ఈవీ వచ్చేసింది!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ కర్వ్.ఈవీ ఎస్‌యూవీ కూపే విడుదల చేసింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.17.49 లక్షలతో ప్రారంభమై రూ.21.25 లక్షల వరకు ఉంది. ఆరు వేరియంట్లలో లభిస్తుంది. 2023 ఆటో ఎక్స్‌పోలో కాన్సెప్ట్ రూపంలో ఈ కారు తొలిసారిగా దర్శనమిచ్చింది. కర్వ్.ఈవీ చేరికతో టాటా మోటార్స్ ఖాతాలో ఎలక్ట్రిక్ మోడళ్ల సంఖ్య అయిదుకు చేరుకుంది. 123 కిలోవాట్ ఎలక్ట్రిక్ మోటార్ కర్వ్.ఈవీలో పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 45 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో 502 కిలోమీటర్లు, 55 కి.వా.అవర్ బ్యాటరీ ప్యాక్‌తో 585 కి.మీ. ప్రయాణిస్తుంది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 8.6 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ట వేగం గంటకు 160 కిలోమీటర్లు. భారత్ ఎన్‌సీఏపీ 5 స్టార్ రేటింగ్ ఉంది.

ఇవీ అదనపు ఫీచర్లు..

20కిపైగా సేఫ్టీ ఫీచర్స్‌తో లెవెల్–2 అడాస్, 360 డిగ్రీ కెమెరా, బ్లైండ్ స్పాట్ మానిటరింగ్ సిస్టమ్, 6 ఎయిర్‌బ్యాగ్స్, ఆటోహోల్డ్‌తో ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, 190 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్, 18 అంగుళాల వీల్స్, పనోరమిక్ సన్‌రూఫ్ ఇతర హంగులు. 40 నిమిషాల్లో బ్యాటరీ 80% చార్జింగ్ పూర్తి అవుతుంది. కర్వ్ ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ మోడల్‌ను సెప్టెంబర్ 2న ఆవిష్కరిస్తున్నట్టు టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ శైలేశ్ చంద్ర తెలిపారు. లక్ష టాటా ఈవీలు భారత రోడ్లపై పరుగెడుతున్నాయన్నారు. కంపెనీకి ఎలక్ట్రిక్ కార్ల విపణిలో 70% వాటా ఉందన్నారు.

బుల్ బ్యాక్ ర్యాలీ

- కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు
- సెన్సెక్స్ లాభం 875 పాయింట్లు
- 305 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- ఇన్వెస్టర్లకు రూ.9 లక్షల కోట్ల లాభం



ముంబై: బ్యాంకులు, మెటల్, ఐటీ, ఆయిల్ షేర్లకు కనిష్ట స్థాయి వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మూడు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల మద్దతు లభించింది. బ్రెంట్ క్రూడాయిల్ ధరలు ఏడు నెలల కనిష్టానికి చేరుకోవడంతో దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలకు దీటుగా సంస్థాగత ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపడుతున్నారు. ఫలితంగా సెన్సెక్స్ 875 పాయింట్లు పెరిగి 79,468 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 305 పాయింట్లు బలపడి 24,298 వద్ద నిలిచింది. ఉదయం భారీ లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1046 పాయింట్లు పెరిగి 79,639 వద్ద, నిఫ్టీ 345 పాయింట్లు బలపడి 24,338 వద్ద గరిష్టాలు అందుకున్నాయి. ఇళ్ల క్రయ విక్రయాలపై చెల్లించే దీర్ఘకాల మూలధన లాభాల పన్నుకు సంబంధించి సడలింపుతో రియల్టీతో పాటు అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ మిడ్, క్యాప్ సూచీలు 2.63%, 2.39 శాతం లాభపడ్డాయి. ఆర్థిక అస్థిర పరిస్థితుల్లో కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లను పెంచదంటూ బ్యాంక్ ఆఫ్ జపాన్ డిప్యూటీ గవర్నర్ వ్యాఖ్యలతో పాటు అమెరికాలో మాంద్యం భయాలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి.

- ఈ ఏడాది జూలై 23 కంటే ముందు ఇళ్ల క్రయ విక్రయాలపై చెల్లించే దీర్ఘకాల మూలధన లాభాల పన్నుకు సంబంధించి ఉన్న కొత్త, పాత విధానాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించడంతో రియల్టీ షేర్లు ర్యాలీ చేశాయి. ఒమెక్స్ 5%, ఒబెరాయ్ రియల్టీ , డీఎల్‌ఎఫ్ 3% రాణించాయి. అన్సల్ ప్రాపర్టీస్, మెక్రోటెక్, గోద్రెజ్ ప్రాపర్టీస్ 2%, అజ్మీరా రియల్టీ 1%, మహీంద్రా లైఫ్‌స్పేస్ అర శాతం చొప్పున లాభపడ్డాయి.
- సెన్సెక్స్ ర్యాలీతో ఒక్కరోజులో రూ.8.97 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.448 లక్షల కోట్లకు చేరింది.
- తొలి త్రైమాసికంలో నికరలాభం 37% వృద్ధి చెందడంతో తో వేదాంత షేరు బీఎస్‌ఈలో 4.50% పెరిగి రూ.432.50 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టాప్ గేర్‌లో రిలయన్స్	దక్షిణాదిపై పాలసీ బజార్ మరింత ఫోకస్

ఎలక్ట్రిక్ టూవీలర్స్..


పోటీ 'ఫాస్ట్ చార్జ్'!


ఎలక్ట్రిక్ టూవీలర్ల అమ్మకాలు మళ్లీ ఫుల్ స్వింగ్‌లో పరుగులు తీస్తున్నాయి. తాజాగా జూలై నెలలో సేల్స్ దాదాపు రెట్టింపు కావడం దీనికి నిదర్శనం. మరోపక్క, ఈ విభాగంలో పోటీ ఫాస్ట్ చార్జింగ్ అవుతోంది. మార్కెట్ లీడర్‌గా ఉన్న ఓలా ఎలక్ట్రిక్‌కు సాంప్రదాయ టూవీలర్ దిగ్గజాలు షాకిస్తున్నాయి. ధరల యుద్ధానికి తెరతీసి, ఓలా మార్కెట్ వాటాకు గండికొడుతున్నాయి. ఐపీఓ సక్సెస్‌తో దండిగా నిధుల జోష్‌లో ఉన్న ఓలా.. ఈ పోటీని ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తి రేపుతోంది! - సాక్షి, బిజినెస్ డెస్క్

ఈ ఏడాది జూలై నెలలో దేశవ్యాప్తంగా మొత్తం 1,07,016 ఈ-టూవీలర్లు రోడ్డెక్కాయి. గతేడాది అమ్ముడైన 54,616 వాహనాలతో పోలిస్తే 96 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది జూన్‌లో అమ్మకాలు 79,868 మాత్రమే. గత కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉన్న సేల్స్ మళ్లీ ఎలక్ట్రిక్ వేగంతో దూసుకెళ్తున్నాయి. పెట్రోలు టూవీలర్లలో రారాజులుగా ఉన్న సాంప్రదాయ టూవీలర్ కంపెనీలు.. బజాజ్ ఆటో, టీవీఎస్ మోటార్స్, హీరో మోటో సైతం ఎలక్ట్రిక్ బరిలో తగ్గేదేలే అంటూ కాలుదువ్వడమే దీనికి ప్రధాన కారణం. జూలైలో బజాజ్ ఆటో ఏకంగా 17,642 ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయించడం విశేషం. జూన్‌తో పోలిస్తే 80 శాతం సేల్స్ పెరిగాయి. మార్కెట్ వాటా సైతం 11.6 శాతం నుంచి 16.9 శాతానికి జంప్ చేసింది. ఇక టీవీఎస్ అమ్మకాలు 30 శాతం పైగా ఎగబాకి 19,471 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ రెండింటితో పోలిస్తే వెనుకబడ్డ హీరో మోటో 5,044 ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయించి సత్తా చాటింది. మొత్తంమీద చూస్తే, ఈ మూడు దిగ్గజాల 'ఎలక్ట్రిక్' వాటా 40 శాతానికి పైగా ఛార్జింగ్ అయింది. ఇందులో టీవీఎస్, బజాజ్ వాటాయే దాదాపు 35 శాతం గమనార్హం.

ఓలాకు షాక్...

రెండు నెలల క్రితం, మే నెలలో దాదాపు 50 శాతం మార్కెట్ వాటాతో తిరుగులేని స్థానంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్‌కు పోటీ సెగ బాగానే తగులుతోంది. జూన్‌లో కంపెనీ 36,781 వాహనాలు విక్రయించగా.. జూలైలో ఈ సంఖ్య కాస్త మెరుగుపడి 41,597కు చేరింది. అయితే, మార్కెట్ వాటా మాత్రం జూన్‌లో 47.5 శాతానికి, ఆపై జూలైలో ఏకంగా 40 శాతానికి పడిపోయింది. ఓలాకు తగ్గుతున్న మార్కెట్ వాటాను సాంప్రదాయ టూవీలర్ కంపెనీలు ఎలక్ట్రిక్ వేగంతో కొట్టేస్తున్నాయి. మరోపక్క, పూర్తిగా ఎలక్ట్రిక్ స్కూటర్లను విక్రయిస్తున్న ఏథర్ ఎనర్జీ క్రమంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటోంది. జూన్‌లో 6,189 (8% మార్కెట్ వాటా), జూలైలో 10,080 (10% వాటా) వాహనాలను అమ్మింది. అయితే, దీని స్కూటర్ల ధరలు రూ. లక్ష పైనే ఉన్నాయి. సాంప్రదాయ టూవీలర్ దిగ్గజాలు రూ. లక్ష లోపు ధరతో ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేస్తుండటంతో.. ఓలా, ఏథర్ వంటి పూర్తి ఈవీ కంపెనీలు కూడా ధరల యుద్ధంలోకి దూకాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్ వాటా పతనంతో ఓలా ఇక పూర్తిగా ఈ-టూవీలర్లపైనే దృష్టిసారించాలని నిర్ణయించుకుంది.





భారీ నెట్‌వర్క్, సర్వీస్ ప్లస్..

తొలిసారిగా రూ. లక్ష లోపు స్కూటర్లను ప్రవేశపెట్టడం కూడా బజాజ్, టీవీఎస్, హీరో అమ్మకాలు పుంజుకున్నాయి. 'ఈ 3 సాంప్రదాయ టూవీలర్ కంపెనీలకు విస్తృత డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, బ్రాండ్ విలువ, సర్వీస్ సదుపాయాలు దన్నుగా నిలుస్తున్నాయి.మార్కెట్ వాటాను కొల్లగొట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి' అని రీసెర్చ్ సంస్థ నోమురా ఆటోమోటివ్ రిటైల్ విభాగం హెడ్ హర్షవర్ధన్ శర్మ పేర్కొన్నారు. ధరల పోరు, బ్యాటరీ టెక్నాలజీలో మెరుగుదల వంటివి ఈ విభాగంలో పోటీని మరింత తీవ్రతరం చేయనుంది. తాజా పరిణామాలతో ఛార్జింగ్ స్టేషన్ల భారీ పెరుగుదలతో పాటు ఇతరత్రా మౌలిక సదుపాయాలు జోరందుకుంటాయని, వినియోగదారులకు కూడా ఇది మేలు చేకూరుస్తుందని హర్షవర్ధన్ చెప్పారు.

ఐటీసీ సన్‌ఫీస్ట్ సూపర్ ఎగ్ అండ్ మిల్క్ బిస్కెట్లు



కోల్‌కతా: ఎఫ్‌ఎంసీజీ సంస్థ ఐటీసీ.. పాలు, గుడ్ల సమ్మేళనంతో 'సన్‌ఫీస్ట్ సూపర్ ఎగ్ అండ్ మిల్క్' బిస్కెట్లను మార్కెట్లోకి విడుదల చేసింది. భారతీయుల సంపూర్ణ పోషక వినియోగాన్ని మరింత పెంచే లక్ష్యంతో వీటిని తీసుకొచ్చి నట్లు కంపెనీ తెలిపింది. కష్టమర్ల బడ్జెట్‌కు అనుగుణంగా రూ.5, 10, 30 ధరల ప్యాకెట్ల రూపంలో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 'పాలు గుడ్డు కలయికతో తయారీ చేసిన బిస్కెట్లను మార్కెట్లో అతి తక్కువ ధరకు విక్రయించే తొలి కంపెనీగా ఐటీసీ నిలిచింది' అని ఐటీసీ ఫుడ్స్ బిస్కెట్స్ కేక్స్ క్లస్టర్ సీవోవో అలీ హారిస్ షేరే తెలిపారు.


ఉద్యోగులకు నంబర్‌1 మైక్రోసాఫ్ట్

- ఆకర్షిస్తున్న టెక్ దిగ్గజం
- తర్వాతి స్థానాల్లో టీసీఎస్, అమెజాన్
- ర్యాండ్‌స్టాడ్ బ్రాండ్ రీసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ: భారత్‌లో ఉద్యోగులకు అత్యంత ఆకర్షణీయమైన సంస్థగా మైక్రోసాఫ్ట్ మొదటి స్థానంలో నిలిచింది. టీసీఎస్, అమెజాన్ రెండు, మూడో స్థానాల్లో ఉన్నట్టు 'ర్యాండ్‌స్టాడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్‌ఈబీఆర్) 2024' నివేదిక తెలిపింది. ఆర్థిక సామర్థ్యం, మంచి పేరు, కెరీర్‌లో చక్కని పురోగతి అవకాశాలు ఈ మూడూ ఉద్యోగులు ప్రధానంగా చూసే అంశాలు. వీటి పరంగా మైక్రోసాఫ్ట్ ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. టాటా పవర్, టాటా మోటార్స్, శామ్‌సంగ్ ఇండియా, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మెర్సెడెస్ బెంజ్ వరుసగా టాప్–10లో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 1,73,000 మంది ప్రతినిధులు, 6,084 కంపెనీల అభిప్రాయాలను సర్వేలో భాగంగా ర్యాండ్‌స్టాడ్ తెలుసుకుంది. భారత్ నుంచి 3,507 మంది అభిప్రాయాలు స్వీకరించింది.

సాక్షి స్పోర్ట్స్


జ్యోతి

జ్యోతి, అన్నూ రాణి విఫలం

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో బుధవారం భారత క్రీడాకారులకు కలిసి రాలేదు. బరిలో దిగిన ఒక్కరు కూడా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించలేకపోయారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ తన అత్యుత్తమ ప్రదర్శనను కూడా నమోదు చేయలేకపోయింది. ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పోటీపడుతున్న తొలి భారతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందిన జ్యోతి 13.16 సెకన్లలో గమ్యానికి చేరి ఏడో స్థానంలో నిలిచింది. సెమీఫైనల్లో స్థానం కోసం జ్యోతికి రెపిచాజ్ రూపంలో మరో అవకాశం ఉంది. విశాఖపట్నం జిల్లాకు చెందిన 24 ఏళ్ల జ్యోతి గతంలో 12.78 సెకన్లతో 100 మీటర్ల హర్డిల్స్‌లో తన పేరిట జాతీయ రికార్డులిఖించుకుంది. మహిళల జావెలిన్ త్రో క్వాలిఫయింగ్‌లో అన్ను రాణి ఈటెను 55.81 మీటర్ల దూరం విసిరి గ్రూప్ 'ఎ'లో 15వ స్థానంలో, ఓవరాల్‌గా 26వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించలేదు. పురుషుల హైజంప్‌లో సర్వేశ్ కుషారే క్వాలిఫయింగ్‌ను దాటలేకపోయాడు. సర్వేశ్ 2.15 మీటర్ల ఎత్తుకు ఎగిరి ఓవరాల్‌గా 25వ స్థానంలో నిలిచాడు. మారథాన్ రేస్ వాక్ మిక్స్‌డ్ రిలే టీమ్‌లో సూరజ్ పన్వర్–ప్రియాంక గోస్వామి జోడీ రేసును పూర్తి చేయలేకపోవడం గమనార్హం.


మనూ భాకర్
జస్పాల్ రాణా

'మిషన్ 2028' మొదలైంది...

- లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు ప్రణాళిక సిద్ధమైందన్న మనూ భాకర్
- బుధవారం స్వదేశానికి వచ్చిన స్టార్ షూటర్
- శనివారం ముగింపు వేడుకలకు మళ్లీ పారిస్ వెళ్లనున్న మనూ

న్యూఢిల్లీ: నాలుగేళ్ల తర్వాత జరగనున్న 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ కోసం ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని భారత స్టార్ షూటర్ మనూ భాకర్ వెల్లడించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించిన మనూ బుధవారం స్వదేశానికి తిరిగి వచ్చింది. స్థానిక ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మనూ భాకర్, ఆమె కోచ్ జస్పాల్ రాణాకు ఘనస్వాగతం లభించింది. 22 ఏళ్ల మనూ భాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంతో పాటు మిక్స్‌డ్ విభాగంలో కాంస్య పతకాలు గెలుచుకొని.. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన తొలి భారత మహిళగా రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మనూ భాకర్ మాట్లాడుతూ. 'పారిస్ ఒలింపిక్స్ ముగింపు దశకు చేరుకున్నాయి. నేనప్పుడే 2028 లాస్ ఏంజెలిస్ క్రీడల కోసం ప్రయాణం ప్రారంభించా. కాస్త విరామం అనంతరం సాధన మొదలుపెడతాను. భవిష్యత్తులోనూ ఇదే నిలకడ చూపేందుకు ప్రయత్నిస్తా. అందుకోసం మరింత శ్రమిస్తా. కాకపోతే ఇప్పుడు కొంతకాలం కుటుంబ సభ్యులతో గడుపుతాను. మూడు నెలల తర్వాత తిరిగి షూటింగ్ ప్రాక్టీస్ ప్రారంభిస్తా' అని ఆమె వెల్లడించింది. విశ్వక్రీడల్లో రెండు పతకాలు సాధించడంతో పాటు 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో త్రుటిలో పతకం చేజార్చుకున్న మనూ భాకర్.. శనివారం తిరిగి పారిస్ వెళ్లనుంది. ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో మనూ భారత బృందానికి పతాకధారిగా వ్యవహరించనుంది.

భారత మహిళల టీటీ జట్టు అవుట్



పారిస్: ఒలింపిక్స్‌లో భారత మహిళల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు పోరాటం ముగిసింది. జర్మనీ జట్టుతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆకుల శ్రీజ, మనిక బత్రా, అర్చనా కామత్‌లతో కూడిన భారత జట్టు 1–3తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో శ్రీజ–అర్చన ద్వయం 5–11, 11–8, 10–12, 6–11తో చైనా సంతతికి చెందిన జర్మనీ జోడీ యువాన్ వాన్–జియోనా షాన్ చేతిలో పరాజయం పాలైంది. రెండో మ్యాచ్‌లో మనిక బత్రా 11–8, 5–11, 7–11, 5–11తో అనెట్ కౌఫమన్ చేతిలో ఓడింది. మూడో మ్యాచ్‌లో అర్చన 19–17, 1–11, 11–5, 11–9తో జియోనా షాన్‌ను ఓడించింది. అయితే నాలుగో మ్యాచ్‌లో శ్రీజ 6–11, 7–11, 7–11తో అనెట్ చేతిలో ఓడిపోవడంతో భారత కథ ముగిసింది.

27 ఏళ్ల తర్వాత...

శ్రీలంక జట్టుకు వన్డే సిరీస్ కోల్పోయిన భారత్




రోహిత్ శర్మ

- చివరి వన్డేలోనూ ఓడిన రోహిత్ సేన
- స్పిన్‌కు దాసోహమైన బ్యాటర్లు
- 138 పరుగులకే ఆలౌట్
- లంకను గెలిపించిన అవిష్క, కుశాల్, వెలలగే

కొలంబో: ఆతిథ్య స్పిన్‌ను ఎదుర్కోలేక బ్యాటర్లంతా చేతులెత్తేయడంతో భారత జట్టు సిరీస్‌ను సమం చేసుకోలేకపోయింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గలేకపోయిన టీమిండియా సిరీస్‌ను 0–2తో శ్రీలంకకు సమర్పించుకుంది. బుధవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో శ్రీలంక 110 పరుగుల తేడాతో గెలిచింది. తద్వారా టీమిండియాపై 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. ఓపెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవిష్క ఫెర్నాండో (102 బంతుల్లో 96; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (82 బంతుల్లో 59; 4 ఫోర్లు) రాణించారు. రియాన్ పరాగ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం భారత్ 26.1 ఓవర్లలో 138 పరుగుల వద్దే కుప్పకూలింది. రోహిత్ శర్మ (20 బంతుల్లో 35; 6 ఫోర్లు, 1 సిక్స్) చేసిన పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోర్! తర్వాత టెయిలెండర్ వాషింగ్టన్ సుందర్ (25 బంతుల్లో 30; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుగ్గా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దునిత్ వెలలగే (5/27) చావుదెబ్బ తీయగా, వాండెర్సే, తీక్షణ చెరో 2 వికెట్లు పడగొట్టారు. తమకు కలిసొచ్చిన స్పిన్ ట్రాక్‌పై పది వికెట్లలో స్పిన్నర్లే 9 వికెట్లు పడగొట్టేశారు.

టాపార్డర్ రాణింపుతో...

టాస్ నెగ్గగానే బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంకకు ఓపెనర్లు నిసాంక, అవిష్క ఫెర్నాండో శుభారంభమిచ్చారు. ఓపెనర్లిద్దరు భారత బౌలర్లపై ఆధిపత్యాన్ని కొనసాగించారు. స్పిన్నర్లను దించినా యథేచ్ఛగా పరుగులు రాబట్టారు. ఎట్టకేలకు ఓపెనింగ్ వికెట్‌కు 89 పరుగులు జతయ్యాక నిసాంకను అక్షర్ అవుట్ చేశాడు. కానీ తర్వాత వచ్చిన కుశాల్‌తో అవిష్క మరో భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టాడు. 65 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకొని సెంచరీ దిశగా సాగుతున్న అవిష్కను జట్టు స్కోరు 171 వద్ద పరాగ్ పెవిలియన్ చేర్చడంతో రెండో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత అసలంక (10), సమరవిక్రమ (0), జనిత్ (8), వెలలగే (2)లపై భారత బౌలర్లు ప్రభావం చూపారు. 77 బంతుల్లో ఫిఫ్టీ చేసిన కుశాల్‌ను కుల్దీప్ బోల్తా కొట్టించడంతో లంకను 250 పరుగుల్లోపే కట్టడి చేశారు.

ఈసారి వెలలగే వలలో...

ఓపెనర్, కెప్టెన్ రోహిత్ ఎప్పట్లాగే తనశైలి దూకుడుతో ఆరంభం నుంచే ధాటిగా పరుగులు రాబట్టే పనిలో పడ్డాడు. కానీ శుబ్‌మన్ గిల్ (6) సీమర్ అసిత ఫెర్నాండో వేసిన ఐదో ఓవర్లోనే క్లీన్ బౌల్డయ్యాడు. కోహ్లి (18 బంతుల్లో 20; 4 ఫోర్లు)తో కలిసి 'హిట్‌మ్యాన్' జట్టు స్కోరును 50 పరుగులు దాటించాడు. కానీ కాసేపటికే వెలలగే స్పిన్ మ్యాజిక్‌కు రోహిత్ వికెట్ సమర్పించుకోవడంతో గత రెండు మ్యాచ్‌ల వైనమే ఇందులోనూ కొనసాగింది. కెప్టెన్ వికెట్ పడగానే షరామామూలుగా రిషభ్ పంత్ (9), కోహ్లి, అక్షర్ పటేల్ (2), శ్రేయస్ అయ్యర్ (8) పెవిలియన్‌కు క్యూకట్టడంతో 82 పరుగులకే భారత్ 6 వికెట్లను కోల్పోయి పరాజయానికి సిద్ధమైంది. జట్టుస్కోరు 100 పరుగులకు చేరగానే వాండెర్సే... పరాగ్ (15)ను, తదుపరి ఓవర్లో శివమ్ దూబే (9)ను పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో వాషింగ్టన్ సుందర్ కొట్టిన ఆ కొద్దిపాటి మెరుపులతో వంద పైచిలుకు స్కోరు చేసిందే తప్ప కనీసం 150 దగ్గరకు వెళ్లలేకపోయింది. సుందర్‌ను తీక్షణ, కుల్దీప్ (6)ను వెలలగే అవుట్ చేయడంతో భారత్ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) పంత్ (బి) అక్షర్ 45; అవిష్క (ఎల్బీడబ్ల్యూ) (బి) పరాగ్ 96; కుశాల్ (సి) గిల్ (బి) కుల్దీప్ 59; అసలంక (ఎల్బీడబ్ల్యూ) (బి) పరాగ్ 10; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 0; జనిత్ (బి) సుందర్ 8; వెలలగే (బి) పరాగ్ 2; కమిందు (నాటౌట్) 23; తీక్షణ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 248. వికెట్ల పతనం:** 1–89, 2–171, 3–183, 4–184, 5–196, 6–199, 7–235. **బౌలింగ్:** సిరాజ్ 9–0–78–1, శివమ్ దూబే 4–0–9–0, అక్షర్ 10–1–41–1, సుందర్ 8–1–29–1, కుల్దీప్ 10–0–36–1, రియాన్ పరాగ్ 9–0–54–3.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) కుశాల్ (బి) వెలలగే 35; గిల్ (బి) అసిత ఫెర్నాండో 6; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 20; పంత్ (స్టంప్డ్) కుశాల్ (బి) తీక్షణ 6; అయ్యర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 8; అక్షర్ (బి) వెలలగే 2; పరాగ్ (బి) వాండెర్సే 15; దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 9; సుందర్ (సి) వాండెర్సే (బి) తీక్షణ 30; కుల్దీప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 6; సిరాజ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (26.1 ఓవర్లలో ఆలౌట్) 138. వికెట్ల పతనం:** 1–37, 2–53, 3–63, 4–71, 5–73, 6–82, 7–100, 8–101, 9–138, 10–138. **బౌలింగ్:** అసిత ఫెర్నాండో 5–0–29–1, తీక్షణ 8–0–45–2, వెలలగే 5.1–0–27–5, వాండెర్సే 5–0–34–2, అసలంక 3–1–2–0.

ద్రోణి ప్రభావం.. రాష్ట్రంలో 3 రోజులు వర్షాలు

- 24 గంటల్లో అల్పపీడనంగా మారనున్న ద్రోణి
- ఒడిశాపైనే ఎక్కువ ప్రభావం


జలమయమైన విజయవాడ పటమట రోడ్డు

సాక్షి, అమరావతి: రాయలసీమ, తమిళనాడు పరిసరాలపై ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఉత్తర ఒడిశా పరిసర ప్రాంతాలపై విస్తరించి ఉన్న మరో ద్రోణి వచ్చే 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ఏర్పడినా దాని ప్రభావం ఒడిశాపైనే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కానీ రాయలసీమపై ఉన్న ద్రోణి ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, బుధవారం గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పార్వతీపురం మన్యం, కర్నూలు, నంద్యాల తదితర జిల్లాల్లో ఎడతెగని వర్షాలు కురిశాయి. భారీ వర్షాలకు రాజధాని అమరావతి ప్రాంతం జలమయమైంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకూ తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో 9.7 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లా చేబ్రోలులో 9.3 సెంటీమీటర్లు, నంద్యాల జిల్లా డోన్‌లో 8.8, శ్రీకాకుళం జిల్లా మెలియపుట్టి, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో 8.4, చిత్తూరు జిల్లా వెంకటగిరి కోటలో 8.3 సెంటీమీటర్లు, విజయవాడలో 7.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

టీచర్ల పని సర్దుబాటు బదిలీపై మార్గదర్శకాలు జారీ



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల పని సర్దుబాటు బదిలీలపై ప్రభుత్వం బుధవారం మార్గదర్శకాలు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 2024 - 25 విద్యా సంవత్సరానికి ఈ బదిలీలు చేయనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ రామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. సబ్జెక్ట్ టీచర్లు (స్కూల్ అసిస్టెంట్లు), ఎస్జీటీల్లోని సబ్జెక్ట్ టీచర్లను ఆయా యాజమాన్యాల్లో అవసరాన్ని బట్టి సర్దుబాటు చేస్తారు. 11వ తేదీలోగా పని సర్దుబాటును పూర్తి చేయనున్నారు. మిగులు స్కూల్ అసిస్టెంట్లను వారి మెథడాలజీ ప్రకారం ఇతర సబ్జెక్టులకు కేటాయిస్తారు. మిగులు ఎస్జీటీలకు డిగ్రీ, బీఈడీ అర్హతను బట్టి ప్రీ-హై స్కూల్, హైస్కూళ్లలో సబ్జెక్టులు బోధించేలా సర్దుబాటు బదిలీలు చేస్తారు. ఒక పాఠశాలలో ఒకరికంటే ఎక్కువ మంది ఎస్ఏ (పీడీ), పీఈటీలు ఉంటే వేరే పాఠశాలలకు కేటాయించేలా ఆదేశించారు. అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో 98 మందికంటే తక్కువ హాజరు నమోదైతే 3 నుంచి 8 తరగతులు, 1 నుంచి 2 తరగతులను విడిగా విభజించి ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. మిగులు ఉపాధ్యాయుల విషయంలో కొండ/ఏజెన్సీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు డెప్యుటేషన్ చేయరు. వచ్చే ఏడాది ఏప్రిల్ 30 నాటికి పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులు, 100 శాతం దృష్టి లోపం ఉన్న వారు, వితంతువులు, అవివాహిత మహిళా ఉపాధ్యాయులు, చట్టబద్ధంగా విడిపోయిన, స్పౌజ్ కోటాలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో పాటు స్కూల్ ప్లస్ పాఠశాలలను సైతం సర్దుబాటు బదిలీ ప్రక్రియ నుంచి మినహాయించారు.

క్లుప్తంగా...

అన్ని వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా



సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో (మైనార్టీ విద్యా సంస్థలు మినహా) ఈడబ్ల్యూఎస్ కోటాను ఈ ఏడాది నుంచి అమలు చేయనున్నారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ కొన్ని వైద్య కళాశాలల్లో మాత్రమే ఈ కోటా అమలులో ఉంది. కాగా, 2024-25 నుంచి 10శాతం సీట్లు ఈడబ్ల్యూఎస్ కోటా కింద భర్తీ చేయనున్నారు. ఎంబీబీఎస్, పీజీ, డెంటల్ కోర్సుల్లో ఈ కోటా వర్తించనుంది. సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో వర్తించదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ కోటానా?

ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ సీట్లను పెంచకుండా ఓసీ సీట్లలో కోత విధించి ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోటాకు సంబంధించిన 107, 108 జీవోలను రద్దు చేయడం ప్రభుత్వానికి చేత కాలేదన్నారు. దీనికి తోడు సీట్లు పెంచకుండా ప్రైవేట్ వైద్య కళాశాలలకు ఈడబ్ల్యూఎస్ అమలు చేయడం ఏంటని ప్రశ్నించారు.

టీచర్ కొట్టడంతో చూపు కోల్పోయిన విద్యార్థి



పొదిలి: ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి కంటిచూపు పోయిన ఘటన ప్రకాశం జిల్లా, పొదిలిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన రమణమ్మ, రామాచారి దంపతుల కుమారుడు రామలక్ష్మణ్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. 20 రోజుల క్రితం పాఠశాలలో ఉపాధ్యాయుడు సురేశ్ కొట్టడంతో పొరపాటున రామలక్ష్మణ్ కన్నుకు దెబ్బ తగిలింది. విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా.. తాత్కాలికంగా వైద్యం చేయించాడు. వైద్య ఖర్చులన్నీ తానే భరిస్తానని చెప్పడంతో ఒంగోలులోని ఆస్పత్రిలో విద్యార్థికి చికిత్స చేయిస్తున్నారు. అయితే చూపు వచ్చే అవకాశం లేదని వైద్యులు చెబుతున్నారని, ఆపరేషన్ చేయించుకునేందుకు అవసరమైన డబ్బు ఉపాధ్యాయుడు ఇవ్వడం లేదని విద్యార్థి తల్లిదండ్రులు స్పందనలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై విద్యాశాఖాధికారి ఉపాధ్యాయుడు సురేశ్‌ను వివరణ కోరగా... తాను ఉద్దేశపూర్వకంగా కొట్టలేదని, పొరపాటున కన్నుకు తగిలిందని, ఇప్పటికే వైద్యం కోసం రూ.50వేలు ఇచ్చినట్లు చెప్పారు. అవసరమైతే ఆపరేషన్ చేయించడానికీ సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

వంట చేయిస్తున్నారు

ఎస్టీ కమిషన్‌కు విద్యార్థుల మొర



విద్యార్థులను విచారిస్తున్న శంకర్ నాయక్

యర్రగొండపాలెం: తమతో చపాతీలు చేయిస్తారని, ప్రతి ఆదివారం బ్యాచ్‌లుగా వంట పనులు చేయాల్సిందేనని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ఎదుట విద్యార్థులు వాపోయారు. ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. చపాతీల తయారీలో పాల్గొన్న ఏడుగురు విద్యార్థులను విచారించారు. వంట గదిలో ఉన్న ఒక విద్యార్థిని వార్డెన్ కొట్టడం వల్ల ఆ విద్యార్థి తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పాడని, ఈ కారణంగా తాము చపాతీలు చేసే విషయం బయటికి వచ్చిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో చపాతీలు చేయించడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, మరోసారి ఇటువంటి పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఫాస్ట్'పోర్టు



విద్య, ఉద్యోగం, వ్యాపారం, మెరుగైన వైద్యం ఇలా అనేక కారణాలతో విదేశాలకు వెళ్లే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా దేశంలో పాస్‌పోర్టుల జారీ ప్రక్రియ వేగం పుంజుకుంది. రోజుకు సగటున 40,667 పాస్‌పోర్టులను కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకూ దేశ వ్యాప్తంగా 74,01,511 పాస్‌పోర్టులు జారీ చేసినట్లు ఇటీవల విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. 2019 నుంచి ఈ ఏడాది జూన్ వరకూ 6,17,90,955 పాస్‌పోర్టులు జారీ చేశారు. గతేడాది రికార్డు స్థాయిలో 1.50 కోట్ల మంది పౌరులు పాస్‌పోర్టులు పొందారు. పెరుగుతున్న డిమాండ్, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం పాస్‌పోర్టు సేవలను సులభతరం చేసింది. 2014కు ముందు దేశంలో దరఖాస్తులను ప్రాసెస్ చేసే కార్యాలయాలు 110 ఉంటే.. ప్రస్తుతం 93 పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, 440 పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో 2014కు ముందుతో పోలిస్తే సేవలు 500 శాతం మేర మెరుగుపడ్డాయి. - సాక్షి, అమరావతి



40,000
దేశంలో సగటున రోజుకు జారీ అవుతున్న పాస్‌పోర్టులు

ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య పొందిన వారి సంఖ్య 74.01 లక్షలు

గతేడాది రికార్డు స్థాయిలో 1.50 కోట్ల మందికి పాస్‌పోర్టులు

అత్యధికంగా కేరళలో 15.47 లక్షలు.. ఏపీలో 5.90 లక్షలు జారీ

ప్రపంచం జాబితాలో భారత్‌కు స్థానం.. **82**

అత్యధికంగా కేరళ.. అత్యల్పంగా లక్షద్వీప్

గత ఏడాది దేశ వ్యాప్తంగా 1.50 కోట్ల పాస్‌పోర్టులను జారీ చేయగా అందులో అత్యధికంగా కేరళ వాసులే 15.47 లక్షల మంది ఉన్నారు. ఏపీలో 5,90,921 మంది, పక్కనున్న తెలంగాణలో 7,91,680 మంది పాస్‌పోర్టులు పొందారు. కేంద్రపాలిత ప్రాంతాలు లక్షద్వీప్‌లో అత్యల్పంగా 2,445, దాద్రా, నగర్ హవేలీలో 3,346 చొప్పున జారీ చేశారు. 2019-23 మధ్య ఐదేళ్లలో ఏపీలో 19.97 లక్షల మంది అందుకున్నారు.

దరఖాస్తు ఇలా..

స్మార్ట్ ఫోన్ ఉన్న వారు ఎంపాస్‌పోర్టు సేవా యాప్ ద్వారా సులువుగా పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా ప్లే/యాపిల్ స్టోర్‌లో ఎంపాస్‌పోర్టు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని న్యూ యూజర్ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి నివసిస్తున్న ప్రాంతం ఆధారంగా పాస్‌పోర్టు కార్యాలయం ఎంచుకోవాలి. అనంతరం పేరు, పుట్టిన తేదీ, మెయిల్ ఐడీ వంటి వివరాలను నమోదు చేయాలి. లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను నమోదు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ఇది పూర్తయ్యాక పాస్‌పోర్టు కార్యాలయం నుంచి రిజిస్టర్డ్ మెయిల్‌కు ధ్రువీకరణ లింక్ వస్తుంది. దాని మీద క్లిక్ చేస్తే వెబ్‌పేజీ తెరుచుకుంటుంది. లాగిన్ ఐడీ నమోదు చేసి ఖాతాను ధ్రువీకరించాలి. ఈ ప్రక్రియ ముగిశాక కొత్త పాస్‌పోర్టుకు దరఖాస్తు ఆప్షన్‌ను ఎంపిక చేసి అడిగిన సమాచారం నమోదు చేయాలి. తర్వాత ఫీజు చెల్లించి, అపాయింట్‌మెంట్ తేదీ బుక్ అయిన తర్వాత పాస్‌పోర్టు కేంద్రాన్ని సందర్శించాలి. https://passportindia.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి సులువుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

58 దేశాలను చుట్టేయవచ్చు

గత కొన్నేళ్లలో భారత పాస్‌పోర్టు తన స్థానాన్ని మెరుగుపరచుకుంటోంది. హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ సంస్థ నివేదిక ప్రకారం 82వ స్థానంలో భారత పాస్‌పోర్టు ఉంది. వీసాతో పని లేకుండా కేవలం ఈ పాస్‌పోర్టుతోనే ఇండోనేషియా, థాయ్‌లాండ్, మలేషియా వంటి 58 దేశాలను చుట్టేయవచ్చు. అంతర్జాతీయ విమానయాన సంఘం నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా పాస్‌పోర్టులకు ర్యాంకింగ్ ఇస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా 103 దేశాలకు కేటాయించగా, సింగపూర్ పాస్‌పోర్టు మొదటి స్థానంలో ఉంది. ఈ దేశ పాస్‌పోర్టుతో ఏకంగా 195 దేశాలను సందర్శించవచ్చు. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, స్పెయిన్ పాస్‌పోర్టులు రెండో స్థానంలో ఉండగా, వీటి ద్వారా 192 దేశాలకు వెళ్లవచ్చు. చివరి స్థానంలో 103వ ర్యాంక్‌తో ఆఫ్ఘనిస్తాన్ ఉంది. ఈ పాస్‌పోర్టుతో 26 దేశాలకు మాత్రమే వీసా లేకుండా వెళ్లవచ్చని నిర్ధారించారు.

2019-23 మధ్య ఏపీలో ఇలా	సంవత్సరం	2019 నుంచి 2024 జూన్ వరకూ దేశంలో పాస్‌పోర్టుల జారీ ఇలా
4,06,947	2019	1,18,55,684
1,89,276	2020	62,38,976
3,06,431	2021	83,54,605
5,03,895	2022	1,29,36,824
5,90,921	2023	1,50,03,355
	2024	74,01,511

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్య

- సీనియర్ విద్యార్థి మొబైల్ కొట్టేసిందని అధికారుల మందలింపు
- అందరి ముందు నిలదీయడం వల్లే అఘాయిత్యం


జమీషా ఖురేషీ (ఫైల్)

వేంపల్లె: వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో నిర్వహించే ఒంగోలు ట్రిపుల్ ఐటీ విద్యార్థిని జమీషా ఖురేషీ (17) మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెం గ్రామానికి చెందిన మక్బూల్, నసీమా దంపతులకు కుమారుడు సోహెల్ అబ్బాస్, కుమార్తె జమీషా ఖురేషీలు ఉన్నారు. ఈ అమ్మాయికి ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు వచ్చింది. మొదటి సంవత్సరం పీయూసీ-1లో మంచి మార్కులు సాధించింది. ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం క్యాంపస్‌లోని క్యాంటీన్‌కు వెళ్లింది. అక్కడ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థిని మొబైల్ ఫోన్ పోయింది. ఆ ఫోన్‌ను జమీషా ఖురేషీ తీసుకున్నట్లు సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించిన ట్రిపుల్ ఐటీ అధికారులు ఆమెను అందరి ముందు మందలించారు. జరిగిన విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో ఆమె మనస్తాపానికి గురై హాస్టల్ గదిలో ఉన్న వాటర్ పైప్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్‌లో ఉన్న తోటి విద్యార్థులు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు స్టడీ అవర్స్‌కు వెళ్లిపోవడంతో ఎవరూ గుర్తించలేదు. 10 గంటల తర్వాత విషయం తెలుసుకున్న ట్రిపుల్ ఐటీ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సరికొత్త ఆవిష్కరణల కోసం ఇస్రోలో చేరండి

విద్యార్థులకు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ సూచన


వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష ప్రయోగాల్లో సరికొత్త ఆవిష్కరణల కోసం ఇస్రోలో సేవలందించేందుకు ముందుకు రావాలని విద్యార్థులకు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం షార్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని ఐఐటీ విద్యార్థులు, స్పేస్ స్టార్టప్ కంపెనీల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. 'విదేశీ అంతరిక్ష సంస్థల ద్వారా మన ఉపగ్రహాలను ప్రయోగించుకునే స్థాయి నుంచి నేడు అగ్రరాజ్యాల ఉపగ్రహాలను కూడా అతి తక్కువ ఖర్చుతో ప్రయోగించే స్థాయికి ఇస్రో చేరింది. ఇంతటి ఘన విజయాల వెనుక ఎందరో మహానుభావుల కృషి దాగి ఉంది. చంద్రుడి మీద పరిశోధనల కోసం చేసిన మూడు ప్రయోగాలు విజయవంతమయ్యాయి. భవిష్యత్‌లో చంద్రుడిపై మరిన్ని పరిశోధనల కోసం రోబోను పంపించేందుకు కసరత్తు చేస్తున్నాం. అలాగే గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించి.. తిరిగి తెచ్చేందుకు సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి' అని ఆర్ముగం రాజరాజన్ చెప్పారు. భవిష్యత్‌లో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా అభివృద్ధి చేసి.. దేశ ప్రతిష్టను ప్రపంచం నలుదిశలా ఇనుమడింపజేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షార్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంబీయూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

హాజరుకానున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్

చంద్రగిరి (తిరుపతి జిల్లా): జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం (ఎంబీయూ)లో గురువారం నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మందికి పైగా ఇంజినీరింగ్, డిగ్రీ, స్కూల్స్ విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్ హాజరుకానున్నారని, ఎంబీయూ చాన్సలర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారని తెలిపారు. ప్రో చాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, షార్ డైరెక్టర్ రాజరాజన్ తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ఎంబీబీఎస్.. పెరగనున్న కటాఫ్‌లు!

గతేడాదితో పోలిస్తే ఈసారి గణనీయంగా 500 నుంచి ఆపైన స్కోర్ చేసిన విద్యార్థులు


- గతేడాది 500పైన స్కోర్ చేసిన విద్యార్థులు 4,605 మంది..
- ఈసారి వీరి సంఖ్య 7,891
- గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 3,286 మంది అధికం
- దీంతో కటాఫ్ స్కోర్లు పెరుగుతాయంటున్న నిపుణులు



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ కోర్సులో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు కౌన్సెలింగ్ మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. రాష్ట్రం నుంచి నీట్ యూజీ-2024లో అర్హత సాధించిన 43,788 మంది విద్యార్థుల జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇప్పటికే ప్రకటించింది. నేడో, రేపో కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ కూడా జారీ చేయనుంది. గతేడాది ఏ స్కోర్ వరకూ సీట్లు వచ్చాయో పరిశీలించి, ప్రస్తుతం ఏ కళాశాలలో సీట్ వచ్చే అవకాశం ఉందో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బేరీజు వేసుకుంటున్నారు. కాగా, గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తమ స్కోర్ చేసిన విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ఈసారి ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో కటాఫ్‌లు బాగా పెరిగే అవకాశం ఉంది.

3,286 మంది అధికం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 500, ఆ పైన మార్కులు సాధించినవారు 3,286 మంది పెరిగారు. వీరిలో కొందరు కోచింగ్ నిమిత్తం ఏపీకి వచ్చి ఇక్కడే పరీక్ష రాసిన విద్యార్థులు ఉంటారు. ఈ విద్యార్థులు తమ సొంత రాష్ట్రాల్లో కౌన్సెలింగ్‌కి హాజరవుతారు. మరోవైపు మన రాష్ట్రానికి చెందిన 700పైన స్కోర్ చేసిన విద్యార్థులు ఎయిమ్స్, జిప్‌మర్ వంటి సంస్థలతో పాటు, మన దగ్గర ఉన్న కళాశాలల్లో ఆల్ ఇండియా కోటా కింద ప్రవేశాలు పొందుతూ ఉంటారు. ఈ ఏడాది మన దగ్గర 61 మంది 700పైన స్కోర్ చేశారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున టాప్ స్కోర్‌లు నమోదు అవ్వడంతో మన విద్యార్థులకు ఆల్ ఇండియా కోటాలో తక్కువ అవకాశాలుంటాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ లెక్కన అన్ని విభాగాల్లో 50 చొప్పున కటాఫ్ స్కోర్‌లు పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



నీట్ గణాంకాలు ఇవి..

గతేడాది రాష్ట్రవ్యాప్తంగా నీట్‌లో అర్హత సాధించినవారు..	42,836
వీరిలో 500, ఆ పైన మార్కులు సాధించినవారు	4,605
ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా నీట్‌లో అర్హత సాధించినవారు	43,788
వీరిలో 500, ఆ పైన మార్కులు సాధించినవారు	7,891
600-715 మధ్య మార్కులు సాధించిన విద్యార్థులు	1,425
550-599 మధ్య మార్కులు సాధించినవారు	1,098
500-549 మధ్య మార్కులు సాధించినవారు	763

వైద్య విద్యలో పాత ఫీజులే కొనసాగింపు

వైద్యశాఖ ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ కోర్సులకు ఫీజులను నిర్ణయిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 2023-26 బ్లాక్ పీరియడ్‌కు ఫీజుల ఖరారుపై కోర్టు కేసులున్నందున 2023-24లో ఉన్నట్లుగానే ఈ విద్యా సంవత్సరానికి కూడా ఫీజులను ఖరారు చేశారు. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాకు రూ.16,500, బి-కేటగిరి రూ.13.20 లక్షలు, సి-(ఎన్ఆర్ఐ) కేటగిరికి రూ.39.60 లక్షలు ఫీజులు నిర్ణయించారు. అదే విధంగా బీడీఎస్ కోర్సులో కన్వీనర్ కోటాకు రూ.14,300, బి- కేటగిరి రూ.4.40 లక్షలు, సి-(ఎన్ఆర్ఐ) కేటగిరికి రూ.13.20 లక్షలు ఫీజులు ఉంటుంది. ఇక సూపర్‌స్పెషాలిటీ వైద్య, డెంటల్ కోర్సుల్లో కాటూరి, జీఎస్ఎల్, నారాయణ, ఎన్ఆర్ఐ, సిద్ధార్థ ప్రైవేట్ కళాశాలలకు ట్యూషన్ ఫీజును రూ.17.25 లక్షలుగా నిర్ణయించారు. మరోవైపు.. కోర్టు తుది తీర్పునకు లోబడి ఫీజుల అమలు ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

పీజీ కోర్సుల్లో ఫీజులు ఇలా..

కోర్సు	కన్వీనర్	బి-కేటగిరి	సి-కేటగిరి
క్లినికల్ డిగ్రీ	రూ.4,96,800	రూ.9,93,600	రూ.57,50,000
పారా క్లినికల్ డిగ్రీ, డిప్లొమా	రూ.1,55,250	రూ.3,10,500	రూ.17,25,000
ప్రీ-క్లినికల్ డిగ్రీ	రూ.70,380	రూ.1,40,760	రూ.9,20,000
డెంటల్ :			
క్లినికల్ డిగ్రీ	రూ.3,41,550	రూ.6,83,100	రూ.13,80,00
పారా-క్లినికల్ డిగ్రీ	రూ.3,07,395	రూ.4,99,790	రూ.8,05,000

గ్రూప్-1 మెయిన్స్‌కు పరీక్షా కేంద్రాలు ఎంపిక చేసుకోండి

సాక్షి, అమరావతి: గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులు 9వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే మాధ్యమం, పోస్టు, జోన్, పరీక్ష కేంద్రం ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో 16వ తేదీలోగా వివరాలను సమర్పించాలని కోరారు. గత ఏడాది డిసెంబర్లో ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు.. ఈ ఏడాది మార్చి 17న ప్రిలిమ్స్ నిర్వహించారు. మొత్తం 4496 మంది మెయిన్స్‌కి అర్హత సాధించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వీధి పశువులను అరికట్టండి

రాయచూరు రూరల్: నగరంలో వీధి పశువుల బెడదను అరికట్టాలని ఆర్‌వైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నగర సభ కమిషనర్ గురు సిద్దయ్యకు వినతిపత్రం అందజేశారు. సంఘం సంచాలకుడు మల్లయ్య మాట్లాడారు. పశువులు రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని, దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్‌లోకి గుంపులుగా చొరబడి కూరగాయలను చిందరవందర చేస్తున్నాయన్నారు. అలాంటి పశువులను ఊరుబయటకు తరలించాలని డిమాండ్ చేశారు.

సాంకేతిక విజ్ఞానాన్ని ఆర్జించాలి

రాయచూరు రూరల్: విద్యార్థులు సైన్స్, సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బడిగేర పిలుపునిచ్చారు. నగరంలోని సైన్స్ కేంద్రంలో ఆకాశవాణి, తాలూకా విద్యాశాఖ మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కంప్యూటర్ యుగంలో సాంకేతికతపై పట్టు సాధిస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పదిలో మంచి మార్కులు సాధించిన నలుగురికి ల్యాప్‌టాప్‌లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆకాశవాణి ప్రచార నిర్వాహకుడు వెంకటేశ్ బేవినబెంచి, తాలూకా విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, సైన్స్ కేంద్రం అధికారి పాల్గొన్నారు.

నకిలీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రఘువీర్‌నాయక్

రాయచూరు రూరల్: జిల్లాలో తప్పుడు ధ్రువీకరణపత్రాలు పొందిన వారిపై చర్యలు చేపట్టాలని హైదరాబాద్ కర్ణాటక వాల్మీకి నాయక్ సంఘం అధ్యక్షుడు రఘువీర నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. జిల్లాలో కురుబలు ఓబీసీ కిందకు వస్తారన్నారు. కాడు కురుబలు ఎస్టీ జాబితాలోకి వస్తారని తెలిపారు. అయితే కురబలు కొందరు ఎస్టీ సర్టిఫికెట్లు పొందారని ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో కురుబ విద్యార్థులను ఎస్టీలుగా నమోదు చేస్తున్నారన్నారు. తప్పుడు ధ్రువీకరణపత్రాలు ఇచ్చిన వారిపై, తీసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మికతతో మనశ్శాంతి

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ భక్తిభావాలను అలవర్చుకోవాలని బిచ్చాలి మఠాధిపతి వీరభద్ర శివాచార్యులు పిలుపు ఇచ్చారు. రాయచూరు సోమవారపేట మఠంలో అంకలిగి సిద్దరామేశ్వర పురాణ శ్రవణ కార్యాక్రమా లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఒత్తిళ్లతో జీవితం సాగిస్తున్నారని, కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయిస్తే మనశ్శాంతి లభిస్తుందన్నారు. సోమవారి పేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య, కేంద్ర మాజీ మంత్రి బసవరాజ్ పాటిల్ అన్వరి, చంద్రశేఖర్, నగర సభ సభ్యుడు సమీర్, గిరిజాశంకర్, ఉదయ కుమార్, పాటిల్, మహంతేష్ పాటిల్, వీరభద్రప్ప పాల్గొన్నారు.

రైల్వేలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



సంతకాలు సేకరిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని ఏఐడీఎస్ఓ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జవహర్ నగర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు చెన్నబసవ మాట్లాడారు. రైల్వే శాఖలో 3.5 లక్షల సిబ్బంది ఉందన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అమరేష్, వినోద్ కుమార్, యల్లప్ప, మౌనేష్, బసవరాజ్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట వేయాలి

- అభయ- భవిత పోస్టర్ విడుదల



మహిళలకు భవిత-అభయ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ శోభారాణి

బళ్లారిఅర్బన్: వివిధ శాఖల ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ మాతృ మహిళ మండలి సారథ్యంలో జీవితం మనది, జీవం మనదే, అభయ- భవిత అనే పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని ఆ మండలి అధ్యక్షురాలు పుష్పాచంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలు, విద్యార్థినులు సురక్షత భావంతో జీవించాలంటే 10 సూత్రాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వానికి చెందిన నర్సరీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థినులకు జీవన సురక్షత జాగృతి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆమె మీడియాకు వివరించారు. కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూర, జిల్లా ఎస్పీ శోభారాణి, డీహెచ్‌ఓ రమేష్‌బాబు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ్‌కుమార్, దివాకర్ కే.సంకి దాసర, జలాలప్ప, సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున, డీఎస్పీ చంద్రకాంత నందరెడ్డితో పాటు వివిధ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనచరితకు సాక్ష్యం రాయ కాలువ

- రాయల కాలంలో అద్భుతంగా కాలువ నిర్మాణం
- వందలాది ఏళ్లుగా రైతుల జీవనాడిగా నిలిచిన వైనం



పాములా మెలికలు తిరిగిన ఆకారంలో అద్భుతంగా నిర్మితమైన రాయ కాలువ సుందర దృశ్యం

సాక్షి బళ్లారి: దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమైన విజయనగర రాజుల కాలం నాటి ఎన్నో కట్టడాలు, వారి పాలన నేటికీ ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ పాలకులకు విజయనగర రాజుల కాలం నాటి పాలన నేటికీ గుర్తుకు వచ్చేలా సాక్ష్యాధారాలతో మనముందున్నాయి. హంపీని రాజధానిగా చేసుకొని దక్షిణ భారత దేశాన్ని పాలించిన తీరుపై యావత్ భారత దేశాన్ని విజయనగర రాజుల పాలనను పొగడ్తలతో ముంచెత్తుతుంటారు. అలాంటి వాటిలో ముందు చూపుతో రైతులకు జీవనాడిగా, ప్రజలకు ఆహారం అందించేందుకు రైతులకు ఉపయోగపడే విధంగా తుంగభద్ర నది నుంచి అప్పట్లో నిర్మించిన కాలువలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. విజయనగర రాజుల కాలంలో తుంగభద్ర నది నుంచి నీరు తీసుకొని రావడానికి నిర్మించిన కాలువలపైకి 'రాయ కాలువ' వైభవమే వేరుగా ఉంటుంది.

నయన మనోహర దృశ్యం

రాయ కాలువ పొడవు, పోయే మార్గం, వివిధ రకాలుగా సుడిగుండాల్లాగా ఉండే దృశ్యాలు ఎంతో అద్భుతంగా కనిపిస్తున్నాయి. 600 సంవత్సరాల క్రితమే నీటి పారుదల కాలువల నిర్మాణం నేటి ఇంజనీర్లను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. హంపిలో వైవిధ్యమైన నీటిపారుదల సౌకర్యాలు, ఆనకట్టలు, కాలువలు అడుగడుగునా కనిపిస్తుంటాయి. హంపిలోని మహానవమిదిబ్బ సమీపంలో మెట్టల కళ్యాణి, విరుపాక్షి దేవాలయం పక్కన మన్మథ నీటి గుంత, కృష్ణదేవాలయం ముందు బాలకృష్ణ నీటి గుంత, విజయ విఠల దేవాలయానికి వెళ్లే దారిలో పలు కళ్యాణి గుంతలు లాంటి దృశ్యాలు, రాణి స్నాన గృహాలు, ఈత కొలనులు తదితర దృశ్యాలు నేటికీ పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. వీటితో పాటు అలనాటి రాయ కాలువ, నీటి పారుదల వ్యవస్థకు సాక్ష్యంగా నిలుస్తోంది.

దాదాపు 25 వేల ఎకరాలకు నీటిపారుదల

తుంగభద్ర నదికి హొసపేటి నుంచి రాయచూరు వరకు చిన్న చిన్న ఆనకట్టలు నిర్మించి కాలువల ద్వారా నీటిని అందిస్తున్నారు. విజయనగర కాలంలో నిర్మించిన కాలువల ద్వారా దాదాపు 25 వేల ఎకరాలకు నీటిపారుదల అందించే నైపుణ్యతను తీర్చిదిద్దారు. రాయల కాలంలో నిర్మించిన 18 కాలువల్లో ఎన్నో అద్భుతమైన వివిధ రీతుల్లో నిర్మించిన కట్టడాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇందులో అత్యంత ప్రముఖమైనది రాయ కాలువే అని చెప్పవచ్చు. ఈ కాలువ ద్వారా ఎన్నో కాలువలకు నీటి పారుదల సౌకర్యం కలుగుతోంది. విజయనగర రాజుల కాలంలో హొసపేటె సమీపంలో తుంగభద్ర నదికి వేసినా కురువగడ్డ ఆనకట్ట నుంచి ఈ కాలువ ప్రారంభమవుతోంది. తుంగభద్ర జలాశయం నిర్మించినప్పుడు ఈ గ్రామాలు, ఆనకట్టలు కొంత మునిగిపోయినా ప్రస్తుతం తుంగభద్ర డ్యాం నుంచి ఈ కాలువకు నీరు పారుదల సౌకర్యం కల్పించారు.

చుట్టుపక్కల 20 పల్లెలకు సాగునీరు

హొసపేటె తాలూకాలో చుట్టుపక్కల 20 పల్లెలకు దీని ఉపయోగం లభిస్తుంది. 18 కాలువల పైకి రాయ కాలువే ఎక్కువగా రైతులకు నీరందిస్తుంది. రాయ కాలువ పొడవునా అపురూపమైన స్మారకాలు, ఎన్నో దృశ్యాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. నాగేనహళ్లి సమీపంలో కాలువ పక్కనే పాడుబడిన రాతి మండపాలు, ప్రాచీన శివాలయం కూడా ఉంది. ఇది చాలా వరకు శిథిలమైంది. విజయనగర రాజుల కాలంలో 600 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కాలువ ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతోంది. ఈ కాలువ ద్వారా హొసపేటె నగరం నుంచి చిత్తవాడిగి, రాణిపేట పక్కనే ప్రవహిస్తుంది. రాయ కాలువగా పిలవబడుతున్న ఈ కాలువ నిర్మాణం శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారా, అంతకు ముందే నిర్మించారా అన్నది ఖచ్చితమైన సాక్ష్యాలు లేకపోయినా అప్పట్లో నిర్మించిన రాయ కాలువ నాటి అద్భుతమైన ప్రతిభకు సాక్ష్యంగా నిలుస్తోంది.

అగ్నిప్రమాదంలో కార్మికుడు సజీవదహనం

- బెళగావి నగరంలో ఘోరం

హుబ్లీ: ఫ్యాక్టరీలో ఆకస్మికంగా జరిగిన అగ్నిప్రమాదంలో ఓ కార్మికుడు కాలి బూడిద కాగా ఇతర కార్మికులు ప్రాణాలతో బయట పడ్డారు. వివరాలు.. బెళగావిలోని ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో బెళగావి మార్కండేయనగర నివాసి యల్లప్ప గుడ్యగోళ (20) మృతి చెందినట్లుగా తెలిసింది. స్నేహ టిస్కో టిప్ కంపెనీ ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి జరిగిన ఈ అగ్నిప్రమాదం వేళ కొందరు కార్మికులు లోపలే ఉన్నారు. మంటలు చెలరేగగానే కార్మికులు తలోదిక్కుకు పారిపోయారు. కానీ యల్లప్ప తప్పించుకొనే ప్రయత్నంలో లిఫ్ట్‌లో చిక్కుకొని మృత్యువాత పడ్డారు. ఘటన స్థలాన్ని, కార్మికుడి మృతదేహాన్ని జిల్లా డీహెచ్‌ఓ డాక్టర్ మహేష్ నేతృత్వంలో ఫోరెన్సిక్ విభాగ అధికారులు పరిశీలించారు. 5 ఎకరాల్లో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో ఈ ఫ్యాక్టరీ మూడు అంతస్తుల్లో నిర్మించారు. యల్లప్ప లిఫ్ట్‌లో కిందకు దిగి వస్తుండగా విద్యుదాఘాతం వాటిల్లి నిప్పు రాజుకోవడంతో ఆయన బయటకు రావడానికి సాధ్యం కాలేదని తోటి కార్మికులు తెలిపారు. ఈ ఘోర అగ్నిప్రమాదంలో మంటలు ఆర్పడానికి సంబంధిత సిబ్బంది రాత్రంతా ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. బుధవారం రాత్రి 10 గంటల సుమారు ఆ కట్టడం గోడ కిటికీలను జేసీబీ యంత్రంతో పగలగొట్టి లోనికి నీరు చిమ్మి అగ్నిని అర్పడానికి ప్రయత్నించారు. ఫ్యాక్టరీ చుట్టుపక్కల 10 కిలోమీటర్ల ప్రాంతంలో దట్టమైన మంటల పొగ, ప్లాస్టిక్ కాలిన వాసనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు మాస్కులు ధరించి ఎంతో కష్టపడి మంటలను ఆర్పేందుకు శ్రమించారు. మూడు అంతస్తుల ఈ కట్టడంలో చిన్నచిన్న కిటికీలు మాత్రమే ఉన్నాయి. సరైన వాకిళ్లు లేవు. నాలుగు వైపులా ఎతైన గోడలు ఉన్నందు వల్ల మంటలు ఆర్పడానికి ఎంతో ఆటంకం కలిగింది. కాగా ఘటనలో తీవ్రంగా గాయపడిన బెళగావి తాలూకా కవళవాడి మారుతీ నారాయణ కర్వేకర్(32), జూనే బెళగావి యల్లప్ప ప్రకాష్ సలగుడే(35), రాజవాడి సందీప్ దశరథ(39)లను బెళగావి కేఎల్ఈ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

సీఎం గద్దె దించేందుకు విపక్షాల కుట్ర



మాట్లాడుతున్న హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

హొసపేటి: సీఎం సిద్దరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి దించేందుకు కేంద్రంలోని అధికార బీజేపీ కూటమి పార్టీలు కుట్ర పన్నుతున్నాయని రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ తెలిపారు. బుధవారం సాయంత్రం నగరంలో డీఏఆర్ విభాగం పాలక నూతన భవనం, డాగ్ కెనాల్, పరేడ్ మైదానం నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సీఎం ప్రజలతో ఎన్నికయ్యారని, ఆయన రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు ఆందోళన చేయడం సమంజసం కాదన్నారు. సీఎం ఎలాంటి మచ్చ లేకుండా పూర్తి పారదర్శకంగా ఉన్నారని, అయితే ఉద్దేశ పూర్వకంగా బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై బీఎస్ యడియూరప్ప పాదయాత్ర చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున ఖనిజ సంపదను లూటీ చేశారని, ఆ విషయంపై అప్పట్లో సిద్దరామయ్య ఆధ్వర్యంలో తమ పార్టీ నాయకులు పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. రాష్ట్ర గవర్నర్ బీజేపీ చేతిలో కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

విద్యార్థి వేతనం ఇవ్వండి మహాప్రభో..!

- నాలుగు నెలలుగా స్టైపెండ్ ఇవ్వని దావణగెరె జేజేఎంఎంసీ
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడి వైద్యకళాశాలలోనే ఈ వైనం

బళ్లారి రూరల్ : 2024-25వ విద్యాసంవత్సరం ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పాసై ఈ ఏడాది ఏప్రిల్‌లో హౌస్‌సర్జన్(ఇంటర్న్‌షిప్) లోకి ప్రవేశించిన జూనియర్ వైద్యులకు దావణగెరె జేజేఎంఎంసీ (జై జగద్గురు మురఘ రాజేంద్ర మెడికల్ కళాశాల) యాజమాన్యం ఇంతవరకు స్టైపెండ్(విద్యార్థి వేతనం) ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందినవారు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారే అధికశాతం ఉన్నారు. దావణగెరె వైద్యకళాశాల యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే స్టైపెండ్‌ను ఇవ్వాలని అర్థిస్తున్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా స్టైపెండ్ ఇవ్వక పోవడంతో జూనియర్ వైద్యులు నానాఅవస్థలు పడుతున్నారు. దావణగెరె స్మార్ట్ సిటీలో గదుల అద్దెలు, భోజనానికి తమ తల్లిదండ్రులు డబ్బులు సమకూర్చలేక తంటాలు పడుతున్నట్లు జూనియర్ వైద్యులు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శామనూరు శివశంకరప్ప వైద్య కళాశాలలోనే ప్రభుత్వం నుంచి అందాల్సిన స్టైపెండ్ ఇవ్వకపోతే ఇక తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని జూనియర్ వైద్యులు ఆవేదన చెందుతున్నారు. జూనియర్ వైద్యులు ఎన్నిసార్లు యాజమాన్యాన్ని స్టైపెండ్ ఇవ్వాలని వేడుకొంటున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమ బాధను అర్థం చేసుకొని నాలుగు నెలల స్టైపెండ్ ఇవ్వాలని కోరుతున్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం



పట్టు వస్త్రాలు తెస్తున్న రాజేంద్రరెడ్డి దంపతులు



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్ : జిల్లా కేంద్రంలోని నవోదయ వైద్య కళాశాల ఆవరణలో వెలసిన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ ఉత్సవాలు నాలుగు రోజులపాటు సాగనున్నాయి. నారాయణ పేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేంద్ర రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సుప్రభాత సేవ, పరిమళ ఆరాధన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వంటి పూజలు నిర్వహించారు.

పాఠశాల గేటుకు స్థలదాత తాళం

- గేటు బయటనే కూర్చున్న విద్యార్థులు



(ఇన్‌సెట్‌లో) గేటుకు తాళం వేసి ఉన్న దృశ్యం

సాక్షి,బళ్లారి: ప్రభుత్వ పాఠశాలకు స్థలం దానం చేసిన ఓ వ్యక్తి పాఠశాల అభివృద్ధి నిర్వహణ కమిటీ(ఎస్‌డీఎంసీ) అధ్యక్షుడుగా శాశ్వతంగా తనను కొనసాగించాలని ఒత్తిడి చేస్తూ పాఠశాల గేట్‌కు తాళం వేసిన ఘటన చోటు చేసుకుంది. బుధవారం విజయపుర జిల్లా తాళికోటె తాలూకా బళగానూరు క్రాస్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు భూమిని దానం చేసిన రామనగౌడ అనే వ్యక్తి తాను పాఠశాలకు భూమి దానం చేశానని, ఈ నేపథ్యంలో పాఠశాల అధ్యక్షుడిగా తననే కొనసాగించాలని పట్టుబట్టారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు అలా కుదరదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే ఎస్‌డీఎంసీ అధ్యక్షుడిగా చేసే అవకాశం ఉందని, పాఠశాలకు భూమి దానం చేసినంత మాత్రన అధ్యక్షుడిగా కొనసాగించేందుకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. దీంతో రామనగౌడ పాఠశాల గేటుకు తాళం వేయడంతో విద్యార్థులు గేటు బయటనే కూర్చొన్నారు. ఈ ఘటన విజయపుర జిల్లాలో చర్చనీయంగా మారింది.

చేనేతకారులను ఆదుకోవాలి



చేనేతకారులను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: చేనేతకారులు మగ్గాలపై నేసిన చీరలను సర్కార్ కొనుగోలు చేసి చేనేతకారులను ఆదుకోవాలని ఇలకల్ చీరల అంబాసిడర్ తృప్తి సాలిమట్ డిమాండ్ చేశారు. బుధవారం ఇలకల్ రాజొళ్లి చీరల కేంద్రంలో జాతీయ చేనేతకారుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. విద్యుత్ ధరలు పెంచడంతో కష్టాలు తప్ప లాభాలు లేవన్నారు. ప్రభుత్వం విద్యుత్ బిల్లుల తగ్గింపుపై పునరాలోచించాలన్నారు. చేనేత మండలికి చైర్మన్‌ను నియమించాలన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉత్తర కర్ణాటకలోని బాగల్‌కోటె, గంగావతి, బళ్లారి, ఇలకల్, హావేరి, గదగ్ ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలన్నారు. ఉచిత విద్యుత్ భాగ్యకు నేకారులకు దౌర్భాగ్యం పట్టుకుందన్నారు. కార్యక్రమంలో ఉత్తమ చేనేతకారులకు శాలువా కప్పి సన్మానించారు. సమావేశంలో నారాయణ రాజొళ్లి, అంబుజా రాజొళ్లి, శ్రీకాంత్ గుళ్లెద్, రమేష్ గుళ్లెద్, లక్ష్మణ్ గుర్రం, మల్లులున్నారు.

చెరువులో ఇద్దరు కార్మికుల అనుమానాస్పద మృతి

బళ్లారి రూరల్ : జిల్లాలోని తోరణగల్లులోని జిందాల్ విద్యానగర్ చెరువులో అనుమానాస్పద రీతిలో ఇద్దరు కార్మికుల మృతదేహాలు లభ్యమైన ఘటన బుధవారం వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. ఉత్తరాఖండ్‌కు చెందిన దీపక్‌సింగ్(27), నేపాల్‌కు చెందిన రాణాబహదూర్ (35) అనే ఇద్దరు వ్యక్తులు జిందాల్ విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో కార్మికులుగా పని చేస్తున్నారు. వీరిరువురి మృతదేహాలు విద్యానగర్ చెరువులో లభ్యమయ్యాయి. ఈ ఘటనపై మృతుల సంబంధీకుల సమాచారం మేరకు తోరణగల్లు పోలీసులు అనుమానాస్పద మృతులుగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



వరుణ్ (ఫైల్)

రాయచూరు రూరల్: తాను ప్రేమించిన యువతికి వేరొకరితో నిశ్చితార్థం కావడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని మాన్విలో చోటు చేసుకుంది. జనతా కాలనీలో నివాసముంటున్న వరుణ్(26)కు ఇన్‌స్టాగ్రాంలో ఓ యువతి పరిచయమైంది. అయితే ఆమెకు మరొకరితో నిశ్చితార్థం కావడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ హిరేమట్ వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా చేనేత దినోత్సవం

బళ్లారి టౌన్: నగరంలోని అనంతపురం రోడ్డులోని హ్యాండ్‌లూమ్ సొసైటీలో జాతీయ చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చాలా కాలంగా మగ్గాలు నేస్తున్న చేనేత కార్మికులను సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మయ్య చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 5 ఏళ్ల అవధిలో కార్మికుల అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. మరోసారి తనకు ప్రాధాన్యత ఇవ్వాలని కార్మికులను కోరారు. చేనేత కారుల సమూహ అధ్యక్షుడు సీ.దేవానంద, నేతలు సోమశేఖర్, రాజేశ్, సొసైటీ కార్యదర్శి బీ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొసలి కలకలం



మావినకెరె చెరువులో కనిపించిన మొసలి

రాయచూరు రూరల్: నగరంలో మొసలి ప్రత్యక్షం కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బుధవారం మావినకెరె చెరువులో మొసలి కనబడింది. దీంతో ఇందిరా నగర్, ఆజాద్ నగర్, ఐడీఎస్ఎంటీ కాలనీ, జహీరాబాద్, ఆకాశవాణి ఏరియా, యరగేర కాలనీ చుట్టుపక్కల నివాసాలున్న ప్రజలు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు వచ్చి గాలించి మొసలిని పట్టుకెళ్లారు.

తపాలా విభాగానికి అవార్డుల పంట



అవార్డును అందుకుంటున్న సూపరింటెండెంట్

బళ్లారిటౌన్: భారతీయ తపాలా శాఖ కార్యాలయం 2023-34వ సంవత్సరంలో చేపట్టిన పలు అభియాన్ కార్యక్రమాల్లో బళ్లారి తపాలా విభాగం అత్యుత్తమ ప్రదర్శన చేపట్టి రాష్ట్ర స్థాయిలో 15 అవార్డులు పొందినట్లు బళ్లారి తపాలా శాఖ సూపరింటెండెంట్ చిదానంద తెలిపారు. గత నెల 30న చిక్కబళ్లాపురలో డిస్కవరీ విలేజ్ రెసార్ట్‌లో జరిగిన కర్ణాటక వలయ స్థాయి అవార్డుల పంపిణీ కార్యక్రమం ఈ 15 బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఉపవిభాగం స్థాయిలో బళ్లారి, హొసపేటె, కూడ్లిగి, సిరుగుప్ప, బళ్లారి ప్రధాన తపాలా కార్యాలయంలో శాంతమ్మ ఐపీటీబీలో మూడు అవార్డులు పొందినట్లు తెలిపారు. ప్రధానమంత్రి జన సురక్ష పథకం కింద కొత్త పొదుపు ఖాతా పథకాలు, ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంక్ సేవలు వంటి వాటిని ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్లినందున ఈ అవార్డులు లభించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో తండ్రీ కొడుకు మృతి

సాక్షి,బళ్లారి: విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకు మృతి చెందిన ఘటన హావేరి జిల్లాలో చోటు చేసుకుంది. బుధవారం రాణిబెన్నూరు తాలూకా పత్తెపూర్ గ్రామంలో కరిబసప్ప (50), ఆయన కుమారుడు దర్శన్(26) ఇద్దరూ తమ పొలంలో విద్యుత్ మోటర్ ఆన్ చేయడానికి వెళ్లి షాక్ తగలడంతో ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వర్షాకాలంలో నేపథ్యంలో వైరు సమస్య తలెత్తడంతో ఘటన జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనపై రాణిబెన్నూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గేదెల కంటైనర్ పట్టివేత

హుబ్లీ: ఊపిరి తీసుకోవడానికి కూడా వీలుపడని విధంగా ఓ పెద్ద కంటైనర్ లారీలో గేదెలను తరలిస్తున్న ముగ్గురిపై స్థానిక బెండిగేరి పోలీస్ స్టేషన్‌లో జంతువులపై కౌర్య నివారణ చట్టం ప్రకారం కేసును దాఖలు చేశారు. బెంగళూరు దేవనహళ్లి పాసింగ్ నెంబర్ ఉన్న కంటైనర్ లారీలో గదగ్ బైపాస్ రోడ్డు మీదుగా 35 గేదెలను అమానుషంగా రవాణా చేస్తున్న లారీ డ్రైవర్ అండ్ క్లీనర్‌తో పాటు సదరు లారీ యజమానికి వ్యతిరేకంగా అంజిగి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. వివరాలు అందుకొని దాడి చేయిస్తుండగా నిందితులు పరారయ్యారని, ఆ గేదెలన్నింటిని గోశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎయిమ్స్‌పై ప్రధానితో చర్చించండి



ఎంపీలకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా చూడాలని లోక్‌సభ సభ్యులకు రాయచూరు ఎయిమ్స్ పోరాట సమితి సభ్యులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన సంచాలకులు బసవరాజ్ కళస మాట్లాడారు. రాయచూరు ఎంపీ కుమార నాయక్, కలబుర్గి ఎంపీ రాధాకృష్ణ దొడ్డమని, దావణగెరె ఎంపీ ప్రభా మల్లికార్జున్, కొప్పళ ఎంపీ రాజశేఖర్ హిట్నాళ్‌లను కలిసి ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించి రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించే విధంగా చూడాలని, కేంద్ర మంత్రిపై ఒత్తిడి తేవాలని కోరినట్లు వివరించారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సోమశేఖర్

రాయచూరు రూరల్: కార్మికులు ఐకమత్యంతో ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కన్నడ భవనంలో జరిగిన రెండవ జిల్లా కార్మికుల సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. కార్మికుల హక్కులను పెట్టుబడి దారులు హరిస్తున్నారన్నారు. దీనికితోడు కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన 44 చట్టాలను కేంద్రం రద్దు చేసిందన్నారు. పనిగంటలు పెంచడాన్ని, పీఎఫ్‌లో కోత విధించడంపై ఉద్యమించాలన్నారు. తిరుమల రావ్ ,అణ్ణప్ప, మహేష్, ఈరమ్మ పాల్గొన్నారు. అంతకుముందు అంబేడ్కర్ సర్కిల్ నుంచి కన్నడ భవన్ వరకు ర్యాలీ చేపట్టారు.

కరాటే శిక్షణ ఆయుధం

బళ్లారిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే తరగతులు నిర్వహించాలని జిల్లా కరాటే ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం సంఘం పదాధికారులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అత్యాచారాలు, దౌర్జన్యాలను అడ్డుకోవాలంటే విద్యార్థినులకు తప్పనిసరిగా కరాటే నేర్పాలన్నారు. గత బీజేపీ హయాంలో కరాటే తరగతులు నిర్వహించేవారని, నాలుగేళ్లుగా వాటిని రద్దు చేశారన్నారు. తిరిగి తరగతులు ప్రారంభించి కరాటే శిక్షణ ఇవ్వాలన్నారు. సురేష్, జడేజ పాల్గొన్నారు. .

భారతీయ సంస్కృతిని కాపాడాలి

రాయచూరు రూరల్ : భారతీయ సంస్కృతిని పరిరక్షించి భావితరాలకు అందించాలని డీఈఓ బడిగేర పిలుపు ఇచ్చారు. ఎంపీ ప్రకాష్ సేవా కళాశాలలో బుధవారం సేడం బసవేశ్వర భారతీయవిద్యా సమితి, భారతీయ వికాస సంఘం, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఏడో భారతీయ సంస్కృతి ఉత్సవ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ధర్మ శిక్షణ, భారతీయ సంప్రదాయాలు, ఆచార విచారాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల అధ్యక్షుడు శరణ బసవ పాటిల్, తాలూకా విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, రాయచూరు వర్సిటీ సిండికేట్ సభ్యులు శివ బసప్ప మాలి పాటిల్, శ్రీనివాస్, బపవరాజ, ఈరన్న, శివమూర్తి, హన్మంతప్ప, మల్లన గౌడ, సుభాష్ చంద్ర పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరివ్వాలి



మాట్లాడుతున్న దొడ్డకేశవరెడ్డి

బళ్లారిఅర్బన్: తాలూకాలోని కొళగల్లు వద్ద హెచ్ఎల్‌సీ13వ డిస్ట్రిబ్యూటరీ కింద చివరి పొలాలకు సాగుజలాలు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పీఎల్‌డీ బ్యాంక్ అధ్యక్షుడు కొర్లగుంది దొడ్డకేశవ రెడ్డి, కొర్లగుంది జీపీ అధ్యక్షుడు రాఘవ రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రమణారెడ్డి, నాగరెడ్డి వెంకటేష్ మాట్లాడుతూ కొర్లగుంది,హంద్యాళ, కోళూరు, మదిరె, సోమసముద్ర, దమ్మూరు, జాలిబెంచి తదితర గ్రామాల పరిధిలో 20 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. ఎగువన ఉన్న భూములకు మాత్రమే నీరు అందుతుండగా చివరి భూములకు నీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చివరి భూములకు నీరు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

వైద్యుడికి రూ.3.40 లక్షల వంచన

హుబ్లీ: మలేసియా దేశానికి పంపించిన పార్సెల్‌లో చట్ట వ్యతిరేక వస్తువులు ఉన్నాయని ధార్వాడ వైద్యుడు రామచంద్రకు ఢిల్లీ కస్టమ్స్ కార్యాలయం పేరుతో ఫోన్ చేసిన ఆన్‌లైన్ కేటుగాళ్లు సదరు డాక్టర్ నుంచి రూ.3.40 లక్షలను తమ ఖాతాలోకి బదలాయించుకొని డాక్టర్‌కు శఠగోపం పెట్టారు. డాక్టర్ రామచంద్రకు ఫోన్ చేసిన ఓ గుర్తు తెలియని వ్యక్తి తాము పార్సెల్ ఆపివేశామని, దీనికి సంబంధించి అధికారితో మాట్లాడమని ఫోన్ కాల్‌ను బదిలీ చేశాడు. ఆ క్రమంలో తనను బెదిరించి డబ్బులను బదలాయించుకున్నట్లుగా డాక్టర్ రామచంద్ర నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు వినతి

సిరుగుప్ప: ఇటీవల సర్వోన్నత న్యాయస్థానంలో సీజేఐతో పాటు 7 మందితో కూడిన ధర్మాసనం వెలువరించిన చారిత్రాత్మక తీర్పును రాష్ట్రప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి పదాధికారులు తహసీల్దార్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా సంచాలకులు హెచ్.బి.గంగప్ప మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రధాన కార్యదర్శికి పంపించి తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్.భీమేశ, ఎస్.వీరేశ, ఎస్.రఫీక్, దొడ్డబసప్ప, మహదేవ, మేకలి వవీరేశ, హెచ్.వీరేశ, డి.మూకప్ప, బి.హనుమేశ, బెళగళ్ మూకప్ప, తిమ్మప్ప, లక్ష్మణ భండారి, అధిక సంఖ్యలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నకిలీ కాంట్రాక్టర్ అరెస్ట్

హుబ్లీ: నకిలీ ఎస్సీ కులధ్రువీకరణ పత్రం సమర్పించి ఎస్సీలకు కేటాయించిన కాంట్రాక్ట్‌లు, టెండర్లు పొందిన ఓ కాంట్రాక్ట్‌ను బెళగావి జిల్లా చిక్కోడి పోలీసులు అరెస్ట్ చేశారు. ధార్వాడ మరాఠ కాలనీ నివాసి బాలకృష్ణ బసవరాజ చోళచగుడ్డ అరెస్ట్ అయిన నిందితుడు. చిక్కోడి గ్రామీణ తాగునీటి నైర్మల్య విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ కేసును దాఖలు చేశారు. గ్రామీణ తాగు నీరు, పారిశుద్ధ్య విభాగం చిక్కోడి పరిధిలోని రాయబాగ తాలూకా ఆళకనూరు, అళకవాడి గ్రామాల్లో జలజీవన మిషన్ పథకం ద్వారా ఇళ్లకు నీటి కొళాయిలను అమర్చడానికి రూ.29.55 లక్షలు, అలాగే రూ.17.90 లక్షల మొత్తం టెండర్లను ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో పిలిచారు. దరఖాస్తు చేసిన బాలకృష్ణ ఆ మేరకు గత మార్చి 2న పనులను చేపట్టాలని ఆదేశం వచ్చింది. నకిలీ కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి ఆ టెండర్ పొందడంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారుల బృందం దర్యాప్తు చేసి సదరు కుల ధ్రువీకరణ పత్రం ఇతరులకు చెందిందని నివేదికలో పేర్కొంది. ఆ నివేదిక ఆధారంగా బాధ్యుడిపై చర్యలు తీసుకున్నట్లు ఆ జిల్లా జెడ్పీ సీఈఓ రాహుల్ షిండే తెలిపారు.